


సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 27

బుధవారం 19-4-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'రాష్ట్రాన్ని, దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 27

బుధవారం 19-4-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ముంబై 'హ్యాట్రిక్' విజయం

14 పరుగుల తేడాతో ఓడిపోయిన సన్‌రైజర్స్ హైదరాబాద్. - 12లో



జ్యోతి సురేఖ ప్రపంచ రికార్డు

వరల్డ్‌కప్ స్టేజ్–1 టోర్నీలో 713 పాయింట్లతో మెరిసిన ఆంధ్రప్రదేశ్ ఆర్చర్. - 12లో



కన్నడనాట కులాల కోలాటం

అసెంబ్లీ పోరు నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ వ్యూహాత్మకంగా పావులు కదుపుతుండగా, జేడీ (ఎస్) వొక్కలిగ ఓటు బ్యాంకునే నమ్ముకుంది.


- వివరాలు 6లో



జీవితాంతం ఎన్సీపీలోనే: పవార్

బీజేపీ తీర్థం పుచ్చుకోబోతున్నారన్న వార్తలను అజిత్ పవార్ ఖండించారు. జీవితాంతం ఎన్సీపీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు.

- వివరాలు 6లో



బానో దుస్థితి మనకే ఎదురైతే...?

బిల్కిస్ బానో కేసులో 11 మంది దోషులకు గుజరాత్ ప్రభుత్వం శిక్ష తగ్గించడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది.

- వివరాలు 6లో



అతీక్ అహ్మద్ రహస్య లేఖ

గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ మరణించేముందే ఓ లేఖ రాశాడు. ఒకవేళ తాను చనిపోతే ఆ లేఖను సీజేఐ, సీఎం యోగికి అందజేయాలని కోరాడు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్


చిత్రకారుడు బాలి కన్నుమూత



'బాలి' పేరుతో చిత్రకారుడిగా ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న కళాఋషి మేడిశెట్టి శంకర్రావు (81) మంగళవారం కన్నుమూశారు. ఆయన కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు.

- వివరాలు 3లో

మీ కోసం వస్తే మాపై నిందలా?: వైవీ సుబ్బారెడ్డి



సీఎం వైఎస్ జగన్‌పై బురద జల్లడమే లక్ష్యంగా కొన్ని పత్రికలు పనిచేస్తున్నాయని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి వైవీ సుబ్బారెడ్డి మండిపడ్డారు. మైసూరు నుంచి విజయ్‌కుమారస్వామి రామోజీ బంధువు విమానంలోనే విజయవాడ వచ్చారన్నారు.

- వివరాలు 3లో

నేటి నుంచి కోవిడ్ బూస్టర్ డోస్ టీకా



బుధవారం నుంచి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కరోనా బూస్టర్ డోసును అందజేయనున్నట్లు వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. కోవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

- వివరాలు 14లో

డీఏవీ స్కూల్ కేసులో దోషికి 20 ఏళ్ల జైలు



డీఏవీ స్కూల్లో చిన్నారిపై లైంగిక దాడి కేసులో నిందితుడు, ఆ పాఠశాల బస్ డ్రైవర్ రజనీకుమార్‌ను నాంపల్లిలోని ప్రత్యేక పోక్సో కోర్టు దోషిగా తేల్చింది. అతడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం సంచలన తీర్పు వెలువరించింది.

- వివరాలు 2లో

ఇదండీ సంగతి



ఏడేళ్ల 'బడి' కల

టీచర్ జాబ్ కోసం ఎదురుచూస్తున్న 4 లక్షల మందికి పైగా టెట్ ఉత్తీర్ణులు

- వ్యయప్రయాసలకోర్చి శిక్షణ పొంది అర్హత సాధించినా ప్రయోజనం లేదని ఆవేదన
- ఏడేళ్లుగా టీచర్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ కోసం ఎదురుచూపులు
- రాష్ట్రంలో 22 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు అంచనా
- 12 వేల ఖాళీలే ఉన్నాయని, వాటిని భర్తీ చేస్తామన్న ప్రభుత్వం
- పదోన్నతులు, బదిలీలు పూర్తయితే తప్ప కొత్త నియామకాలు చేపట్టలేమంటున్న విద్యాశాఖ
- కోర్టు వివాదాలతో పదోన్నతులు, బదిలీలు పూర్తికాక ముందుకు పడని అడుగులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం వరుసగా ఉద్యోగ నియామక నోటిఫికేషన్లు ఇస్తుండటం నిరుద్యోగ యువతలో ఆశలు రేకెత్తించింది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ల్లో ఉత్తీర్ణులైన వారూ గంపెడాశలు పెట్టుకున్నారు. టీచర్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ కూడా వెలువడుతుందని భావించారు. కానీ కల నెరవేరకపోవడంతో, నోటిఫికేషన్ వెలువడే సూచనలు లేకపోవడంతో వారంతా నిరాశా నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2016 నుంచి ఇప్పటివరకు మూడు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లు నిర్వహించింది. 2016, 2017ల్లో నిర్వహించిన టెట్‌లలో రెండు లక్షల మందికి పైగా ఉత్తీర్ణులయ్యారు. తాజాగా 2022 జూన్‌లో నిర్వహించిన టెట్‌లో మరో రెండు లక్షల మందికి పైగా ఉత్తీర్ణులయ్యారు. మూడు పరీక్షల్లో నాలుగు లక్షల మందికి పైగా అర్హత సాధించినా ఇప్పటివరకు ప్రయోజనం లేకుండా పోయింది. ఏడేళ్లుగా ఎదురుచూపులే మిగులుతున్నాయని టెట్ ఉత్తీర్ణులు వాపోతున్నారు.



పదోన్నతులకు, నియామకాలకు ముడి

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 22 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయనేది ఓ అంచనా కాగా.. ప్రభుత్వం మాత్రం 12 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేస్తామని తెలిపింది. చాలా పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత వెంటాడుతోంది. పైగా గత ఏడాది నుంచి ఆంగ్ల మాధ్యమంలో బోధన చేపట్టారు. కొన్ని పాఠశాలల్లో ఎస్జీటీలను

మిగతా 2వ పేజీలో ▶

బీఈడీ, డీఈడీ కోర్సులు పూర్తి చేసిన వారు ప్రభుత్వ టీచర్ పోస్టునే లక్ష్యంగా పెట్టుకుంటారు. అవకాశం వచ్చే వరకు ప్రైవేటు స్కూళ్లలో టీచర్లుగా పనిచేస్తుంటారు. కొందరు ఇతర ఉద్యోగాలూ చేస్తుంటారు. టెట్ పరీక్ష నిర్వహించే కొన్ని నెలల ముందు వీరంతా తాము అంతకుముందు చేస్తున్న ఉద్యోగాలు వదిలేసి, వ్యయప్రయాసలకోర్చి కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుం

వ్యయప్రయాసలకోర్చి శిక్షణ తీసుకుని..

టారు. ఇదే క్రమంలో గత ఏడాది జూన్‌లో నిర్వహించిన టెట్‌కు హాజరయ్యారు. గతానికి భిన్నంగా ఈసారి 6 లక్షల మంది వరకు పరీక్ష రాశారు. 1–5 తరగతులకు బోధించేందుకు డీఎడ్ అర్హతతో టెట్ పేపర్–1 రాస్తారు. గతంలో ఈ పరీక్ష రాయడానికి బీఈడీ చేసిన అభ్యర్థులు అర్హులు కారు. కానీ ఈసారి బీఈడీ అభ్యర్థులు పేపర్–2తోపాటు, పేపర్–1 రాసేందుకూ వీలు కల్పించారు. దీంతో అభ్యర్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ పరీక్షలో ఏకంగా 2 లక్షల మందికి పైగా అర్హత సాధించడంతో మొత్తం అర్హుల సంఖ్య 4 లక్షలు దాటింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు మొదలవడంతో, తమకూ టీచర్ అయ్యే అవకాశం వస్తుందని వీరంతా ఎదురుచూశారు.

అవినాశ్‌ను అరెస్టు చేయొద్దు

తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

- 25 వరకు సీబీఐ కార్యాలయానికి ఎంపీ హాజరు కావాలి
- దర్యాప్తు అధికారులు లిఖితపూర్వకంగానే విచారణ చేపట్టాలి
- వీడియో, ఆడియో రికార్డు చేయాలని న్యాయస్థానం ఆదేశాలు
- సీబీఐ దర్యాప్తు తీరును తప్పుబట్టిన అవినాశ్ న్యాయవాది
- కిరాయి హంతకుడి ప్రెస్‌మీట్‌ను ప్రచురిస్తారా?
- అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలపై ఆ వ్యాఖ్యలేమిటి?
- 'టీకొట్' ప్రామాణికమంటూ గూగుల్ కూడా సర్టిఫికెట్ ఇవ్వదు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఈ నెల 25వ తేదీ వరకు కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయవద్దని సీబీఐని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. అప్పటి వరకు ఆయన రోజూ సీబీఐ కార్యాలయానికి వస్తారని, ఏ విచారణ చేయాలన్నా చేపట్టవచ్చని సూచించింది. అయితే సీబీఐ అడిగే ప్రశ్నలు లిఖితపూర్వకంగా ఉండాలని... వీడియో, ఆడియో రికార్డు చేయాలని స్పష్టం చేసింది. స్పష్టమైన ఆధారాలు లేకుండా అరెస్టులు చేయడం సరికాదని, 25వతేదీలోగా సాక్ష్యాలు సేకరించాలని పేర్కొంటూ మంగళవారం మధ్యంతర ఉత్త ర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ నాటికి అన్ని అంశాలను పరిశీలించి తుది ఆదేశాలు ఇస్తామని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ఈ నెల 30లోగా విచారణ పూర్తి చేయాలని సీబీఐకి నిర్దేశించింది. వివేకా హత్య కేసులో సీబీఐ అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ కోరుతూ అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన



పిటిషన్‌ను విచారించిన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేందర్ ఈమేరకు ఆదేశాలు జారీ చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఆ వివరాలు ఇవీ...

ఏది ప్రామాణికం..?


'హత్య జరిగిన రోజు నిందితుల కదలికలకు సంబంధించి భాస్కర్‌రెడ్డి రిమాండ్ రిపోర్టులో ఒకలా.. ఏ–4 దస్తగిరి ఇచ్చిన వాంగ్మూలంలో మరోలా.. సీబీఐ గూగుల్ టీకొట్‌లో ఇంకోలా ఉంది. ఇందులో ఏది ప్రామాణికం? దేనిని పరిగణలోకి తీసుకోవాలి? కిరాయి హంతకుడు దస్తగిరి (ఏ–4) సోమవారం ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడితే ఈనాడు పత్రిక ప్రచురించింది. గతంలో ఈ కేసు దర్యాప్తు చేసిన సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్‌ను పలుకుబడితో మార్చేశారంటూ వ్యాఖ్యలు చేశాడు. దీన్ని సీబీఐ సమర్థిస్తుందా? విచారణాధికారిని మార్చింది సుప్రీంకోర్టు. అంటే దస్తగిరి ఉద్దేశం సుప్రీంకోర్టు ద్వారా

మిగతా 3వ పేజీలో ▶

డిపాజిట్లలో రహస్యం ఉందా?

మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కి, రామోజీరావుకి సుప్రీంకోర్టు ప్రశ్న

- డిపాజిటర్ల వివరాలన్నీ బయటపెట్టాలని ఆదేశం
- ఎవరెవరికి ఎంతెంత చెల్లించారో వివరంగా చెప్పండి
- డిపాజిటర్ల వివరాలు కోర్టుకు సమగ్రంగా వెల్లడించండి



సాక్షి, న్యూఢిల్లీ: డిపాజిటర్లకు చేసిన చెల్లింపుల్లో ఏమైనా రహస్యం దాగుందా? అని మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అలాంటిదేమీ లేని పక్షంలో ఆయా వివరాలు పూర్తిగా కోర్టుకు అందజేయాలని ఆదేశించింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లు మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జేబీ పార్దీవాలాలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చాయి. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ ప్రభుత్వం నుంచి కొన్ని డాక్యుమెంట్లు తీసుకోవాల్సి ఉందని, రెండు వారాలు గడువు ఇవ్వాలని కోరారు. ఏపీ ప్రభుత్వం వాయిదా కోరుతూ లెటర్‌ను సర్క్యులేట్ చేయగా.. దానిపై మార్గదర్శి అభ్యంతరం చెప్పింది. అభ్యంతరాలతో కూడిన లెటర్‌ను సోమవారం రాత్రే మార్గదర్శి మిగతా 3వ పేజీలో ▶

ఒక చోట ప్రొప్రైటర్ అన్నారు... మరొక చోట హెచ్‌యూఎఫ్ అన్నారు. అలా చెప్పటం చట్ట విరుద్ధం కదా? డిపాజిటర్లకు మార్గదర్శి ఫైనాన్షియర్స్ చేసిన చెల్లింపుల్లో ఏమైనా రహస్యం దాగుందా?. లేకుంటే వాటి వివరాలు బహిర్గతం చేయొచ్చు కదా?.. కోర్టుకు అన్ని వివరాలూ అంద జేయండి

- సుప్రీంకోర్టు



కాంగ్రెస్ 'నిరుద్యోగ ఉద్యమం'!

- 21న నల్లగొండ మహాత్మాగాంధీ వర్సిటీ నుంచి ప్రారంభం
- తర్వాత ఖమ్మం, ఆదిలాబాద్‌లో నిరసన కార్యక్రమాలు
- చివరిగా హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో భారీ సభ
- హాజరుకానున్న ప్రియాంకా గాంధీ..
- 50 లక్షల మంది నిరుద్యోగుల పక్షాన పోరాటం: రేవంత్
- మే 9 నుంచి గద్వాల జిల్లాలో రెండో విడత హాథ్ సే హాథ్ జోడో యాత్ర ప్రారంభిస్తామని వెల్లడి

5లో

ఇక కమలనాథుల యాత్రల జాతర

- మరో విడత లోక్‌సభ ప్రవాసీ యోజనకు బీజేపీ సిద్ధం
- రాష్ట్రంలో వచ్చే రెండు నెలల్లో కేంద్రమంత్రులు, ముఖ్యనేతల వరుస పర్యటనలు
- 23న చేవెళ్ల లోక్‌సభ పరిధిలో అమిత్ షా పర్యటన, బహిరంగసభ

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వచ్చే రెండు నెలల పాటు తెలంగాణలో కేంద్ర మంత్రులు, బీజేపీ ముఖ్యనేతల పర్యటనలు హోరెత్తనున్నాయి. దేశవ్యాప్తంగా చేపడుతున్న లోక్‌సభ ప్రవాసీ యోజనలో భాగంగా కేంద్రమంత్రులు రాష్ట్రంలోని 14 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో (సికింద్రాబాద్, కరీంనగర్, నిజామాబాద్ మినహా) పర్యటించనున్నారు. ఇప్పటికే రెండు విడతలుగా ఈ యోజన పూర్తి కాగా, మూడో విడతకు ముఖ్యనేతలు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగానే మిగతా 5వ పేజీలో ▶

165 ఎకరాల్లో ఫామ్‌హౌస్ ఎలా?

- కొన్నది 80 ఎకరాలేగా..మంత్రి నిరంజన్‌రెడ్డిపై రఘునందన్ ఆరోపణలు
- వ్యవసాయ శాఖ మంత్రి మూడుచోట్ల ఫామ్‌హౌస్‌లు నిర్మించారు
- చందూరులో కృష్ణా పరీవాహక ప్రాంతం కబ్జా చేశారు
- సీఎం మాదిరిగానే మంత్రులూ ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు
- చాలామంది మంత్రుల ఫామ్‌హౌస్‌ల చరిత్రలు నా వద్ద ఉన్నాయి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అధికార పార్టీ నేతల భూకబ్జాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోందని బీజేపీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు విమర్శించారు. ప్రభుత్వ భూములు, ప్రాజెక్టుల కోసం తీసుకున్న భూములను బీఆర్‌ఎస్ నేతలు ఆక్రమించారని ఆరోపించారు. ప్రభుత్వ భూముల మీద మిగతా 5వ పేజీలో ▶

ఒక్క గుంట భూమి ఎక్కువున్నా రాజీనామా చేస్తా..



- ఆ భూములను నా పిల్లలు కూడా వదిలేస్తారు
- వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి సవాల్
- పశువుల కొట్టాలు, కూలీల రేకుల షెడ్లు కూడా ఫామ్‌హౌస్‌లేనా?
- రఘునందన్‌రావు ఆరోపణలపై ఆగ్రహం

- 5లో

మాకింసంతోష్



భారత్‌లో యాపిల్ తొలి రిటైల్ స్టోర్ 'యాపిల్ బీకేసీ'ని మంగళవారం ముంబైలో కంపెనీ సీఈవో టిమ్ కుక్ ప్రారంభించారు. స్వయంగా స్టోర్ తలుపులు తెరిచి, కస్టమర్లకు ఆయన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఓ వినియోగదారుడు 1984 నాటి యాపిల్ తొలితరం కంప్యూటర్ మాకింతోష్‌ను తీసుకువచ్చారు. దీన్ని చూసిన టిమ్ కుక్ 'వావ్' అంటూ ఇలా సంభ్రమాశ్చర్యానికి లోనయ్యారు.

యాపిల్ స్టోర్ వచ్చేసింది

ముంబైలో తొలి స్టోర్ ప్రారంభించిన సీఈవో టిమ్ కుక్ - 13లో

నేడు, రేపు అధిక ఉష్ణోగ్రతలు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బుధ, గురువారాల్లో అనేకచోట్ల పగటి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుంచి 43 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. 21వ తేదీ నుండి నాలుగైదు రోజులపాటు గరిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గి అనేకచోట్ల 40 డిగ్రీల కన్నా తక్కువగా నమోదయ్యే అవకాశముందని పేర్కొంది. రాగల మూడు రోజులు అక్కడక్కడ తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం కూడా ఉందని తెలిపింది. బుధవారం వాయవ్య, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతోపాటు ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. మంగళవారం అనేకచోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జగిత్యాల జిల్లా మల్లాపూర్, నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌లో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హనుమకొండ జిల్లా ధర్మాసాగర్‌లో 44.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
కర్నూలు	45.6	25.4
రెంటచింతల	44.2	25.5
నిజామాబాద్	42.4	26.5
ఆదిలాబాద్	42.3	26.5
రామగుండం	42.0	23.6
భద్రాచలం	41.8	26.5
విశాఖపట్నం	41.6	25.2
మహబూబ్‌నగర్	41.5	25.1
కడప	41.4	22.4
మెదక్	41.2	21.8
నల్లగొండ	41.0	23.4
ఖమ్మం	40.8	24.6
హనుమకొండ	40.0	24.5
హైదరాబాద్	39.4	22.4

క్లుప్తంగా...

తెలుగు రాష్ట్రాల డ్రైవర్లకు జాతీయ పురస్కారాలు

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లోని ఆర్టీసీ డ్రైవర్లకు జాతీయస్థాయిలో గౌరవం దక్కింది. ప్రమాదాల బారిన పడకుండా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానం చేర్చుతున్న నలుగురు ఆర్టీసీ డ్రైవర్లకు కేంద్ర రవాణా, రహదారుల శాఖ కార్యదర్శి అల్కాఉపాధ్యాయ అవార్డులు అందించారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ప్రమాద రహితంగా బస్సులు నడుపుతున్న 42 మంది డ్రైవర్లను సత్కరించారు. ఏపీఎస్‌ఆర్టీసీ నుంచి కర్నూలు జిల్లా ఆత్మకూరు డిపోకు చెందిన ఎ.ఎం.బాషా, సింహాచలం డిపోకు చెందిన ఎస్ఎఎన్ రాజు, టీఎస్‌ఆర్టీసీ నుంచి కుషాయిగూడ డిపోకు చెందిన కంది రంగారెడ్డి, సూర్యాపేట డిపోకు చెందిన కల్లు సోమిరెడ్డి పురస్కారాలు అందుకున్నారు.

రాష్ట్రంలో మరో రెండు కొత్త మండలాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మరో రెండు కొత్త మండలాలు ఏర్పాటు కానున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎర్రవెల్లి మండల ఏర్పాటుకు ప్రాథమిక, కామారెడ్డి జిల్లా పాల్వంచ మండల ఏర్పాటుకు తుది నోటిఫికేషన్లు విడుదల చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇటిక్యాల మండలంలోని 9 గ్రామాలతో ఎర్రవెల్లి మండలం, మాచారెడ్డి, రాంరెడ్డి మండలాల్లోని 10గ్రామాలతో పాల్వంచ మండలం ఏర్పాటుకు రెవెన్యూ శాఖ నోటిఫికేషన్లు జారీచేసింది.

జనగామ ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుమతి

సాక్షి, హైదరాబాద్: జనగాం ప్రభుత్వ వైద్య కళాశాలకు జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) మంగళవారం అనుమతులు మంజూరు చేసింది. ఇటీవల ఆసిఫాబాద్, కామారెడ్డి, ఖమ్మం, వికారాబాద్ వైద్య కళాశాలలకు ఎన్ఎంసీ అనుమతి ఇవ్వడం తెలిసిందే. అనుమతులు మంజూరు చేయడంపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు హర్షం వ్యక్తం చేశారు.

జనగణనలో కులగణన చేయాలి

ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్



కాచిగూడ: దేశ జనగణనలో కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో కృష్ణయ్య మాట్లాడారు. కులాల వారీ లెక్కలు తీయాలని కోరుతూ ప్రధానమంత్రికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ లేఖలు రాయడం శుభపరిణామమన్నారు. కులగణన కోసం కాంగ్రెస్ సహా 16 పార్టీల మద్దతు రావడం తమ సంఘం పోరాట ఫలితమేనని తెలిపారు. ఇటీవల ఢిల్లీలో మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సీతారాం ఏచూరి, అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్‌తో సహా 16 పార్టీల ప్రతినిధులను కలిసి చర్చలు జరిపామన్నారు. కార్యక్రమంలో సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.రాము, నేతలు నీల వెంకటేష్, పగడాల సుధాకర్, వేముల రామకృష్ణ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గొంగ్లూర్ టు జపాన్!

- మహిళా స్వయం సహాయక బృందం తయారు చేసిన గానుగ వంటనూనెల ఎగుమతికి సన్నాహాలు
- ఇటీవలే నూనెల నమూనాలను నాణ్యతా పరీక్షలకు పంపిన జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్
- వాటి ఫలితాల పట్ల సంతృప్తి.. త్వరలో కుదరనున్న ఒప్పందం

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: సంఘటితమై పారిశ్రామికవేత్తలుగా ఎదిగిన సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం గొంగ్లూర్ గ్రామ మహిళలు (స్వయం సహాయక బృందం) తయారు చేస్తున్న గానుగ (కోల్డ్ ప్రెస్డ్) వంటనూనెలను జపాన్‌కు ఎగుమతి చేసే దిశగా కీలక ముందడుగు పడింది. గొంగ్లూర్ గ్రామానికి చెందిన 126 మంది మహిళలు నడుపుతున్న సర్వోదయ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ కాటేజ్ ఇండస్ట్రీస్ తయారు చేస్తున్న గానుగ వంటనూనెల నమూనాలను ఇటీవల నాణ్యతా పరీక్షలకు తీసుకెళ్లిన జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జెట్రో) వాటి ఫలితాలపట్ల సంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో ఆయా నూనెల ఎగుమతికి వీలుగా సర్వోదయ సంస్థ త్వరలో ఒప్పందం కుదుర్చుకోనుంది.

నూనెలు.. చేతితో చేసిన సబ్బులు.. శుద్ధిచేసిన పప్పు దినుసులు

ఐఆర్ఎస్ అధికారి సుధాకర్ నాయక్ ఆధ్వర్యంలో పలువురు వైద్యుల సహకారంతో గ్రామంలో పలు రకాల కుటీర పరిశ్రమలను స్థాపించారు. అందులో ఒకటైన సర్వోదయ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ కాటేజ్ ఇండస్ట్రీస్... 'సర్వోదయాస్ మంజీరా' బ్రాండ్ పేరుతో చేతితో చేసిన సబ్బులు, పప్పు దినుసుల ప్రాసెసింగ్‌తోపాటు సహజ పద్ధతుల్లో వంట నూనెలను తయారు చేస్తోంది. పల్లి, పొద్దుతిరుగుడు, నువ్వుల నూనెలు, కుసుమ, కొబ్బరినూనెలను ఉత్పత్తి చేస్తోంది.

వంట నూనెలు తయారు చేస్తున్న మహిళలు



ఐఐటీ హైదరాబాద్ సహకారం...

ఆయా ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ కల్పించడంతోపాటు వెబ్‌సైట్, మొబైల్ అప్లికేషన్ తయారీ, నాణ్యతా పరీక్షలకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించాలని గొంగ్లూర్ మహిళలు గతంలో ఐఐటీ–హైదరాబాద్‌ను కోరారు. అందుకు అంగీకరించిన ఐఐటీ–హెచ్... భారత్–జపాన్ ద్వైపాక్షిక సహకారంలో భాగంగా తమ క్యాంపస్‌లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సుజుకీ ఇన్నోవేషన్ సెంటర్ (ఎస్ఐసీ) దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లింది. ఎస్ఐసీ ద్వారా 'జెట్రో'ను సంప్రదించింది. ఐఐటీ–హెచ్, ఎస్ఐసీలు ఫెసిలిటేటర్‌గా వ్యవహరించాయి. మరోవైపు పర్యావరణ అనుకూల పద్ధతుల్లో తమ ఉత్పత్తుల ప్యాకేజింగ్ తయారీకి తోడ్పాటు అందించాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ (ఐఐపీ) హైదరాబాద్‌కు గొంగ్లూర్ మహిళలు విజ్ఞప్తి చేయగా ఆ సంస్థ సైతం అందుకు అంగీకారం తెలిపింది.

కీలక ముందడుగు పడింది...

సర్వోదయ మంజీరా వంట నూనెల ఉత్పత్తుల ఎగుమతులకు సంబంధించి కీలక ముందడుగు పడింది. మేము పంపిన శాంపిల్‌ను పరిశీలించి దిగుమతి చేసుకోవాలని జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ సానుకూల నిర్ణయం తీసుకుంది. త్వరలో ఎంవోయూ కుదుర్చుకొనేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రస్తుతం ప్రతినెలా 5 వేల లీటర్ల నూనెలను ఉత్పత్తి చేస్తున్నాం. ఎగుమతి ఆర్డర్ వస్తే ఉత్పత్తిని మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.

– సుధాకర్‌నాయక్, మంజీరా సర్వోదయ ఫౌండర్

తొలుత బెంగళూరుకు...

వంట నూనెల ఎగుమతులకు సంబంధించి జపాన్ సంస్థలు సానుకూలత వ్యక్తం చేయడంతో త్వరలో ఆయా సంస్థలతో ఒప్పందం కుదుర్చుకునేందుకు గొంగ్లూర్ మహిళలు ప్రయత్నాలు చేస్తున్నారు. ధర, ప్యాకింగ్, రవాణా వంటి అంశాలను ఆయా సంస్థలు పరిశీలిస్తున్నాయి. ఇక్కడ తయారు చేసిన వంటనూనెలను తొలుత బెంగళూరులోని 'జెట్రో' గోదాములకు తరలించి అక్కడి నుంచి ఎగుమతి చేసే యోచనలో ఉన్నారు.



జాతీయ సంస్థల నుంచి లైసెన్స్‌లు..

సర్వోదయ విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ సంస్థ ఇప్పటికే పలు జాతీయ సంస్థల నుంచి లైసెన్స్‌లు పొందింది. బహుళజాతి సంస్థలు తీసుకున్నట్లే ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా), జీఎంపీ (గుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్రొడక్ట్), హ్యాండ్‌మేడ్ సబ్బులు వంటి కాస్మెటిక్స్ ఉత్పత్తులకు ఆయూష్ విభాగం నుంచి కూడా లైసెన్స్ పొందింది.

తమ ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా విక్రయించేందుకు www.sarvodayasmanjeera.com/ అనే ఈ-కామర్స్ ప్లాట్‌ఫాంను కూడా ఏర్పాటు చేసుకుంది.

ఏడేళ్ల 'బడి' కల

▶ మొదటి పేజీ తరువాయి

ఉన్నత తరగతులకు పంపుతున్నారు. ఇందులో చాలామంది స్కూల్ అసిస్టెంట్లకు అర్హత ఉన్నా, పదోన్నతులు లేకపోవడంతో ఫలితం దక్కడం లేదు. పదోన్నతులు లేకపోవడంతో బదిలీలు జరగడం లేదు. ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు చేస్తే తప్ప కొత్త నియామకాలు చేపట్టలేమని విద్యాశాఖ అధికారులు అంటున్నారు. ఈ ప్రక్రియ ఎప్పటికప్పుడు వాయిదా పడుతూనే ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికల ముందు హడావుడి చేసినా, కోర్టు వివాదాల కారణంగా వాయిదా పడింది. అయితే ఈ వివాదాల పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులేయడం లేదనే విమర్శలున్నాయి. కోర్టు వివాదాలకు దారి తీసే రీతిలో విద్యాశాఖ వ్యవహరించడం వల్లే పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ముందుకెళ్లడం లేదనే విమర్శలూ వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి

బదిలీలు, ప్రమోషన్స్ పేరిట కాలయాపన చేయడం వల్ల ఉపాధ్యాయ ఖాళీల భర్తీ ప్రక్రియ ఆలస్యమవుతోంది. దీంతో 4 లక్షల మంది అభ్యర్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. మేమంతా టీచర్ పోస్టులు వస్తాయని ఉన్న ఉద్యోగాలు మానేసి, పోటీ పరీక్షకు రూ.వేలు ఖర్చు పెట్టాం. అన్ని రకాల నోటిఫికేషన్లు జారీ చేసిన ప్రభుత్వం, టీఆర్టీ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సమంజసం కాదు. ప్రభుత్వం వెంటనే ఆర్థిక శాఖకు అనుమతివ్వాలి.

– రావుల రామ్మోహన్ రెడ్డి (రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం అధ్యక్షుడు)

ప్రభుత్వ స్కూళ్లలో టీచర్ల కొరత తీర్చాలి

రాష్ట్రంలో 60 శాతానికి పైగా గెజిటెడ్ హెచ్ఎంలు, వేలాది స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయంటే విద్యాశాఖ ఎంత దారుణంగా వ్యవహరిస్తోందో అర్థం చేసుకోవచ్చు. కాలయాపన చేయకుండా తక్షణమే బదిలీలు, పదోన్నతుల వివాదాన్ని పరిష్కరించే ప్రయత్నం చేయాలి. పేదలు చదివే ప్రభుత్వ స్కూళ్ళలో ఉపాధ్యాయుల కొరత తీర్చాలి.

– ఎం. చెన్నయ్య (పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు)

టెట్ ఉత్తీర్ణుల వివరాలు ఇలా..

	పేపర్	అభ్యర్థులు	ఉత్తీర్ణులు	శాతం
2016 లో..	పేపర్-1	88,661	48,278	54.45
	పేపర్-2	2,51,906	63,079	25.04
2017 లో..	పేపర్-1	98,848	56,708	57.37
	పేపర్-2 (సైన్స్)	1,11,018	20,233	18.22
	పేపర్-2(సోషల్)	1,19,914	24,732	20.62
2022 లో..	పేపర్-1	3,18,506	1,01,922	32.68
	పేపర్-2	2,51,070	1,04,078	49.64

టీచర్ల బదిలీలు, పదోన్నతులపై అడుగులు

- కేసును త్వరగా విచారించాలని కోర్టుకు
- టీచర్ల ఆగ్రహం తగ్గించే ప్రయత్నంలో ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులపై న్యాయ పరమైన వివాదాన్ని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులేస్తోంది. కేసును త్వరగా విచారించాలని, అవసరమైన ఆదేశాలివ్వాలని కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతోంది. టీచర్ల బదిలీలు, పదోన్నతుల వ్యవహారంపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందన్న విమర్శలు సర్వత్రా విన్పిస్తున్నాయి. ఈ ఏడాది ఈ వివాదం మరింత ముదిరింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ దాన్ని అమలు చేయకపోవడంతో టీచర్లలో అసంతృప్తి నెలకొంది. ఏడేళ్ళుగా బదిలీలు, పదోన్నతులు చేపట్టలేదు. ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందు మాత్రం నోటిఫికేషన్ ఇచ్చింది. దీంతో మార్గదర్శకాలపై టీచర్లు కోర్టును ఆశ్రయించారు. తమకు అన్యాయం జరుగుతోందని భాషా పండితులు న్యాయస్థానం మెట్లెక్కారు. దీంతో ప్రక్రియపై హైకోర్టు స్టే ఇచ్చింది. ఈ కేసును కోర్టు జూన్‌కు వాయిదా వేసింది. అయితే జూన్‌లో పాఠశాలలు తిరిగి తెరుస్తారు కాబట్టి, ఆ సమయంలో బదిలీలు సాధ్యం కాదు. ఆ తర్వాత కొన్ని నెలల్లోనే ప్రభుత్వం ఎన్నికలకు వెళ్ళాల్సి ఉంటుంది. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వ అనుకూల సంఘాలపై టీచర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విపక్ష బీజేపీ అభ్యర్థిని గెలిపించారు. దీంతో టీచర్లలో తీవ్ర అసంతృప్తి ఉందని, టీచర్ల ఓట్లు దాదాపు 1.05 లక్షలు తమకు వ్యతిరేకంగా పడే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో విచారణ త్వరగా ముగించి, బదిలీలు, పదోన్నతులు కల్పించి, టీచర్లను సంతృప్తి పర్చాలనే యోచనలో ఉన్నట్టు అధికార వర్గాల ద్వారా తెలిసింది.

ఆర్టీసీ ఉద్యోగుల వేతన సవరణకు లైన్ క్లియర్

- 2017 నాటి 16 శాతం ఐఆర్‌కు కొంతపెంచి ఫిట్‌మెంట్ ప్రకటించే యోచన
- ఆర్టీసీ చైర్మన్ ప్రతిపాదనపై సీఎం సానుకూలత
- సీఎం బిజీగా ఉండటంతో మంగళవారం భేటీ వాయిదా.. నేడు స్పష్టత వచ్చే అవకాశం

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగులకు బకాయి ఉన్న రెండు వేతన సవరణల్లో ఒకదాన్ని ప్రకటించేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. 2017, 2021లకు సంబంధించి పీఆర్‌సీలు పెండింగులో ఉండగా, 2017కు సంబంధించిన వేతనాలను సవరించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనను సీఎం కేసీఆర్ ముందుకు ఆర్టీసీ చైర్మన్ తెచ్చినట్టు సమాచారం. విషయంపై చర్చించేందుకు సీఎం అనుమతించటంతో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఈడీ, సీపీఎం, ఫైనాన్స్ అడ్వయిజర్లు మంగళవారం సాయంత్రం ప్రగతిభవన్ వెళ్లారు. అయితే మరో ముఖ్యమైన పనిలో సీఎం బిజీగా ఉండటంతో అపాయింట్‌మెంట్ దక్కలేదు. వారిని బుధవారం రావాల్సిందిగా అక్కడి అధికారులు సూచించారు. దీనిపై సీఎంతో చర్చించిన తర్వాత ఫిట్‌మెంట్ విషయమై స్పష్టత రానుంది.

ఐదేళ్లుగా ఇంటీరియమ్ రిలీఫ్ పైనే..

రాష్ట్రం ఆవిర్భవించిన వెంటనే 2015లో ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు అత్యధికంగా 44 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. 2013కు సంబంధించిన వేతన సవరణను రెండేళ్ల తర్వాత, ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేసిన దానికంటే ఎక్కువగా ప్రభుత్వం ప్రకటించింది. దానికి సంబంధించిన బకాయిల్లో 50 శాతం మొత్తాన్ని బాండ్ల రూపంలో ఇవ్వనున్నట్టు అప్పట్లో ప్రకటించింది. అయితే ఆ మొత్తాన్ని ఇప్పటివరకు చెల్లించలేదు. 2017లో మరోసారి వేతన సవరణ జరగాల్సి ఉన్నా, సకాలంలో చేయకపోవటంతో అప్పట్లో కార్మికులు సమ్మెకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఆ సమయంలో నాటి మంత్రి కడియం శ్రీహరి ఆధ్వర్యంలో మంత్రుల కమిటీని ఏర్పాటు చేసింది. కార్మిక సంఘాలతో పలుమార్లు చర్చించిన కమిటీ, వేతన సవరణ చేసేవరకు ఇంటీరియమ్ రిలీఫ్(ఐఆర్) ఇస్తామని తెలిపింది. దీనికి కార్మిక నేతలు అంగీకరించటంతో, ప్రభుత్వం 16 శాతం ఐఆర్‌ను ప్రకటించింది. ఇప్పటికీ అదే అమలవుతోంది. దానికి మరికొంత కలిపి 30 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని ఉద్యోగులు అప్పటి నుంచి డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఈలోపు మరో వేతన సవరణ గడువు 2021 దాటిపోయింది. 2013 నాటి వేతన సరవణ బకాయిలు సగం వరకు పెండింగులో ఉండటం, 2017 వేతన సవరణ చేయకుండా ఐఆర్‌తో సరిపుచ్చటం, 2021 వేతన సవరణ ఊసే ఎత్తకపోవటంతో ఆర్టీసీ ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ నేపథ్యంలో ఒక వేతన సవరణను ప్రకటించాలని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి కోరుతూ వస్తున్నారు. తాజాగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లటంతో, చర్చించేందుకు ఆయనను, అధికారులను పిలిచారు. బుధవారం దీనిపై స్పష్టత వస్తుందని భావిస్తున్నారు.



డీఏవీ స్కూల్ కేసులో దోషికి 20 ఏళ్ల జైలు

- డ్రైవర్ రజినీకుమార్‌ను దోషిగా తేల్చిన ప్రత్యేక పోక్సో కోర్టు
- చిన్నారిపై లైంగిక దాడి కేసులో ఆరు నెలల్లోనే సంచలన తీర్పు



తన కార్యాలయంలో పోలీసులను అభినందిస్తున్న కమిషనర్ సీవీ ఆనంద్

బంజారాహిల్స్ (హైదరాబాద్): సంచలనం సృష్టించిన డీఏవీ స్కూల్లో చిన్నారిపై లైంగిక దాడి కేసులో నిందితుడు, ఆ పాఠశాల బస్ డ్రైవర్ రజినీకుమార్‌ను నాంపల్లిలోని ప్రత్యేక పోక్సో కోర్టు దోషిగా తేల్చింది. అతడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో డీఏవీ స్కూల్ ప్రిన్సిపాల్ మాధవిని న్యాయస్థానం నిర్దోషిగా తేల్చింది. బంజారాహిల్స్ రోడ్ నం. 14లోని డీఏవీ స్కూల్లో చదువుతున్న నాలుగేళ్ల బాలికపై గత అక్టోబర్ 17న లైంగిక దాడి జరిగిన సంగతి తెలిసిందే. ప్రిన్సిపాల్ కారు డ్రైవర్‌గా, స్కూల్ బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్న రజినీకుమార్ పాఠశాలలో పెత్తనం చేస్తూ తరగతి గదుల్లో ఇష్టానుసారంగా తిరుగుతూ చిన్నారులపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు పోలీసులు పక్కా ఆధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. చిన్నారిపై లైంగిక దాడి జరిగిన విషయాన్ని శాస్త్రీయ ఆధారాలతో న్యాయస్థానంలో నిరూపించారు. అక్టోబర్ 19న నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బంజారాహిల్స్ పోలీసులు ఈ కేసును సవాల్‌గా తీసుకుని ప్రతీ చిన్న ఆధారాన్ని కూడా చార్జిషీట్‌లో పొందుపరిచారు. ఆరు నెలల్లోనే కోర్టు రజినీకుమార్‌కు జైలు శిక్ష విధిస్తూ తీర్పునివ్వడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం తీర్పు వెలువడిన కొద్దిసేపటికే విద్యార్థుల తల్లిదండ్రులు డీఏవీ స్కూల్ వద్దకు చేరుకొని సంబరాలు జరుపుకొన్నారు. కాగా, దోషికి శిక్ష పడటంలో కోర్టుకు ఆధారాలు సమర్పించిన బంజారాహిల్స్ పోలీసులు, షీ టీమ్, భరోసా పోలీసులను నగర పోలీస్ కమిషనర్ ఆనంద్ రివార్డులతో అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఎవరికైనా.. హైదరాబాద్ సొంతిల్లే

- 'నో నాన్సెన్స్' సిటీగా తీర్చిదిద్దాం
- సాంకేతిక రంగంలో మూడు లక్షల నుంచి 10లక్షలకు పెరిగిన ఉద్యోగులు
- సిటీకో శాశ్వత క్యాంపస్ ప్రారంభంలో కేటీఆర్



సిటీకో కార్యాలయ ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్, జయేశ్‌రంజన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: శాంతిభద్రతల పరిరక్షణ కోసం కఠినంగా వ్యవహరించడంతో పాటు రాష్ట్రంలో హింస, విధ్వంసాలకు తావులేకుండా హైదరాబాద్‌ను 'నో నాన్సెన్స్'సిటీగా తీర్చిదిద్దామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు అన్నారు. విభిన్న సంస్కృతుల సమ్మేళనంగా ఉన్న హైదరాబాద్‌లో ప్రజలు తమ సొంత ఇంట్లో ఉన్నట్లు భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలో గ్లోబల్ ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ అసెట్స్ సర్వీస్ (సిటీకో) శాశ్వత కార్యాలయాన్ని మంత్రి కేటీఆర్ మంగళవారం ప్రారంభించారు. జేపీ మోర్గాన్, గోల్డ్‌మెన్, స్టేట్‌స్ట్రీట్ వంటి దిగ్గజ పెట్టుబడుల సంస్థలు గడిచిన ఐదేళ్లలోనే హైదరాబాద్‌కు వచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యే నాటికి టెక్నాలజీ రంగంలో 3.25లక్షలుగా ఉన్న ఉద్యోగాల సంఖ్య తొమ్మిదేళ్లలో పది లక్షలకు పెరిగిందన్నారు. లైఫ్‌సైన్సెస్, రక్షణ, ఆర్థిక సేవలు, మౌలికవసతుల రంగం సహా అనేక రంగాల్లో టెక్నాలజీ ప్రమేయం పెరుగుతోందని, దీంతో టెక్నాలజీ రంగానికి హైదరాబాద్ చిరునామాగా మారుతోందన్నారు. విద్యతో పాటు ఆవిష్కరణల రంగానికి హైదరాబాద్ కేంద్రంగా ఉందని, టీ హబ్, టీ వర్క్స్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయన్నారు.

18 ఎకరాల విస్తీర్ణంలో 'ఇమేజ్ టవర్స్'

గేమింగ్, యానిమేషన్, మల్టీ మీడియా ఆవిష్కరణల కోసం ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ 'ఇమేజ్ టవర్స్'18 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణంలో ఉందని కేటీఆర్ వెల్లడించారు. సిటీకోకు చెందిన ప్రపంచంలోనే రెండో అతిపెద్ద క్యాంపస్ హైదరాబాద్‌లో ఉండేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సిటీకో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా తమ కార్యకలాపాలను విస్తృతం చేస్తామని సిటీకో ఫండ్ సర్వీసెస్ హెడ్ జే పెల్లర్ వెల్లడించారు. సిటీకో (భారత్) జనరల్ మేనేజర్ అమిత్ వర్మ, ఐటీ పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతర్జాతీయ పెట్టుబడుల సేవా రంగంలో పేరొందిన సిటీకో గ్రూప్.. హై టెక్ సిటీ సమీపంలో 2021లో తన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ను ఏర్పాటు చేసింది. విస్తరణ భాగంగా శాశ్వత వసతిలోకి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కార్యకలాపాలను మార్చుతున్నట్లు ప్రకటించింది.

ఇరిగేషన్ ప్రాజెక్టుల అనుమతులకు కేంద్రం తాత్సారం

- తెలంగాణకు ఒక న్యాయం.. కర్ణాటకకు మరో న్యాయమా?
- రాష్ట్ర ప్రభుత్వం ఆగ్రహం
- కేంద్ర జలశక్తి శాఖకు రాష్ట్రం లేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నిర్మించే నీటి పారుదల ప్రాజెక్టులకు అనుమతుల విషయంలో కేంద్రం తాత్సారం చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వం మండిపడింది. కేటాయింపులకు లోబడే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం చేపట్టినా అనుమతులు ఇవ్వకపోవడంతో పాటు, కనీసం ప్రాజెక్టు సవివరణ నివేదిక (డీపీఆర్)ను పరిశీలించడం లేదని అసహనం వ్యక్తం చేసింది. కర్ణాటకలోని అప్పర్ భద్ర ప్రాజెక్టుకు మాత్రం కేంద్రం అన్ని అనుమతులు ఇవ్వడంతోపాటు జాతీయ హోదాను కూడా కల్పించిన విషయాన్ని గుర్తు చేసింది. ప్రాజెక్టులకు అనుమతుల విషయంలో తెలంగాణకు ఒక న్యాయం, ఇతర రాష్ట్రాలకు మరో న్యాయమా అంటూ ప్రశ్నించింది. 2014 ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే పాలమూరు రంగారెడి ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారని గుర్తు చేసింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖకు మంగళవారం తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. కేటాయింపులకు లోబడే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం చేపట్టామని స్పష్టం చేసింది. పోలవరం నుంచి కృష్ణా డెల్టాకు తరలించే 80 టీఎంసీల నీటికి బదులుగా సాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలు 80 టీఎంసీల కృష్ణా జలాలు వాడుకోవచ్చని గోదావరి ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును గుర్తు చేసింది. ఈ మేరకు వచ్చే 45 టీఎంసీలు, మైనర్ ఇరిగేషన్‌లో మిగులు 45 టీఎంసీలు కలుపుకుని మొత్తం 90 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టును చేపట్టినట్లు లేఖలో పేర్కొంది. ప్రాజెక్టుకు నీటి కేటాయింపు అంశం కోర్టు పరిధిలో ఉన్నాయంటూ డీపీఆర్‌ను వెనక్కి పంపించడంలో కేంద్రం అంతర్యం ఏమిటని ప్రశ్నించింది.

మాకే ఎందుకీ అన్యాయం

కరువు పీడిత, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలలో తాగునీరు, సాగునీరు అందించడానికి ప్రతిపాదించిన పాలమూరు–రంగారెడ్డికి మాత్రం ఎందుకు అన్యాయం చేస్తున్నారని నిలదీసింది. ప్రాజెక్టులకు అనుమతుల విషయంలో ఒక్కో రాష్ట్రానికి ఒక్కో విధంగా వ్యవహరిస్తారా? అని ప్రశ్నించింది.

డీపీఆర్‌ను పరిశీలించాల్సిందే..

2021 జూలై 15వ తేదీన కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ ప్రకారం.. అనుమతి లేని ప్రాజెక్టుల జాబితాలో పాలమూరు–రంగారెడ్డిని చేర్చారని, ఆరు నెలల్లోగా అనుమతులు పొందాలని చెప్పారని ఆ లేఖలో రాష్ట్ర సాగునీటి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజత్ కుమార్ వివరించారు. ఈ మేరకే అనుమతుల కోసం డీపీఆర్‌ను సమర్పించినట్టు తెలిపారు. అప్పటి నుంచి ఆరు నెలల్లోగా డీపీఆర్‌ను పరిశీలించి, అనుమతులు ఇచ్చే బాధ్యత కేంద్రానిదేనని గుర్తు చేశారు. అయితే.. ట్రిబ్యునల్‌లో కేసు విచారణ కొనసాగుతున్నదనే కారణంతో డీపీఆర్‌ను పరిశీలించలేమని కేంద్ర జలవనరుల సంఘం చెప్పడం అన్యాయమన్నారు. తమకు నీటి కేటాయింపులు చేసే అధికారం లేదని జస్టిస్ బ్రిజేష్ కుమార్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో డీపీఆర్ పరిశీలన కొనసాగించాలని, త్వరగా అనుమతులు మంజూరు చేసే విధంగా కేంద్ర జల సంఘాన్ని ఆదేశించాలని కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి పంకజ్ కుమార్‌కు రజత్ కుమార్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర జల సంఘం లేవనెత్తిన అంశాలు అన్నిటికీ సమాధానాలు సమర్పించామని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు.

ఇలాగైతే జీఆర్ఎంబీ మూసివేతే!

- జీతాలు చెల్లించడానికి డబ్బులు లేవంటూ కేంద్రానికి బోర్డు అధికారుల లేఖ
- తక్షణమే రూ.8.5 కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగులకు వేతనాలు ఇవ్వడానికి నిధులు అందుబాటులో లేవని, వెంటనే విడుదల చేయాలని కేంద్ర జలశక్తి శాఖకు గోదావరి నది యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) లేఖరాసింది. నిధులు లేక బోర్డును మూసివేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమైందని ఆందోళన వ్యక్తం చేసింది. సాగునీటి ప్రాజెక్టుల డీపీఆర్‌ల మదింపు, విభజన చట్టం నిర్దేశించిన బాధ్యతల నిర్వహణ వంటివాటిపై ప్రభావం పడుతోందని స్పష్టం చేసింది. రూ.8.5 కోట్లను రుణం/గ్రాంట్‌గా తక్షణమే విడుదల చేయాలని కోరింది.

నిధులు విడుదల చేయక: 2022–23 ఏడాదికి రూ.10 కోట్లు, 2023–24 అవసరాలకు రూ.16 కోట్ల బడ్జెట్‌ను గోదావరి బోర్డు గతంలోనే ఆమోదించిందని.. ఈ మేరకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు బోర్డుకు నిధులను అందజేయాల్సి ఉందని అధికారులు లేఖలో పేర్కొన్నారు. కానీ రెండు రాష్ట్రాలు గత రెండేళ్లుగా ఎలాంటి నిధులు ఇవ్వలేదని వివరించారు. గతంలో పొదుపు చేసిన నిల్వల నుంచే గత ఆర్థిక సంవత్సరంలో బోర్డు ఉద్యోగులకు జీతాలు చెల్లించామని.. ఈసారి జీతాల కోసం ఎలాంటి నిధులు మిగలలేదని స్పష్టం చేశారు. వేతనాలివ్వక బోర్డును మూసివేసే పరిస్థితిలో.. డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉద్యోగులను తిప్పి పంపించేయాల్సి ఉంటుందని.. కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ వాటర్ ఇంజనీరింగ్ సర్వీసెస్, సెంట్రల్ పవర్ ఇంజనీరింగ్ సర్వీసెస్ అధికారులకు వేరే పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అయితే ఈ లేఖ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం గోదావరి బోర్డుకు రూ.5 కోట్లు నిధులు విడుదల చేసింది.

డిపాజిట్లలో రహస్యం ఉందా?

▶ మొదటి పేజీ తరువాయి

ఫైనాన్షియర్స్ సర్క్యులేట్ చేసింది. దీన్ని గుర్తుచేస్తూ మార్గదర్శి ఫైనాన్షియర్స్ తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా.. వాదనలు వినిపించారు. ఈ దశలో జస్టిస్ జేబీ పార్దీవాలా జోక్యం చేసుకుని... ''కొన్నిసార్లు వాదించినపుడు ప్రొప్రయిటరీ అంటున్నారు. మరికొన్ని వాదనల్లో హెచ్‌యూఎఫ్ (హిందూ అవిభాజ్య కుటుంబం) అని పేర్కొంటున్నారు. ఇది సమస్యాత్మకం కదా? అని ప్రశ్నించారు. తదుపరి విచారణ జరిగేటప్పుడు దీనిపై స్పష్టత ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు.

హెచ్‌యూఎఫ్- ప్రొప్రయిటర్ రెండూ ఎలా కుదురుతాయి?

హెచ్‌యూఎఫ్ అంటే వ్యక్తుల సమూహం (అసోసియేషన్ ఆఫ్ ఇండివిడ్యుయల్స్) కదా? మరి ప్రొప్రయిటరీ షిప్‌ను కూడా ఇందులో ఇండివిడ్యుయల్ కెపాసిటీలో చూపుతున్నారా? ఇలా చేయటం చట్ట విరుద్ధం కాదా? అని జస్టిస్ పార్దీవాలా ప్రశ్నించారు. గత విచారణలో డిపాజిటర్లందరికీ సొమ్ములు వెనక్కి ఇచ్చేశాం అన్నారు కదా? అని కూడా లూత్రానుద్దేశించి జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. ఈ సమయంలో పార్టీ ఇన్ పర్సన్ ఉండవల్లి అరుణ్‌కుమార్, న్యాయవాది అల్లంకి రమేష్‌లు జోక్యం చేసుకుంటూ... డిపాజిటర్లకు సొమ్ములు తిరిగి ఇచ్చేశాం అన్నారు కానీ, వివరాలు ఎక్కడా వెల్లడించలేదని గుర్తుచేశారు. ఇటు ప్రభుత్వానికి కానీ అటు కోర్టుకు గానీ వివరాలు చెప్పలేదన్నారు. ఆయా వివరాలు అందజేయాల్సిందిగా కోరాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఆడిటర్ స్టేట్‌మెంట్ ప్రకారం తాము వివరాలు ఇచ్చామని లూత్రా తెలిపారు. ఈ దశలో ఉండవల్లి జోక్యం చేసుకుంటూ వారిని వివరాలు అందజేయాల్సిందిగా మరోసారి ధర్మాసనాన్ని అభ్యర్థించారు. దీంతో... వివరాలు వెల్లడించడంలో ఏమైనా సీక్రెట్ (రహస్యం) దాగుందా? అని లూత్రాను జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. ఇందులో రహస్యం ఏమీ లేదని లూత్రా చెప్పగా... అయితే, కోర్టులో ఫైల్ చేయాలని జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు. ఈ దశలో మార్గదర్శి తరఫున మరో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి జోక్యం చేసుకొని హైకోర్టు ఆర్డర్ ప్రకారం ఎవరైనా వివరాలు కావాలని ముందుకొస్తే అందజేస్తామని పేర్కొన్నారు. దీంతో జస్టిస్ సూర్యకాంత్ కల్పించుకుని ''డిపాజిట్లు తిరిగి ఎవరెవరికి ఇచ్చారు? ఎంతెంత ఇచ్చారు? మీరు చెప్పాల్సిన అవసరం ఉంది'' అని లూత్రా, సింఘ్విలనుద్దేశించి స్పష్టం చేశారు. ''2007 మార్చి చివరి నాటికి డిపాజిట్ల రూపంలో సేకరించిన మొత్తం రూ.2541 కోట్లు. తిరిగి వెనక్కి ఇచ్చింది రూ.2596 కోట్లు.. తదనంతరం ఖాతాలో బ్యాలెన్స్ రూ.5.43 కోట్లు'' అని ఆడిటర్ స్టేట్‌మెంట్ ఇచ్చిన విషయాన్ని లూత్రా కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అయితే, తదుపరి విచారణ సమయానికి ఎవరెవరికి ఎంతెంత చెల్లించారనే వివరాలు సమగ్రంగా కోర్టుకు అందజేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

డిపాజిటర్ల వివరాలు ఎందుకు దాస్తున్నారు?: ఉండవల్లి



ఎవరికి ఫిర్యాదు చేయాలనే అంశంపై మార్గదర్శిలో తగిన యంత్రాంగం లేదని కూడా ఉండవల్లి కోర్టుకు తెలిపారు. రామోజీరావు, మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై పలు కేసులు ఉన్నాయని, గూగుల్‌లో చూస్తే అన్నీ తెలుస్తాయని పేర్కొన్నారు. ''డిపాజిటర్ల వివరాలు ఎందుకు దాస్తున్నారు? బయటకు వెల్లడించొచ్చు కదా!, ఆయా వివరాలపై అఫిడవిట్ దాఖలు చేయొచ్చు కదా!'' అని ఉండవల్లి పేర్కొన్నారు. గత విచారణ సమయంలో డిపాజిటర్ల వివరాలు రిజర్వు బ్యాంకుకు (ఆర్‌బీఐ) చెప్పాలని సుప్రీంకోర్టు సూచించగా.. ఆయా వివరాలు ఆర్‌బీఐకు అందజేశామని ఇక సమస్య ఏముందని లూత్రా చెప్పగా.... ఆర్‌బీఐ కూడా ఈ కేసులో పార్టీగా ఉందన్న విషయాన్ని ఉండవల్లి గుర్తుచేశారు. దీంతో వివరాలు వెల్లడించడానికి తమకేమీ ఇబ్బంది లేదని లూత్రా పేర్కొన్నారు. ''రిజాయిండర్ దాఖలు చేయడానికి ఏపీ ప్రభుత్వానికి గడువు ఇస్తున్నాం'' అని జస్టిస్ సూర్యకాంత్ ఆర్డర్ చదువుతుండగా.. డిపాజిటర్ల వివరాలు వెల్లడించాలని మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ఆదేశించాలని ఉండవల్లి ఇంకోసారి అభ్యర్థించారు. ''డిపాజిటర్లకు చెల్లింపు వివరాలు అందజేయాలని మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను, రామోజీరావును ఆదేశిస్తున్నాం'' అని జస్టిస్ సూర్యకాంత్ ఉత్తర్వులు చదువుతూ చెప్పారు. తదుపరి విచారణ జూలైలో చేపడతామని ధర్మాసనం పేర్కొంది.

ఇదీ.. మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసు కథ

మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థకు వాస్తవానికి జనం నుంచి డిపాజిట్లు సేకరించేందుకు అనుమతి లేదు. అయినా సరే... హిందూ అవిభాజ్య కుటుంబానికి చెందిన సంస్థగా పేర్కొంటూ జనం నుంచి డిపాజిట్లు సేకరించి వారికి బాండ్లు జారీ చేశారు. ఆ బాండ్లపై హెచ్‌యూఎఫ్ కర్తగా రామోజీరావు సంతకం చేశారు. కానీ ఆ డిపాజిటర్లకు డబ్బులు చెల్లించాల్సి వచ్చినపుడు ఆ చెక్కులపై ప్రొప్రయిటర్ హోదాలో రామోజీరావు సంతకాలు చేశారు. ఇదంతా ఎందుకంటే 1934 నాటి రిజర్వు బ్యాంకు చట్టం సెక్షన్ 45(ఎస్) ప్రకారం... వ్యక్తులెవరూ ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించకుండా నిషేధించారు. దీన్ని తప్పించుకోవటానికి అక్రమంగా హెచ్‌యూఎఫ్ ముసుగులో రామోజీరావు డిపాజిట్లు సేకరించినట్లు అప్పట్లో నాటి పార్లమెంటు సభ్యుడు ఉండవల్లి అరుణ్‌కుమార్ ఆరోపించారు. దీనిపై న్యాయపోరాటానికి దిగారు. అక్రమాలన్నీ నిజమేనని తేలటంతో... రామోజీరావు డిపాజిట్లు సేకరించటం నిలిపేశారు. కేసు విచారణలో ఉండగానే... మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను మూసేశారు. అయితే అక్రమంగా డిపాజిట్లు సేకరించటం నేరం కనక... ఆ నేరాన్ని నిర్ధారించడానికి సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

20న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల జూలై కోటా విడుదల



తిరుమల: శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల జూలై కోటాను ఏప్రిల్ 20న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఏప్రిల్ 22 ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు లక్కీ డిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవాటికెట్ల కోటాను ఏప్రిల్ 20న ఉదయం 11.30 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదలవుతాయి.

శ్రీవాణి టికెట్ల ఆన్‌లైన్ కోటా..: శ్రీవాణి ట్రస్టు టికెట్లకు సంబంధించిన జూలై నెల ఆన్‌లైన్ కోటాను ఏప్రిల్ 20న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది. జూలైకు సంబంధించిన అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఏప్రిల్ 21న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా మే నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను ఏప్రిల్ 21న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

24న వర్చువల్ సేవల కోటా..: వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన మే నెల కోటాను ఏప్రిల్ 24న ఉదయం 10 గంటలకు, జూన్ కోటాను ఏప్రిల్ 24న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

25న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా..: మే, జూన్‌లకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. తిరుమలలో మే నెల గదుల కోటాను ఏప్రిల్ 26న ఉదయం 10 గంటలకు, తిరుపతిలో మే నెల గదుల కోటాను ఏప్రిల్ 27న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

సీబీఐ కస్టడీకి భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్

నేటి నుంచి ఈ నెల 24 వరకు • అనుమతి ఇచ్చిన సీబీఐ కోర్టు

సాక్షి, హైదరాబాద్: వైఎస్ వివేకా హత్యకేసులో అరెస్టయిన వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌లను తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) దాఖలు చేసిన పిటిషన్లను ప్రత్యేక న్యాయస్థానం అనుమతించింది. వారిద్దరిని ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు కస్టడీకి ఇస్తూ ఆదేశాలు జారీచేసింది. చెంచల్‌గూడ జైలులో ఉన్న వీరిని బుధవారం సీబీఐ కస్టడీలోకి తీసుకుని విచారించనుంది.

నేడు మూలపేట పోర్టుకు భూమి పూజ

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నెరవేర్చారు. శ్రీకాకుళం జిల్లా రూపురేఖలు మార్చి, సమగ్ర అభివృద్ధికి బాటలు వేసే విధంగా సంతబొమ్మాళి మండలంలో రూ.4,362 కోట్ల వ్యయంతో మూలపేట పోర్టు పనులకు బుధవారం సీఎం వైఎస్ జగన్ భూమి పూజ చేయనున్నారు. 23.5 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో 4 బెర్తులను నిర్మించనున్నారు. జనరల్ కార్గోకు, బొగ్గుకు, కంటైనర్‌తో పాటు ఇతర ఎగుమతి, దిగుమతులకు వినియోగించేలా 30 నెలల్లో ఈ పోర్టును పూర్తిచేయాలని నిర్ణయించారు. విష్ణుచక్రం, మూలపేట గ్రామాలకు చెందిన 594 నిర్వాసిత కుటుంబాలకు పరిహారం, పునరావాసానికి ప్రభుత్వం రూ.109 కోట్లు కేటాయించింది. అంతేగాక వీరికోసం నౌపడలో 55 ఎకరాల్లో ఆధునిక వసతులతో ఆర్ అండ్ ఆర్ కాలనీని సైతం నిర్మిస్తోంది. మూలపేట పోర్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 25,000 మందికి ఉపాధి లభించనుంది.

మీకోసం వస్తే.. మాపై నిందలా?

మీకైతే దైవాశీస్సులు.. మాకైతే లాబీయింగా?: వైవీ సుబ్బారెడ్డి

- రామోజీ బంధువు విమానంలోనే విజయవాడకు విజయ్‌కుమార్‌స్వామి
- మార్గదర్శి కేసు నుంచి బయట పడేందుకు పిలిచారనుకోవాలా?
- ఆయన గతంలోనూ రామోజీ బంధువుల గృహ ప్రవేశానికి వచ్చారు
- దేవుడు, స్వామీజీల విషయంలో నీచ రాజకీయాలు తగవు



'నవయుగ' విశ్వేశ్వరరావు కుమారుడు శశిధర్, విజయ్‌కుమార్ స్వామి(ఫైల్)

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బురద జల్లడమే లక్ష్యంగా వ్యవహరిస్తూ కొన్ని పత్రికలు అడ్డగోలు రాతలు రాస్తున్నాయని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి వైవీ సుబ్బారెడ్డి మండిపడ్డారు. మైసూర్ నుంచి విజయ్‌కుమార్‌స్వామి రామోజీ బంధువు విమానంలోనే విజయవాడ వచ్చారని వెల్లడించారు. రామోజీ బంధువుకు చెందిన ప్రత్యేక విమానంలో, వారి కార్యక్రమం కోసమే విజయవాడ వచ్చారని తెలిపారు. ఆయన మీకోసం వస్తే మాపై నిందలు వేస్తారా? అని నిలదీశారు. 'విజయ్‌కుమార్‌స్వామిని ఆహ్వానించింది మీరే. మీ మార్గదర్శి కేసు నుంచి బయట పడేందుకు ఆయన్ను తెచ్చుకున్నారా?' అని వైవీ ప్రశ్నించారు. మీరు చేస్తే దైవాశీస్సులు.. మేం చేస్తే లాబీయింగా? అని నిలదీశారు. దేవుడు, స్వామీజీల విషయంలో నీచ రాజకీయాలు తగదని హితవు పలికారు. వైవీ సుబ్బారెడ్డి మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

ఈ పిచ్చి రాతలేమిటి?

విజయ్‌కుమార్‌స్వామిని మహిమాన్వితుడిగా ప్రముఖులంతా విశ్వసిస్తారు. అందువల్లే ఆయనతో సీఎం జగన్‌కి ఆశీర్వాదం ఇప్పించా. విజయ్‌కుమార్ స్వామిని లాబీయిస్టుగా అభివర్ణిస్తూ ఎల్లోమీడియా దుర్మార్గమైన కథనాలను ప్రచురిస్తోంది. 'వారి కోసం స్వామి వచ్చిన విషయాన్ని దాచిపెట్టి మాపై నిందలేమిటి? ఈ ద్వంద్వ ప్రమాణాలేమిటి..? ఈ పిచ్చి రాతలేమిటి?'అని వైవీ మండిపడ్డారు.

ప్రత్యేక విమానం రామోజీ బంధువుదే..

'విజయ్‌కుమార్ స్వామి వచ్చిన ప్రత్యేక విమానం రామోజీరావు బంధువు (వియ్యంకుడు) నవయుగ విశ్వేశ్వరరావుదే కదా! విశ్వేశ్వరరావు కుమారుడు శశిధర్, విజయకుమార్ స్వామి అందులో ఉన్నది నిజం కాదా?. మార్గదర్శి కేసుల నుంచి బయటపడేందుకే స్వామీజీని పిలిపించారా? 2017-18లో హైదరాబాద్‌లో రామోజీ బంధువుల గృహ ప్రవేశానికి కూడా విజయ్‌కుమార్‌స్వామి వచ్చారు. అప్పుడు కూడా నవయుగ విశ్వేశ్వరరావు, శశిధర్‌తో కలసి వచ్చారు కదా? మరి అప్పుడు ఎందుకు వచ్చారనుకోవాలి? మీరు చేసేవన్నీ దైవ కార్యాలనుకోవాలా? ఇంత నిస్సిగ్గుగా కథనాలు రాస్తారా? నాకు చాలామంది స్వామీజీలు తెలుసు. 2007 నుంచి విజయ్‌కుమార్ స్వామితో పరిచయం ఉంది. ఆయనంటే ప్రత్యేక గౌరవం ఉంది'అని వైవీ పేర్కొన్నారు.

చిత్తూరులో ప్రేమోన్మాదం?

- తన బ్యూటీపార్లర్‌లోనే బ్యూటీషియన్ మృతి
- ఆమె పక్కనే కొన ఊపిరితో పడి ఉన్న యువకుడు



దుర్గా ప్రశాంతి (ఫైల్)

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని మంగళవారం ఓ బ్యూటీషియన్ చనిపోవడం... పక్కనే ఆమె స్నేహితుడు రక్తపుమడుగులో పడి ఉండటం సంచలనం సృష్టించింది. యువతిని ఆమె స్నేహితుడు గొంతు నులిమి చంపేసి, అనంతరం అతను బ్లేడుతో కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... చిత్తూరు నగరంలోని తాలూకా పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగరాజు, ఇందిర దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు సంతానం. రెండో కుమార్తె దుర్గాప్రశాంతి(23) నాలుగు నెలల క్రితం చిత్తూరులోని కొండమిట్ట ప్రాంతంలో సొంతగా బ్యూటీపార్లర్ ప్రారంభించింది.


ఫేస్‌బుక్ ద్వారా పరిచయమై...

దుర్గాప్రశాంతికి రెండేళ్ల క్రితం ఫేస్‌బుక్‌లో చక్రవర్తి (27) అనే యువకుడు పరిచయమయ్యాడు. అతనిది భద్రాచలం జిల్లా కొత్తగూడెం కాగా, రెండేళ్లు దుబాయ్‌లో వంట మాస్టర్‌గా పనిచేశాడు. ఆ సమయంలోనే చక్రవర్తికి, దుర్గాప్రశాంతికి ఫేస్‌బుక్ ద్వారా స్నేహం కుదిరింది. రెండు నెలల క్రితం దుబాయ్ నుంచి వచ్చిన చక్రవర్తి... తన తల్లిని తీసుకుని చిత్తూరు వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. దుర్గాప్రశాంతి బ్యూటీపార్లర్ వద్దకు మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో చక్రవర్తి వచ్చాడు. ఇద్దరూ లోపలికి వెళ్లి తలుపులు వేసుకున్నారు. సాయంత్రం 4.30 గంటల సమయంలో దుర్గాప్రశాంత్ తల్లి ఇందిర వచ్చి బ్యూటీపార్లర్ తలుపు తీసి చూడగా... దుర్గాప్రశాంతి రక్తపు మడుగులో అచేతనంగా పడి ఉంది. చక్రవర్తి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు చక్రవర్తిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దుర్గాప్రశాంతి అప్పటికే చనిపోయి ఉంది. చక్రవర్తి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రిమ్స్‌కు తరలించారు.

ఇప్పుడే పెళ్లి వద్దంటూ...

దుర్గాప్రశాంతికి పెళ్లి చేసేందుకు ఆమె తల్లిదండ్రులు ఇటీవల ఒక సంబంధం చూశారు. అబ్బాయి వైద్యుడు అని, పెళ్లి చేసుకోవాలని కోరారు. అయితే, ఏడాది తర్వాత పెళ్లి గురించి చూద్దామని దుర్గాప్రశాంతి చెప్పింది. ఈ నేపథ్యంలో చక్రవర్తి, దుర్గాప్రశాంతికి మధ్య ఏదైనా గొడవ జరిగి... ఆమె గొంతు నులిమి చంపేసి, అతను బ్లేడ్‌తో కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడా..? అని పోలీసులు అనుమానిస్తున్నారు. చక్రవర్తి స్పృహలోకి వస్తేనే అసలు విషయం తెలుస్తుందని పోలీసులు చెబుతున్నారు.

ప్రముఖ చిత్రకారుడు బాలి కన్నుమూత



ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): ప్రముఖ చిత్రకారుడు బాలి(81) మంగళవారం కన్నుమూశారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. బాలి అసలు పేరు మేడిశెట్టి శంకర్రావు. 1942లో మేడిశెట్టి అన్నపూర్ణ, లక్ష్మణరావు దంపతులకు విశాఖలో ఆయన జన్మించారు. ఆయన తండ్రి బ్రిటిష్ వారి పాలనలో ఆర్మీలో సుబేదార్. ఆయనకు చిత్రకళపై ఆసక్తి ఉండేది. వీలు చిక్కినప్పుడల్లా బొమ్మలు వేసేవారు. వాళ్ల అమ్మ అన్నపూర్ణ అందమైన ముగ్గులు వేసేవారు. అలా వారిద్దరి నుంచి తనకు చిత్రకళ అబ్బినట్లు బాలి చెప్పేవారు. హైస్కూల్ చదివే రోజుల్లో డ్రాయింగ్ మాస్టారు పెద్దపల్లి వెంకటరత్నం వద్ద చిత్ర కళలోని మెళకువలు నేర్చుకున్నారు. తొలిసారిగా 1958లో ఆయన గీసిన 'ఉబుసుపోక' రేఖాచిత్రం ఆంధ్రపత్రిక వీక్లీలో ప్రచురితమైంది. తొలుత ఇరిగేషన్ డిపార్టుమెంటు ఉద్యోగంలో చేరినా.. చిత్రలేఖనంపై మక్కువతో దాన్ని వదిలేశారు. తర్వాత పలు ప్రధాన దినపత్రికల్లో కార్టూనిస్టుగా పనిచేశారు. వ్యంగ్య చిత్రాలు, కార్టూన్‌లతో పాఠకుల ఆదరణ పొందారు. ఎంతోమంది ప్రముఖ రచయితల నవలలకు కవర్ పేజీ డిజైన్లు వేశారు. ఆయన పత్రికల్లో పనిచేసేటప్పుడు శంకర్ పేరు మీద అప్పటికే పలువురు ఆర్టిస్టులు ఉండటంతో నాటి పత్రిక సంపాదకులు పురాణం సుబ్రహ్మణ్య శర్మ శంకర్రావు పేరును బాలిగా మార్చారు.

బాపూ తర్వాత ఆ స్థాయిలో తెలుగు పత్రికలకు దశాబ్దాలపాటు బొమ్మలు గీసింది బాలినే. గుంటూరు కళాపీఠం ఆధ్వర్యంలో ఆయన్ని చిత్రకళా సామ్రాట్ బిరుదుతో సత్కరించారు. 2013లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హంస అవార్డుతో సత్కరించింది. పలు అంతర్జాతీయ పోటీల్లోనూ బహుమతులు గెలుపొందారు. 'అమ్మే కావాలి' ఆయన రాసిన తొలి పుస్తకం కాగా, ఎనిమిది వరకు కార్టూన్ పుస్తకాలను వెలువరించారు. బాలి సతీమణి 2010లో చనిపోయారు. పిల్లలు అమెరికాలో సెటిలవ్వడంతో ఆయన విశాఖలో ఒంటరిగానే ఉంటున్నారు. గతేడాది ఆయన కుమారుడు గోకుల్ అమెరికాలో జరిగిన మంచు ప్రమాదంలో మరణించారు. ఆరోగ్యం బాగోలేకపోవడంతో బాలి కుమార్తె వైశాలి అమెరికా నుంచి కొన్ని రోజుల క్రితం విశాఖకు వచ్చారు. బాలి మృతి పట్ల పలువురు కళాకారులు, కార్టూనిస్టులు సంతాపం వ్యక్తం చేశారు.





అవినాశ్‌ను అరెస్టు చేయొద్దు



▶ మొదటి పేజీ తరువాయి

మార్చించారనా? అత్యున్నత న్యాయస్థానంపై ఇలాంటి వ్యాఖ్యలను స్వాగతిస్తామా? ఈ కేసులో ఇంప్లీడ్ అయిన సునీత న్యాయవాది దస్తగిరి వ్యాఖ్యలను సమర్థించడం సరికాదు. అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, మరో ఇద్దరు తమ వెనుక ఉన్నారని గంగిరెడ్డి పేర్కొన్నట్లు దస్తగిరి చెప్పాడు. అయితే గంగిరెడ్డి మాత్రం తాను ఎవరి పేర్లు చెప్పలేదని వాంగ్మూలంలో పేర్కొన్నాడు. కిరాయి హంతకుడు చెప్పిన ఓ మాటను పట్టుకుని అవినాశ్, భాస్కర్‌రెడ్డిని ఈ కేసులో ఇరికించేందుకు సీబీఐ శతవిధాలా ప్రయత్నిస్తోంది.

గూగుల్ కూడా సర్టిఫికెట్ ఇవ్వదు..

వైఎస్ వివేకా హత్య వెనుక ఉన్న ప్రధాన కారణాలపై సీబీఐ దర్యాప్తు సాగించడం లేదు. గంగిరెడ్డితో వివేకాకు భూమికి సంబంధించిన వివాదం ఉంది. తనకు రావాల్సిన వాటా ఇవ్వడం లేదని గంగిరెడ్డి ఆగ్రహంతో ఉండేవాడు. వివేకా రెండో భార్య, ఆమె కుమారుడి ఉదంతంలో మొదటి భార్య, కుమార్తె సునీత, అల్లుడితో తీవ్ర విభేదాలున్నాయి. సునీల్ యాదవ్(ఏ-2) తల్లిని వివేకా అసభ్యకరంగా వేధింపులకు గురి చేసినట్లు ఆరోపణలున్నాయి. వివేకాకు కొందరు రాజకీయ శత్రువులు కూడా ఉన్నారు. ఈ నాలుగు అంశాలపై సీబీఐ విచారణ జరపలేదు. సీబీఐ దర్యాప్తు అంతా అవినాశ్, భాస్కర్‌రెడ్డిని ఇరికించేందుకే సాగుతూ ఇతర కారణాల జోలికి వెళ్లడం లేదు. గూగుల్ టేక్ అవుట్ ప్రామాణికం కాదు. ఇది సీబీఐకి కూడా తెలిసినా అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిని ఇరికించే ఉద్దేశంతో దాన్ని పదే పదే ప్రస్తావిస్తున్నారు. గూగుల్ టేక్ అవుట్ ప్రామాణికమని గూగుల్ కూడా అధికారికంగా సర్టిఫికెట్ ఇవ్వదు.. ఇప్పటివరకు ఇవ్వలేదు కూడా. అలాంటిది సీబీఐ దాన్ని ఆధారంగా పేర్కొనడం తప్పుబట్టాల్సిన అంశం.

ఆధారాలు లేకుండా అరెస్టులు...

2017లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకా స్వల్ప తేడాతో ఓడిపోయారు. ఆ ఓటమికి అవినాశ్, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి కారణమని వివేకా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు రిమాండ్ పిటిషన్‌లో సీబీఐ పేర్కొంది. దీనికి ఎలాంటి ఆధారం, సాక్ష్యం లేదు. ఎలాంటి ఆధారం లేకుండా ఓ యువ ఎంపీని అరెస్టు చేస్తే ఆయన భవిష్యత్, పరువు ప్రతిష్టలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కడప పార్లమెంట్ స్థానం నుంచి అవినాశ్ రెండుసార్లు ఎంపీగా పోటీ చేశారు. వివేకా జీవించి ఉండగా అవినాశ్ విజయం కోసం ప్రచారం నిర్వహించారు. గెలుపు బాధ్యతంతా ఆయనే తీసుకుని పనిచేశారు. అత్యంత సన్నిహితులైన వివేకా, అవినాశ్ మధ్య సంబంధాలు ఒక్క ఎమ్మెల్సీ ఎన్నిక కారణంగా హత్యలు చేసుకునే స్థాయికి వెళ్లాయనడం సరికాదు. సీబీఐ కంటే ముందు సిట్ మెటీరియల్ అంతా సేకరించింది. దీన్ని సీబీఐకి అందజేసింది. దస్తగిరి బెయిల్ పిటిషన్ విచారణ సమయంలో గానీ, అప్రూవర్‌గా పేర్కొన్న సమయంలో గానీ ఈ మెటీరియల్‌ను మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టలేదు. అసలు హత్యలో కీలక పాత్ర పోషించిన ఎర్ర గంగిరెడ్డి, దస్తగిరిని వదిలేశారు. ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దుకు ఎందుకు పిటిషన్ వేయలేదని న్యాయస్థానం ప్రశ్నించడంతో తర్వాత దాఖలు చేశారు. దీనిపై కూడా వాయిదాలు కోరుతూ జాప్యం చేస్తూ వస్తున్నారు. హత్య చేసిన తర్వాత తాను బీరువా పగుల కొట్టానని, గంగిరెడ్డి ఏవో డాక్యుమెంట్ల కోసం వెతికి తీసుకెళ్లాడని దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడు. ఆ డాక్యుమెంట్లు ఏమిటి? ఎక్కడి తీసుకెళ్లాడో దర్యాప్తు అధికారులు ఇంతవరకు తెలుసుకోలేదు. అసలు మెటీరియల్‌ను దర్యాప్తు అధికారులు ఎందుకు పరిశీలించడం లేదో తెలియదు. వివేకా మృతి విషయాన్ని ఆయన అల్లుడికి చెప్పింది ఎవరు? వారికి ఈ విషయం ఎలా తెలిసింది? దీని గురించి కూడా విచారణ చేయడం లేదు. ఆధారాలు లేకుండానే భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేశారు.

విచారణకు పూర్తిగా సహకరిస్తున్నారు..

తన విచారణను వీడియో, ఆడియో రికార్డు చేస్తున్నారో లేదో చెప్పాలని అవినాశ్ పలుమార్లు సీబీఐని కోరారు. ఓ చిన్న నోట్ ఇచ్చేందుకు కూడా వారు నిరాకరించారు. దీంతో ఆయన కోర్టును ఆశ్రయించి ఆ వివరాలు తెలుసుకోవాల్సి వచ్చింది. విలువైన కోర్టు సమయం వృథా అయింది. దర్యాప్తు పారదర్శకంగా లేదు. విచారణ ముగిసిందని భాస్కర్‌రెడ్డి రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. అవినాశ్‌కు ఈ హత్యతో సంబంధం ఉన్నట్లు వారి వద్ద ఆధారాలు, సాక్ష్యాలు ఏమీ లేవు.. ఒక్క దస్తగిరి వాంగ్మూలం మినహా. సీబీఐ విచారణకు సహకరించేందుకు అవినాశ్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారు. ఎప్పుడు, ఎక్కడికి పిలిచినా ఆయన వస్తారు. ఇప్పటికే పలుమార్లు 160 సీఆర్‌పీసీ కింద నోటీసులు జారీ చేశారు. దాదాపు 20 గంటలకుపైగా విచారించి 161 సీఆర్‌పీసీ కింద స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు. అవినాశ్‌ను అరెస్టు చేయాలని సీబీఐ అత్యుత్సాహంతో ఉంది. ఈ అంశాలన్నీ పరిగణలోకి తీసుకుని అరెస్టు చేయకుండా ఆదేశాలివ్వాలి'

ఇంకా సాక్ష్యాలు సేకరిస్తున్నాం: సీబీఐ పీపీ

'వివేకా హత్య వెనుక కుటుంబ తగాదాలు, వ్యాపార తగాదాలు లేవు. అవినాశ్‌రెడ్డి విచారణకు సహకరించడం లేదు. ఆయన సాక్ష్యాలను తారుమారు చేసే ప్రయత్నాలు చేశారు. ఇంకా కొందరిని విచారించాల్సి ఉంది. సమాచారం, డాక్యుమెంట్లు సేకరిస్తున్నాం. గంగిరెడ్డి తీసుకువెళ్లిన డాక్యుమెంట్లను సేకరించలేదు' అని సీబీఐ పీపీ తెలిపారు. కిక్కిరిసిన కోర్టు హాల్‌లో సుదీర్ఘ వాదనల అనంతరం అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయవద్దని ఆదేశాలు జారీ చేస్తూ తదుపరి విచారణను న్యాయమూర్తి వాయిదా వేశారు.

• తెలంగాణ

సైన్స్ సెంటర్ ప్రాజెక్టుకు 25 ఎకరాలివ్వండి

సీఎం కేసీఆర్‌కు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయనున్న 'సైన్స్ సెంటర్'ప్రాజెక్టుకు 25 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని సీఎం కేసీఆర్‌కు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. 'ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని'పురస్కరించుకుని తెలంగాణ చారిత్రక, వారసత్వ సంపద పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వ కృషిని వివరిస్తూ జి.కిషన్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణకు చెందిన వివిధ సంగీత, నాటక, నాట్య కళలను పరిరక్షించేందుకు హైదరాబాద్‌లో సంగీత నాటక అకాడమీ ప్రాంతీయ కేంద్రం ఏర్పాటుకు 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరానని పేర్కొన్నారు. ఈ రెండు అంశాలకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఎంత త్వరగా స్పందించి సహకరిస్తే, అంత త్వరగా ఆయా ప్రాజెక్టులను ప్రారంభించటానికి కేంద్రం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. దాదాపు రూ.610 కోట్లతో కాకతీయుల నుంచి నిజాం నవాబుల వరకు అన్ని వారసత్వ కట్టడాలను పరిరక్షిస్తున్నట్టు వివరించారు. హైదరాబాద్‌లో 'కొమురం భీమ్ గిరిజన మ్యూజియం'ను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.



త్యాగం, సోదరభావానికి ప్రతీక రంజాన్

సాక్షి, హైదరాబాద్: త్యాగానికి, సోదరభావానికి ప్రతీక రంజాన్ అని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నవీన్ మిత్తల్ అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం సీసీఎల్ఏ కార్యాలయంలో తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఇఫ్తార్ విందుకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్‌కుమార్, సీసీఎల్ఏ కార్యదర్శి హైమావతి, ప్రత్యేక అధికారి సత్యశారద హాజరయ్యారు.

• తెలంగాణ

కాన్పు చేసి.. కర్చీఫ్ వదిలేసి

- జగిత్యాల మాతా శిశు సంక్షేమ కేంద్రం వైద్యుల నిర్వాకం
- ఆరు నెలలుగా నొప్పితో మహిళ నరకయాతన
- ప్రైవేటు ఆస్పత్రిలో శస్త్రచికిత్స.. కర్చీఫ్ తొలగింపు



నవ్యశ్రీ



నవ్యశ్రీ కడుపులోంచి తొలగించిన కర్చీఫ్

జగిత్యాల: గర్భిణికి సిజేరియన్ శస్త్రచికిత్స చేసిన ప్రభుత్వ వైద్యులు.. కడుపులోనే కర్చీఫ్ మర్చిపోయి కుట్లు వేశారు.. కడుపునొప్పి, మంటతో నరకయాతన అనుభవించిన ఆ మహిళ.. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించుకున్నప్పుడు ఈ విషయం బయటపడింది. జగిత్యాల జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంక్షేమ కేంద్రంలో జరిగిన ఈ సంఘటనపై బాధితురాలి కథనమిది. కొడిమ్యాల మండల నమిలికొండ గ్రామానికి చెందిన నవ్యశ్రీ మూడోకాన్పు కోసం 2021 డిసెంబర్ 28న మాతాశిశు సంక్షేమ ఆస్పత్రిలో చేరింది. అదేనెల 29న వైద్యులు సిజేరియన్ శస్త్రచికిత్స చేయగా మగ శిశువుకు జన్మనిచ్చింది. ఆ తర్వాత ఇంటికి వచ్చిన నవ్యశ్రీ.. తరచూ కడుపునొప్పి, మంటతో బాధపడుతోంది. ఆమె భర్త ఉపాధి కోసం విదేశాల్లో ఉన్నారు. దాదాపు 16 నెలలుగా నరకయాతన పడుతున్న నవ్యశ్రీ వారం క్రితం వేములవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లింది. ఎంఆర్ఐ చేసిన వైద్యులు.. ఆమె కడుపులో కర్చీఫ్ ఉన్నట్లు గుర్తించి శస్త్రచికిత్స చేశారు. కర్చీఫ్‌తో పాటు ఇన్ఫెక్షన్ వల్ల ఏర్పడ్డ గడ్డను తొలగించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన మహిళ కుటుంబసభ్యులు.. మంగళవారం ఆస్పత్రికి చేరుకుని అక్కడి వైద్యులను సంప్రదించేందుకు ప్రయత్నించగా, ఎవరూ అందుబాటులోకి రాలేదు. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఈ సంఘటనపై కలెక్టర్ యాస్మిన్ బాషా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే విచారణ జరిపి బుధవారంలోగా నివేదిక అందజేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఇందుకోసం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తోపాటు గైనిక్ హెచ్‌వోడీ, డీఎంహెచ్‌వోతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములును వివరణ కోరగా.. గర్భిణికి 2021లో పాత ప్రభుత్వ ఆస్పత్రిలో సిజేరియన్ శస్త్రచికిత్స జరిగిందని వివరించారు. అప్పుడు శస్త్రచికిత్స చేసిన వైద్యుల నుంచి వివరాలు సేకరించి, నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. మరోవైపు.. నిర్లక్ష్యంగా శస్త్రచికిత్స చేసిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని నవ్యశ్రీ డిమాండ్ చేశారు.



వెయ్యి శూన్యపు పలుకుల కన్నా,
శాంతిని తేగలిగే ఒక్క మాట మెరుగైనది.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 19 ఏప్రిల్ 2023

సంక్షుభిత దేశంలో సంఘర్షణ

'మదగజాలు పోట్లాడుకుంటే, మామూలు గడ్డి వాటి కాళ్ళ కింద పడి నలిగిపోతుంద'ని ఆఫ్రికన్ సామెత. ఉత్తర ఆఫ్రికా దేశం సూడాన్‌లో పరిస్థితి ఇప్పుడదే. పైచేయి కోసం సైన్యానికీ, పారా మిలటరీ దళాలకూ మధ్య... ఆ రెంటికీ సారథ్యం వహిస్తున్న ఇద్దరు సైనిక జనరల్స్ మధ్య... నాలుగు రోజులుగా చెలరేగుతున్న హింసాకాండలో కనీసం 200 మంది ప్రాణాలు కోల్పోయారు. 2 వేల మంది గాయపడ్డారు. వీధుల్లో పడివున్నవారి వద్దకు వైద్యులు వెళ్ళే పరిస్థితి లేనందువల్ల అసలు లెక్క ఇంకెన్ని రెట్లు ఉంటుందో చెప్పలేని పరిస్థితి. ఇళ్ళు, ఆస్పత్రులు, విద్యుత్కేంద్రాలు, విమానాశ్రయాలు – ఏవీ యుద్ధట్యాంకుల కాల్పులకు మినహాయింపు కాదు. లక్షల మంది ఇంటి గడప దాటి బయటకు రాలేని పరిస్థితి. ఒకవైపు కరెంట్ లేక కష్టపడుతుంటే, మరోవైపు ఇళ్ళపై పడి దోచేస్తున్న దుఃస్థితి. అమెరికా, బ్రిటన్, చైనా, రష్యా, సౌదీ అరేబియా సహా పలు దేశాలు రంగంలోకి దిగి, 'బేషరతుగా శత్రుత్వాన్ని విడనాడాల'ని కోరాల్సి వచ్చింది. ఐరాస ప్రధాన కార్యదర్శి సైతం హింసకు స్వస్తి పలకండంటూ ఇరువర్గాల సైనికనేతలతో మాట్లాడారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

సహజ వనరుల సంపన్న దేశమైతేనేం, 1956లో బ్రిటన్ నుంచి స్వాతంత్య్రం పొందినప్పటి నుంచి సూడాన్‌లో నిత్యం ఏదో ఒక కుంపటి. ప్రజాపాలన ఏర్పడేందుకు ఎప్పుడూ ఏదో ఒక అడ్డంకి. అనేకానేక ఆకస్మిక తిరుగుబాట్లు, పౌర కలహాల చరిత్ర. 1989 నాటి విద్రోహంతో దేశాధ్యక్షుడైన నియంత బషీర్ దీర్ఘకాలిక ప్రభుత్వం 2019 ఏప్రిల్‌లో దేశవ్యాప్తంగా పెల్లుబికిన నిరసనతో పడిపోయింది. ఆ మూడు దశాబ్దాల హింసాత్మక, నిరంకుశ, అవినీతి పాలన స్థానంలో స్వేచ్ఛాయుత, ప్రజాప్రభుత్వం వస్తుందన్న ఆశ ఫలించలేదు. రెండేళ్ళకే, మధ్యంతర పౌరప్రభుత్వం నడుస్తుండగానే ఎన్నికలు జరగాల్సినవేళ 2021లో జనరల్ బుర్హాన్ నేతృత్వంలో తిరుగుబాటు జరిగింది.

ఆనాటి నుంచి సదరు సైనిక జనరలే అసలుసిసలు పాలకుడిగా, సైన్యమే సూడాన్‌ను నడిపిస్తోంది. అలా సైన్యాధికారమే సాగేందుకు మహమ్మద్ హమ్దన్ దగలో అలియాస్ హెమెడ్తీ నేతృత్వంలోని పారా మిలటరీ బలగమైన 'సత్వర మద్దతు దళాల' (ఆర్ఎస్ఎఫ్) కూడా సూడాన్ ఆర్మీతో కలసి పనిచేస్తూ వచ్చింది. అయితే... కొంతకాలంగా సూడాన్ సైన్యానికీ, 'ఆర్ఎస్ఎఫ్'కూ మధ్య పొసగడం లేదు. రెండేళ్ళ క్రితం చేతిలో చేయి వేసుకు నిలబడి, మధ్యంతర పౌరప్రభుత్వాన్ని పడదోసి, పాలనా పగ్గాలు చేపట్టిన సైనిక జనరల్స్ బుర్హాన్‌కూ, ఆయన డిప్యూటీ దగలోకూ మధ్య ఇప్పుడు అపనమ్మకం పెరిగింది. వారి ఆధిపత్య పోరు ఫలితమే సూడాన్‌లో తాజా సంక్షోభం.

నియంత బషీర్ పదవీచ్యుతి అనంతర రాజకీయ అధికార బదలీలో భాగంగా అసలైతే ఈ 2023 చివరికి ఎన్నికలు జరపాలి. పౌర పాలనకు బాటలు వేస్తామంటూ సైనిక నేత జనరల్ బుర్హాన్ సైతం బాస చేశారు. అయితే, అధికారమంటే ఎవరికి తీపి కాదు! అందుకే, ఇటు సేనా నాయకుడు, అటు 'ఆర్ఎస్ఎఫ్' సారథి... ఎవరూ అధికారాన్ని వదులుకోదలుచుకోలేదు. పైచేయికై పరస్పరం ఢీ కొన్నారు. ఆర్ఎస్ఎఫ్ పారామిలటరీలను కూడా సూడాన్ ఆర్మీలోకి చేర్చుకొని, రెండేళ్ళలో పౌర సర్కార్ ఏర్పాటుచేయడంపై ఏకాభిప్రాయం కుదరకపోవడం హింసకు కారణం. ఆర్మీలో ఆర్ఎస్ఎఫ్‌ను చేర్చుకుంటే తన పట్టు పోతుందని దగాలో భయం. పౌర ప్రభుత్వాన్ని మరో పదేళ్ళు జాగు చేయాలని ఆయన భావన. ఇది కడుపులో పెట్టుకొని, సైన్యం అనుమతి లేకనే వివిధ ప్రాంతాల్లో ఆర్ఎస్ఎఫ్ తన వాళ్ళను మోహరించడం మొదలెట్టింది. ఇది ఏప్రిల్ 15 నుంచి హింసాత్మకమైంది.

నిజానికి, ఇవన్నీ ఉన్నట్టుండి జరిగినవి కానే కావు. సూడాన్ దేశ ఆర్థిక సంపదపై, అందులోనూ ప్రత్యేకించి బంగారు గనులపై నియంత్రణ కోసం ఆర్ఎస్ఎఫ్ కొంతకాలంగా ప్రయత్నిస్తోంది. అలా ఇరువర్గాల మధ్య పెరిగిన కుతకుతలు ఇక్కడికి దారి తీశాయి. దీర్ఘకాలం దేశాధ్యక్షుడైన నియంత బషీరే కాదు... 2000ల నాటికి జంజవీద్ అనే తీవ్రవాద సంస్థ సారథిగా మొదలై ఇప్పుడు ఆర్ఎస్ఎఫ్ అధినేత అయిన దగాలో, ప్రస్తుత సైనిక నేత బుర్హాన్... అంతా ఒకే తాను గుడ్డలు. అందరూ మానవ హక్కులను కాలరాసినవారే. ప్రజాస్వామ్య అనుకూల ఉద్యమకారులపై ఉక్కుపాదం మోపినవారే. ఎవరు గద్దెపై ఉన్నా సూడాన్‌లో ఎన్నికల ప్రజాస్వామ్యం వైపు అడుగులేయడం కల్ల. వేలకొద్దీ సైన్యం చేతుల్లో ఉన్న ఇద్దరు అహంభావుల వ్యక్తిగత అధికార దాహానికి ఇన్ని లక్షల మంది ఇక్కట్ల పాలవడమే దురదృష్టం. అంతర్యుద్ధాన్ని నివారించడానికే మధ్యంతర సర్కారును కాదని సైన్యం పగ్గాలు పట్టిందని 2021లో అన్న బుర్హాన్ ఇప్పుడచ్చంగా దేశాన్ని అటువైపే నెట్టేస్తున్నారు.

సూడాన్‌లో సుస్థిరత, సురక్షణ, ప్రజాస్వామ్యం భారత్‌కూ కీలకమే. సంక్షుభిత సూడాన్‌లో దాదాపు 4 వేల మంది భారతీయులున్నారు. వారిలో 1200 మంది దశాబ్దాల క్రితమే అక్కడ స్థిరపడ్డారు. తాజా ఘర్షణల్లో కేరళకు చెందిన ఒకరు మరణించగా, కర్ణాటకలోని హక్కీ–పిక్కీ తెగకు చెందినవారు పదుల సంఖ్యలో చిక్కుకుపోయారన్న మాట ఆందోళన రేపుతోంది. ఘర్షణలు మరింత పెరిగితే సూడాన్ సహా ఆ పరిసర ప్రాంతాలన్నీ అస్థిరతలోకి జారిపోతాయి. ఆకలి కేకలు, ఆర్థిక సంక్షోభం, ఆకాశమార్గం పట్టిన ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్న దేశానికి ఇరుగు పొరుగుతోనూ సంబంధాలు దెబ్బతింటాయి. దేశం ప్రజాస్వామ్య పాలన దిశగా అడుగులు వేయడానికీ ఉపకరించదు. వెరసి, సూడాన్ చరిత్రలో ప్రతి రాజకీయ పరివర్తనకూ సైన్యమే కేంద్రమవుతూ వచ్చింది గనక ఈసారి ఏ మార్పు జరుగుతుందో వేచిచూడాలి.

కృత్రిమ మేధకు పగ్గాలు వేయాలా?

విశ్లేషణ



జస్‌ప్రీత్ బింద్రా

సుమారు 19,000 మంది టెక్ దిగ్గజాలు కృత్రిమ మేధ 'జనరేటివ్ ఏఐ'పై ఆందోళన వెలిబుచ్చుతూ బహిరంగ లేఖ రాశారు. జీపీటీ4 లాంటి టెక్నాలజీలను కనీసం ఆరు నెలల పాటు నిలిపేయాలని కోరారు. మనం చాలా టెక్నాలజీల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాం. మానవ క్లోనింగ్, జన్యుమార్పిడి, అణు టెక్నాలజీలు వీటిల్లో కొన్ని మాత్రమే. కానీ ఈ నిలిపివేత వల్ల ప్రపంచం మొత్తానికి దాదాపుగా ఉచితంగా, అది కూడా పర్యావరణ కాలుష్యం లేకుండా అందివ్వగల కేంద్రక సంలీన ప్రక్రియను సాకారం చేసే జీపీటీ7, జీపీటీ8 వంటి అత్యాధునిక జనరేటివ్ ఏఐ మోడళ్లు రావడం ఆలస్యం కాదా? అత్యద్భుత మేధతో మాత్రమే పరిష్కారం కాగల పెద్ద పెద్ద సమస్యల మాటేమిటి? అందుకే దీనిమీద గట్టి చర్చ జరగాలి.

ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఫిలాసఫర్ నిక్ బోస్ట్రోమ్ 'సూపర్ ఇంటెలిజెన్స్' పేరుతో ఓ పుస్తకం రాశారు. అదొక బెస్ట్ సెల్లర్. అననుకూల వాతావరణంలో మనుగడ కష్టమై బెదిరిపోయిన పిచ్చుకల గుంపు కథ ఇందులో ఉంది. సమస్యలను అధిగమించేందుకు ఆ పిచ్చుకల గుంపు ఓ గుడ్లగూబను దత్తత తీసుకోవాలని నిర్ణయిస్తుంది. ఆ గుడ్లగూబ తమ గూళ్లు కట్టిపెడుతుందనీ, వేటాడేందుకు వచ్చిన జంతువులను భయపెట్టి తరిమేస్తుందనీ, ఆహారాన్ని వెతుక్కునేందుకు సాయపడుతుందనీ ఆ పిచ్చుకలు భావిస్తాయి. ఇదేదో భలే ఉందే అనుకున్న పిచ్చుకల గుంపు గుడ్లగూబ లేదా దాని గుడ్డు వెతకాలని నిర్ణయించుకుంటాయి. అయితే గుంపులో స్క్రాన్‌ఫింకెల్ అనే పిచ్చుక ఈ ఆలోచనతో అంగీకరించదు. గుంపులో గుడ్లగూబ ఉంటే సమస్యలు తప్పవనీ, అందుకే ముందు ఆ గుడ్లగూబను నియంత్రించడమెలా, మచ్చిక చేసుకోవడం ఎలా అన్నది ఆలోచించాలనీ ప్రతిపాదిస్తుంది. మిగిలిన పిచ్చుకలు ఈ అభ్యంతరాలను పట్టించుకోవు. గుడ్లగూబను వెతికి తెచ్చుకోవడమే పెద్ద విషయమనీ, మచ్చిక, నియంత్రణలను ఆ తరువాత చూసుకోవచ్చుననీ అంటాయి.

సానుకూల ఫలితాలే ఉంటాయా?

అచ్చం ఇలాంటి కథే వాస్తవంలోనూ నడుస్తోంది. కానీ ఇందులో ఇప్పటివరకూ కనీసం 19,000 స్క్రాన్‌ఫింకెల్స్ అభ్యంతరాలు వ్యక్తం చేశాయి... ఈ మధ్యకాలంలో అందరినీ ఆశ్చర్యానికి గురిచేసిన ఛాట్ జీపీటీపై! టెక్నాలజీ రంగ దిగ్గజాలు ఎలాన్ మస్క్, స్టీవ్ వోజ్నియాక్, స్టువర్ట్ రస్సెల్ వంటి మరెందరో కృత్రిమ మేధ ఆధారంగా పనిచేసే ఈ జీపీటీ4పై, స్థూలంగా 'జనరేటివ్ ఏఐ'పై తమ ఆందోళన వెలిబుచ్చారు. అక్కడితో ఆగలేదు. ఫ్యూచర్ ఆఫ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో 'పవర్‌ఫుల్ ఏ.ఐ. సిస్టమ్స్' పేరుతో ఓ బహిరంగ లేఖ కూడా రాశారు. అన్ని సానుకూల ఫలితాలుంటాయనీ, ఎదురయ్యే ప్రమాదాలను నియంత్రించేందుకు అవకాశముంటుందన్న నమ్మకం కుదిరిన తరువాత మాత్రమే జీపీటీ4 లాంటి టెక్నాలజీలను మరింత అభివృద్ధి చేయాలనీ వారు ఈ లేఖలో స్పష్టం చేశారు. జీపీటీ4ను అభివృద్ధి చేస్తున్న సంస్థ 'ఓపెన్ ఏఐ' స్వయంగా ''ఏదో ఒకదశలో దీనిపై స్వతంత్ర సమీక్ష ఒకటి జరపడం చాలా ముఖ్యమవుతుంది. జీపీటీ4 లాంటి వ్యవస్థలకు మరింత శిక్షణ ఇచ్చే ముందు ఇది జరగాలి. అలాగే ఇలాంటి వ్యవస్థల కోసం ఉపయోగించే గరిష్ఠ కంప్యూటింగ్ శక్తిని కూడా మదింపు చేయాలి'' అని చెప్పడాన్ని వీరు తమ లేఖలో ఉదహరించారు. ఆ సమయం ఇప్పుడు ఆసన్నమైందన్నది టెక్ దిగ్గజాల అంచనా. ఈ విషయమై కృత్రిమ మేధపై పనిచేస్తున్న అన్ని కంపెనీలకు ఒక విజ్ఞప్తి కూడా చేశారు. జీపీటీ4 కంటే ఎక్కువ శక్తిమంతమైన అన్ని కృత్రిమ మేధ వ్యవస్థలకు శిక్షణ ఇవ్వడాన్ని కనీసం ఆరునెలలు ఆపాలనీ, అది వెంటనే జరగాలనీ కోరారు.



అలా సాధ్యం కాని పక్షంలో ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని కూడా సూచించారు. (అయితే 'ట్విట్టర్' సీఈఓ ఎలాన్ మస్క్ కూడా ఒక ఏఐ వేదిక ప్రారంభించనున్నట్టూ, దానికి ట్రూత్ జీపీటీ అని పేరు పెడుతున్నట్టూ వెల్లడించడం గమనార్హం).

బోస్ట్రోమ్ పిచ్చుకల కథకూ, దీనికీ కొంచెం తేడా ఉందంటారు 'న్యూయార్క్ టైమ్స్' కాలమిస్ట్ రాస్ డౌదాట్. పిచ్చుకలకు కనీసం గుడ్లగూబ ఎలా ఉంటుంది, ఏ రకమైన హాని చేయగలదన్న విషయమైనా తెలుసుననీ, జీపీటీ4 వంటి కృత్రిమ మేధ విషయంలో మనకు ఆమాత్రం కూడా తెలియదనీ వివరించారు. ఐఫోన్, ఫేస్‌బుక్, టిక్‌టోక్‌లు అందుబాటులోకి వచ్చినప్పుడు కూడా వాటితోనూ కొన్ని దుష్ప్రభావాలు ఉండగలవని ఎవరు ఊహించారు?

ఆచితూచి వ్యవహరించాల్సిన టెక్నాలజీలు

జీపీటీ4 లాంటి జనరేటివ్ ఏఐ టెక్నాలజీ అతితక్కువ సమయంలో అత్యద్భుతమైన ఫలితాలను ఎలా ప్రదర్శిస్తోందో టెక్ కంపెనీలకు సైతం ఇంకా తెలియకపోవడం గమనార్హం. ''కొంచెం జాగ్రత్తగా ఉండక తప్పదు. దీని (ఏఐ) గురించి మనమూ భయపడుతున్నామని తెలిస్తే ప్రజలు కొంత సంతోషంగా ఫీల్ అవుతారు'' అంటారు 'ఓపెన్ ఏఐ' సీఈవో సామ్ ఆల్ట్‌మ్యాన్. ఇదేదో అమాయకమైన చిన్న పిచ్చుక లాంటి వ్యవహారం కాదు, ప్రమాదకరమైనది అని ఆయన స్పష్టంగా హెచ్చరించారు.

టెక్ దిగ్గజాలు రాసిన బహిరంగ లేఖలో ఒక్క విషయాన్నయితే అంగీకరించాల్సి ఉంటుంది. ఇటీవలి కాలంలో మనం చాలా టెక్నాలజీల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాం. కొన్నింటి పురోగతిని నిలిపివేసే ప్రయత్నమూ చేశాం. మానవ క్లోనింగ్, జన్యుమార్పిడి టెక్నాలజీలు వీటిల్లో కొన్ని మాత్రమే. భూమండలాన్ని ధ్వంసం చేసే సామర్థ్యమున్న రసాయన, జీవాయుధాలు, అణ్వస్త్ర టెక్నాలజీలను కూడా అడ్డుకున్నాం. అణ్వస్త్ర టెక్నాలజీనే తీసుకుంటే... శక్తిమంతమైన కృత్రిమ మేధలాగే, అణువును విభజించడంలో లాభాలెన్నో, నష్టాలూ అన్నే. అనంతమైన విద్యుత్తు ఇవ్వగలగడం సానుకూల అంశమైతే, విధ్వంసం దీనికి మరోవైపున కనిపిస్తుంది. ఈ రెండో రూపాన్ని గుర్తించేందుకు హిరోషిమా, నాగసాకి వంటి భయంకరమైన అణుబాంబు దాడుల్ని చూడాల్సి వచ్చింది. ఈ ఘటన తరువాత దేశాలన్నీ ఒక్కతాటిపై వచ్చి ఇంటర్నేషనల్ అటామిక్ ఏజెన్సీ, అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక చట్టం వంటి వాటిద్వారా అణ్వస్త్రాలపై నిషేధం, నియంత్రణలు తేగలిగాయి. తద్వారా మరిన్ని హిరోషిమా, నాగ సాకీలు జరక్కుండా ఇప్పటివరకూ నిరోధించగలిగాం.

అణు టెక్నాలజీకి సంబంధించిన ఇంకో పార్శ్వమూ ఉంది. విధ్వంసం, వినాశనాలకు బెదిరి మనం వాడకాన్ని మరీ పరిమితం చేసేశాం. ఫలితంగా వాతావరణ మార్పులకు కారణమైన శిలాజ ఇంధనాలను విపరీతంగా వాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక ముప్పు తప్పించుకునేందుకు ఇంకోముప్పును కొని తెచ్చుకున్నట్టు అన్నమాట!

అత్యాధునిక మోడళ్లను ఆపడమా?

కృత్రిమ మేధ టెక్నాలజీపై ఆరు నెలల విరామం వల్ల ఏం ఫలితం ఉండగలదని చాలామంది ప్రశ్నించవచ్చు. ఒక వేళ ఆరునెలల పాటు నిలిపేసినా చైనా లాంటి దేశాలు దీన్ని అనుసరిస్తాయా? తాత్కాలిక నిలిపివేత వల్ల ప్రపంచం మొత్తానికి దాదాపుగా ఉచితంగా, అది కూడా పర్యావరణ కాలుష్యం అనేది లేకుండా అందివ్వగల కేంద్రక సంలీన ప్రక్రియను సాకారం చేసే శక్తి ఉన్న జీపీటీ7, జీపీటీ8 వంటి అత్యాధునిక జనరేటివ్ ఏఐ మోడళ్లు రావడం ఆలస్యం కాదా? వాతావరణ మార్పులు మొదలుకొని అత్యద్భుత మేధతో మాత్రమే పరిష్కారం కాగల పెద్ద పెద్ద సమస్యల మాటేమిటి? ఈ ప్రశ్నలపై చర్చోపచర్చలు దీర్ఘకాలం కొనసాగుతాయి. అందులో సందేహం లేదు. అయితే జనరేటివ్ ఏఐ విషయంలో మనం నైతిక అంశాలపై మొట్టమొదట మాట్లాడుకోవాలి. ఎప్పటికప్పుడు కొత్త కొత్త జనరేటివ్ ఏఐ మోడళ్లను విడుదల చేసినంత వేగంగా, అత్యవసరంగా ఈ అంశంపై చర్చ జరగాలన్నది నా అభిప్రాయం. సాధారణ పరిస్థితుల్లోనైతే అత్యంత శక్తిమంతమైన టెక్నాలజీ మదింపునకు అంతర్జాతీయ సంస్థలు బోలెడంత సమయం తీసుకునే అవకాశముంది. అందుకే ప్రభుత్వాలు కలుగజేసుకోవాలి. ఆరునెలల తాత్కాలిక నిషేధం గొప్ప పరిష్కారం కాకపోవచ్చు. కానీ టెక్ దిగ్గజాలు హెచ్చరిస్తున్నట్టుగా జనరేటివ్ ఏఐ అనే గుడ్లగూబను నియంత్రించడం, మచ్చిక చేసుకోవడం ఎలాగో తెలుసుకున్న తరువాతే మనుషులనే పిచ్చుకల గుంపులోకి దాన్ని తీసుకురావడం మేలు. ఈ విషయమై ప్రపంచం స్థిమితంగా ఆలోచించాల్సిన అవసరం, సమయం వచ్చేసింది!

వ్యాసకర్త రచయిత; 'ఏఐ అండ్ ఎథిక్స్' అంశంపై కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో స్నాతకోత్తర విద్యను అభ్యసిస్తున్నారు.

('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చెత్త మనుషులు



ఇండియాలో ఆఖరికి చెత్తను వేరు చేయడం కూడా ప్రతిష్ఠకు సంబంధించిన అంశం. ఇండోర్‌లో ఒక వ్యాపారి గన్ తీసి గాలిలోకి కాల్చాడు– ఎందుకంటే, ఆయన భార్య తడి చెత్త, పొడి చెత్త ఎందుకు వేరు చేయలేదని శానిటరీ వర్కర్ అడిగే 'ధైర్యం' చేసినందుకు! ఆ చెత్త కంటే ఈ కోపం పరమచెత్తగా ఉంది.

– సంగీత నంబి, రచయిత్రి

చట్టమే మొదలు



వివాహ సమానత్వం కోసం ఉన్న డిమాండ్ గురించి: ముందు సమాజం మారితే, దాన్ని చట్టం అనుసరిస్తుందని చెప్పడం పొరపాటు. చట్టమే దాన్ని గుర్తించడానికి నిరాకరిస్తుంటే, మనం ఇక సమాజం నుంచి ఏం ఆశించగలం?

– అఖిల్ సిబాల్, న్యాయవాది

కష్టపడి చూడాలి



పనికి మించింది లేదు. అందుకే ఎంజాయ్ చేయడం మానండి. 'కిసీ కా భాయీ కిసీ కీ జాన్' విడుదలకు నాల్రోజులే ఉంది. కష్టపడకపోతే ఫ్యామిలీ సినిమాను ఫ్యామిలీకి ఎట్లా చూపిస్తారు? అడ్వాన్స్ బుకింగ్ ఓపెన్ అయింది, కొనేసి క్లోజ్ చేయండి!

– సల్మాన్ ఖాన్, నటుడు

తొలి ఉత్సాహం



ముంబయిలోని ఉత్సాహం, సృజన, ఉద్వేగాలు అద్భుతం. ఇండియాలో మా మొదటి యాపిల్ స్టోర్‌ను ప్రారంభించడం ఎంతో ఉద్విగ్నంగా ఉంది.

– టిమ్ కుక్, వ్యాపారవేత్త

ఆధ్యాత్మిక బలం



రంజాన్ మాసంలో ఉపవాసం ఉండటంలోని ఉద్దేశం ఏమిటంటే, మనిషికి సంబంధించిన భౌతిక దృష్టికోణాన్ని బలహీనపరిచి, అతడిలోని ఆధ్యాత్మికతను బలపరచడం.

– మౌలానా వహీదుద్దీన్ ఖాన్, ఇస్లామిక్ పండితుడు

ఇన్‌బాక్స్

'పిల్లల బడి' నిర్మాత

ప్రఖ్యాత విద్యావేత్త తారాబాయి 1892 ఏప్రిల్ 19న ముంబైలో జన్మించారు. గిజుభాయ్ బధేకా సహాయంతో 'మాంటిస్సోరి' సూత్రాల ఆధారంగా 'పాటల ద్వారా బోధన'ని ఆవిష్కరించి విద్యారంగంలో తన ప్రస్థానం ప్రారంభించారు. 1923 నుండి 1932 వరకు భావ్‌నగర్‌లోని దక్షిణామూర్తి విద్యాసంస్థలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 1936లో 'న్యూ చైల్డ్ ఎడ్యుకేషన్ అసోసియేషన్'ను స్థాపించారు. థానే జిల్లా బోర్డిలో 'గ్రామ్ బాల్ శిక్షా' కేంద్రాన్ని స్థాపించారు.

ఆటపాటల ద్వారా విద్యాబోధన, వ్యవసాయంతో మేళవించిన పాఠాలు బోధించి ఆదివాసీ పిల్లలను ఆకర్షించారు. వారికి మరింత దగ్గరవ్వడం కోసం 'మెడో స్కూల్' పేరుతో అడవుల్లో పాఠశాల తెరిచారు. స్థానికంగా దొరికే ఈకలు, కంకణాలు, గుండ్లు, రాళ్లు, గింజలు, మట్టి, ఇసుక, వెదురు లాంటివి మాత్రమే ఉపయోగించి విద్యార్థులకు... రంగు, స్పర్శ, బరువు కొలత, సంఖ్యలు బోధించారు. గిరిజన పిల్లల కోసం ఆమె ప్రారంభించిన 'కురాన్ స్కూల్' ఒక ప్రత్యేకమైన ఆవిష్కరణ.

తారాబాయి 1946 –1951 మధ్య మహారాష్ట్ర ఎమ్మెల్యేగా సేవలందించారు. విద్యారంగంలో ఆమె చేసిన కృషికి గాను ప్రభుత్వం పద్మ భూషణ్‌తో సత్కరించింది. ముంబైలో 1973లో తన 81వ యేట తారాబాయి కన్ను మూశారు.

– డా॥ ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ జిల్లా

(నేడు తారాబాయీ మోడక్ జయంతి)

ఆ ప్రోత్సాహకాలు ఎవరిని ఉద్ధరించినట్లు?

అభిప్రాయం



డి. పాపారావు

2021 ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 'ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు' (పీఎల్ఐ) పేరిట కేంద్ర ప్రభుత్వం సరికొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. 2014 సెప్టెంబర్ మాసంలో ఆడంబరంగా ఆవిష్కరించిన 'మేకిన్ ఇండియా' కార్యక్రమంలో అంతర్భాగంగా, 2021లో ఈ పీఎల్ఐ పథకం ముందుకు వచ్చింది. ఈ పథకంతో పాటుగా... స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, గతిశక్తి కార్యక్రమం, కార్మిక చట్టాల సవరణలు, అలాగే విదేశాల నుంచి దిగుమతి అయ్యే పలు రకాల సరు కులపై సుంకాలు పెంచడం వంటివన్నీ భారత్‌లో సరుకు ఉత్పత్తికీ, పారిశ్రామిక రంగం వృద్ధి చెందడానికీ ఉపయోగపడతాయనేది కేంద్ర ప్రభుత్వ ఉద్దేశ్యం. 'మేకిన్ ఇండియా,' దానికి అనుబంధంగా ముందుకు వచ్చిన పీఎల్ఐ పథకం కావచ్చు... గతిశక్తి కావచ్చు... మరే చొరవైనా కావచ్చు... దేశీయంగా ప్రజల కొనుగోలు శక్తినీ, డిమాండ్‌ను పెంచలేదు. అలా పెంచాలనే ఆలోచన కూడా ఈ ప్రభుత్వంలో కనబడదు.

పీఎల్ఐ పథకం స్వభావం, దాని ఫలితాలు వంటి అంశాలను సునిశితంగా పరిశీలిస్తే... అసలు దీనివల్ల ఏమైనా మేలు జరిగిందా? జరిగితే ఎవరికి జరిగింది అనే విషయాలు తేటతెల్లమవుతాయి. ఇప్పటివరకు 14 సరుకు ఉత్పత్తి రంగాలకు సంబంధించి ప్రోత్సాహకాలను ఈ పథకం ప్రకటించింది. ఆయా రంగాలలో మరింత ఉత్పత్తినీ, ఎగుమతులనూ, ఉపాధి కల్పననూ ప్రోత్సహించడం పథక ప్రధాన ఉద్దేశ్యం. దీనికోసం ఈ పథకం కింద ఎంపికైన కంపెనీలకు సంబంధించి ఒక నిర్దిష్ట సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుంటారు. దాని అనంతర 5 ఏళ్ల కాలంలో, సంవత్సరానికి ఆ కంపెనీ సరుకుల అమ్మకాలకు సంబంధించిన నిర్దిష్ట లక్ష్యాలను నిర్ణయిస్తారు. లక్ష్యాలను చేరుకోగలిగితే... పీఎల్ఐ పథకం కింద ఆ సంస్థకు 4 నుంచి 6 శాతం మేర ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని అందిస్తుంది. లక్ష్యాలను సాధించిన కంపెనీలకు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు ఇప్పటివరకు దరిదాపుగా 2 లక్షల కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం కేటాయించింది.

ప్రభుత్వం అందిస్తోన్న ప్రోత్సాహకాలతో పాటుగా... భౌగోళిక రాజకీయ అంశాలు కూడా ఈ పథకం విజయవంతం కావడానికి కలిసి వస్తాయనేది మన పాలకుల అంచనా. అంటే కోవిడ్, లాక్‌డౌన్ కాలంలోనూ, ఆ తర్వాతి కాలంలోనూ ప్రపంచంలోని అతిపెద్ద సరుకు ఉత్పత్తిదారైన చైనాలో ఉత్పత్తి కుంటుపడి ప్రపంచవ్యాప్తంగా సరుకుల కొరత ఏర్పడింది. దీంతో వాటి ధరలు పెరిగాయి. అలాగే చైనా, అమెరికాల మధ్యన ఏర్పడిన ఆధిపత్య ఘర్షణల క్రమంలో... చైనాను దెబ్బ తియ్యాలంటే దాని సరుకు ఉత్పత్తి పునాదిని పెకిలించి వేయాలనేది కూడా పాశ్చాత్య దేశాల ఆలోచనగా ఉంది. ఈ రెండు అంశాల ప్రాతిపదికగానే – 'చైనా+1' అనే విధానాన్ని ముందుకు తెచ్చారు. దీని ప్రకారం చైనాను ప్రధాన ఉత్పత్తిదారుగా 'ఉండనిస్తూనే' మెల్లమెల్లగా పరిశ్రమల స్థాపనకు ఇతర దేశాలను కూడా అదనపు కేంద్రాలుగా చేసుకోవాలన్నది ఆలోచన.

నిజానికి ట్రంప్ హయాంలోనే చైనాతో వాణిజ్య ఘర్షణకు తెర లేచింది. అప్పట్లో ఆసియా దేశాల నుంచి అమెరికాకు అయ్యే ఎగుమతుల్లో 65 శాతం వాటా చైనా కలిగి ఉంది. ట్రంప్ విధానాల వల్ల 2019 నాలు గవ త్రైమాసికం నాటికి దాని వాటా 56 శాతానికి పడిపోయింది. అంటే, 2019లో 31 బిలియన్ డాలర్ల మేరకు చైనా వ్యాపారం ఇతర



ఆసియా దేశాలకు తరలిపోయింది. ఈ మొత్తంలో సుమారు 46 శాతం వాటాను వియత్నాం సొంతం చేసుకోగా, భారత్ కేవలం 10 శాతానికే పరిమితమయింది. మన దేశంలో 2014లోనే మోదీ ప్రభుత్వం ఆర్భాటంగా 'మేకిన్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రారంభించింది. అయినా చైనా నుంచి తరలివెళ్లిన వ్యాపారంలో మన దేశానికి తగిన వాటాను ఈ పథకం సాధించి పెట్టలేకపోయింది. ఇదంతా కోవిడ్ ముందరి కథ.

అయితే కోవిడ్ అనంతరం బలంగా ముందుకు వచ్చిన 'చైనా+1' నినాద కాలంలో... డిసెంబర్ 2022 వరకూ సుమారు మూడేళ్ల 'జీరో కోవిడ్' విధానంతో చైనాలో సరుకు ఉత్పత్తి చాలా మేరకు స్తంభించిపోయింది. అయినా మన దేశం తాను అప్పటికే ముందుకు తెచ్చిన పీఎల్ఐ పథకం ద్వారా పారిశ్రామికంగా పెద్దగా పెట్టుబడులను ఆకర్షించలేకపోయింది. ఇదే విషయాన్ని ప్రధాన ఆర్థిక సలహాదారుగా ఉన్న వి. అనంతనాగేశ్వరన్ ఇప్పటికే చెప్పారు. ఆయన ప్రకారం... ఈ పథకం కేవలం రెండు మూడు రంగాల్లో (మొత్తం 14 రంగాలకు గాను) మాత్రమే ఇప్పటివరకు విజయవంతం అయ్యింది. అయితే కొద్దిపాటి రంగాలలో పీఎల్ఐ వలన పెట్టుబడులు పెరిగి నప్పటికీ, అక్కడ ఉపాధి కల్పన మాత్రం ఆశించిన స్థాయిలో జరుగలేదు. ఇక పీఎల్ఐ విజయం సాధించిన మొబైల్ ఫోన్ల తయారీ రంగంలో కూడా కేవలం ఇప్పటికే మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు, బ్రాండ్ ఇమేజ్ తదితర అనుకూలతలు ఉన్న కంపెనీలే లక్ష్యాలను సాధించాయి. పీఎల్ఐ పథకం క్రింద ప్రోత్సాహకాలు పొందేందుకు అర్హత పొందిన దేశీయ కంపెనీలు నిర్దేశిత అమ్మకం, ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడంలో ఇబ్బందులు పడుతున్నాయి. కాగా, విదేశీ కంపెనీలు అయిన ఆపిల్, సామ్‌సంగ్‌లు మాత్రం ఈ పథకం నిర్దేశించిన లక్ష్యా లను చేరుకోగలిగాయి. అయితే ఎంట్రీ లెవెల్ ఫోన్‌ల అమ్మకాలు తప్ప ఖరీదైన ఫోన్‌ల అమ్మకాలు పెద్దగా పెరగలేదు. ఇందుకు కారణం సామాన్య, మధ్య తరగతుల... ఆదాయం, కొనుగోలు శక్తులు పతనం కావడమే. అంటే, స్థూలంగా అనేక ఇతర కారణాలతో పాటుగా, దేశీయంగా సామాన్య ప్రజల కొనుగోలు శక్తి పతనం కూడా పీఎల్ఐ వైఫల్యానికి ఒక కారణమన్నమాట.

ఈ మధ్య రిజర్వ్ బ్యాంకు మాజీ డిప్యూటీ గవర్నర్ అయిన విరాల్ ఆచార్య చెప్పినట్లుగా దేశంలోని చిన్న పారిశ్రామిక సంస్థలను దెబ్బతీసి, 5 అతిపెద్ద కార్పొరేట్లు మాత్రమే భారీగా ఎదిగాయి. బహుశా ఇది ఆశ్రిత పెట్టుబడిదారీ విధాన ఫలితం. ఇటువంటి స్థితిలో పీఎల్ఐ వంటి పథకాల రూపంలో ఎటువంటి ప్రోత్సాహకాలను ఇచ్చినా... అవన్నీ పాలకుల కరుణా కటాక్షాలు ఉన్న కొద్దిపాటి పారిశ్రామిక సంస్థలకో లేదా అంతర్జాతీయ స్థాయి విస్తృతి, సామర్థ్యం ఉన్న బడా సంస్థలకో దక్కుతాయి. పరిశ్రమలు పెట్టడానికి కావలసిన అనేక సానుకూల అంశాలు మనదేశంలో లేవు. 'ఫైనాన్సియల్ టైమ్స్' కథనం ప్రకారం... మన దేశంలో పారిశ్రామిక ఉత్పత్తికి ఒక ప్రధాన సవాలు ఉత్పత్తిలో నాణ్యతా ప్రమాణాల సాధనలో ఎదురవుతున్న ఇబ్బందులు. దీనికి కారణం దేశీయ మానవ వనరుల నైపుణ్యాల స్థాయి తగిన మేర లేకపోవడం. ప్రభుత్వాలు కార్పొరేట్లకు రాయితీలు ఎన్ని ఇచ్చినా... ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ప్రజల స్థితిగతుల్లో ఏ మార్పూ రావడంలేదు. ఉత్పత్తి పెరిగి కనీసం సరుకుల ధరలన్నా తగ్గడం లేదు. కేవలం పారిశ్రామిక సంస్థల లాభాల కిట్టీని మరింత పెంచడానికే ఈ రాయితీలు ఉపయోగపడుతున్నాయి.

వ్యాసకర్త ఆర్థిక రంగ నిపుణులు । 98661 79615

తుంగలా ఉండాలి!

మహాభారత యుద్ధానంతరం శ్రీకృష్ణుడు ప్రేరేపించగా శరతల్పగతుడైన భీష్ముని వద్దకు ధర్మరాజు వచ్చి, ధర్మాధర్మముల స్వరూపం తెలుసుకొనే ఉద్దేశంతో పలు ప్రశ్నలు వేస్తాడు. శత్రువు అధిక బలుడైనప్పుడు, అల్ప బలుడైనవాడు ఏ విధంగా తనను తాను రక్షించుకొని ఆపద నుండి బైటపడాలి? అనేది వాటిల్లో ఒక ప్రశ్న. ఈ ప్రశ్నకు సమాధానంగా భీష్ముడు ఒక కథ చెప్పాడు.

''ఒకప్పుడు సముద్రుడి మెదడులో ఒక సందేహం పొడమింది. అది తీర్చుకొనేటందుకు అన్ని నదులనూ ఈ విధంగా అడిగాడు: 'మీరు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నప్పుడు వేళ్ళతో సహా పెళ్ళగింపబడిన మహా మహా వృక్షాలు మీతోపాటుగా వస్తుంటాయి. కానీ అలా

జ్యోతిర్మయం

ఎప్పుడు తుంగ గడ్డి మొక్కలు రావటం నేను చూడలేదు. తుంగ గడ్డి మొక్కలు సన్నగా పొడుగ్గా బలహీనంగా ఉంటాయి. అవి మీ ఒడ్డునే పెరుగుతాయి. అవి ఎందుకు పెళ్ళగింపబడవు? అవంటే మీకు చిన్న చూపా? లేక మరే విధంగానైనా అవి మీకు ప్రీతి పాత్రమైనవా? వాటిని పెరికి వేయటానికి మీకు శక్తి చాలదా? ఎందువల్ల వాటికి చేటు వాటిల్లదు?'

అందుకు గంగానది, అన్ని నదుల పక్షాన ఈ విధంగా అన్నది: 'పెద్ద పెద్ద వృక్షాలు అన్నీ ఒకే చోట స్థిరంగా పాతుకుపోయి ఉంటాయి. అందువల్ల అవి మాకు ఎదురొడ్డి నిల్చినప్పుడు మా ప్రవాహ వేగానికి వాటి స్థానాలను అవి విడిచిపెట్టక తప్పదు. తుంగ గడ్డి మొక్కల పరిస్థితి వేరు. మా ప్రవాహ ఉధృతికి అవి తలొగ్గుతాయి. వరద ఉధృతి తగ్గగానే తుంగ గడ్డి మొక్కలు మళ్ళీ పైకి లేచి యథాస్థితికి వస్తాయి. అవి సమయానుకూలంగా ప్రవర్తిస్తాయి. మొండిగా వ్యవహరించవు. అందువల్ల ఆ మొక్కలను మేము పెరికి వేయం.'

ఈ కథ సారాంశం ఏమిటంటే... తన కంటే బలవంతుడైన శత్రువును ఎదుర్కోవాలి అంటే సరైన సమయం, అవకాశం కోసం కాచుకొని ఉండాలి. శత్రువు బలం ఏ పాటిదో, తనకున్న శక్తి ఎంతటిదో అంచనా వేసుకోవాలి. తొందరపాటుతో మూర్ఖంగా శత్రువును ఎదిరించకూడదు.''

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.చతుర్దశి ఉ.11.10 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** రేవతి రా.12.03 వరకు, తదుపరి అశ్వని, **వర్జ్యం:** ప.12.25 నుండి 1.59 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.33 నుండి 12.24 వరకు, **అమృతఘడియలు:** రా.9.40 నుండి 11.13 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.46, **సూర్యాస్తమయం:** 6.12.

క్లుప్తంగా...

జూలై 9న బ్రహ్మ గర్జన



దిల్‌సుఖ్‌నగర్ (హైదరాబాద్): తెలంగాణ బ్రాహ్మణ సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో జూలై 9న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బ్రహ్మ గర్జన సభను నిర్వహించనున్నట్టు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్‌మోహన్ శర్మ తెలిపారు. కొత్తపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 22న జరగాల్సిన బ్రహ్మ గర్జనను అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు చెప్పారు. బ్రాహ్మణుల సమస్యలను అన్ని ప్రభుత్వాలకు తెలియజేయడానికి లక్షలాది మందితో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

లీకేజీపై సీబీఐ విచారణకు డిమాండ్



సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగుల మీద సీఎం కేసీఆర్‌కి చిత్తశుద్ధి ఉంటే టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌పై సీబీఐ విచారణ జరిపించాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈ ఘటనపై దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని కోరారు. అదేవిధంగా టీఎస్‌పీఎస్సీ బోర్డును వెంటనే ప్రక్షాళన చేయాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీ స్కాం జరిగి నెలన్నర దాటుతున్నా.. ఇప్పటివరకు ఒక్క రివ్యూ మీటింగు లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు. గతంలో నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడినా.. ఇప్పుడు పేపర్ లీకేజీలతో వారి కష్టార్జితం నీటిపాలైనా బీఆర్ఎస్‌కు దున్నపోతు మీద వానపడ్డట్టుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగట్లో సరుకులు అమ్ముతున్నట్లు టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాలను అమ్మకానికి పెట్టినా ఈ సర్కారుకు సిగ్గురాలేదని విమర్శించారు. నిరుద్యోగుల పక్షాన గళమెత్తితే పోలీసులను పంపించడం... హౌస్ అరెస్ట్ చేయించడం.. ఇది మాత్రమే కేసీఆర్‌కి చేతనైందని ఎద్దేవా చేశారు.

కేసీఆర్ కుటుంబానికే జైలు కొత్త... నాకు కాదు

- చర్లపల్లి జైలు నుంచి విడుదలైన తీన్మార్ మల్లన్న
- తెలంగాణ నిర్మాణ పార్టీని నెలకొల్పుతున్నట్లు ప్రకటించిన మల్లన్న



కుషాయిగూడ(హైదరాబాద్): జైలు తనకేమీ కొత్త కాదని, సీఎం కేసీఆర్ కుటుంబానికే కొత్తని, జైలుకెళ్లేందుకు కేసీఆర్ కుటుంబం సిద్ధంగా ఉండాలని తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ పేర్కొన్నారు. చర్లపల్లి జైలు శిక్ష అనుభవిస్తున్న ఆయన మంగళవారం విడుదలయ్యారు. మల్లన్న అభిమానులు జైల్ వద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ తనపై ప్రభుత్వం మోపిన కేసులన్నీ డొమ్మీ కేసులేనని, అందుకే కోర్టు బెయిల్ మంజూరు చేసిందని తెలిపారు. తెలంగాణ నిర్మాణ పార్టీ పేరుతో రాజకీయపార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో మేడ్చల్ అసెంబ్లీ స్థానం నుంచి తన పార్టీ తరఫున పోటీ చేస్తానని తెలిపారు. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు ప్రజల మనోభావాలు గౌరవించేందుకు కాదని, మహారాష్ట్ర రాజకీయాల్లోకి ప్రవేశం కోసమేనని చెప్పారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చేది యువతేనని..రైట్ రీ కాల్ తీసుకొస్తామని స్పష్టం చేశారు.

మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం

భూపాలపల్లి: భూపాలపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌పై 20 మంది కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించారు. ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ టీఎస్ దివాకర్‌కు మంగళవారం అవిశ్వాస నోటీసును అందజేశారు. తాము ఎన్నికై మూడేళ్లు గడిచినా ఇప్పటివరకు వార్డుల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సెగ్గెం వెంకటరాణి, వైస్‌చైర్మన్ కొత్త హరిబాబు ప్రొటోకాల్ పాటించడం లేదని, తమను అగౌరవ పరుస్తున్నారని తెలిపారు. వారి ఒంటెద్దు పోకడల కారణంగా తమకు ఇబ్బంది కలుగుతోందని, కౌన్సిలర్లుగా ఎటువంటి గౌరవం లేనందున విసుగు చెంది అవిశ్వాసం ప్రకటిస్తున్నామని నోటీసులో పేర్కొన్నారు.

డబుల్‌బెడ్‌రూం పంపిణీలో వివాదమే కారణమా?

కాగా, డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీలో తలెత్తిన వివాదం కారణంగానే కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించినట్లు తెలుస్తోంది. తమ తమ వార్డుల్లోని అర్హుల జాబితాను అందించినప్పటికీ, వారికి కేటాయించకుండా, చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లు డబ్బులు తీసుకొని, ఏకపక్షంగా లబ్ధిదారుల జాబితా తయారు చేశారనే ప్రచారం సాగుతోంది. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి వెంటనే కౌన్సిలర్లను తన క్యాంపు కార్యాలయానికి పిలిచి మాట్లాడారు. లబ్ధిదారుల జాబితాలో అనర్హులు ఉన్నట్లయితే విచారణ జరిపించి తప్పకుండా తొలగిస్తానని కౌన్సిలర్లకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ 'నిరుద్యోగ ఉద్యమం'!

ఈనెల 21న నల్లగొండ మహాత్మాగాంధీ వర్సిటీ నుంచి ప్రారంభం

- తర్వాత ఖమ్మం, ఆదిలాబాద్‌లో నిరసన కార్యక్రమాలు
- చివరిగా హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో భారీ సభ
- హాజరుకానున్న ప్రియాంకా గాంధీ..
- 50 లక్షల మంది నిరుద్యోగుల పక్షాన పోరాటం: రేవంత్
- మే 9 నుంచి గద్వాల జిల్లాలో రెండోవిడత జోడో యాత్ర ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నిరుద్యోగుల పక్షాన సమరశంఖం పూరించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. టీఎస్‌పీఎస్సీ, టెన్త్ పేపర్ల లీకేజీలపై నిరసనలతోపాటు టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేశాకే పరీక్షల నిర్వహణ, పేపర్ల లీక్ కేసులో సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలన్న డిమాండ్లతో నిరుద్యోగులతో కలసి ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించింది. ఈనెల 21న నల్లగొండలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం కేంద్రంగా పోరాటం ప్రారంభించనుంది. ఎంజీ వర్సిటీ విద్యార్థులతో కలసి నిరసన చేపట్టిన అనంతరం.. ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లోనూ నిరుద్యోగ సభలు నిర్వహించనుంది. ఈ మూడు జిల్లాల్లో కార్యక్రమాల అనంతరం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో భారీగా నిరుద్యోగ సభ నిర్వహించాలని.. దానికి కాంగ్రెస్ ముఖ్య నేత ప్రియాంకాగాంధీని ఆహ్వానించాలని నిర్ణయించింది.

మే నెల మొదటి వారంలో..

ఈనెల 24న ఖమ్మంలో, 26న ఆదిలాబాద్‌లో సభ నిర్వహించిన తర్వాత మే 4న, లేదా 5న సరూర్‌నగర్ సభ జరపాలని కాంగ్రెస్ భావిస్తోంది. సభ రోజున తొలుత ఎల్బీనగర్ చౌరస్తాలో తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి విగ్రహానికి నివాళి అర్పించి.. అక్కడి నుంచి ర్యాలీగా సరూర్‌నగర్ స్టేడియానికి చేరుకోవాలని నిర్ణయించింది. ప్రియాంకాగాంధీ ఈ ర్యాలీలో పాల్గొంటారా? నేరుగా సరూర్‌నగర్ సభకు హాజరవుతారా? ఆమె ఎప్పుడు హైదరాబాద్‌కు వస్తారు? 4, 5 తేదీల్లో ఏ రోజున సభ జరుగుతుందన్న అంశాలపై రెండు రోజుల్లో స్పష్టత రానుంది. ప్రస్తుతం కర్ణాటక ఎన్నికల ప్రచారంలో ప్రియాంకాగాంధీ బిజీగా ఉన్నారని.. ఆమె వీలును ఒకరోజు ఇక్కడికి వస్తారని పీసీసీ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిరుద్యోగుల కోసం ఏం చేస్తామనే అంశాలను ఆమె సభలో ప్రకటిస్తారని పేర్కొన్నాయి. ఇక సరూర్‌నగర్ సభ తర్వాత నాలుగైదు రోజుల విరామం తర్వాత మే 9 నుంచి రేవంత్‌రెడ్డి రెండో విడత హాథ్‌సే హాథ్ జోడో యాత్రను జోగుళాంబ గద్వాల జిల్లా నుంచి ప్రారంభించనున్నారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేవంత్ ఈ వివరాలను వెల్లడించారు.

బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు: రేవంత్

''టెన్త్ పేపర్ లీకేజీ విషయంలో నిరసన వ్యక్తం చేసిన ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులను ఐదు రోజులు జైల్లో పెట్టారు. అదే టెన్త్ పేపర్లు లీక్ చేశాడంటూ పెద్ద పెద్ద సెక్షన్ల కింద కేసులు పెట్టి అరెస్టు చేసిన బండి సంజయ్‌కు మాత్రం తెల్లారేసరికి బెయిల్ వచ్చింది. ప్రభుత్వ వైఫల్యాలపై కాంగ్రెస్ తీవ్రంగా పోరాడిన తర్వాత.. బీజేపీ ఏదో ఒక చిల్లర పంచాయితీ చేస్తుంది. దాన్ని పెద్దది చేయడంలో బీఆర్ఎస్ సహకరిస్తుంది. సంజయ్ అరెస్టు, వెంటనే బెయిల్ దీనికి నిదర్శనం. బీజేపీ, బీఆర్ఎస్‌ల కుమ్మక్కుకు ఇదే ఉదాహరణ''అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇంటికో ఉద్యోగమిస్తామని కేసీఆర్ మోసం చేశారని.. ఒకేరోజు 2లక్షల ఉద్యోగాలిస్తామని బండి సంజయ్ మోసపు మాటలు మాట్లాడుతున్నారని.. నిరుద్యోగుల పక్షాన క్షేత్రస్థాయి నుంచి పార్లమెంటు వరకు కొట్లాడింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని పేర్కొన్నారు. సంజయ్ మాటలు వింటుంటే నవ్వాలో ఏడ్వాలో తెలియడం లేదని.. అసలు ఏ శాఖలో ఎన్ని ఉద్యోగ ఖాళీలున్నాయో ఆయనకు తెలుసా? అని రేవంత్ ఎద్దేవా చేశారు. టీఎస్‌పీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులంతా కలసి రావాలి..

దేశంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ ఇద్దరూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమయ్యారని రేవంత్ మండిపడ్డారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోదీ ఇప్పటి వరకు 20 కోట్ల ఉద్యోగాలు ఇచ్చి ఉండాల్సిందని పేర్కొన్నారు. తాను పార్లమెంటులో ఈ విషయమై ప్రశ్న అడిగితే.. ఉద్యోగాల కోసం ఇప్పటివరకు 22 కోట్ల దరఖాస్తులు వస్తే 7,22,311 ఉద్యోగాలు ఇచ్చామని కేంద్ర ప్రభుత్వం తెలిపిందని వివరించారు. తాము చేస్తున్న పోరాటం కాంగ్రెస్ పార్టీ కోసం కాదని.. 50లక్షల మంది నిరుద్యోగుల పక్షాన పోరాడుతున్నామని చెప్పారు. తమ పోరాటాల్లో విద్యార్థులు సామాజిక బాధ్యతగా పాల్గొనాలని.. నిరసన దీక్షల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

ఒక్క గుంట భూమి ఎక్కువున్నా రాజీనామా చేస్తా

- ఆ భూములను నా పిల్లలు కూడా వదిలేస్తారు... వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి సవాల్
- పశువుల కొట్టాలు, కూలీల రేకుల షెడ్లు కూడా ఫాంహౌస్‌లేనా?
- రఘునందన్‌రావు ఆరోపణలపై ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: చట్టప్రకారం కొనుగోలు చేసిన దానికన్నా ఒక్క గుంట ఎక్కువ ఉన్నా ఆ భూములను తమ పిల్లలు వదిలేస్తారనీ, తాను పదవికి రాజీనామా చేస్తానని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి స్పష్టం చేశారు. లేకుంటే ఆరోపణలు చేసిన బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అక్కడే తన పదవికి రాజీనామా చేసి పోవాలని సవాల్ విసిరారు. 'నాకు మూడు ఫాంహౌస్‌లు ఉన్నాయంటూ బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రచారం చేయడం అవివేకం...పశువుల కొట్టాలు, కూలీల రేకుల షెడ్లు కూడా ఫాంహౌస్‌లుగా కనిపిస్తే అది ఆయన అజ్ఞానానికి నిదర్శనం'అని పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తన స్వగ్రామం పాన్‌గల్‌లో ఉన్న భూములు 2014, 2018 ఎన్నికల అఫిడవిట్లలో పేర్కొన్నవేనని స్పష్టం చేశారు. ఆ వ్యవసాయ క్షేత్రంలో ఉన్నది తన సతీమణి సొంత డబ్బులు, బ్యాంకు రుణాలతో కట్టుకున్న ఇల్లు అని వెల్లడించారు. విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న తన ఇద్దరు అమ్మాయిలు చందూరులో సురవరం ప్రతాపరెడ్డి వారసుల నుంచి, ఇతరుల నుంచి చట్టబద్ధంగా భూములు కొన్నారని వివరించారు. ఎస్టీల పేరు మీద కొని తర్వాత మార్చుకున్నారంటూ రఘునందన్ రావు ఆరోపించడం తగదని పేర్కొన్నారు. తల్లితండ్రులను కోల్పోయిన బాలుడు గౌడనాయక్ ను చేరదీసి ఉన్నత చదువులు చదివించానని, ప్రస్తుతం అతను తన ఇంటి వ్యవహారాలు చూసుకుంటున్నాడని తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి విదేశాల్లో ఉన్న పిల్లలు కరోనా నేపథ్యంలో సకాలంలో రాలేని పరిస్థితుల్లో గౌడనాయక్ పేరు మీద కొంత భూమి రిజిస్టర్ చేసి, తర్వాత పిల్లల తమ పేరు మీదకు మార్చుకున్నారని వివరించారు.

రఘునందన్‌పై చట్టపరంగా ముందుకెళ్తాం

పెద్దమందడి మండలం మోజెర్లలో 50 ఎకరాల భూమి ఉందని ఆరోపించారనీ, కానీ అది వెల్టూరు గ్రామ పరిధి అని, అక్కడ లండన్‌లో డాక్టర్ గా పనిచేస్తున్న తన మరదలు కవిత, వారి స్నేహితులకు ఉన్న భూమి 11.20 ఎకరాలు మాత్రమేనని వెల్లడించారు. వారు ఇక్కడ ఉండరనీ, తానే అప్పుడప్పుడు పర్యవేక్షణకు వెళ్తుంటానని మంత్రి వివరించారు. దురుద్దేశపూర్వకంగా రఘునందన్‌రావు చేస్తున్న అసత్య ఆరోపణలపై చట్టపరంగా ముందుకెళ్తామని తెలిపారు.

165 ఎకరాల్లో ఫామ్‌హౌస్ ఎలా?

▶ మొదటి పేజీ తరువాయి

కన్నేసి ఎక్కడికక్కడ కబ్జా చేస్తున్నారని, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి కృష్ణా నదిని కబ్జా చేసి, రీ సిల్టింగ్ చేశారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ కట్టుకుంటే తాము కట్టుకోవద్దా అని మంత్రులు కూడా ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారన్నారు. రఘునందన్‌రావు మంగళవారం మీడియాతో మాట్లాడారు.

మూడు ఫామ్‌హౌస్‌లు కట్టిన వ్యవసాయ మంత్రి

'వ్యవసాయ శాఖ మంత్రి మొత్తం మూడు ఫామ్‌హౌస్‌లు కట్టారు. పాత పాలమూరు జిల్లాలోని చందూరులో 165 ఎకరాల విస్తీర్ణంలో ఒక ఫామ్‌హౌస్ నిర్మించారు. కృష్ణా పరీవాహక ప్రాంతం కబ్జా చేసి ప్రహరీ గోడ కట్టారు. ఈ భూమిలో మూడున్నర ఎకరాల సీసీ రోడ్లు నిర్మించారు. గిరిజనుల పేరిట రూ.7 కోట్ల సబ్సిడీ రుణం తీసుకున్నారు. మంత్రి 80 ఎకరాలు కొని.. 165 ఎకరాల ఫామ్‌హౌస్ ఎలా కట్టారు?. నదిలో గోడ కట్టడంతో పాటు, మట్టి నింపి రీ సిల్టింగ్ చేయడం.. ఇవన్నీ నేరాలే. దీనికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు ఓ గిరిజన సోదరి పేరు నుంచి మంత్రి కుటుంబసభ్యుల పేర్లపైకి బదిలీ అయ్యాయి. ఆ తర్వాత రెగ్యులరైజ్ చేసుకుని కాంపౌండ్ వాల్ కట్టడం జరిగింది. మానవపాడు మండల తహశీల్దార్ కార్యాలయం 2021 అక్టోబర్‌లో తగలబడి ఈ ఫామ్‌హౌస్ భూములకు సంబంధించిన రికార్డులు కాలి బూడిదయ్యాయి. అధికారులు కేసు పెట్టాక పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేసినా, ఇప్పటివరకు చార్జిషీట్ వేయలేదు. పాన్‌గల్ మండలం కొత్తపేట గ్రామ పంచాయితీలో వంద ఎకరాల్లో మంత్రి నిరంజన్ రెడ్డి మరో ఫామ్‌హౌస్ కట్టారు. పెద్ద మందాడి మండలం మోజర్ల సమీపంలో 50 ఎకరాల్లో ఇంకొక ఫామ్‌హౌస్ కట్టారు. ఇంకా చాలామంది మంత్రుల ఫామ్‌హౌస్‌ల చరిత్రలు నా వద్ద ఉన్నాయి..' అన్నారు.

మంత్రిపై చర్యలు తీసుకోవాలి

'గతంలో ఇలాంటి ఆరోపణలపై ఈటల రాజేందర్‌ను, అంతకుముందు ఓ దళిత మంత్రిని కేబినెట్ నుంచి తొలగించారు. మరి ఇప్పుడు నిరంజన్‌రెడ్డిపై ఎలాంటి చర్యలూ ఎందుకు తీసుకోవడం లేదు? బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు ఒక న్యాయం.. అగ్రకులాల వారికి మరో న్యాయమా? అని తెలంగాణ సమాజం ప్రశ్నిస్తోంది. అవినీతిని ఉపేక్షించకుండా సీఎం కేసీఆర్ మంత్రిపై చర్యలు తీసుకోవాలి. ప్రాజెక్టుల కోసం తీసుకున్న భూములను కబ్జా చేస్తున్న వారిని, తహసీల్ ఆఫీస్‌లను తగులబెట్టి, రికార్డులు లేవు కాబట్టి తమ పేరిట ఆస్తులు మార్చుకోవాలని చూస్తున్న వారిని కఠినంగా శిక్షించాలి..'అని రఘునందన్ విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రభుత్వం స్పందించకపోతే ఇతర వేదికలను కూడా ఆశ్రయిస్తామని అన్నారు.

బీజేపీలో చేరుతాననేది దుష్ప్రచారమే..

స్పష్టం చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి



తాండూరు: బీజేపీలో తాను చేరుతానంటూ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. వికారాబాద్ జిల్లా తాండూరులో మంగళవారంరాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరైన ఆయన అనంతరం చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కలిసి మీడియాతో మాట్లాడారు. కొంతమంది నాయకులు పనిగట్టుకుని తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ పార్టీలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సీనియర్ లీడర్‌ను తానేనని స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలందరినీ గెలిపించాల్సిన బాధ్యత తనపై ఉందని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ నుంచి తాండూరు బరిలో నిలు స్తానని తెలిపారు. ఇందులో భాగంగా మే 25 నుంచి తాండూరులో 'పల్లెపల్లెకు పట్నం' కార్యక్రమంతో ప్రజల్లోకి వెళ్తానని స్పష్టం చేశారు. భద్రేశ్వరస్వామి జాతరలో ఎమ్మెల్యే తనను తోసేశాడని జరుగుతున్న ప్రచారంలో నిజం లేదన్నారు.

ఉమ్మడి పరీక్షల నిర్వహణపై జాగ్రత్తలు తీసుకోండి

అధికారులకు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఎంసెట్ సహా అన్ని ఉమ్మడి ప్రవేశ పరీక్షల నిర్వహణ పట్ల అధికారులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఉన్నత విద్యా మండలి అధికారులను ఆదేశించారు. ఈ పరీక్షలన్నీ మే నెలలో జరగనున్న నేపథ్యంలో మంగళవారం అధికారులతో చర్చించారు. ఎంసెట్ భద్రత చర్యలపై జేఎన్‌టీయూహెచ్ అధికారులు, ఎంసెట్ కన్వీనర్, ఉన్నత విద్యా మండలి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మంత్రి ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీల నేపథ్యంలో భద్రతపై అధికారులు ఇప్పటికీ ఒక్క సమావేశం పెట్టుకోకపోవడాన్ని ఆమె ప్రశ్నించినట్లు తెలిసింది. గతంలో కన్వీనర్‌గా ఉన్న గోవర్ధన్ ఎప్పటికప్పుడు వివరాలు పారదర్శకంగా ఉంచేవారని, ప్రస్తుత కన్వీనర్ కొత్త కావడం వల్ల ఏమీ తెలియడం లేదనే అభిప్రాయం మంత్రి వ్యక్తం చేసినట్టు తెలిసింది. జేఎన్‌టీయూహెచ్ అధికారులు సహకరించడం లేదని ఈ సందర్భంగా లింబాద్రి మంత్రి వద్ద వాపోయినట్టు తెలిసింది.

రామప్ప అభివృద్ధికి రూ.23 కోట్లు

- ప్రపంచ వారసత్వ వేడుకల్లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- కేసీఆర్ కృషితోనే రామప్పకు యునెస్కో గుర్తింపు
- తెలంగాణను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తున్నట్టు వెల్లడి



వేడుకలను ప్రారంభిస్తున్న మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే సీతక్క తదితరులు

వెంకటాపురం(ఎం)/ సాక్షిప్రతినిధి, వరంగల్: ప్రఖ్యాత చారిత్రక ప్రాంతం రామప్ప అభివృద్ధికి రూ.23 కోట్లు మంజూరు చేస్తున్నట్టు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. అందులో రోడ్ల అభివృద్ధికి రూ.7 కోట్లు, రామప్ప ఆలయ అభివృద్ధికి రూ.16 కోట్లు వినియోగించనున్నట్టు వెల్లడించారు. సీఎం కేసీఆర్ కృషితోనే రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు వచ్చిందని.. ఆయన ఆదేశాల మేరకే రామప్పలో ప్రపంచ వారసత్వ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామన్నారు. శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం ములుగు జిల్లా వెంకటాపురం మండలం పాలంపేటలోని రామప్ప గార్డెన్‌లో నిర్వహించిన ప్రపంచ వారసత్వ వేడుకల్లో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యేలు సీతక్క, వినయభాస్కర్, పొదెం వీరయ్య తదితరులతో కలసి పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

రామప్పలో మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో కళాకారిణి అన్షితారెడ్డి కూచిపూడి నృత్యంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. గురూజీ అశోక్ గుజ్జల్ వయోలిన్ ప్రదర్శన,సుధీర్‌రావు బృందం కూచిపూడి నృత్యం, సూర్య ఎస్ రావు బృందం రావణ నాటక ప్రదర్శన, శ్రావ్య మానస అకాడమీ ఆధ్వర్యంలో 200మంది కళాకారులతో చేసిన క్లాసికల్, ఫోక్ షోలు ప్రజలను అలరించాయి. ఎస్ఎస్ తమన్, డ్రమ్స్ శివమణి, సింగర్ కార్తీక్‌ల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

రెండు నగరాల అభివృద్ధికి పెద్దపీట!

దక్షిణ తెలంగాణలో మహబూబ్‌నగర్, ఉత్తర తెలంగాణలో వరంగల్ నగరాల అభివృద్ధిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. ఎయిర్‌పోర్టు, ఐటీ పరంగా హైదరాబాద్‌తో సమాంతరంగా ఈ నగరాలను తీర్చిదిద్దుతున్నామన్నారు. రామప్పకు చేరుకోక ముందు హనుమకొండలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయభాస్కర్‌లతో కలిసి శ్రీనివాస్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. రామప్పకు యునెస్కో గుర్తింపు వచ్చినా.. అభివృద్ధి కోసం కేంద్రం ఎలాంటి నిధులు ఇవ్వలేదని మండిపడ్డారు. కాగా.. మతం పేరుతో చిచ్చుపెట్టడం తప్ప కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒక్క దేవాలయాన్ని కూడా అభివృద్ధి చేయలేదని మంత్రి ఎర్రబెల్లి విమర్శించారు. రామప్పకు యునెస్కో గుర్తింపు సాధించడానికి ఎంతో కృషిచేసినట్టు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పుకోవడం ఆశ్చర్యకరమని పేర్కొన్నారు.

ఇక కమలనాథుల యాత్రల జాతర

▶ మొదటి పేజీ తరువాయి

ఈ నెల 23న చేవెళ్ల లోక్‌సభ పరిధిలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పర్యటించనున్నారు. అదేరోజు సాయంత్రం చేవేళ్ల సభలో ఆయన ప్రసంగిస్తారు.

లోక్‌సభ నియోజకవర్గాల కన్వీనర్లతో సునీల్ బన్సల్ భేటీ

మంగళవారం బీజేపీ కార్యాలయంలో లోక్‌సభ ప్రవాసీ యోజనలో భాగంగా పార్లమెంటరీ నియోజకవర్గాల కన్వీనర్లు, కో కన్వీనర్లతో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సంస్థాగత ఇన్‌చార్జి సునీల్ బన్సల్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాబోయే రోజుల్లో కేంద్రమంత్రుల పర్యటనల సందర్భంగా ఏ ఎంపీ స్థానం పరిధిలో ఎక్కడెక్కడ బహిరంగసభల నిర్వహణతో పాటు స్థానిక ప్రజలతో ఇంటరాక్ట్ అయ్యేలా కార్యక్రమాలు రూపొందించాలనే విషయమై చర్చించారు. గతంలో రెండువిడతలుగా చేపట్టిన యోజనలో కార్యకర్తలను కలుసుకోవడం, క్షేత్రస్థాయి పరిశీలనలు వంటివి ఉండగా, దానికి భిన్నంగా ఈసారి ప్రజలను నేరుగా కలుసుకునేలా మార్పులు చేశారు. దేశవ్యాప్తంగా బీజేపీ ఇంతవరకు గెలవని, రెండోస్థానంలో నిలిచిన, మిత్రపక్షాలకు కేటాయించిన 160 ఎంపీ స్థానాల్లో అత్యధిక సీట్లు గెలవాలనే లక్ష్యంతో లోక్‌సభ ప్రవాసీ యోజనను బీజేపీ అధినాయకత్వం రూపొందించడం తెలిసిందే. వీటిలో 40 స్థానాల్లో జరిగిన ప్రవాసీ యోజన సమావేశాలకు అమిత్‌షా హాజరయ్యారు. ఇక రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు బండి సంజయ్, ఇతర నేతల పర్యటనల సందర్భంగా 119 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పార్టీ పటిష్టత, పోలింగ్ బూత్ స్థాయి వరకు బలోపేతంపై దృష్టి పెట్టాలని నిర్ణయించారు.

నేడు బీజేపీ కోర్ కమిటీ భేటీ...: బుధవారం బీజేపీ కార్యాలయంలో సంజయ్ అధ్యక్షతన రాష్ట్ర కోర్‌కమిటీ భేటీ కానుంది. ఈ నెల 23న అమిత్‌షా పర్యటనకు చేయాల్సిన ఏర్పాట్లు, ఎన్నికల నేపథ్యంలో పార్టీ సన్నద్ధత, నిర్వహిస్తున్న కార్యక్రమాలు తదితర అంశాలు చర్చకు రానున్నాయి. ఇక బుధ, గురు, శుక్రవారాల్లో సంస్థాగతమైన అంశాలపై పార్టీ ప్రధానకార్యదర్శి సునీల్ బన్సల్, తరుణ్ చుగ్, పార్టీ జాతీయ సహ ప్రధానకార్యదర్శి(సంస్థాగత) శివప్రకాశ్, రాష్ట్ర సంస్థాగత సహ ఇన్‌చార్జి అర్వింద్ మీనన్ వరుస సమావేశాలు నిర్వహించనున్నారు.



మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

ఈత సరదా.. నలుగురి బలి

- చెరువులో ఈతకు వెళ్లి ముగ్గురు చిన్నారులు.. కాపాడబోయి మహిళ మృతి

నారాయణపేట రూరల్: ఈత కోసం చెరువులోకి దిగి ముగ్గురు పిల్లలు, వారిని కాపాడబోయి ఓ మహిళ ప్రమాదవశాత్తు మృత్యువాత పడ్డారు. ఈ ఘటన నారాయణపేట జిల్లా బోయిన్‌పల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బోయిన్‌పల్లి గ్రామానికి చెందిన సురేఖ(28), ఆమె అక్క చెన్నమ్మ కొంతకాలంగా ఒంటరిగా జీవిస్తున్నారు. సురేఖకు కుమారుడు, చెన్నమ్మకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వీరిద్దరు కూలీ పనులు చేస్తుంటారు. ఈ క్రమంలో సురేఖ తన దగ్గర ఉన్న మేకను మేపడానికి మంగళవారం సాయంత్రం గ్రామ శివారులోకి వెళ్లింది. ఆమెతోపాటు కుమారుడు విజయ్(8), సోదరి కూతురు లిఖిత(7), విజయ్ స్నేహితుడు వెంకటేశ్(8)తో పాటు 12 ఏళ్ల మరో బాలిక మమత వెళ్లారు. సురేఖ మేకను మేపుతుండగా పక్కనే ఉన్న చెరువునీటిలో ఈత కోసం పిల్లలు వెళ్లారు. సరదాగా ఈత కొడుతున్న ముగ్గురు పిల్లలు ప్రమాదవశాత్తు ఒకరి తర్వాత మరొకరు నీటిలోకి జారిపోయారు. గమనించిన సురేఖ వెంటనే చెరువులోకి దిగి వారిని కాపాడేందుకు చీరకొంగును అందించింది. పిల్లలు నీళ్లలో మునుగుతూ చీరకొంగును గట్టిగా పట్టుకుని లాగడంతో ఆమె సైతం నీటిలోకి జారిపోయింది. గట్టుపైనున్న మమత భయాందోళనతో ఊర్లోకి పరుగెత్తి గ్రామస్తులకు చెప్పింది. స్థానికులు చెరువు దగ్గరకు వెళ్లి చూడగా నలుగురు మృత్యువాతపడ్డారు.

బార్బడోస్‌లో గుండెపోటుతో ఖమ్మం విద్యార్థి మృతి

- ఎంబీబీఎస్ సెకండియర్ చదువుతున్న శివరామకృష్ణ



ఖమ్మం క్రైం: కరేబియన్ దీవుల్లోని బార్బడోస్‌లో ఎంబీబీఎస్ చదువుతున్న ఖమ్మం విద్యార్థి గుండెపోటుతో మృతిచెందిన విషాద ఘటన ఇది. ఖమ్మం ట్రాఫిక్ ఎస్సై రవికుమార్ కుటుంబ సభ్యులతో కలసి ఖమ్మం రూరల్ మండలం పెదతండాలో నివసిస్తున్నారు. ఆయన పెద్ద కుమారుడైన హేమంత్ శివరామకృష్ణ (20) బార్బడోస్‌లో ఎంబీబీయస్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. స్నేహితులతో కలసి మంగళవారం బీచ్‌కు వెళ్లిన అతను... ఈత కొట్టివచ్చిన కాసేపటికే గుండెపోటుతో కుప్పకూలాడు. సహచరులు అతన్ని ఆస్పత్రికి తరలించేలోగానే మృతిచెందాడు. శివరామకృష్ణ మృతదేహాన్ని స్వస్థలానికి పంపించేందుకు అక్కడి భారతీయులు ఏర్పాట్లు చేస్తున్నారు.

క్లుప్తంగా...

త్వరలో 'ట్రూత్‌జీపీటీ'...

ట్విట్టర్ అధినేత ఎలాన్ మస్క్ ప్రకటన



న్యూయార్క్: ప్రపంచ వ్యాప్తంగా కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత చాటింగ్ టెక్నాలజీ పెరిగిపోతుండడం పట్ల ట్విట్టర్ అధినేత ఎలాన్ మస్క్ ఆందోళన వ్యక్తం చేశారు. ''కార్లు, రాకెట్ల కంటే ఏఐ మరింత ప్రమాదకరం. దీనివల్ల మానవాళికి ముప్పు తప్పదు. మానవాళిని నిర్వీర్యం చేసే శక్తి ఏఐకి ఉంది'' అని ఓ ఇంటర్వ్యూలో అన్నారు. ఏఐ చాట్‌బాట్ 'చాట్‌జీపీటీ' వివక్ష పూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దానికి ప్రత్యామ్నాయంగా 'ట్రూత్‌జీపీటీ' పేరిట సొంత చాట్‌బాట్ తెస్తామన్నారు. మానవాళిని ధ్వంసం చేసే టెక్నాలజీ వద్దని, అర్థం చేసుకొనేది కావాలని అన్నారు. కృత్రిమ మేధను నియంత్రించే వ్యవస్థ ఉండాలన్న ప్రతిపాదనను సమర్థించారు.

అమెరికాలో పోలీసుల అదుపులో 17 మంది 'వాంటెడ్' సిక్కులు



వాషింగ్టన్: అమెరికాలో 11 కాల్పుల ఘటనలకు సంబంధించి 17 మంది సిక్కులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆపరేషన్ బ్రోకెన్ స్వోర్డ్ పేరుతో 20కి పైగా ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో మెషీన్ గన్, ఏకే–47లు సహా 42 తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులంతా ఉత్తర కాలిఫోర్నియాకు చెందిన మాఫియా సభ్యులని అధికారులు చెప్పారు. వీరు పలు హత్యా ఘటనలకు సంబంధించి భారత్ పంపిన వాంటెడ్ జాబితాలో ఉన్నారన్నారు. హింసాత్మక ఘటనలు, కాల్పులతోపాటు ఐదు హత్యాయత్నం ఘటనలతోనూ వీరికి ప్రమేయం ఉందన్నారు.

డీకే శివకుమార్ ఆస్తులు రూ.1,413.78 కోట్లు

బెంగళూరు: కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులు భారీగా పెరిగాయి. తనకు, కుటుంబ సభ్యులకు మొత్తం రూ.1,413.78 కోట్ల ఆస్తులున్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో ఆయన పేర్కొన్నారు. ఆయన 2018 అఫిడవిట్లో ప్రకటించిన రూ.840.08 కోట్లతో పోలిస్తే ఇది 68.29 శాతం పెరుగుదల. 2018లో కనకపుర స్థానం నుంచి ఎమ్మెల్యేగా నెగ్గిన ఆయన ఈసారి కూడా అదే స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. డీకేపై మొత్తం 19 కేసులు ఉన్నాయి.


కన్నడనాట కులాల కోలాటం

ప్రతి ఎన్నికల్లోనూ వాటిది కీలక పాత్ర

కులాల కరుణ కోసం పార్టీల యత్నాలు

మన దేశంలో ఎన్నికలంటేనే కులం చుట్టూ తిరుగుతుంటాయి. అందులోనూ కర్ణాటక రాజకీయాల్లో కులాలు, మతాల పాత్ర మరీ ఎక్కువ. లింగాయత్, వొక్కలిగ, ఓబీసీ, ముస్లిం వర్గాలు నాలుగు స్తంభాలుగా ఎన్నికల ఫలితాలను శాసిస్తూ వస్తున్నాయి. అందుకే మరోసారి వారి మనసు చూరగొనేందుకు బీజేపీ, కాంగ్రెస్, జేడీ(ఎస్) సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి...

జనాభాలో ఎవరి శాతమెంత?



కర్ణాటకలో త్రిముఖ పోరు నేపథ్యంలో కులాలవారీగా ఓటర్లను ఆకర్షించడంలో బీజేపీ, కాంగ్రెస్ వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. జేడీ(ఎస్) మాత్రం ప్రధానంగా రాష్ట్ర జనాభాల్లో లింగాయత్‌ల తర్వాత అత్యధికంగా 15% ఓటర్లున్న వొక్కలిగ ఓటు బ్యాంకునే నమ్ముకుంది. 59 అసెంబ్లీ స్థానాలున్న పాత మైసూరు ప్రాంతంలో వొక్కలిగలు ఇప్పటికీ మాజీ ప్రధాని హెచ్.డి.దేవెగౌడను ఎంతగానో ఆరాధిస్తారు. ఆ ఓటు బ్యాంకును చీల్చే లక్ష్యంతో ఎన్నికల ముందు నుంచే కోటా రాజకీయాలకు బీజేపీ తెర తీసింది. దాంతో దాన్ని ఎలాగైనా కాపాడుకునే పనిలో జేడీ(ఎస్) తలమునకలుగా ఉంది.

కోటాతో రాజకీయ ఆట

అసెంబ్లీ ఎన్నికల ముందు నుంచే అధికార బీజేపీ అన్ని సామాజిక వర్గాల ఓట్లూ రాబట్టేలా వ్యూహాలు పన్నడం మొదలు పెట్టింది. 2018 ఎన్నికల్లో 100కు పైగా స్థానాలు సాధించినా మెజారిటీ మాత్రం అందలేదు. పాత మైసూరులోని 59 సీట్లలో ఆరు మాత్రమే దక్కడం అందుకు ప్రధాన కారణం. దాంతో ఈసారి సరిగ్గా ఎన్నికల వేళ ముస్లింల 4 శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తూ సంచలనం నిర్ణయం తీసుకోవడమే గాక వాటిని బలమైన సామాజిక వర్గాలైన లింగాయత్, వొక్కలిగలకు చెరో 2 శాతం చొప్పున పంచింది. ఈ నిర్ణయం పాత మైసూరు ప్రాంతంలో తమ భాగ్యరేఖలను కాస్త మెరుగు పరుస్తుందని ఆశ పడుతోంది. అలాగే ఎస్సీ రిజర్వేషన్లను 15 నుంచి 17 శాతానికి పెంచడమే గాక అంతర్గత కోటాను అమలు చేయాలని కూడా నిర్ణయించింది. ఈ నిర్ణయాలను లింగాయత్‌లు, దళితుల్లో ఒక వర్గం ఆహ్వానించినా ముస్లింలు భగ్గుమంటున్నారు. బంజారాల్లో కూడా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అంతర్గత రిజర్వేషన్లతో తమకు మరింత అన్యాయం జరుగుతుందన్న భయం వారిలో ఉంది. పాత మైసూరులో బీజేపీ ఏకంగా 41 మంది వొక్కలిగలకు టికెట్లిచ్చింది! వీరు వ్యవసాయం మీద ఆధారపడ్డవారే కావడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ కార్యక్రమాలు బాగా జనంలోకి వెళ్లేలా ప్రయత్నాలు చేస్తోంది. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తరచూ పాత మైసూరులో పర్యటిస్తున్నారు.

ఓబీసీలు ఎటువైపో...!

వీరశైవ లింగాయత్‌లలో బీజేపీ ఓట్లలో 2 నుంచి 3% తమకు వస్తాయని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. హిందూత్వకు పోటీగా అహిందా (ఓబీసీ, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ) నినాదంతో ఓట్లు కొల్లగొట్టే పనిలో పడింది. ఓబీసీల్లో ఒకప్పుడు కాంగ్రెస్‌కు ఓటుబ్యాంకుగా ఉన్న బిల్వాస్, మొగవీరాస్, విశ్వకర్మ, కొలిస్‌లు కొన్నేళ్లుగా బీజేపీ వైపు తిరిగారు. ఈసారి లింగాయత్, వొక్కలిగలు ఏ ఒక్క పార్టీకీ పూర్తిస్థాయిలో మద్దతునిచ్చే అవకాశాలు లేవన్న అభిప్రాయాల నడుమ ఈ ఓబీసీల ఓటు బ్యాంకే కీలకంగా మారింది. వారి ఓటుబ్యాంకును ఈసారి బీజేపీ నిలబెట్టుకోని పక్షంలో దానికి కాంగ్రెస్ నుంచి గట్టి ముప్పు పొంచి ఉన్నట్టే!

హింద్ వర్సెస్ అహిందా

లింగాయత్, బ్రాహ్మణుల ఓట్లతో పాటుగా హిందూత్వ ఓటు బ్యాంకునే బీజేపీ బాగా నమ్ముకుంది. హిందూత్వ, దేశభక్తి, అభివృద్ధి నినాదాలతో ఓట్లు రాబట్టజూస్తోంది. బాహుబలిగా పేరొందిన లింగాయత్ నేత బి.ఎస్.యడియూరప్పనే ముందుంచి ఎన్నికల వ్యవహారాలను నడిపిస్తోంది. 51 మంది లింగాయత్‌లకు టికెట్లిచ్చింది. కానీ బలమైన లింగాయత్ నేతలైన మాజీ సీఎం జగదీశ్ శెట్టర్, మాజీ ఉప ముఖ్యమంత్రి లక్ష్మణ్ సవాది పార్టీని వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం బీజేపీలో తాజాగా ప్రకంపనలు సృష్టిస్తోంది. తాను కనీసం 25 సీట్లలో బీజేపీ అవకాశాలకు గండి కొడతానన్న శెట్టర్ హెచ్చరికలను వారు గుర్తు చేస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

కర్నాటకలో 2018 ఎన్నికల్లో సామాజికవర్గాల వారీగా పార్టీల ప్రదర్శన — **మొత్తం అసెంబ్లీ స్థానాలు: 224**

సామాజికవర్గం (ప్రాబల్య స్థానాలు)		బీజేపీ	కాంగ్రెస్	జేడీ(ఎస్)	ఇతరులు
లింగాయత్ (67)	గెలిచిన సీట్లు	40	20	6	1
	ఓట్ల శాతం	41.77	38.22	11.84	8.17
వొక్కలిగ (44)	గెలిచిన సీట్లు	14	9	21	0
	ఓట్ల శాతం	26.44	33.16	34.66	5.74
ఓబీసీ (24)	గెలిచిన సీట్లు	18	5	1	0
	ఓట్ల శాతం	45.46	37.13	9.42	7.99
ముస్లింలు (18)	గెలిచిన సీట్లు	6	11	1	0
	ఓట్ల శాతం	40.13	44.01	9.70	6.17

గెలిచిన సీట్లు ▶ ● బీజేపీ ● కాంగ్రెస్ ● జేడీ(ఎస్) ● ఇతరులు | ● ప్రాబల్య స్థానాలు ● ఓట్ల శాతం

సూడాన్ ఘర్షణల్లో 185 మంది మృతి



ఖార్టూమ్‌లో బాంబు దాడుల భయంతో వలసపోతున్న స్థానికులు

ఖార్టూమ్: సూడాన్ రాజధాని ఖార్టూమ్‌తోపాటు పలు నగరాలు మూడో రోజూ తుపాకీ కాల్పులు, బాంబు పేలుళ్లతో దద్దరిల్లాయి. అధికారం కోసం ఆర్మీ, పారా మిలటరీ బలగాల మధ్య వీధి పోరాటం కొనసాగుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఇరుపక్షాలు ట్యాంకులు, ఫిరంగులతో భారీగా కాల్పులకు దిగాయి. రాత్రి వేళల్లో యుద్ధ విమానాలు సంచరిస్తున్నాయి. ఈ ఘర్షణల్లో కనీసం 185 మంది ప్రాణాలు కోల్పోగా మరో 1,800 మంది గాయపడినట్లు ఐక్యరాజ్యసమితి రాయబారి వొల్కెర్ చెప్పారు. పోరాటం కారణంగా ఎవరూ వెళ్లలేని సెంట్రల్ ఖార్టూమ్‌లోని పలు వీధుల్లో మృతదేహాలు పడి ఉన్నాయంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో మృతుల సంఖ్య ఇంకా ఎక్కువే ఉంటుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పోరుతో సామాన్య జనం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. నిత్యావసరాల సరఫరా నిలిచిపోగా, పలు ఆస్పత్రులు మూతబడ్డాయి. ఐక్యరాజ్య సమితి, అగ్రరాజ్యాలు వైరి వర్గాల మధ్య సయోధ్య కుదిర్చే పనిలో ఉన్నాయి. ఖార్టూమ్ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన సుమారు 88 మంది విద్యార్థులు, సిబ్బంది ఘర్షణల కారణంగా క్యాంపస్‌లోని లైబ్రరీలో మూడు రోజులుగా ఉండిపోయినట్లు సమాచారం. ఆర్మీ జనరల్ అబ్దెల్ బుర్హాన్, పారామిలటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్(ఆర్‌ఎస్‌ఎఫ్) జనరల్ మహ్మద్ హందాన్ ఆధిపత్యం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. లొంగిపోవాలంటూ వీరిద్దరూ పరస్పరం హెచ్చరికలు చేసుకోవడం గమనార్హం. బుర్హాన్‌కు ఈజిప్ట్ మద్దతిస్తుండగా, హందాన్‌కు సౌదీ అరేబియా, యూఏఈ అండగా ఉన్నాయి. జీ7 భేటీ కోసం జపాన్‌లో ఉన్న అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ మంగళవారం బుర్హాన్, హందాన్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలని బ్లింకెన్ వారిని కోరినట్లు అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి వేదాంత్ పటేల్ చెప్పారు. తమ దౌత్య కార్యాలయ వాహనాలపై కాల్పులు జరిగినట్లు అనంతరం బ్లింకెన్ చెప్పారు. ఈయూ దౌత్యాధికారిపై దాడి జరిగినట్లు తెలుస్తోంది. ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెర్రస్ అరబ్ లీగ్, ఆఫ్రికన్ యూనియన్‌తో శాంతి చర్చలు జరుపుతున్నారు. మంగళవారం నుంచి 24 గంటల కాల్పుల విరమణకు ఆర్మీ, ఆర్‌ఎస్‌ఎఫ్ అంగీకరించాయి.

చిక్కుకున్న 31 మంది కర్ణాటక గిరిజనులు

సూడాన్‌లో కర్ణాటకలోని హక్కి–పక్కి గిరిజన వర్గానికి చెందిన 31 మంది చిక్కుకుపోయినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ విషయమై విదేశాంగ శాఖతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించింది. సూడాన్‌లో భారత దౌత్యకార్యాలయంతో టచ్‌లో ఉండాలంటూ బాధితులను కోరామని వివరించింది.

'ఉన్నావ్' బాధితురాలిపై నిందితుల దాడి, ఇంటికి నిప్పు

ఉన్నావ్: యూపీలోని ఉన్నావ్ దళిత బాలిక అత్యాచార ఘటనలో నిందితులు మళ్లీ రెచ్చిపోయారు. మరికొందరితో కలిసి బాధితురాలిపై దాడికి తెగబడ్డారు. ఆమె ఉంటున్న గుడిసెకు నిప్పుపెట్టారు. ఈ ఘటనలో బాధితురాలి ఆరు నెలల కొడుకుతో పాటు, రెండు నెలల వయస్సున్న సోదరి తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. ఉన్నావ్‌కు చెందిన 11 ఏళ్ల బాలికపై గత ఏడాది ఫిబ్రవరిలో ఇద్దరు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె గర్భం దాల్చి, కుమారుడికి జన్మనిచ్చింది. ఈ కేసులో జైలుకు వెళ్లిన నిందితులు ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చారు. కేసును వెనక్కి తీసుకునేందుకు బాధితురాలు నిరాకరించిందనే కోపంతోనే దారుణానికి ఒడిగట్టినట్లు భావిస్తున్నారు. అగ్ని ప్రమాదంలో గాయపడిన శిశువుల పరిస్థితి విషమంగా మారడంతో కాన్పూర్ తరలించినట్లు పోలీసులు చెప్పారు. తమ కుమార్తెను అంతం చేసేందుకే నిందితులు ఇంటికి నిప్పుపెట్టారంటూ బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇలా ఉండగా, ఈ కేసులో నిందితులతో రాజీకి నిరాకరిస్తున్నాడనే కారణంతో గత నెలలో బాధితురాలి తాత, మామ కలిసి జరిపిన దాడిలో బాధితురాలి తండ్రి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో ఉన్నాడు.

చైనాలో అగ్నిప్రమాదాలకు 32 మంది బలి

బీజింగ్: చైనా రాజధాని బీజింగ్‌లోని ఓ ఆస్పత్రిలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో 21 మంది చనిపోయారు. ఈ ఘటనలో 71 మందిని కాపాడినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి దారితీసిన కారణాలపై దర్యాప్తు చేపట్టామన్నారు.

మరో ఘటనలో 11 మంది...

ఝెజియాంగ్ ప్రావిన్స్ జిన్‌హువా నగరంలోని ఓ తలుపుల తయారీ ఫ్యాక్టరీలో సోమవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో 11 మంది చనిపోయారు. కలప, రసాయనాల కారణంగానే మంటలు చెలరేగి ఉంటాయని భావిస్తున్నారు.

సంక్లిష్టమైన అంశమిది

స్వలింగ వివాహాలపై సుప్రీం ధర్మాసనం

- కోర్టులు, చట్టసభలు చట్టబద్ధత కల్పించలేవు
- సమాజం నుంచే ఆమోదం రావాలి: కేంద్రం
- విచారణపై అభ్యంతరం, తోసిపుచ్చిన సీజేఐ



న్యూఢిల్లీ: స్వలింగ వివాహాలకు చట్టబద్ధత అత్యంత సంక్లిష్టమైన అంశమని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయపడింది. వాటికి కల్పించాలంటూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం మంగళవారం విచారణ మొదలు పెట్టింది. ''ఈ విషయంలో వ్యక్తిగత వివాహ చట్టాల్లోకి పోదల్చుకోలేదు. కులమతాలతో సంబంధం లేకుండా భిన్న మతాలు, కులాలకు చెందిన వారు పెళ్లి చేసుకునేందుకు చట్టపరమైన వెసులుబాటు కల్పిస్తున్న ప్రత్యేక వివాహ చట్టంపై మాత్రమే విచారణ జరుపుతాం. దానిమీదే వాదనలు విన్పించండి'' అని న్యాయవాదులకు సూచించింది. దీనిపై సుప్రీంకోర్టు విచారణను వ్యతిరేకిస్తున్నట్టు కేంద్రం పేర్కొంది.

మెహతా వర్సెస్ సీజేఐ

స్వలింగ సంపర్కులకు ఇప్పటికే భాగస్వాముల ఎంపిక, గోప్యత వంటి పలు చట్టపరమైన హక్కులున్నాయని కేంద్రం తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గుర్తు చేశారు. ''వివాహ హక్కు ద్వారా వారికి సామాజిక, చట్టపరమైన హోదాను కోర్టు ద్వారా, చట్టసభల ద్వారా కల్పించలేం. సమాజం నుంచే అందుకు ఆమోదం రావాల్సి ఉంటుంది'' అన్నారు. పార్లమెంటు పరిధిలోని ఈ అంశాన్ని విచారణకు స్వీకరించడంపై తమ అభ్యంతరాలను ముందుగా పరిగణనలోకి తీసుకోవాలని పట్టుబట్టగా సీజేఐ నిరాకరించారు. ''ఇక్కడ మేమే ఇన్‌చార్జులం. విచారణ ప్రక్రియ ఎలా ఉండాలో మీరు నిర్దేశించలేరు. ఇలాంటి వాటిని నా కోర్టులో ఎన్నడూ అనుమతించలేదు'' అంటూ కుండబద్దలు కొట్టారు. ముందుగా పిటిషనర్ల వాదన వింటామని స్పష్టం చేశారు. వ్యక్తిగత వివాహ చట్టాలనూ పరిగణనలోకి తీసుకోవాల్సిందిగా కూడా తమను ఒత్తిడి చేయలేరన్నారు. అలాగైతే అసలు ఈ అంశంపై విచారణే జరగరాదన్నది కేంద్రం అభిప్రాయమని మెహతా మరోసారి వాదించారు. ''అందుకే మధ్యేమార్గంగా పోతున్నాం. ఒక నిర్దిష్టమైన అంశంపై నిర్ణయం తీసుకునేందుకు మొత్తం ప్రక్రియపై తీర్పు చెప్పాల్సిన పని లేదు'' అని సీజేఐ బదులిచ్చారు. ప్రత్యేక వివాహ చట్టంలో కూడా స్త్రీ, పురుష పదాలున్నాయని మెహతా గుర్తు చేయగా, ఆ భావనే చాలా సంక్లిష్టమైనదని సీజేఐ అభిప్రాయపడ్డారు. అది కేవలం జననాంగాల ఆధారంగా నిర్ధారించేది కాదన్నారు. అది జననాంగాలకే పరిమితమన్న మెహతా వాదనను కొట్టిపారేశారు. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పిస్తే ఎన్నో చట్టాలు నిరర్థకంగా మారతాయని మెహతా అన్నారు. అందుకే దీనిపై సమగ్రంగా విచారణ జరపడమా, లేక పూర్తిగా పార్లమెంటుకే వదిలేయడమా అన్నది ధర్మాసనం ముందుగా నిర్ణయించాలని సూచించారు. రాష్ట్రాలకు కూడా దీనిపై వాదన విన్పించే అవకాశమివ్వాలన్నారు. సీనియర్ న్యాయవాదులు రాకేశ్ ద్వివేది, కపిల్ సిబల్ తదితరులు కూడా దీన్ని సమర్థించారు. ''నేను స్వలింగ వివాహాలను సమర్థిస్తా. కానీ ఈ విషయంలో విచారణ చేపట్టబోతున్న పద్ధతిని సమర్థించను. విదేశాల్లో ఈ విషయంలో అవసరమైన అన్ని చట్టాలనూ సంస్కరించారు'' అని సిబల్ అన్నారు. దీనిపై నిర్ణయం తీసుకోవడానికి పార్లమెంటే సరైన వేదిక అని ధర్మాసనం కూడా అభిప్రాయపడింది. ''ఈ విషయంలో మా పరిమితులేమిటో తెలుసు. అందుకే చట్టాలను వ్యాఖ్యానించే అధికారాన్ని మాత్రమే వినియోగించదలచాం. స్వలింగ సంపర్కం నేరం కాదన్న సుప్రీంకోర్టు తీర్పు, స్వలింగ బంధాలకు సమాజంలో పలు స్థాయిల్లో లభిస్తున్న ఆమోదం వంటివి ఈ విషయంలో మారుతున్న ధోరణికి ప్రతీకలే'' అని పేర్కొంది. వాదనలు బుధవారం కూడా కొనసాగనున్నాయి.

బానో దుస్థితి మనకే ఎదురైతే...?

కేంద్రానికి, గుజరాత్ సర్కారుకు సుప్రీం ప్రశ్న

- దోషులకు ఏ ప్రాతిపదికన శిక్ష తగ్గించారు?
- ఏళ్లకేళ్ల పెరోల్ ఎందుకివ్వాల్సి వచ్చింది?
- గుజరాత్ సర్కారుకు తలంటిన ధర్మాసనం
- బుర్ర ఉపయోగించరా అంటూ తీవ్ర ఆగ్రహం



న్యూఢిల్లీ: బిల్కిస్ బానో కేసులో 11 మంది దోషులకు గుజరాత్ ప్రభుత్వం శిక్ష తగ్గించడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. ''ఆ నిర్ణయం ఎందుకు తీసుకోవాల్సి వచ్చింది? శిక్ష తగ్గించే ముందు నేర తీవ్రత దృష్ట్యా కాస్త బుర్ర ఉపయోగించి ఉండాల్సింది'' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. నేర తీవ్రతను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదంటూ నిలదీసింది. ''ఓ గర్భిణిపై అతి హేయంగా సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె కుటుంబీకులెందరినో దారుణంగా హత్య చేశారు. ఈ రోజు బానో బాధితురాలు. రేపు ఇంకెవరైనా కావచ్చు. మీరు, నేను కూడా కావచ్చు!'' అని కేంద్రాన్ని, గుజరాత్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో దోషుల విడుదలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను న్యాయమూర్తులు జస్టిస్ కె.ఎం.జోసెఫ్, జస్టిస్ బి.వి.నాగరత్న ధర్మాసనం మంగళవారం విచారించింది. దోషులకు ఇష్టమొచ్చినట్టు పెరోల్ మంజూరు చేశారంటూ విస్మయం వ్యక్తం చేసింది. ''ఒకరికి ఏకంగా 1,000 రోజుల పెరోల్ ఇచ్చారు. అంటే మూడేళ్లు. మరొకరికి 1,200 రోజులు, ఇంకొకరికి 1,500 రోజులిచ్చారు! అసలు మీరు ఏ విధానాన్ని అనుసరిస్తున్నారు?'' అంటూ గుజరాత్ ప్రభుత్వాన్ని నిలదీసింది. ''ఇది కేవలం ఓ సాధారణ హత్య కేసు కాదు. హత్యలు, పైపెచ్చు సామూహిక అత్యాచారానికి సంబంధించిన కేసు. ఓ జనహననాన్ని మామూలు హత్యలా చూడలేం'' అంటూ తలంటింది. ఇలాంటి కేసులో దోషులను విడుదల చేయడం ద్వారా సమాజానికి ఎలాంటి సందేశమిస్తున్నదీ చూసుకోవాల్సిన అవసరం చాలా ఉందని పేర్కొంది. శిక్ష తగ్గింపుకు కారణాలు చూపకపోతే తమ అవగాహన ప్రకారం ఓ నిర్ణయానికి రావాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. తాము ఆదేశించినా శిక్ష తగ్గింపు తాలూకు రికార్డులను సమర్పించకపోవడంపై ఆగ్రహం వెలిబుచ్చింది. దీన్ని ధిక్కార నేరంగా పరిగణించాల్సి ఉంటుందని కేంద్రం, గుజరాత్ ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజును హెచ్చరించింది. దోషి ఒక మంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త అనే కారణంతో శిక్ష తగ్గిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని 2006లో సుప్రీంకోర్టు కొట్టేసిందని జస్టిస్ జోసెఫ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ''అందుకే శిక్ష తగ్గింపుకు కారణాలేమిటో తెలుసుకోదలచాం. ఇది నేర తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మాత్రమే రాష్ట్ర ప్రభుత్వాలు వాడాల్సిన సున్నితమైన అధికారం. ఈ విషయంలో సుప్రీంకోర్టు పొందుపరిచిన మార్గదర్శకాలను పాటించి తీరాల్సిందే'' అని ఆయన స్పష్టం చేశారు. ప్రతివాదులంతా మే 1లోగా ప్రతిస్పందనలు సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. విచారణను మే 2కు వాయిదా వేసింది.

జీవితాంతం ఎన్సీపీలోనే: అజిత్



ముంబై: ఎన్సీపీ సీనియర్ నేత అజిత్ పవార్ తాను బీజేపీలో చేరుతున్నానన్న వార్తలను కొట్టిపారేశారు. 'ఎన్సీపీలో ఎలాంటి అలజడులూ లేవు. 53 మంది పార్టీ ఎమ్మెల్యేల్లో 40 మందితో బీజేపీకి దగ్గరవుతున్నానన్న వార్తలు అవి అబద్ధాలు. జీవితాంతం ఎన్సీపీలోనే ఉంటా'' అని మంగళవారం చెప్పారు. శివసేన (యూబీటీ) నేత సంజయ్‌రౌత్ ఎన్సీపీ అధికార ప్రతినిధిలా మాట్లాడుతున్నారంటూ దుయ్యబట్టారు. బీజేపీతో అజిత్ దోస్తీ ఉత్తమాటలని ఎన్సీపీ చీఫ్ శరద్‌పవార్ అన్నారు.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మంగళవారం ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందగా ఇద్దరు పట్టుబడ్డారు. నైమేడ్ పోలీస్‌స్టేషన్ పరిధి కచ్లవాడ అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ భైరంగఢ్ ఏరియా కమిటీ బాధ్యులు మోహన్ కడ్తి, సుమిత్ర కడ్తి తదితరులు సంచరిస్తున్నారనే సమాచారంతో పోలీసులు కూంబింగ్ చేపట్టారు. హోరాహోరీ ఎదురు కాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టును గుర్తించాల్సి ఉంది.

రష్యాపై మరిన్ని కఠిన ఆంక్షలు

యుద్ధ నేరాలకు శిక్ష తప్పదు ● జీ7 దేశాల హెచ్చరికలు

టోక్యో: తైవాన్‌పై చైనా దుందుడుకు చర్యలు, ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగాలపై జీ7 దేశాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ''తీరు మార్చుకుని అంతర్జాతీయ నిబంధనలకు కట్టుబడాలి. లేదంటే తీవ్ర పరిణామాలు తప్పవు''అని ఆ దేశాలను హెచ్చరించాయి. జీ7 దేశాలైన జపాన్, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, కెనడా, ఇటలీ విదేశాంగ మంత్రులు, అత్యున్నత ప్రతినిధుల మూడు రోజుల సదస్సు జపాన్‌లోని కరూయిజవాలో మంగళవారం ముగిసింది. చైనా, రష్యా, ఉత్తర కొరియాల కట్టడికి కలిసికట్టుగా కృషి చేయాలని నిర్ణయించారు. అనంతరం మంత్రులు ఉమ్మడి ప్రకటన జారీ చేశారు. రష్యాను దారికి తీసుకురావడమే లక్ష్యంగా మరిన్ని కఠిన ఆంక్షలు విధించబోతున్నట్లు వెల్లడించారు. ఉక్రెయన్‌లో యుద్ధ నేరాలకు పాల్పడుతున్న రష్యాకు శిక్ష తప్పదన్నారు. ఉక్రెయిన్‌లో రష్యా రాక్షసకాండను సహించబోమన్నారు. ఉక్రెయిన్‌కు మద్దతు కొనసాగుతుందన్నారు. చైనా, తైవాన్ మధ్య శాంతి, స్థిరత్వాన్ని కోరుకుంటున్నామని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ చెప్పారు. జీ7 దేశాధినేతల శిఖరాగ్ర సదస్సు మే లో జపాన్‌లోని హిరోషిమాలో జరగనుంది. చైనాపై జీ7 కూటమి కుట్రలు పన్నుతోందని ఆ దేశ విదేశాంగ మంత్రి వాంగ్ వెన్‌బిన్ ఆరోపించారు.

మరోసారి ఆక్రమిత ఉక్రెయిన్‌లోకి పుతిన్



కీవ్: యుద్ధం మొదలై దాదాపు 13 నెలలు పూర్తవుతున్న వేళ రష్యా అధ్యక్షుడు పుతిన్ సోమవారం ఉక్రెయిన్‌లోని రష్యా ఆక్రమిత ప్రాంతాల్లో పర్యటించి తమ సైన్యం సన్నద్ధతను సమీక్షించారు. మొదట ఖేర్సన్ ప్రావిన్స్‌కు చేరుకున్న పుతిన్ అక్కడి రష్యా సేనల కమాండ్ పోస్ట్‌కు వెళ్లారు. తర్వాత లుహాన్స్క్‌లోని రష్యన్ నేషనల్ గార్డ్ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. ఖేర్సన్, లుహాన్స్క్‌లో సైనిక ఉన్నతాధికారులతో సమావేశమై తాజా పరిస్థితిని సమీక్షించారు. రష్యా అధీనంలోకి వచ్చిన ఉక్రెయిన్ ప్రాంతాల్లో పుతిన్ పర్యటించడం గత రెండు నెలల్లో ఇది రెండోసారి కావడం గమనార్హం. కొన్ని నెలల క్రితమే ఆక్రమించాక ఉక్రెయిన్‌లోని ఖేర్సన్, లుహాన్స్క్, డోనెట్స్క్, జపోరిజియా ప్రావిన్స్‌లను స్థానిక 'రెఫరెండమ్'ల ద్వారా గత సెప్టెంబర్‌లో రష్యా తనలో కలిపేసుకున్న విషయం తెల్సిందే.



మంగళవారం ఢిల్లీలోని బెంగాలీ మార్కెట్‌లో వీధి వెంట సరదాగా చిరుతిండి రుచి చూస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

అతీక్ రహస్య లేఖ

- సీజేఐకి, సీఎం యోగికి అందజేస్తాం
- అతీక్ తరఫు న్యాయవాది వెల్లడి



ప్రయాగ్‌రాజ్/న్యూఢిల్లీ: గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ తన చావును ముందే ఊహించినట్లున్నాడు. అందుకే రెండు వారాల ముందే ఓ లేఖ రాసి సీల్డ్ కవర్‌లో భద్రంగా దాచిపెట్టాడు. తాను చనిపోతే దాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి(సీజేఐ), యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు అందజేయాలని కోరాడు. ఈ విషయాన్ని అతీక్ న్యాయవాది విజయ్ మిశ్రా మంగళవారం వెల్లడించారు. ''అందులో ఏముందో నాకు తెలియదు. అతీక్ కోరిక మేరకు సీల్డ్ కవర్‌లో సీజేఐకి, సీఎంకు పంపుతా'' అని చెప్పారు.

హత్యపై సుప్రీంకోర్టులో 24న విచారణ

అతీక్ సోదరుల హత్యోదంతంపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ''దీన్ని అత్యవసరంగా విచారణకు స్వీకరించండి. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సారథ్యంలో స్వతంత్ర దర్యాప్తు సాగేలా చూడండి. 2017 నుంచి యూపీలో జరిగిన 183 పోలీస్ ఎన్‌కౌంటర్లపై ఎంక్వైరీకి ఆదేశించండి'' అని న్యాయవాది విశాల్ తివారీ మంగళవారం సుప్రీంకోర్టును కోరారు. దీనిపై ఏప్రిల్ 24న విచారణ జరుపుతామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. యోగి పాలనలో ఆరేళ్లలో ఎన్‌కౌంటర్లలో 183 మంది నేరగాళ్లు హతమయ్యారని యూపీ స్పెషల్ డీజీపీ (శాంతిభద్రతలు) ప్రకటించడం తెల్సిందే. మరోవైపు, ప్రయాగ్‌రాజ్‌లో అతీక్ లాయర్‌నని చెప్పుకుంటున్న దయాశంకర్ మిశ్రా నివాసం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు బాంబు విసిరారు. ఎవరికీ హాని జరగలేదు.

ఇక ఏ మాఫియా బెదిరించలేదు: యోగి

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో ఇకపై ఎలాంటి మాఫియా కూడా బెదిరింపులకు పాల్పడబోదని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. అతీక్ సోదరుల హత్య నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మంగళవారం లక్నో, హర్దోయీ జిల్లాల్లో టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటుపై కేంద్రంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న సందర్భంగా యోగి మాట్లాడారు. ''గతంలో రాష్ట్రాన్ని మాఫియా, నేరగాళ్లు కష్టాలపాలు జేశారు. ఇప్పుడు వాళ్లే కష్టాలు పడుతున్నారు'' అన్నారు. 'సమాజ్‌వాదీ పార్టీ హయాంలో 2012–2017 మధ్య రాష్ట్రంలో 700 అల్లర్ల ఘటనలు చోటుచేసుకున్నాయి. అంతకుముందు బీఎస్పీ హయాంలో 364కు పైగా జరిగాయి. మా ప్రభుత్వం వచ్చాక 2017 నుంచి ఒక్క అల్లర్ల ఘటన లేదు. కర్ఫ్యూ లేదు. పరిశ్రమలు, వ్యాపారాలకు అనువైన వాతావరణం నెలకొంది. పెట్టుబడిదారుల భద్రత మా బాధ్యత'' అని చెప్పారు.

సాక్షి కరీంనగర్

బుధవారం । 19 । ఏప్రిల్ । 2023



పోలీస్‌స్టేషన్ తనిఖీ

శంకరపట్నం: కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం కరీంనగర్ సీపీ సుబ్బారాయుడు తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటి నీరు పోశారు.



అంజన్నకు మొక్కులు

కొండగట్టు: కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని మంగళవారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
41.0/26.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ చలిగాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

అగ్ని కలపను భస్మీపటలం చేసినట్లు ఈర్ష్య సత్కారాలను స్వాహా చేస్తుంది.
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
బుధ 6:36	గురు 4:29

న్యూస్‌రీల్

గార్డ్స్ నిరంతరం అప్రమత్తంగా ఉండాలి



కరీంనగర్ అర్బన్: ఈవీఎం గోడౌన్ వద్ద గార్డ్స్ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వెనుకాలలోని గోడౌన్‌ను వివిధ పార్టీల నేతలతో కలిసి పరిశీలించారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీ ప్యాట్ గోడౌన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు వివరించారు. అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్, ఆర్డీవో ఆనంద్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఎలక్షన్ తహసీన్, బీఆర్‌ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, బీజేపీ ప్రతినిధి బండ రమణారెడ్డి, సీపీఎం మిట్కూరి వాసుదేవరెడ్డి, సీపీఐ కసిరెడ్డి సురేందర్ రెడ్డి, టీడీపీ ప్రతినిధి కళ్యాడపు ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.

నిధులు వచ్చాక చెల్లిస్తాం



కరీంనగర్: జిల్లాకు మూల్యాంకనానికి సంబంధించి ఎలాంటి నిధులు వచ్చినా చెల్లిస్తామని డీఈవో జనార్దన్‌రావు తెలిపారు. పదో తరగతి మూల్యాంకన కేంద్రంలో ఎస్టీయూ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్, ఫిజికల్ సైన్స్ ఫోరం అధ్యక్షుడు, బయోలాజికల్ ఫోరం అధ్యక్షుడు అనంతాచారి ఆధ్వర్యంలో మంగళవారం డీఈవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతేడాది ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ మూల్యాంకన బకాయిలు విడుదల చేయాలని కోరారు. లేదంటే రేపు మూల్యాంకనం చేయబోమని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాజన్న సిరిసిల్ల జిల్లా బాధ్యులు మెడపట్ల కిషన్, వెంకటేశ్, సదయ్య, కట్టా రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ పట్టివేత



కరీంనగర్‌సిటీ: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పలు దుకాణాలపై మంగళవారం నగరపాలకసంస్థ అధికారులు దాడులు చేశారు. సందర్భంగా పలు దుకాణాల్లో నిల్వచేసి, అమ్ముతున్న టన్ను నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అమ్మకాలు చేస్తున్న దుకాణాలకు రూ.84,000 జరిమానా విధించారు. పలు దుకాణాలపై కేసులు నమోదు చేశారు.

ఎక్సైజ్ అధికారుల తనిఖీలు



సాక్షి ఎఫెక్ట్

చొప్పదండి: కరీంనగర్‌రూరల్ ఎక్సైజ్ అధికారులు మంగళవారం రాత్రి చొప్పదండి పట్టణ శివారులోని అనుమానాస్పద ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలపై తనిఖీలు నిర్వహించారు. గంజాయి విచ్చలవిడి అమ్మకాలపై మంగళవారం సాక్షిలో 'మత్తులో మరణమృదంగం' అనే శీర్షికన వచ్చిన కథనానికి స్పందించిన ఎక్సైజ్ సీఐ తిరుమలత ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. చొప్పదండిలోని ఎల్లమ్మ టెంపుల్, బస్టాండ్ ఏరియా, బీటీరోడ్, ఆటోస్టాండ్ ఏరియా, అంబేద్కర్ చౌరస్తా ఏరియాల్లో గంజాయి అమ్మకాలపై తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. నిఘా పెట్టి గంజాయి అమ్మకాలను నిషేధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

పోయిన సెల్‌ఫోన్ దొరుకుతుంది!

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కొంతకాలంగా సెల్‌ఫోన్ల చోరీలు పెరిగిపోతున్నాయి. ఫోన్ పోగొట్టుకున్నవారంతా పోయిన ఫోన్ కంటే కూడా అందులో ఉండే డేటా కోసం ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఈ రోజుల్లో విద్య, వ్యాపారం, ఉద్యోగం, ఆరోగ్యం, బ్యాంకింగ్, రాజకీయ సమావేశాలు ఇలా ప్రతీ సమాచారాన్ని సెల్‌ఫోన్ నుంచే నిర్వహిస్తున్నారు. కరోనా తరువాత డేటా వినియోగం పెరిగింది. విద్యార్థుల నుంచి ముసలివారి దాకా స్మార్ట్ ఫోన్‌ల వినియోగం ముమ్మరంగా మారింది. ఈ క్రమంలో తమ వ్యక్తిగత, వృత్తిగత సమాచారాన్ని పలు సాఫ్ట్ కాపీల రూపంలో ఫోన్‌లోనే భద్రపరుచుకుంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే మన దైనందిక జీవితంలో ఫోన్ కీలకంగా మారింది. అంతటి కీలకమైన ఫోన్‌ను పొగొట్టుకున్నా.. లేక చోరీకి గురైనా ఏంటి పరిస్థితి? అమ్మో..! అస్సలు ఆ పరిస్థితినే ఊహించుకోలేని స్థితికి చేరుకున్నాం. అంతటి కీలకమైన స్మార్ట్‌ఫోన్ పోయినా.. పొగొట్టుకున్నా.. అందులో డేటా తస్కరణకు గురైతే పలు సున్నితమైన విషయాలు బయటికి వచ్చే ప్రమాదం కూడా ఉంది. అందుకే.. ఇకపై అలాంటి చిక్కులు లేకుండా తెలంగాణ పోలీసులు వినూత్న సాంకేతికతను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఇందులో భాగంగా కరీంనగర్ కమిషనరేట్‌లో ఈ విధానం ప్రయోగాత్మకంగా అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికే పోగొట్టుకున్న రెండు మొబైల్స్‌ను పట్టుకున్న పోలీసులు తిరిగి వాటిని యజమానులకు అప్పగించారు.

సీఈఐఆర్ సాంకేతికత ద్వారా..

డిపార్ట్‌మెంటు ఆఫ్ టెలీ కమ్యూనికేషన్స్ ఆధ్వర్యంలో సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్ (సీఈఐఆర్) సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా పోయిన సెల్‌ఫోన్‌ను తిరిగి కనిపెట్టే సాంకేతికతను పరిచయం చేస్తున్నారు. ఈ సాంకేతికతను ఉపయోగించి సీఈఐఆర్ వెబ్‌సైట్ ఓపెన్ చేసి బ్లాక్ చేయవచ్చు. సీఈఐఆర్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి సెల్‌ఫోన్‌ను ఐఎంఈఐ నెంబరు సాయంతో బ్లాక్ చేయవచ్చు. ఈ తరువాత ఆ సెల్‌ఫోన్ ఎట్టి పరిస్థితుల్లోనూ పనిచేయదు. ఒకవేళ ఫోన్ ఆన్ చేసి, అందులో కొత్త సిమ్‌కార్డు వేసినా.. ఆ విషయం ఫోన్ యజమానికి ఎస్ఎంఎస్ ద్వారా తెలిసిపోతుంది.



ఐఎంఈఐ నంబరు తెలియకపోతే?

ఒకవేళ మీరు మీ ఫోన్‌ను పొగొట్టుకున్నారు. ఐఎంఈఐ నెంబరు తెలియకపోయినా/గుర్తులేకపోయినా దాన్ని ఇలా తెలుసుకోవచ్చు. మీ మొబైల్ నుంచి (*#06#) డయల్ చేయగానే మీ మొబైల్ నెంబరుపై దాని ఐఎంఈఐ నంబరు ప్రత్యక్షమవుతుంది.

- ఒకవేళ ఫోన్ పోగొట్టుకుంటే.. ఫోన్ కొన్న బాక్స్ మీద లేదా కొనుగోలు చేసిన షాప్‌లో ఉన్న ఇన్వాయిస్ (బిల్) ద్వారా ఐఎంఈఐ నెంబరు సాధించవచ్చు.

- ఆ సెల్‌ఫోన్ పనిచేయదు, కొత్త సిమ్ వేస్తే తెలిసిపోతుంది..
- సీఈఐఆర్ సాంకేతికతపై రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులకు శిక్షణ
- కరీంనగర్‌లో తొలిసారిగా ప్రయోగాత్మకంగా పరిశీలన
- ఇప్పటికే పలు ఫోన్లను పట్టుకున్న రూరల్ పోలీసులు
- మీరు కొన్నది దొంగ ఫోనా? కాదా? తెలిసిపోతుంది
- త్వరలో సామాన్యులకు సైతం విస్తృత అవగాహన



సీఈఐఆర్ పోర్టల్

ఎలా పనిచేస్తుంది?

సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే.. https://www.ceir.gov.in/ పోర్టల్ ఓపెన్ చేయాలి. అందులో బ్లాక్ ఫోన్ అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి.

- అందులో మొబైల్ నెంబర్–1, మొబైల్ నెంబరు–2, సెల్‌ఫోన్ బ్రాండ్, మోడల్, ఇన్వాయిస్ (బిల్) ఫొటో సూచించిన గడుల్లో నింపాలి.
- పోగొట్టుకున్న స్థలం, పోయిన తేదీ, ఇతర చిరునామాలు, అంతకుముందే ఇచ్చిన పోలీస్ కంప్లయింట్ నెంబరు, ఫోన్ యజమాని చిరునామా, ఈమెయిల్ ఐడీ, ధ్రువీకరణ కార్డులు, చప్తాలను సూచించిన బాక్సుల్లో నింపాలి.
- వెంటనే మీ సెల్‌ఫోన్ (పాత నెంబరు మీద తీసుకున్న కొత్త సిమ్) నెంబరుకు ఓటీపీ వస్తుంది.
- ఓటీపీ ఎంటర్ చేసిన తరువాత ఫామ్‌ను సబ్మిట్ చేయాలి. ఆ తరువాత ఫోన్ దానంతట అదే బ్లాక్ అవుతుంది. ఇకపై దాన్ని ఎవరూ ఆపరేట్ చేయలేరు. దానిలోని డేటా సురక్షితంగా ఉంటుంది. ఒకవేళ దొంగించిన వ్యక్తి లేదా సెకండ్ హ్యాండ్‌లో కొన్న వ్యక్తి సిమ్ వేయగానే.. మీ నెంబరుకు మెసేజ్ వస్తుంది.
- ఆ సందేశం ఆధారంగా ఫోన్ ఎక్కడ ఉన్నా.. పట్టుకోవడం సులభతరంగా మారుతుంది.



పెద్దపల్లి జిల్లాకు చెందిన బొడ్డ రమేశ్‌కు మొబైల్ ఇస్తున్న సీపీ

అన్‌బ్లాక్ చేయండిలా..!

- మీ ఫోన్‌ను పోలీసులు పట్టుకున్నా.. లేక మీకే దొరికినా.. మీ పాత ఐడీని, ఫోన్‌నెంబరు, ఇతర వివరాలు నింపిన తరువాత ఫోన్‌ను అన్‌బ్లాక్ చేసుకోవచ్చు.

బ్లాక్ చేయండిలా..

మీరు సెకండ్ హ్యాండ్ లేదా ఓఎల్ఎక్స్ తదితర వెబ్‌సైట్స్ లేదా తెలిసిన వారి దగ్గర ఫోన్ కొనుక్కోవాల్సి వచ్చినపుడు అది దొంగిలించిందా లేదా బ్లాక్ లిస్టులో ఉందా? అన్న విషయం మనం కేవైఎం (నో యువర్ మొబైల్) విధానంలో ముందే తెలుసుకోవచ్చు.

- ఇందుకోసం మొబైల్ తీసుకుని కేవైఎం (నో యువర్ మొబైల్) విధానంలోనూ ఐఎంఈఐ నెంబరును తెలుసుకోవచ్చు. ఇందుకోసం కేవీఎం అని పెద్ద అక్షరాల్లో టైప్ చేయాలి. అనంతరం 15 అక్షరాల ఐఎంఈఐ నెంబరును టైప్ చేసి 14422కు ఎస్ఎంఎస్ పంపాలి.
- ఇందుకోసం కేవైఎం యాప్‌ను సైతం డౌన్‌లోడు చేసుకోవచ్చు. ఇది ఆండ్రాయిడ్/ఐఓఎస్ మొబైళ్ల ప్లే స్టోర్లలో అందుబాటులో ఉంది. లేదా సీఐఆర్ వెబ్‌పోర్టల్‌లో ఆఖరుగా ఇచ్చిన ఆప్షన్ ద్వారా కూడా సెల్‌ఫోన్ తనిఖీ చేసుకోవచ్చు.

ఇక తస్కరులకు చుక్కలే

తాజా సాంకేతికత కరీంనగర్‌లో ప్రయోగాత్మకంగా ఉపయోగిస్తున్నాం. ఇప్పటికే కమిషనరేట్ పరిధిలోని అన్ని స్టేషన్ల రైటర్లకు దీని వినియోగంపై శిక్షణ ఇచ్చాం. రూరల్ పోలీసులు ఈ సాంకేతికత ద్వారా పలు ఫోన్ల జాడ తెలుసుకుని పట్టుకోగలిగారు. త్వరలో దీనిపై సెల్‌ఫోన్ వినియోగదారులకు సైతం విస్తృత అవగాహన కల్పిస్తాం. ఇక ఫోన్ కొట్టేసినా అది పనిచేయదు కాబట్టి, చోరుల ఆటలు సాగవు. – ఎల్.సుబ్బారాయుడు, సీపీ, కరీంనగర్

వీలైనంత మందికి ఉపాధి కల్పించండి

- రాష్ట్రంలోనే జిల్లా ముందంజ
- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



కరీంనగర్ అర్బన్: ఉపాధి హామీ పనుల్లో ఎక్కువ మందిని భాగస్వాములను చేయాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఉపాధి పనుల్లో రాష్ట్రంలోనే జిల్లా ముందంజలో ఉందని వివరించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ హరితహారం, నర్సరీల నిర్వహణపై ఎంపీడీవోలు, పంచాయతీ అధికారులు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గుడ్ గవర్నెన్స్‌లో గ్రామపంచాయతీలలో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని అన్నారు. పని ప్రదేశాలలో వర్క్ సైట్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సెక్రటరీలు ఎప్పటికప్పుడు జాబ్ కార్డులను అప్‌డేట్ చేయాలని, మండలస్థాయిలో వర్క్ షాప్‌లను నిర్వహిస్తూ మోడల్ పంచాయతీలుగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం ఈజీఎస్, తెలంగాణ హరితహారం కార్యక్రమాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను జారీచేయడంతోపాటు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ప్రియాంక, డీఆర్డీవో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోళ్లు

- అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్ లాల్

కరీంనగర్ అర్బన్: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యాసంగి పంట ధాన్యం కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్ లాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 2022–23 యాసంగి పంట కొనుగోలుపై పాక్స్ నోడల్ అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమీక్షించారు. కేంద్రాలకు ధాన్యంతో వచ్చిన రైతు, మొదలైన వివరాలను ఖచ్చితంగా ట్యాబ్‌లో నమోదు చేయాలన్నారు. ఇప్పటికే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి కేంద్రాలకు వచ్చే వారిని గుర్తించి నియంత్రించాలని స్పష్టం చేశారు. ఏ రోజుకారోజు ఎఫ్.ఎ.క్యూ ప్రమాణాలను పాటించడంతోపాటు తాలు వేరు చేసిన వీడియో, ఫొటోలను తీయాలన్నారు. ప్రతీ గన్ని సంచిని సరిచూసి బాగున్న వాటికి మాత్రమే రశీదు ఇవ్వాలని, రాత్రిపూట, కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం సీరియల్ నంబర్ ప్రకారం నమోదు చేయాలని అన్నారు. టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని, కాపలాదారున్ని నియమించాలని అన్నారు. జిల్లా సహకార శాఖ అధికారి శ్రీమాల, పీఏసీఎస్ సొసైటీ సభ్యులు, నోడల్ అధికారులు, సీవోలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే వచ్చా..!

- కొప్పుల ఈశ్వర్‌కు తన 'సంక్షేమ'మే ముఖ్యం
- కేసీఆర్ మెప్పు కోసమే పనిచేస్తున్నారు
- పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

సాక్షి, పెద్దపల్లి: 'ఇప్పుడు ఎన్నికలు లేవు. అయినప్పటికీ కాంగ్రెస్ ఇచ్చిన తెలంగాణలో మీ సమస్యలు పరిష్కారమయ్యాయా..? లేదా..? తెలుసుకునేందుకు పాదయాత్రన మీ వద్దకు వచ్చా..' అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర మంగళవారం ధర్మారంలోని రచ్చపల్లి, రామయ్యపల్లి మీదుగా పెద్దపల్లి నియోజకవర్గం పాలితంలోకి ప్రవేశించింది. అయితే దొంగతుర్తి, బొంపల్లి, మేరపల్లి, తెనుగువాడ, పెద్దపల్లి, హనుమంతునిపేట, రాంపల్లి వరకు సుమారు 20 కిలోమీటర్ల మేర ఉద్రిక్తతల మధ్య కొనసాగింది.

కాంగ్రెస్ పార్టీ నిర్మించిన ప్రాజెక్టులతోనే..

ధర్మారం మండలం రామయ్యపల్లిలో భట్టి మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులతోనే రైతులకు ప్రస్తుతం సాగునీరందుతోందని, తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల ద్వారా చుక్క నీరందడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో దుర్మార్గ పాలన కొనసాగుతోందన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పథకాలన్నీ దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో కొనసాగాయన్నారు.

సొంత సంక్షేమం చూసుకుంటున్న 'కొప్పుల'

జిల్లాకేంద్రంలోని రాజీవ్‌చౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడుతూ.. మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజల సంక్షేమాన్ని విస్మరించి తన సంక్షేమమే చూసుకుంటున్నారని, ఆయన చేసిన అభివృద్ధి ఏమిటో చూపెట్టాలన్నారు. కేసీఆర్ మెప్పు కోసం పనిచేసే ఆయన అవసరమా..? ప్రజలే ఆలోచన చేయాలన్నారు. మంచిర్యాల, రామగుండం ప్రజలు ఓపెన్‌కాస్టులతో, సింగరేణి ప్రైవేటీకరణతో ఇబ్బంది పడుతున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సమస్యలు పరిష్కరిస్తామన్నారు. మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. జిల్లాలో ఇసుక, మట్టి, బూడిద దందాతోపాటు మర్డర్ల మాఫియా కొనసాగుతోందన్నారు. అధికారపార్టీ ఎమ్మెల్యేలు దందాలు చేసి దోచుకోవడానికే గెలిచినట్లు ఉందని ఎద్దేవా చేశారు. డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, జెడ్పీటీసీ గంటా రాములు, జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలరించిన గద్దర్ పాట

'మా మట్టికాళ్ల భట్టిగారు పాదయాత్ర చేస్తుండంట.. పోతవురో కేసీఆర్.. మా ఉసురు తగిలిపోతావురో..' అంటూ గద్దర్ పాడిన పాటకు కార్యకర్తలు, ప్రజల నుంచి పెద్దఎత్తున స్పందన వచ్చింది.

అభ్యర్థి ప్రకటనతో మొదలు..

గతంలో పెద్దపల్లికి వచ్చిన రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ తరఫున పెద్దపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా విజయరమణారావును ప్రకటించారు. దీంతో టికెట్‌పై ఆశలు పెట్టుకున్న ఓదెల జెడ్పీటీసీ గంటా రాములు, డీసీసీ మాజీ అధ్యక్షుడు ఈర్ల కొమురయ్య, తదితరులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పాలితంలోకి భట్టి పాదయాత్ర ప్రవేశించగానే ముందుగా భారీ అనుచరవర్గంతో వచ్చిన మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు స్వాగతం పలికారు. తర్వాత తన అనుచరులతో వచ్చిన గంటా రాములు స్వాగతం పలికే క్రమంలో ఇరువర్గాలు నినాదాలతో హోరెత్తించారు. ఒకరినొకరు తోసుకోవడంతో అక్కడ తోపులాట జరిగింది. భట్టి సముదాయించటంతో సద్దుమణిగింది. సాయంత్రం బొంపల్లి వద్ద మరోసారి గొడవ జరిగింది. ఈ ఘటనలో గంట రాములు వర్గీయుడు నర్సింగ్ తలకు గాయాలయ్యాయి.



పెద్దపల్లిలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

లక్ష్యానికి మించి..

- జిల్లాలోని మార్కెట్‌కమిటీలకు కనకవర్షం
- లక్ష్యానికి మించి వసూలైన పన్నులు
- ఏడుయార్డులకు రూ.22.38 లక్ష్యం.. రూ.27.35 ఆదాయం
- వరంగల్ రీజియన్‌లో పన్నుల వసూళ్లలో రెండస్థానంలో కరీంనగర్
- హర్షం వ్యక్తం చేసిన అధికారులు, మార్కెట్‌కమిటీలు

జమ్మికుంట(హుజూరాబాద్): జిల్లాలోని మార్కెట్‌కమిటీలకు కాసుల పంట పండింది. ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులపై జీఎస్టీ ఎత్తివేయడంతో లక్ష్యానికి మించిన ఆదాయం సాధించాయి. పెరిగిన సాగు విస్తీర్ణం, మార్కెట్ యార్డుల్లో లక్ష్యానికి మించిన క్రయ విక్రయాలు ఇందుకు కారణంగా చెప్పవచ్చు. చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా, కొనుగోలు, అమ్మకాల ప్రక్రియలో ఖచ్చితత్వంతో మార్కెట్ కమిటీలకు లక్ష్యానికి మించిన పన్నులు వసూలు అయ్యాయి. పన్నుల వసూళ్లలో జిల్లా మార్కెటింగ్ శాఖ రూ.22.38కోట్ల లక్ష్యానికి రూ.27.35 కోట్ల ఆదాయంతో వరంగల్ రీజియన్ పరిధిలో రెండోస్థానంలో నిలిచింది. దీంతో అధికారులు, మార్కెట్ కమిటీ పాలకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లా పరిధిలో ఏడు మార్కెట్ కమిటీలు ఉన్నాయి. అన్నింటికి కలిపి 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.22.38కోట్ల లక్ష్యం కేటాయించగా.. రూ.27.35 కోట్ల ఆదాయం వచ్చింది. అన్ని యార్డుల్లోనూ లక్ష్యానికి మించిన పన్నులు వసూలు అయ్యాయి.
- అయా వ్యవసాయ మార్కెట్ యార్డుల పరిధిలో వ్యవసాయ ఉత్పత్తులు అధికమొత్తంలో అమ్మకాలు, కొనుగోళ్ల ప్రక్రియ జరగడంతో మార్కెట్ శాఖకు భారీ ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది.
- ప్రభుత్వరంగ సంస్థలైన పీఏసీఎస్‌లు, ఐకేపీ, మార్క్‌ఫెడ్ ద్వారా వ్యవసాయ ఉత్పత్తులైన ధాన్యం, మొక్కజొన్న 90శాతం వరకు కొనుగోలు జరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా పత్తి క్రయవిక్రయాలు జరుగుతున్నాయి.
- మార్కెట్ యార్డుల పరిధిలో అక్రమ వ్యాపారాలకు తెరపడడం, జీఎస్టీ ఎత్తివేడంతో వ్యవసాయ మార్కెట్లకు ఆదాయం సమకూరుతోందని మార్కెటింగ్‌శాఖ గణంకాగాలు చెబుతున్నాయి.
- వరంగల్ రీజియన్ పరిధిలో 107 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా మార్కెట్ కమిటీ టార్గెట్ 18కోట్ల 93లక్షలు కాగా 26కోట్ల 45లక్షలతో140శాతంతో మొదటిస్థానంలో నిలిచింది.
- కరీంనగర్ జిల్లా మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.22 కోట్ల 38లక్షలు కాగా.. రూ.27 కోట్ల 35లక్షలు ఆదాయం సమకూరగా.. 122శాతంతో రెండోస్థానంలో నిలిచింది.
- వరంగల్ రీజియన్‌లో పన్నులశాతం పెంపుదలపై నివేదిక ఆధారంగా అధికారులు గ్రేడ్ నిర్ణయించారు. దీంతో యాదాద్రి (భువనగిరి జిల్లా)మార్కెట్ కమిటీ మొదటిస్థానంలో, కరీంనగర్ జిల్లా రెండోస్థానంలో నిలిచాయి.



జమ్మికుంట మార్కెట్ కమిటీ కార్యాలయం

జిల్లాలోని ఏడు మార్కెట్ల 2022-23 వార్షికలక్ష్యం, ఆదాయం వివరాలు(రూ.కోట్లలో)


మార్కెట్	లక్ష్యం	సాధించింది	శాతం
కరీంనగర్	4.42	4.54	102.83
జమ్మికుంట	6.98	7.35	105.38
చొప్పదండి	2.15	2.97	138.47
హుజూరాబాద్	3.24	5.21	160.47
గంగాధర	1.66	2.86	172.49
మానకొండూర్	1.82	1.91	105.01
గోపాల్‌రావుపేట	2.11	2.49	118.14

మార్కెట్ నిబంధనలతో పెరిగింది



మార్కెట్‌కమిటీ పన్నుల వసూళ్లలో నిబంధనలు సరళీకృతం అయ్యాయి. వ్యవసాయ ఉత్పత్తుల రవాణా పెరిగింది. చెక్‌పోస్టుల ద్వారా నిఘా కఠినతరం చేశాం. క్రయ విక్రయాల నమోదు, తద్వారా పన్ను చెల్లింపు క్రమంగా జరుగుతుంది. దీంతో మార్కెట్‌కు అధిక ఆదాయం సమకూరింది. – గూగులోతు రెడ్డినాయక్, కార్యదర్శి, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్

మరింత పెంచేలా కృషిచేస్తాం



వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలపై ప్రభుత్వం, ప్రైవేటువ్యాపారులకు ద్వారా భారీ ఆదాయం సమకుర్చేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు వ్యాపారులకు లైసెన్స్‌లు జారీచేసి, పన్నులు వసూలు చేస్తూ.. నెలవారీ నివేదిక ఆదారంగా కార్యదర్శులు పనిచేస్తున్నారు. వచ్చే 2023–24 ఆర్థిక సంవత్సరంలో మరింత ఆదాయం పెంచేందుకు కృషి చేస్తాం. – పద్మావతి, డీఎంవో, మార్కెటింగ్‌శాఖ, కరీంనగర్

క్లుప్తంగా

తగ్గిన పత్తి ధర

● క్వింటాల్‌కు రూ.7,900


మిల్లులో కొనుగోలు చేసిన పత్తి

జమ్మికుంట(హుజూరాబాద్‌): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో పత్తి ధర తగ్గింది. సోమవారం క్వింటాల్‌కు రూ.7,950 కాగా మంగళవారం రూ.50 తగ్గి, గరిష్టంగా రూ.7,900 పలికింది. మార్కెట్‌కు 94 వాహనాల్లో 1,686 క్వింటాళ్ల పత్తిని రైతులు విక్రయానికి తీసుకువచ్చారు. క్వింటాల్‌కు మోడల్‌ ధర రూ.7,700, కనిష్ట ధర రూ.7,300 వ్యాపారులు చెల్లించారు. గన్నీ సంచుల్లో 11 మంది రైతులు 16 క్వింటాళ్ల పత్తిని తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.7,400, మోడల్‌ ధర రూ.7,000, కనిష్ఠ ధర రూ.6,000కు కొనుగోలు చేశారు. మార్కెట్‌లో క్రయవిక్రయాలను కార్యదర్శి గుగులోతు రెడ్డినాయక్‌ పర్యవేక్షించారు.

బీసీ బంధు పథకం ప్రవేశపెట్టాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్‌

కరీంనగర్‌: బీసీ బంధు పథకాన్ని ప్రవేశపెట్టి, రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని, బీసీలను ఆర్థికంగా ఆదుకోవాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. మంగళవారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో నగర అధ్యక్షుడు అనుమాస నితిన్‌ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత బంధు మాదిరిగానే బీసీల్లో అత్యంత వెనుకబడిన వర్గాల అభివృద్ధికి బీసీ బంధు పథకం ద్వారా తోడ్పాటునందించాలని కోరారు. తెలంగాణ వస్తే బతుకులు బాగుపడతాయని ఆశించిన బీసీ కులాల అభివృద్ధికి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగొని శ్రీనివాస్‌, కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్‌, జాయింట్‌ సెక్రటరీ అల్గాం శ్రీకాంత్‌, నాయకులు భార్గవ్‌ తదితరులు పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొన్న లారీ

● ఒకరి పరిస్థితి విషమం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై ఓ స్కూటీని లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై శేఖర్‌ వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్‌కు చెందిన తాళ్లపెల్లి రామస్వామి మంగళవారం స్కూటీపై మండల కేంద్రం నుంచి ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా వేగంగా వస్తున్న వడ్ల లోడ్‌ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామస్వామి లారీ కిందికి వెళ్లడంతో ఆయన కాలు నుజ్జునుజ్జయింది. స్కూటీ లారీ టైరు కింద ఇరుక్కొని, నుజ్జునుజ్జయింది. రామస్వామి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు అతన్ని 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

‘నుస్తులాపూర్‌’ చైర్మన్‌పై అవిశ్వాసం?

● 10 మంది పీఏసీఎస్‌ డైరెక్టర్ల నిర్ణయం!
● నోటీస్‌పై సంతకం చేసినట్లు సమాచారం


నుస్తులాపూర్‌ పీఏసీఎస్‌ కార్యాలయం

తిమ్మాపూర్‌(మానకొండూర్‌): మండలంలోని నుస్తులాపూర్‌ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్‌) చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని డైరెక్టర్లు నిర్ణయించినట్లు తెలిసింది. ఈ మేరకు నోటీస్‌పై సంతకాలు చేసినట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే.. నుస్తులాపూర్‌ సొసైటీ కింద తిమ్మాపూర్‌, గన్నేరువరం మండలాలు, 13 డైరెక్టర్‌ స్థానాలు ఉన్నాయి. వీరిలో ఏడుగురు గన్నేరువరం మండలానికి, ఆరుగురు తిమ్మాపూర్‌ మండలానికి చెందినవారు. మొదట ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ తిమ్మాపూర్‌ మండలానికి చెందిన గుజ్జుల రవీందర్‌ రెడ్డి పేరు సూచించగా గన్నేరువరానికి చెందిన ఏడుగురు డైరెక్టర్లు ఏకమయ్యారు. ఎమ్మెల్యే మాటను ధిక్కరించి, ఎస్సీ రిజర్వ్‌ స్థానం నుంచి ఎన్నికైన అలువాల కోటిని చైర్మన్‌గా ఎంపిక చేశారు. ఈ ఏడుగురు డైరెక్టర్లలో కోటి రెండున్నర సంవత్సరాలు, గంప వెంకన్న రెండున్నర సంవత్సరాలు చైర్మన్‌గా ఉండాలని ఒప్పందం చేసుకున్నారు. అయితే మూడేళ్లు గడిచినా కోటి రాజీనామా చేయకపోవడంతో వెంకన్నతోపాటు రవీందర్‌ రెడ్డి, మరో 10 మంది డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించినట్లు తెలిసింది. ఈ మేరకు అందరూ నోటీస్‌పై సంతకాలు చేసి, డీసీవోకు అందించినట్లు సమాచారం.

ఓ నాయకుడు చక్రం తిప్పాడని చర్చ..

రవీందర్‌ రెడ్డిని చైర్మన్‌గా ప్రపోజ్‌ చేసిన ఎమ్మెల్యే మాటను కాదని కోటి చైర్మన్‌ అయ్యారు. దీని వెనకాల బెజ్జంకికి చెందిన ఓ నాయకుడు ఉండి, చక్రం తిప్పాడన్న చర్చ జరుగుతోంది. తనతోనే ఉంటూ నమ్మకద్రోహం చేశారని గ్రహించిన ఎమ్మెల్యే అప్పటినుంచి ఆయనతోపాటు గన్నేరువరం ప్రజాప్రతినిధులను దూరం పెట్టారు. తర్వాత ఆయన చేస్తున్న అభివృద్ధి పనులు చూసి, గన్నేరువరం ప్రజాప్రతినిధులు బెజ్జంకి నాయకుడికి వ్యతిరేకంగా ఎమ్మెల్యే గూటికి చేరారు. ప్రస్తుతం 13 మంది డైరెక్టర్లలో 10 మంది రవీందర్‌ రెడ్డికి అనుకూలంగా ఉండి, అవిశ్వాసం పెట్టాలని నిర్ణయించారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కరీంనగర్‌: స్కాలర్‌షిప్‌, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలు విడుదల చేయాలని, ప్రైవేట్‌, కార్పొరేట్‌ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్‌ చేశారు. ఫెడరేషన్‌ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్‌ మాట్లాడుతూ.. దాదాపు రెండున్నరేళ్లుగా విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ పూర్తిస్థాయిలో చెల్లించడం లేదన్నారు. కార్పొరేట్‌ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు దండుకుంటున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు కాకుండా తమకు నచ్చినట్లు లక్షల రూపాయలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. గురుకులంలో సమ్మర్‌ క్యాంపు పేరిట విద్యార్థులకు తరగతులు నిర్వహించడాన్ని ఉపసంహరించుకోవాలని అన్నారు. లేకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్‌, ఉపాధ్యక్షుడు తిప్పారపు రోహిత్‌, జిల్లా కమిటీ సభ్యులు రత్నం సురేశ్‌, నాగుల శివ, రమ్య, నాయకులు భవాని, వినీత్‌, ఇషాక్‌, నాయక్‌, మణికంఠ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రీజియన్లు లాభాల్లోకి రావాలి

● ఆర్టీసీ కరీంనగర్‌ జోన్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న జోన్‌ ఈడీ వెంకటేశ్వర్లు

కరీంనగర్‌: 2023–24 ఆర్థిక సంవత్సరంలో కరీంనగర్‌ జోన్‌ పరిధిలోని అన్ని రీజియన్లు ప్రస్తుత నష్టాలను అధిగమించి, లాభాల్లోకి రావాలని ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ వి.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో రీజినల్‌ మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం దృష్ట్యా ప్రయాణికులకు చల్లటి మంచినీటి సౌకర్యం కల్పించడంతోపాటు ప్రయాణంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంలు ఖుస్రో షా ఖాన్‌, ఉషాదేవి, ప్రభులత, జానీ రెడ్డి, శ్రీలత, డిప్యూటీ రీజినల్‌ మేనేజర్లు, డిప్యూటీ చీఫ్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌, వర్క్స్‌ మేనేజర్‌, డిప్యూటీ చీఫ్‌ పర్సనల్‌ మేనేజర్‌, కరీంనగర్‌ జోన్‌ పర్సనల్‌ ఆఫీసర్లు, అకౌంట్స్‌ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తుదారులకు అవకాశం

● ప్లాట్లను చట్టబద్ధం చేసుకోండి
● మేయర్‌ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్‌సిటీ: ఎల్‌ఆర్‌ఎస్‌–2020లో రూ.1,000 చెల్లించి, దరఖాస్తు చేసుకున్నవారి కోసం రాష్ట్ర ప్రభుత్వం చక్కటి అవకాశం కల్పించిందని, స్థలాలను రెగ్యులరైజ్‌ చేసుకోవాలని మేయర్‌ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. మంగళవారం కరీంనగర్‌ నగరపాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్‌ కమిషనర్‌ సేవా ఇస్లావత్‌తో కలిసి టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు, లైసెన్స్‌ సర్వేయర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎల్‌ఆర్‌ఎస్‌–2020 దరఖాస్తుల ప్రాసెస్‌పై సూచనలు చేశారు. నగరపాలక సంస్థలో 2020 సంవత్సరంలో ఎల్‌ఆర్‌ఎస్‌ కింద 26,441 మంది రెగ్యులరైజేషన్‌ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తుదారులు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ప్లాట్లను చట్టబద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ స్కీంలో రెగ్యులరైజేషన్‌ చేసుకున్నవారు అప్పటి మార్కెట్‌ విలువ ప్రకారమే భవన నిర్మాణ అనుమతులకు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. దీనివల్ల ఆర్థిక భారం తగ్గనుందన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సందేహాల నివృత్తికి ప్రత్యేక హెల్ప్‌ డెస్క్‌ ఏర్పాటు చేశామని తెలిపారు. దరఖాస్తుదారులు టౌన్‌ ప్లానింగ్‌ అధికారులను సంప్రదించాలన్నారు. అధికారులు కూడా దరఖాస్తులకు సమాచారం అందిస్తూ రెగ్యులరైజేషన్‌కు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీసీపీ సుభాష్‌, ఏసీపీ భానుచందర్‌, టీపీబీవోలు శ్రీహరి, నవీన్‌, రాజు తదితరులున్నారు.

మహిళా క్లినిక్‌లో 8 రకాల వైద్య పరీక్షలు


మహిళలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో లలితాదేవి

● డీఎంహెచ్‌వో లలితాదేవి

కరీంనగర్‌టౌన్‌: జిల్లాలో ఆరోగ్య మహిళ పథకం కింద బుట్టిరాజారాం కాలనీ ఆసుపత్రిలో ప్రతీ మంగళవారం నిర్వహిస్తున్న మహిళా క్లినిక్‌ను డీఎంహెచ్‌వో లలితాదేవి సందర్శించారు. మహిళలతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆరోగ్య మహిళా పథకం కింద మహిళలకు 8 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య పరిస్థితని నిర్ధారించి, చికిత్స అందించనున్నట్లు పేర్కొన్నారు. సూక్ష్మ పోషక లోపాలు, శరీర బరువు నిర్వహణ, కేన్సర్‌ స్క్రీనింగ్‌, రొమ్ము కేన్సర్‌, మెనోపాజ్‌ నిర్వహణ, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్‌, రుతుస్రావ సమస్యలు, సుఖ వ్యాధులు తదితరాలకు చికిత్స అందిస్తున్నామని చెప్పారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నెహ్రూ విగ్రహాన్ని వెంటనే నెలకొల్పాలి


కలెక్టర్‌ ఆర్‌వీ కర్ణన్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

కరీంనగర్‌టౌన్‌: నవరన్‌ స్ట్రీట్‌ కూడలి వద్ద ఉన్న నెహ్రూ విగ్రహాన్ని రెండేళ్ల క్రితం రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించారని కాంగ్రెస్‌ నాయకులు తెలిపారు. వెంటనే విగ్రహాన్ని నెలకొల్పాలని కోరుతూ కాంగ్రెస్‌ నగర శాక ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్‌ ఆర్‌వీ కర్ణన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్‌ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌ రెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్య్ర సంగ్రామంలో కీలక భూమిక పోషించడమే కాకుండా దేశ మొట్టమొదటి ప్రధానమంత్రిగా పంచవర్ష ప్రణాళికలతో అభివృద్ధికి బీజాలు వేసిన మహనీయుడు నెహ్రూ అని కొనియాడారు. ఆయన విగ్రహ ఏర్పాటులో నిర్లక్ష్యం తగదన్నారు. రెండేళ్లుగా మున్సిపల్‌ కమిషనర్‌కు వినతి పత్రాలు ఇస్తూ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అయినా స్పందించకపోవడం బాధాకరమన్నారు. 15 రోజుల్లో ఈ విషయంలో స్పష్టత రాకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. నాయకులు గుండాటి శ్రీనివాస్‌ రెడ్డి, శ్రవణ్‌ నాయక్‌, కుర్ర పోచయ్య, దండి రవీందర్‌, ఎండీ.చాంద్‌, ముక్క భాస్కర్‌, మామిడి సత్యనారాయణ రెడ్డి, మేకల నర్సయ్య, పొరండ్ల రమేశ్‌, మెతుకు కాంతయ్య, షబానా మహమ్మద్‌, నెల్లి నరేష్‌, అన్న జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

● బైక్‌ అదుపుతప్పి పడిపోయిన ఘటనలో గాయాలు

కరీంనగర్‌ క్రైం: బైక్‌ అదుపు తప్పి, కిందపడిన ఘటనలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కరీంనగర్‌ వన్‌టౌన్‌ పోలీసుల వివరాల ప్రకారం.. పెండోట రాము(51) హౌజింగ్‌ బోర్డు కాలనీలో నివసిస్తూ కమాన్‌ సమీపంలో బైక్‌ మెకానిక్‌ పని చేసేవాడు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి, బైక్‌పై తాను పని చేసే దుకాణానికి వెళ్తుండగా గేదె అడ్డు వచ్చింది. దీంతో అతను వాహనం అదుపుతప్పి, కిందపడ్డాడు. తలకు బలమైన గాయమవడంతో స్థానికులు 108కు ఫోన్‌ చేయగా సిబ్బంది వచ్చి, ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి, ప్రథమ చికిత్స అందించారు. మరుసటి రోజు స్కానింగ్‌ చేసుకోమని సూచించారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున బాత్రూంలోకి వెళ్లిన రాము తనకు కళ్లు తిరుగుతున్నాయని చెప్పి, కిందపడిపోయాడు. కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

కళ్లముందే బావిలో మునిగి‘పోయాడు’..

● ఈత రాక యువకుడి మృతి
● కాపాడే ప్రయత్నం చేసినా విఫలం
● కన్నీరుమున్నీరైన స్నేహితులు
● చామనపల్లిలో ఘటన


రాజేందర్‌ మృతదేహం

కరీంనగర్‌రూరల్‌: ముగ్గురు స్నేహితులు సరదాగా తాటికల్లు తాగడానికి ఊరెళ్లారు.. బహిర్భూమి కోసం వెళ్లిన స్నేహితుడు ప్రమాదవశాత్తు బావిలో పడగా కాపాడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.. ఈత రాక అతను కళ్లముందే మృతి చెందడంతో స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్‌ శివాజీనగర్‌కు చెందిన సానవేణి రాజేందర్‌(26) గాంధీరోడ్డులోని మద్యం దుకాణంలో పర్మిట్‌రూం నడిపిస్తూ ఉపాధి పొందుతున్నాడు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు అతనితోపాటు స్నేహితులు బూర్గుపల్లి ప్రశాంత్‌, వినీత్‌లు రెండు ద్విచక్ర వాహనాలపై కరీంనగర్‌ మండలంలోని చామనపల్లిలో తాటికల్లు తాగేందుకు వెళ్లారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు తిరిగి కరీంనగర్‌కు వస్తూ ఆ గ్రామ ఎల్లమ్మ గుడి సమీపంలో ఆగారు. రాజేందర్‌ బహిర్భూమికి వెళ్లి, ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడిపోయాడు. గమనించిన స్నేహితులు అతన్ని కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అయినా ఫలితం లేకపోయింది. తమ కళ్లముందే స్నేహితుడు బావిలో మునిగిపోతున్నా తమకు ఈత రాకపోవడంతో కాపాడలేకపోయామంటూ కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం అందుకున్న కరీంనగర్‌రూరల్‌ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, బావిలో నుంచి నీటిని తొలగించారు. స్థానికుల సహాయంతో రాజేందర్‌ మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఏడాది క్రితమే వివాహమైంది. అతనికి తల్లి భాగ్య, సోదరుడు ఉన్నారు. ఈత రాకపోవడం వల్లే తన కుమారుడు మృతిచెందాడని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గన్నేరువరం నుంచి బ్రిడ్జి నిర్మించాలి


సుడా చైర్మన్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

గన్నేరువరం(మానకొండూర్‌): గన్నేరువరం మండలం నుంచి కరీంనగర్‌కు లోయర్‌ మానేరు డ్యాంపై బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని బ్రిడ్జి సాధన కమిటీ చైర్మన్‌ సంపతి ఉదయ్‌ కోరారు. ఈ మేరకు మంగళవారం కరీంనగర్‌లోని బీఆర్‌ఎస్‌ పార్టీ కార్యాలయంలో సుడా చైర్మన్‌, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావును కలిసి, వినతిపత్రం అందించారు. ఎల్‌ఎండీ నిర్మాణం అనంతరం 12 నుంచి 40 కిలోమీటర్ల దూరభారం పెరిగిందని తెలిపారు. దీంతో మండలవాసులు ఉన్నత విద్యతోపాటు వైద్యానికి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణం చేపడితే గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కమిటీ వైస్‌ చైర్మన్‌ పుల్లెల జగన్మోహన్‌, ప్రధాన కార్యదర్శి పుల్లెల రాము, కోశాధికారి గుండా వెంకటేశం, ప్రచార కార్యదర్శి మునిగంటి శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



శ్యాంసుందర్‌ను ఫ్లెక్సీలో ఉంచి, ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం, తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్‌

● కల్వర్టును ఢీకొన్న టాటాఏస్‌ వాహనం
● తిమ్మాపూర్‌లో ఘటన

తిమ్మాపూర్‌(మానకొండూర్‌): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎల్‌ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన అనంతుల శ్రీకాంత్‌ తన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో ఉండేందుకు రూం తీసుకున్నాడు. సామగ్రి తీసుకెళ్లేందుకు మంచిర్యాలకు చెందిన శ్యాంసుందర్‌కు చెందిన టాటాఏస్‌ వాహనాన్ని మాట్లాడుకున్నాడు. సోమవారం సాయంత్రం ఇద్దరూ సామగ్రి తీసుకెళ్లారు. తిరిగి మంగళవారం ఉదయం గోదావరిఖని బయల్దేరారు. 6 గంటలకు తిమ్మాపూర్‌ ఎంపీడీవో కార్యాలయం వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి, కల్వర్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న ఆర్టీసీ పోలీసులు స్పందించి, క్షతగాత్రులను బయటకు తీశారు. ఎస్సై ప్రమోద్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని, బాధితుల వివరాలు తెలుసుకున్నారు. 108 వాహనంలో శ్రీకాంత్‌ను, హెచ్‌కేఆర్‌ అంబులెన్స్‌లో శ్యాంసుందర్‌ను కరీంనగర్‌ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. డ్రైవర్‌ శ్యాంసుందర్‌ కాలు నుజ్జునుజ్జవగా, శ్రీకాంత్‌ ఎడమ భుజం విరిగింది.

అంబులెన్స్‌లో స్ట్రెచర్‌ లేక ఇబ్బంది..

హెచ్‌కేఆర్‌ అంబులెన్స్‌లో స్ట్రెచర్‌ లేదు. శ్యాంసుందర్‌రావు కాలు నుజ్జునుజ్జవడంతో వాహనంలోకి ఎక్కించడానికి స్థానికులు ఇబ్బంది పడ్డారు. చివరకు అతన్ని ఫ్లెక్సీలో వేసి, అంబులెన్స్‌లో ఎక్కించారు. దీంతో హెచ్‌కేఆర్‌ సిబ్బందిపై ప్రయాణికులు మండిపడ్డారు. రూ.లక్షల్లో టోల్‌ వసూలు చేస్తూ అంబులెన్స్‌లో సరైన సదుపాయాలు కల్పించకపోవడం ఏంటని ప్రశ్నించారు.

తండ్రి భూమిని తన పేరిట రాయాలని..

● వాటర్‌ ట్యాంక్‌ ఎక్కి తనయుడి నిరసన

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తన తండ్రి సంపాదించిన భూమిని తన పేరిట రాయాలంటూ ఓ యువకుడు వాటర్‌ ఎక్కి, నిరసన తెలిపాడు. ఈ ఘటన తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల్లలో చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. జిల్లెల్లకు చెందిన బాలసాని ఎల్లయ్య–జపమాల దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన పేరిట ఉన్న 3 ఎకరాల భూమిని భార్య తన పేరిట మార్చుకుంది. అయితే కుమారుడు రమేశ్‌ భూమిని తన పేరిట రాసివ్వాలని మంగళవారం స్థానిక ప్రభుత్వ పాఠశాల దగ్గరున్న వాటర్‌ ట్యాంక్‌ ఎక్కాడు. ఫోన్‌లో సెల్ఫీ ఫొటో తీసి, గ్రామ వాట్సాప్‌ గ్రూప్‌లో పోస్టు చేశాడు. ఇది చూసిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాధితుడితో మాట్లాడి, కిందకు రప్పించారు. అనంతరం అతన్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రమేశ్‌ మాట్లాడుతూ.. తన తండ్రి ఎల్లయ్య పేరిట ఉన్న భూమిని తల్లి తన అక్కాచెల్లెలికి ఇచ్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించాడు. రూ.20 లక్షలు, రైతుబీమా ద్వారా వచ్చిన రూ.5 లక్షలు తల్లి వద్దనే ఉన్నాయని, ఆ డబ్బులను తాను అడగడం లేదని తెలిపాడు. గతంలో తనకు విషాహారం పెట్టి, చంపే ప్రయత్నం చేశారని, అక్క రేణుక, చెల్లి కళావతి, బావ శ్రీనివాస్‌లు తనపై దాడికి ప్రయత్నించారని, తన భార్యపై దాడి చేశారని అన్నాడు. 100కు కాల్‌ చేయగా పోలీసులు వచ్చి, కాపాడారని తెలిపాడు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దుబాయ్‌లో వలసజీవి దుర్మరణం

● మృతుడు గుడ్డివెలుగులపల్లి వాసి


శ్రీనివాస్‌ (ఫైల్‌)

రామడుగు(చొప్పదండి): మండలంలోని వెలిచాల గ్రామ పరిధి గుడ్డివెలుగులపల్లి గ్రామానికి చెందిన నాగసముద్రం శ్రీనివాస్‌ దుబాయ్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. ఉపాధి కోసం రెండేళ్ల క్రితం దుబాయ్‌ వెళ్లిన శ్రీనివాస్‌ రెండు నెలల క్రితం తన తండ్రి రామస్వామి మృతి చెందడంతో ఇంటికి వచ్చాడు. దహనసంస్కార కార్యక్రమాలను ముగించుకొని నెల రోజుల క్రితం మళ్లీ వెళ్లాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం అక్కడ కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి, మృతిచెందాడు. మృతునికి తల్లి, భార్య, కుమారుడు ఉన్నారు. శ్రీనివాస్‌ మృతదేహం బుధవారం స్వగ్రామం చేరుకోనుందని స్థానికులు పేర్కొన్నారు.

ఉరేసుకొని ఒకరి బలవన్మరణం

గన్నేరువరం(మానకొండూర్‌): మండల కేంద్రానికి చెందిన పర్శరాములు(50) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సురేందర్‌ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పర్శరాములు గతంలో గల్ఫ్‌ వెళ్లివచ్చాడు. అతనికి కొన్ని రోజులుగా మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. ఈ క్రమంలో మంగళవారం ఇంటివద్ద బాత్‌రూంలో ఉరేసుకున్నాడు. మృతుడి భార్య భూలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని వ్యక్తి ఆత్మహత్య

గంగాధర(చొప్పదండి): భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై అభిలాష్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర మండలంలోని వెంకటాయిపల్లికి చెందిన మంద రాములు స్థానికంగా ట్రాక్టర్‌ డ్రైవర్‌గా పని చేసేవాడు. అతనికి భార్య వజ్ర, ఇద్దరు కుమారులు ఉన్నారు. దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో రాములు నెల రోజుల క్రితం గొడవ పడి, భార్యను కొట్టాడు. ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో అతను మద్యానికి అలవాటు పడ్డాడు. సోమవారం తన భార్యను తీసుకురావడానికి అత్తగారింటికి వెళ్లగా తాగుడు బంద్‌ చేస్తేనే వస్తానని ఆమె తేల్చిచెప్పడంతో తిరిగి వచ్చాడు. మంగళవారం అంబేడ్కర్‌ భవనం ఎదురుగా ఉన్న చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌ కేసులో 50 మందికి జరిమానా

కరీంనగర్‌ క్రైం: కరీంనగర్‌ పట్టణంలో మద్యం సేవించి, వాహనాలు నడుపుతూ పట్టుబడిన 50 మందిని ట్రాఫిక్‌ సీఐ జి.తిరుమల్‌ మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి వారికి రూ.82,500 జరిమానా విధించారని తెలిపారు.

భూమి విషయంలో గొడవ.. ఇద్దరిపై కేసు

ముస్తాబాద్‌(సిరిసిల్ల): మండలంలోని సేవాలా ల్‌ తండాలో గొడవ పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ధరంసోత్‌ బాల్‌రెడ్డి నాయక్‌, రవి నాయక్‌లు భూమి విషయంలో మంగళవారం గొడవ పడ్డారు. వీరిలో బాల్‌రెడ్డి నాయక్‌ ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితులు పరస్పరం ఫిర్యాదు చేసుకోవడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

కంటివెలుగు శిబిరం ప్రారంభం



సర్పంచ్ వెంకటమ్మకు కంటి పరీక్ష చేస్తున్న వైద్యసిబ్బంది

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ గాజుల వెంకటమ్మ, ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావులు మంగళవారం ప్రారంభించారు. 12రోజుల పాటు నిర్వహించే శిబిరంలో అర్హులందరూ కంటి పరీక్షలు చేసుకోవాలని కోరారు. అనంతరం వైద్య సిబ్బంది సర్పంచ్ వెంకటమ్మకు కంటి పరీక్షలు చేసి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొల్లె రాజ్యలక్ష్మి, సింగిల్‌విండో డైరెక్టర్ గాజుల అంజయ్య, వైద్యురాలు అరుణ, సూపర్‌వైజర్ బాలయ్య, అప్తామాలిస్ట్ పద్మ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్ఎం పద్మ, అమృత తదితరులు పాల్గొన్నారు.

తీగలగుట్టపల్లిలో ప్రిస్కూల్ మేళా



కరీంనగర్‌రూరల్: తీగలగుట్టపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రిస్కూల్ మేళా నిర్వహించారు. పిల్లలను కచ్చితంగా అంగన్‌వాడీ కేంద్రాలను పంపించాలని సూపర్‌వైజర్ నిర్మల కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, తల్లులు, గర్భిణులకు అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం చిన్నారి మాడిశెట్టి హన్సిక జన్మదినం పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ, అంగన్‌వాడీ టీచర్ శ్రీలతతో పాటు తల్లులు పాల్గొన్నారు.

వైండింగ్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి



విద్యానగర్(కరీంనగర్): వైండింగ్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని ఎలక్ట్రికల్ వైండింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కనవేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎలక్ట్రికల్ వైండింగ్ పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారు ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం మెకానిక్ బందు ప్రకటించాలని, ఉచిత హెల్త్ కార్డు, అర్హులైన వారికి ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడార్ల జగదీశ్వరాచారి, అసోసియేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

ఈద్ ప్యాక్‌ల అందజేత



కరీంనగర్‌కల్చరల్: నగరంలోని నిరుపేద ముస్లింలకు మంగళవారం దారుల్ అన్సార్ సొసైటీ ఆధ్వర్యంలో రంజాన్ ఈద్ ప్యాక్‌లు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్, మదర్సా పైజె అబ్రార్ వ్యవస్థాపకుడు హఫీజ్ సయ్యద్ రిజ్వాన్, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్‌అలీ, తెలంగాణ హజ్ కమిటీ సభ్యులు సయ్యద్ ఇర్ఫాన్, ఉలాక్, పీస్ కమిటీ సభ్యుడు అబ్దుల్ గఫార్, నాయకులు హఫీజ్ జునేద్, హఫీజ్ ఆసిఫ్, ఫయాజ్, మానాజీర్, మౌల్వీ మహబూబ్ రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

వంట సామగ్రి పంపిణీ

విద్యానగర్(కరీంనగర్): రంజాన్ పండుగ సందర్భంగా కరీంనగర్‌లోని పేద ముస్లిం కుటుంబాలకు మంగళవారం సామాజిక కార్యకర్త మహ్మద్ అమీర్ వంట సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో పేదల ఆకలి తీర్చేందుకు హైదరాబాద్‌కు చెందిన సామాజిక కార్యకర్త అబ్దుల్ రహమాన్ సహకారంతో బియ్యం, పప్పు, నూనెలు, పిండి తదితర వంట సామగ్రి, మరికొందరికి నగదుతో పాటు దుస్తులు అందజేసినట్లు తెలిపారు.

ఆధ్యాత్మికం

ఎల్లమ్మ జోగు



కరీంనగర్‌లో ఈనెల 25న జరిగే రేణుక ఎల్లమ్మతల్లి బోనాల జాతరలో భాగంగా మంగళవారం రాంనగర్, భాగ్యనగర్ ప్రాంతాల్లో జోగు కార్యక్రమం కొనసాగింది. గౌడ కులస్తులు అమ్మవారి ఉత్సవమూర్తికి పూజలు చేసి జోగు సమర్పించారు. కార్యక్రమంలో కోడూరి తిరుపతిగౌడ్, బత్తిని సత్యం, కోడూరి మహేందర్, గంగారపు సాయిరాం, స్వరాజ్, నాగుల కిరణ్, రవి, శ్రీనివాస్, స్వామి, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు. - కరీంనగర్‌కల్చరల్

చిత్ర కథ





వాకింగ్ ట్రాకా.. వాహనాల ట్రాకా..

కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌పై వాకర్స్ కంటే వాహనాలే ఎక్కువగా తిరుగుతున్నాయి. లక్షలు వెచ్చించి నిర్మించిన ట్రాక్‌పై కార్లు, ద్విచక్రవాహనాలు అడ్డూఅదుపు లేకుండా తిరుగుతుండటంతో వాకర్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాకింగ్ ట్రాక్‌పై వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

భవిత పైనే ధ్యాస

- వేసవి సెలవులను వృథా చేయం
- మరో రెండు రోజుల్లో ముగియనున్న తొమ్మిదో తరగతి పరీక్షలు
- సవరన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో 'సాక్షి' చిట్‌చాట్



సవరన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): వేసవి సెలవులు వస్తున్నాయంటే చిన్నారుల ఆనందానికి హద్దులుండవు. ఎంతో సంతోషంతో గంతులేస్తారు. ఏడాది పాటు పాఠశాలలో పుస్తకాలతో కుస్తీపట్టిన విద్యార్థులు వేసవి సెలవులను తమ భవిష్యత్తుకు ఉపయోగపడేలా వినియోగించుకోవాలని భావిస్తున్నారు. కరీంనగర్ కోతిరాంపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సవరన్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులను మంగళవారం 'సాక్షి' పలకరించింది. ఇంకా రెండు పరీక్షలు మిగిలి ఉన్నాయి. వచ్చే ఏడాది పదో తరగతిలో పదికి పది జీపీఏ గ్రేడ్ సాధించేందుకు సాధన చేస్తామని కొందరు.. పదో తరగతిలో ఆటల క్లాసులు ఉండవు ఈ సమ్మర్ హాలీడేస్‌లోనే ఆడేస్తామని మరికొందరు.. ఇలా ఎవరి తోచిన ఆలోచనలు వారు వెలిబుచ్చారు.

వేసవిలో అందుబాటులో ఉన్న కోర్సులు

వేసవి సెలవుల్లో కంప్యూటర్ కోర్సులు, స్పోకెన్ ఇంగ్లిష్, సబ్జెక్ట్‌ల ట్యూషన్స్, డ్రాయింగ్, ఆర్ట్ క్లాస్‌లు, సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్‌లు, మ్యూజిక్, డ్యాన్స్ క్లాస్‌లతో పాటు ఎన్నో రకాల వాటిని నేర్చుకునేందుకు అందుబాటులో ఉన్నాయి. పదో తరగతి విద్యార్థులకు సబ్జెక్టుకు సంబంధించిన ట్యూషన్‌లను కూడా వాడుకోవచ్చునని అంటున్నారు పలువురు విశ్లేషకులు.

10జీపీఏ కోసం సాధన చేస్తా..



పదో తరగతిలో 10 జీపీఏ కోసం ఇప్పటి నుంచే సాధన ప్రారంభిస్తా. హాలీడేస్‌ను వృథా చేయను. అన్ని సబ్జెక్టులను ఒకసారి చూసుకుంటా. గ్రామర్‌పై దృష్టి పెడుతా. మ్యాథ్స్, సైన్స్‌కు ఎక్కువ సమయం కేటాయిస్తా. - సంతోషిణి

రైటింగ్‌పై దృష్టి పెడుతా..



మా పరీక్షలు మరో రెండు రోజుల్లో ముగియనున్నాయి. వచ్చే ఏడాది పదోతరగతిలో ఎక్కువ మార్కులు సాధించాలంటే హ్యాండ్ రైటింగ్ బాగుండాలి. డబుల్ రూల్, ఫోర్‌రూల్ బుక్స్ తీసుకొని తెలుగు, హిందీ, ఇంగ్లిష్ రైటింగ్ ప్రాక్టీస్ చేస్తా.- అక్షయ

స్విమ్మింగ్‌కు వెళ్తా..



వేసవి సెలవులంటేనే స్విమ్మింగ్. జాగ్రత్తగా స్విమ్మింగ్ చేస్తా. అదే విధంగా ఏదైనా ఒక గేమ్‌లో కోచింగ్ తీసుకొని జాతీయ, రాష్ట్ర పోటీల్లో పాల్గొంటా. అంబేడ్కర్ స్టేడియానికి ప్రతిరోజూ వెళ్లి ప్రాక్టీస్ చేస్తా. - సృజన్

ట్యూషన్‌కు వెళ్తా..



సమ్మర్ హాలీడేస్ వేస్ట్ చేయను. ఎంజాయ్‌తో పాటు ట్యూషన్ క్లాస్‌లకు ప్లాన్ చేసుకుంటా. వచ్చే ఏడాదిలో పదో తరగతిలో మంచి జీపీఏ సాధించేందుకు కృషి చేస్తా. వీక్ ఉన్న సబ్జెక్ట్‌లపై దృష్టి పెడుతా. - చైతన్య

సమ్మర్ క్యాంప్‌లకు వెళ్తా..



వేసవి సెలవులంటేనే సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్‌లు. ఏటా అంబేడ్కర్ స్టేడియంలో మున్సిపల్ శాఖ, జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో పలు క్రీడల్లో కోచింగ్ క్యాంప్‌లు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఏదైన ఒక క్రీడలో కోచింగ్ తీసుకుంటా. - భార్గవ్

ఖోఖోలో శిక్షణ తీసుకుంటా..



నాకు ఖోఖో క్రీడంటే చాలా ఇష్టం. హాలీడేస్‌లో ఖోఖోలో శిక్షణ తీసుకుంటా. పదో తరగతిలో స్టేట్ లెవల్ పోటీల్లో పాల్గొనాలని ఉంది. అదేవిధంగా కొన్ని రోజులు చదువుకుంటా. పదో తరగతిలో మంచి జీపీఏ తెచ్చుకోవాలని ఉంది. - వాజీద్

చిత్ర కథ



క్రీడా మైదానం కరువాయే.. మార్కెట్ యార్డే దిక్కాయే

నగరం క్రమేణా కాంక్రీట్‌మయంగా మారుతుండటంతో భావిపౌరులకు క్రీడా మైదానాలు కరవవుతున్నాయి. రెండు, మూడు మైదానాలు మినహా చెప్పుకోదగ్గ మైదానాలు లేవు. ఈక్రమంలో మూడు లక్షలకు పైగా జనాభా ఉన్న నగరంలో అరకొర ప్రాంతాలను మైదానాలుగా వాడుతున్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డు, మార్క్‌ఫెడ్, హౌసింగ్‌బోర్డు తదితర ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో ఆటలాడుతున్నారు. - కరీంనగర్ అర్బన్

ఆర్చి కూలినా పట్టింపేది..?



కూలిన లక్ష్మీపూర్‌లోని వైకుంఠధామం ఆర్చీ

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపూర్‌లో గల వైకుంఠధామం కమాన్ ఆర్చీ కూలింది. ఐదు నెలల క్రితం ధ్వంసమైన ఈ ఆర్చీకి మరమ్మతులు చేపట్టడంలో గ్రామపంచాయతీ పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోంది. మనిషి చివరి మజిలీని సంతోషంగా నిర్వహించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వైకుంఠధామాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే వైకుంఠధామాల కమాన్ ఆర్చీలను సైతం అందంగా నిర్మించింది. అయితే గ్రామస్థాయి అధికారుల నిర్లక్ష్యం మూలంగా కొన్ని వైకుంఠధామాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. లక్ష్మీపూర్‌లోని వైకుంఠధామం కమాన్ ఆర్చీ కూలడం ఆకతాయిల పనా? లేక కావాలని మందుబాబులు పగలగొట్టారా..? అని తేల్చడంలో పూర్తిగా విఫలమయ్యారు. కనీసం కూలిన ఆర్చీ నిర్మాణ పనులు చేపట్టడమో.. దానికి బాధ్యులెవరని తేల్చేందుకు పోలీసులకు ఫిర్యాదు చేయడం వంటి చర్యలు చేపట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సర్వమతాల పండుగలకు నిలయం తెలంగాణ

- మేయర్ సునీల్‌రావు



కానుకలు అందజేస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌కల్చరల్: సర్వమతాల పండుగలకు నిలయం తెలంగాణ అని మేయర్ సునీల్‌రావు అన్నారు. మంగళవారం 33వ డివిజన్ భగత్‌నగర్‌లోని పెద్దమ్మ ఆలయ సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ పండుగ కానుకలను ముస్లిం మహిళలకు పంపిణీ చేశారు. గతంలో ఏ ప్రభుత్వాలు రాష్ట్రంలో జరిగే పండుగలను గుర్తించి కానుకలు అందించిన దాఖలాలు లేవన్నారు. పండుగలు సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ అన్ని మతాల పండుగలను గౌరవిస్తూ కానుకలు అందించే సంస్కృతిని ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సల్ల శారద రవీందర్, బీఆర్ఎస్ నాయకులు హామీద్, సంజయ్, నాగరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సాహెర్ విందు



విందులో పాల్గొన్న ముస్లింలు

కరీంనగర్ కల్చరల్: జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అష్టద్ అలీ ఆధ్వర్యంలో మంగళవారం సాహెర్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అక్బర్ హుస్సేన్, సుప్రీం జాబిద్, మీర్ షౌకత్ అలీ, మీర్జా అస్మత్ అలీబేగ్, వజిద్, బాబుజానీ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల రక్షణే లక్ష్యం కావాలి



విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేస్తున్న ఉమారాణి

కరీంనగర్‌టౌన్: సమాజంలో ఆడపిల్లలకు భద్రత కరువైందని, ఆడపిల్లల రక్షణే తల్లిదండ్రుల లక్ష్యం కావాలని సీడీపీవో ఉమారాణి అన్నారు. స్వరక్ష డేను పురస్కరించుకొని 28వ డివిజన్ అశోక్‌నగర్-2 అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. స్వరక్ష అంటే సమస్యలు ఎదురైనప్పుడు మనల్ని మనం రక్షించుకోవడమే అన్నారు. సోషల్ మీడియాకు అమ్మాయిలు వ్యసనంగా మారి తప్పుదారి పట్టే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. చివరకు అమ్మాయిలే మోసపోతున్నారని అన్నారు. బాలికలకు మంచి చెడు నేర్పిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో 28వ డివిజన్ కార్పొరేటర్ నాంపెల్లి శ్రీనివాస్, రాజేశ్వరి, వసంత, శైలజ, స్వప్న, పుష్పలత, బూస అహల్య, ఊర్మిల, సుజాత, ఉమ, పద్మ, సరళ, జమున, జ్యోతి, వినోత వీరేందర్ పాల్గొన్నారు.

పల్లెపల్లెకు సీపీఐ కరపత్రం ఆవిష్కరణ

గన్నేరువరం: పల్లె పల్లెకు సీపీఐ, ప్రజల వద్దకు సీపీఐ ప్రజా చైతన్యయాత్ర కరపత్రాన్ని మంగళవారం గన్నేరువరంలో పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ నెల 16 నుంచి ప్రారంభమైన ప్రజాచైతన్య బస్సుయాత్ర 27వ తేదీ వరకు కొనసాగుతుందని, 20న మండల కేంద్రానికి చేరుకుంటుందని తెలిపారు. యాత్రలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద పవన్, గుంటి వేణు, తంగ్రా సదానందం, వెన్నం సురేశ్ పాల్గొంటారని, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సూపర్ టాలెంట్ కిడ్ అవార్డు గ్రహీతకు అభినందన



వరుణ్ అయాన్ష్‌ను అభినందిస్తున్న ప్రసాదరావు

కొత్తపల్లి: ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్ సూపర్ టాలెంట్ కిడ్ అవార్డు అందుకున్న కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ స్కూల్‌కు చెందిన నాల్గో తరగతి విద్యార్థి వరుణ్ అయాన్ష్‌ను మంగళవారం ఆ విద్యా సంస్థల చైర్మన్ డా.ప్రసాదరావు అభినందించారు. ఆఫ్రికా సంగీత వాయిద్యమైన జెంబేపైన వివిధ రకాల రాగాలను లయబద్ధంగా వాయించి అంతర్జాతీయస్థాయిలో అవార్డు సాధించినట్లు తెలిపారు. అవార్డు సాధించిన వరుణ్‌ను పాఠశాల డైరెక్టర్లు రశ్మిత, అనూకర్‌రావు, ప్రసూన, వీయూఎం ప్రసాద్, రాకేశ్, వినోద్‌రావు, పాఠశాల ప్రిన్సిపాల్ సంజయ్ భట్టాచార్య, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, సమన్వయకర్తలు రబీంద్రపాత్రో, హరిప్రియ, సంగీత ఉపాధ్యాయుడు మనిశర్మలు అభినందించారు.

ఉపాధి హామీ పథకం పనులకు ప్రశంసాపత్రాలు



కలెక్టర్ నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో నిర్మించిన తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలు, నిర్వహణ సక్రమంగా ఉండటంతో కరీంనగర్ మండలానికి కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ప్రశంసాపత్రం అందించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధిహామీ పథకంపై నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీవో శోభారాణికి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అదే విధంగా చెర్లభూత్కూర్‌లో వైకుంఠధామం నిర్వహణకు ఉత్తమ ప్రశంసాపత్రాన్ని పంచాయతీ కార్యదర్శి వాహేద్‌కు ఇచ్చారు.

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: విద్యుత్ మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు కొత్తపల్లిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపల్లి మెయిన్ రోడ్, రెడ్డిరాంపల్లి, మార్కెట్ రోడ్, సంఘం చౌరస్తా, అంబేద్కర్‌నగర్, ఇరుకుల్ల కాలనీ, వొడ్డెర కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

వర్షపు నీటిని నిల్వచేయాలి



మానకొండూర్: మండలంలోని సదాశివపల్లి శిశు మందిర్ పాఠశాలలో మంగళవారం నెహ్రూ యువ కేంద్రం కరీంనగర్ ఆధ్వర్యంలో జలశక్తిఅభియాన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు నీటి ఆవశ్యకత గురించి వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించి గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం రాజమౌళి వర్షపు నీరు వృథాకాకుండా ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలన్నారు. అనంతరం నీటి సంరక్షణకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు.

డ్రెయినేజీలు నిర్మించాలి

కరీంనగర్‌టౌన్: 18వ డివిజన్ రేకుర్తి శ్రీరామ్‌నగర్‌కాలనీలోని సోడా ఫ్యాక్టరీ వద్ద డ్రెయినేజీ లేక రోడ్డుపైనే మురుగునీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి బాల్‌రెడ్డి అన్నారు. పై నుంచి వస్తున్న మురుగునీరు పోయేందుకు డ్రెయినేజీ పైపు లేకపోవడంతో ఒకే దగ్గర నీరు చేరుతుందన్నారు. ఈ మురుగునీటిలో దోమలు చేరి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని తెలిపారు. మున్సిపల్ అధికారులు స్పందించి డ్రెయినేజీలు నిర్మించాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శుల నిరసన

సైదాపూర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో రెండో రోజు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిరసన తెలిపారు. ప్రొబేషనరీ పూర్తయిన రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయడం లేదన్నారు.

బంగారు ఇళ్లు ఎక్కడ?

గ్రామాల్లో నాకన్నీ గుడిసెలే కన్పిస్తున్నాయి: సీఎల్పీ నేత భట్టి ఎద్దేవా

- ఒక్క కేసీఆర్ కుటుంబమే బంగారుమయం అయ్యిందని విమర్శ

సాక్షి, పెద్దపల్లి: 'నేను పాదయాత్రలో ప్రతి గ్రామం చూస్తున్నా. ఏ ఒక్క ఇల్లు కూడా బంగారంలా కనిపించడం లేదు. అన్నీ గుడిసెలే కనిపిస్తున్నాయి. మరి సీఎం కేసీఆర్ చెబుతున్న బంగారు ఇళ్లు ఎక్కడున్నాయి? కేసీఆర్ తెలంగాణను బంగారం చేస్తే పేదలు ఇంకా గుడిసెల్లోనే ఎందుకు బతుకుతున్నారు? రాష్ట్రంలో నాలుగు కోట్ల ప్రజలకు చెందాల్సిన సంపదను నలుగురే దోపిడీ చేస్తున్నారు. కేవలం కేసీఆర్ కుటుంబం మాత్రమే బంగారుమయమైంది. ఆయన తన ఇల్లు చూసుకుని రాష్ట్రంలో ప్రతి ఇల్లూ ఇలాగే ఉందని అనుకుంటున్నట్టుంది..'అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా భట్టి చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మంగళవారం పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం, పెద్దపల్లిలో కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు.



మాట్లాడుతున్న భట్టి విక్రమార్క. చిత్రంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి.

రైతులు ఇబ్బందులు పడుతుంటే ఏం చేస్తున్నారు?

ధాన్యం కొనుగోలు విషయంలో రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడుతుంటే ఈ ప్రభుత్వం ఏం చేస్తోందని భట్టి ప్రశ్నించారు. రూ.1.25 లక్షల కోట్లతో నిర్మించిన కాళేశ్వరంతో ఉపయోగం ఏంటో సర్కారు సమాధానం ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించకుండా జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం స్తంభంపల్లి శివారులో కాలుష్య కారకమైన ఇథనాల్ కంపెనీ ఏర్పాటును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బాధితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ఇంకా రేకుల షెడ్లలోనే చదువులు..

రూ.2.90 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న రాష్ట్రంలో విద్యార్థులు ఇంకా రేకుల షెడ్లలో చదవడం ఏంటంటూ.. ధర్మారం మండలం రచ్చపల్లి ప్రాథమిక పాఠశాల దుస్థితిపై భట్టి ప్రభుత్వాన్ని నిలదీశారు. 'మన ఊరు మనబడి'పథకం గొప్పగా తీసుకొచ్చామని ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం పాఠశాలల తరగతి గదుల నిర్మాణాన్ని పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. విద్యాశాఖమంత్రి జిల్లాల్లో పర్యటించి వాస్తవ విషయాలు తెలుసుకుంటే బాగుంటుందని సూచించారు. ఉపాధ్యాయుల కొరతను భర్తీ చేయడానికి వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ వేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలో కొస్తే విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తుందని భట్టి హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయ రమణారావు, డీసీసీ అధ్యక్షులు మక్కాన్‌సింగ్, లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేతల బల ప్రదర్శన

భట్టి పాదయాత్ర పెద్దపల్లి నియోజకవర్గంలోకి ప్రవేశించే పాలితం వద్ద కాంగ్రెస్ నేతలు బలప్రదర్శనకు దిగారు. మొదట విజయ రమణారావు ఆయనకు ఘన స్వాగతం పలకగా, అనంతరం ఓదెల జెడ్పీటీసీ గంట రాములు తన అనుచరులతో కలిసి స్వాగతం పలికే క్రమంలో ఇరువర్గాల కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా తోపులాట చోటు చేసుకోవడంతో భట్టి జోక్యం చేసుకుని వారిని శాంతింపజేశారు.



భట్టి ముందే గొడవకు దిగుతున్న నాయకులు

25న బీఆర్ఎస్ జెండా పండుగ

- 19వేల జనావాసాల్లో ఎగురవేయాలి
- అదే రోజు నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ ప్రతినిధుల సభలు
- పార్టీ పనితీరుపై ఆ సభల్లో చర్చించుకోవాలి: మంత్రి కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అభివృద్ధి, ప్రభుత్వ పరంగా ప్రజలకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ పనితీరుపై ఈ నెల 25న జరిగే నియోజకవర్గ స్థాయి పార్టీ ప్రతినిధుల సభల్లో చర్చించుకోవాలని భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీ రామారావు పిలుపునిచ్చారు. ప్రతినిధుల సభలు పార్టీ నియమించిన ఇన్‌చార్జీలు, స్థానిక ఎమ్మెల్యేల అధ్యక్షతన కొనసాగుతాయని, వాటి నిర్వహణను పార్టీ జిల్లా అధ్యక్షులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో నిర్వహించే కార్యక్రమాలపై పార్టీ శ్రేణులతో కేటీఆర్ మంగళవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. 25న రాష్ట్ర వ్యాప్తంగా 19 వేల జనావాసాల్లో బీఆర్ఎస్ జెండా ఎగరాలని, అన్ని నియోజకవర్గాల్లో గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ఉదయం పూట పండుగ వాతావరణంలో పార్టీ జెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. గ్రామ, వార్డు స్థాయిలో జెండా పండుగ ముగిసిన తర్వాత ఉదయం 10 గంటలకు నియోజకవర్గ కేంద్రాలకు చేరుకుని ప్రతినిధుల సభకు హాజరుకావాలన్నారు.

సమ్మేళనాల నివేదిక ఎప్పటికప్పుడు కేసీఆర్‌కు చేరుతోంది

ఎమ్మెల్సీ మధుసూదనాచారి ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమాల అమలు కమిటీ ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణ తీరుతెన్నులపై పార్టీ అధ్యక్షుడు, సీఎం కె.చంద్రశేఖర్‌రావుకు ఎప్పటికప్పుడు నివేదికలు అందిస్తోందని కేటీఆర్ వెల్లడించారు. కాగా, ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేసిన నేతలను కేటీ రామారావు ఈ సందర్భంగా అభినందించారు.

కనీసం 3 వేల మందితో ప్రతినిధుల సభ

కనీసం 3 వేల నుంచి 3500 మంది ప్రతినిధులతో ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో సభ నిర్వహించాలని పార్టీ ఇన్‌చార్జీలు, ఎమ్మెల్యేలకు సూచించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తలు తీసుకోవాలనీ, సమావేశాలకు హాజరయ్యే పార్టీ ప్రతినిధులకు భోజనాలు, ఇతర వసతులను సమకూర్చాలని కోరారు. అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని బీఆర్ఎస్ గ్రామ, వార్డు శాఖల అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్ విండో చైర్మన్లు, మార్కెట్ కమిటీల డైరెక్టర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జెడ్పీ చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మేయర్లు, పురపాలక సంఘాల చైర్‌పర్సన్లను ఆహ్వానించాలన్నారు. వీరితో పాటు పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్లు, నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జెడ్పీ చైర్మన్లు, పార్టీ సీనియర్ నేతలు హాజరయ్యేలా సమన్వయం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జీలను ఆదేశించారు.

క్లుప్తంగా...

విప్లవోద్యమం సజీవంగా ఉంటుంది

సీపీఐ(ఎంఎల్) జనశక్తి అగ్రనేత కూర రాజన్న

సిరిసిల్ల/చంచల్‌గూడ: తెలంగాణలో ప్రస్తుతం విప్లవోద్యమం బలహీనపడినా.. అది నిరంతరం సజీవంగానే ఉంటుందని, అది మళ్లీ ఎగసిపడుతుందని సీపీఐ(ఎంఎల్) జనశక్తి అగ్రనేత కూర రాజన్న అలియాస్ రాజేందర్ అన్నారు. ఈ ప్రమాదాన్ని గుర్తించే రాజ్యం తమను వెంటాడుతోందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన ఓ హత్య కేసులో అరెస్టయిన రాజన్న కొన్ని నెలలుగా చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో జైలు నుంచి విడుదలయ్యారు. అనంతరం ఆయన సిరిసిల్లలో మీడియాతో మాట్లాడుతూ.. దిద్దుబాటు కేంద్రాలుగా ఉండాల్సిన జైలులో మానహక్కుల హననం జరుగుతోందన్నారు. అండర్ ట్రయల్‌లో ఉన్న వారికి అనారోగ్య సమస్యలు వస్తే, ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి చూపించే పరిస్థితి లేదన్నారు. సమావేశంలో రాజన్న సోదరుడు కూర దేవేందర్ అలియాస్ అమర్, విమలక్క తదితరులు పాల్గొన్నారు. కాగా, సుద్దాల మాజీ సర్పంచ్ ఏనుగు వేణుగోపాల్‌రావు అలియాస్ ప్రభాకర్‌రావు హత్య కేసులో నిందితుడిగా ఉన్న విశ్వనాథ్‌కు బెయిల్ ఇచ్చేందుకు జిల్లా కోర్టు నిరాకరించింది. దీంతో ఆయనను సిరిసిల్ల నుంచి మళ్లీ జైలుకు తీసుకెళ్లారు.

నకిలీ బిల్లులపై విచారణ

ఖమ్మం వినాయక ఆస్పత్రిలో తనిఖీ

ఖమ్మం వైద్యవిభాగం: సీఎం సహాయనిధి నుంచి పరిహారం పొందేందుకు వైద్యం చేయకుండానే.. చేసినట్లు తప్పుడు బిల్లులు ఇచ్చారనే ఆరోపణలతో ఖమ్మంలోని శ్రీ వినాయక సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో హైదరాబాద్ పోలీసులు తనిఖీలు చేట్టారు. సచివాలయం ఉద్యోగి డీఎస్ఎన్ మూర్తి ఇచ్చిన ఫిర్యాదుతో ఆస్పత్రి నిర్వాహకులతోపాటు బిల్లులు సమర్పించిన శివపై హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం సీసీఎస్ సీఐ మల్లికార్జున్ ఆధ్వర్యాన పోలీసులతోపాటు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాంబాబు తనిఖీలు చేపట్టారు. నల్లగొండ జిల్లా చలకుర్తికి చెందిన రమావత్ శివ ఈ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నట్లు నకిలీ పత్రాలు సృష్టించి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.1,55,854 బిల్లు తీసుకున్నాడు. ఆయన వినాయక ఆస్పత్రిలో జనరల్ ఫిజీషియన్ రమేష్ వద్ద వైద్యం చేయించుకున్నట్లు బిల్లుల్లో ఉంది. అయితే, అలాంటి వైద్యుడెవరూ తమ వద్ద లేరని నిర్వాహకులు చెప్పడంతో పోలీసులు రికార్డులు తనిఖీ చేశారు.

అటవీభూమిలో చట్టవిరుద్ధంగా ఈద్గా నిర్మాణం

- ఆ స్థలాన్ని ఒకేషనల్ సెంటర్‌కు కేంద్రం కేటాయించిందన్న బండి సంజయ్
- చర్యలు చేపట్టాలని సీఎం కేసీఆర్‌కు లేఖ



సాక్షి, హైదరాబాద్/నిర్మల్: నిర్మల్ జిల్లా చించోలి(బి) పరిధిలోని సర్వేనంబర్లు 543, 544, 969లో ఉన్న అటవీభూమిని చట్టవిరుద్ధంగా ఈద్గాకు కేటాయించి నిర్మాణం చేపట్టారని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సీఎం కేసీఆర్‌కు మంగళవారం లేఖ రాశారు. వృత్తి విద్యానైపుణ్యాల అభివృద్ధి కేంద్రం కోసం ఇవ్వాలని గతంలో రాష్ట్రప్రభుత్వం చేసిన అభ్యర్థన మేరకు 3.373 హెక్టార్ల అటవీభూమిని కేంద్రప్రభుత్వం కేటాయించిందని లేఖలో పేర్కొన్నారు. అటవీభూములను సైతం డీనోటిఫై చేసిందే నిరుద్యోగుల భవిష్యత్తు కోసమని, అలాంటి భూమిని స్వార్థరాజకీయాల కోసం ఈద్గాకు కేటాయించడం చట్టవిరుద్ధమన్నారు. ప్రజాఉపయోగ కార్యక్రమాల కోసం ఉపయోగించాల్సిన భూములను ప్రార్థనాస్థలాలకు కేటాయించడానికి వీల్లేదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. కోర్టుతీర్పులకు వ్యతిరేకంగా ఈద్గాను నిర్మించడమంటే న్యాయవ్యవస్థను అవమానించినట్లేనన్నారు. ఈద్గా నిర్మాణానికి దగ్గరలోనే రెండు హిందూ ఆలయాలున్నా పట్టించుకోలేదని ఆరోపించారు. నిరుద్యోగుల కోసం కేటాయించిన భూమిని ప్రార్థనాస్థలాలకు ఇవ్వడంతోపాటు ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. రాజకీయ స్వార్థప్రయోజనాల కోసం యువత భవిష్యత్తును బలిచేసే చర్యలను బీజేపీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వృత్తివిద్య, నైపుణ్యాల అభివృద్ధి కోసం కేటాయించిన భూమిని అదే ప్రయోజనాల కోసం వినియోగించాలని, లేనిపక్షంలో కోర్టును ఆశ్రయించడంతోపాటు ఆందోళనలకూ సిద్ధమవుతామని సంజయ్ హెచ్చరించారు.

నిబంధనల ప్రకారమే 'ఈద్గా'

సీఎంకు బండి సంజయ్ లేఖ రాయడాన్ని ఖండించిన మంత్రులు



ఈద్గాను ప్రారంభిస్తున్న మంత్రులు మహమూద్ అలీ, ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్/సారంగపూర్: నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం చించోలి(బి) అటవీప్రాంతంలో నిబంధనల ప్రకారమే ఈద్గాను నిర్మించారని హోంమంత్రి మహమూద్ అలీ తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని అటవీప్రాంతంలో పదెకరాల్లో రూ.5 కోట్లతో నిర్మించిన ఈద్గాను మంగళవారం సాయంత్రం మంత్రులు మహమూద్ అలీ, ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం హోంమంత్రి మాట్లాడుతూ.. ఈద్గాపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సీఎంకు లేఖ రాయడాన్ని ఖండించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హిందూ ముస్లింలను సమానంగా చూస్తూ గంగాజమునా తెహజీబ్‌ను కాపాడుతున్నారని తెలిపారు. అయితే.. చించోలి(బి) సమీపంలోని పదెకరాల స్థలం ఒకేషనల్ సెంటర్ కోసం ఇచ్చిందేనని, కానీ నిబంధనల ప్రకారమే ఈద్గాకు తీసుకున్నామని అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. చెట్లు తీసేసినందుకు రూ.82 లక్షలు అటవీశాఖకు చెల్లించామన్నారు. ఈ స్థలానికి బదులుగా ముథోల్ నియోజకవర్గంలో అటవీశాఖకు 20 ఎకరాలు కేటాయించామని వివరించారు. ఒకేషనల్ సెంటర్ పనులనూ చేపడతామని ప్రకటించారు.

ఇది యావత్ తెలుగు విద్యార్థులపై కుట్ర

- నా యూట్యూబ్ చానల్ హ్యాక్ చేశారు
- సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకురాలు బాల లత



పంజగుట్ట (హైదరాబాద్): తన యూట్యూబ్ చానల్‌ను హ్యాక్ చేయడం యావత్ తెలుగు విద్యార్థులపై జరిగిన కుట్ర అని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకురాలు బాల లత స్పష్టం చేశారు. ఆమె మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ... గత ఆదివారం తెల్లవారుజామున తన యూట్యూబ్ చానల్ హ్యాక్ అయినట్లు గుర్తించానన్నారు. తాను రెండు సార్లు సివిల్ సర్వీసులకు ఎంపికయ్యానని, కానీ విద్యార్థులు, నిరుద్యోగులకు ఏదైనా చేయాలనే లక్ష్యంతో యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించానని వివరించారు. వారికి ప్రేరణ కలిగిస్తూ, పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో వీడియోలు చేసి అప్‌లోడ్ చేస్తున్నానని తెలిపారు. ఎంతోమంది గ్రామీణ విద్యార్థులు, మహిళలు, దివ్యాంగులు, హైదరాబాద్‌కు వచ్చి చదువుకోలేని వారికి, తెలుగులో తాను చేసిన వీడియోలు ఎంతగానో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. తన యూట్యూబ్ చానల్‌లో ఐదు లక్షల మంది వీక్షకులున్నారని తెలిపారు. తన వీడియోలు చూసి ప్రేరణ పొందిన ఎంతోమంది ఉద్యోగాలకు ఎంపికై నట్టు చెప్పారు. మే 25న సివిల్ సర్వీసెస్ పరీక్షలు, జూన్‌లో యూపీఎస్సీ పరీక్షలున్న నేపథ్యంలో.. ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని వేలాదిమంది ఫోన్ చేసి అడుగుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. హ్యాక్ చేయడమే కాకుండా అందులో గేమింగ్ వీడియోలు పెడుతున్నారని, ఏదైనా తప్పుడు సమాచారం పెడితే విద్యార్థుల భవిష్యత్ ఏమవుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఇప్పటికే సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. కేసును త్వరగా పరిష్కరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అప్పటివరకు విద్యార్థులు నిరాశకు గురికాకుండా వారికి ప్రేరణ, పోటీ పరీక్షలకు అవసరమైన సమాచారం ఇచ్చేందుకు 'BALA LATHA OFFICIAL'అనే కొత్త యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

మోదీ బాబా 39 మంది దొంగలు..!



పాదయాత్ర చేస్తున్న నారాయణ, నాయకులు

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- తాండూర్‌లో ప్రజాపోరు యాత్ర షురూ

బెల్లంపల్లి/తాండూర్: ఒకప్పుడు ఆలీబాబా 40 దొంగలు అన్న చరిత్ర చదివాం.. కానీ ప్రస్తుతం దేశంలో మోదీ బాబా 39 దొంగలు ఉన్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే.నారాయణ తీవ్రంగా విమర్శించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు యాత్రను తాండూర్ మండల కేంద్రంలో ఆయన ప్రారంభించారు. కిష్టంపేట శివారు సుమంగళి ఫంక్షన్ హాల్ నుంచి ప్రారంభమైన యాత్ర ఐబీ అంగడి వద్ద ఏర్పాటు చేసిన సభాస్థలి వరకు మూడు కిలోమీటర్లు సాగింది. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సాగిస్తున్న మతోన్మాద చర్యలపై తీవ్రంగా మండిపడ్డారు. రౌడీలందరినీ ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా కాల్చిచంపుతోందని ఆరోపించారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను అమలు చేయకుండా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఆ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మతోన్మాద బీజేపీకి వ్యతిరేకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పోరాటం సాగించడం మంచిదేనని అన్నారు. బీజేపీతో పోరాడుతున్నానని చెప్పుకుంటున్న సీఎం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, దళిత బంధు, ఎస్సీ, ఎస్టీల స్వయం ఉపాధికి 40 శాతం సబ్సిడీ ఇస్తానని ప్రకటించిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. బీజేపీకి వ్యతిరేకంగా సీఎం ఒక్కరే పోరాడితే సరిపోదని, అందరూ కలిసి కట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయి నుంచి బీజేపీ వ్యతిరేకతకు ఐక్యత రావాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను సీపీఐ ప్రజాపోరు యాత్రలో ప్రజలకు వివరించి చైతన్యపరుస్తామని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం ప్రైవేటీకరిస్తూ కార్మికవర్గాన్ని రోడ్డుపాలు చేస్తోందని, ఉపాధి హామీ పథకం నిర్వీర్యానికి కుట్ర సాగిస్తోందని విమర్శించారు. ప్రజానాట్యమండలి కళాకారుల పాటలు ఉత్తేజ పరిచాయి. రెడ్‌షర్ట్స్ వాలంటీర్లు, ఎరుపు రంగు చీరలు ధరించిన మహిళలు ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణ నిలిచారు. భారీగా జన సమీకరణలో నాయకులు విజయవంతం అయ్యారు. యాత్రలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, కుమురంభీం, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల సీపీఐ కార్యదర్శులు బద్రి సత్యనారాయణ, ఎస్.విలాస్, ముడుపు ప్రభాకర్‌రెడ్డి, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్, మహిళా నాయకురాలు బి.పూర్ణిమ, నాయకులు చిప్ప నర్సయ్య, ఎం.వెంకటస్వామి, దాగం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో రాత్రి బస

ప్రజా పోరుయాత్ర చేపట్టిన సీపీఐ శ్రేణులు మంగళవారం రాత్రి స్థానికంగానే బస చేశారు. బుధవారం ఉదయం తాండూర్ మండలం బోయపల్లి గ్రామం నుంచి ప్రారంభిస్తారు. రెండో రోజు ఐబీ, తాండూర్, కిష్టంపేట, తంగళ్లపల్లి ప్రాంతాల్లో పోరు యాత్ర సాగుతుంది.

నిలువెల్లా నిర్లక్ష్యమే!

- గర్భిణులను పట్టించుకోని డాక్టర్లు
- వైద్యసేవలు, సర్జరీల్లోనూ అశ్రద్ధ
- ప్రాణాలు పోతున్నా స్పందించని వైనం
- ప్రభుత్వ వైద్యుల తీరుపై విమర్శలు



జగిత్యాల జిల్లా కేంద్రంలోని మాతాశిశు సంక్షేమ ఆస్పత్రి

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసేవలు అందించడంలో కొందరు వైద్యులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. జిల్లాలోని కొడిమ్యాల మండల నమిలికొండకు చెందిన నవ్యశ్రీకి ఏడాది క్రితం సిజేరియన్ చేసిన డాక్టర్లు.. ఆమె కడుపులోనే కర్చీఫ్ మర్చిపోవడం, వారం క్రితం ఆపరేషన్ చేసి కర్చీఫ్‌తోపాటు ఇన్ఫెక్షన్ గడ్డను తొలగించడం వైద్యుల తీరుకు అద్దంపడుతోంది.

నిర్లక్ష్యానికి నిదర్శనాలివి..

- జగిత్యాలకు చెందిన గర్భిణి మహాలక్ష్మి ఫిబ్రవరి నెల 3న స్థానిక మాతాశిశు సంక్షేమ ఆస్పత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. సిజేరియన్ చేసిన వైద్యులు ఆ తర్వాత కుట్లు వేశారు. వారం తర్వాత కుట్లు వికటించాయి. ఆమె ఇన్ఫెక్షన్ కావడంతో మళ్లీ కుట్లు వేయగా, పేషెంట్ తీవ్ర అస్వస్థతకుగురైంది.
- గతంలోనూ ఓ గర్భిణికి సిజేరియన్ చేసిన డాక్టర్లు.. కడుపులోనే గుడ్డపెట్టి కుట్లు వేశారు. అది ఇన్ఫెక్షన్ కావడంతో ఆ మహిళ మృతి చెందింది.
- వైద్యుల నిర్లక్ష్యమో, సిజేరియన్లు వికటించడమో తెలియదు కానీ, గతంలో ఐదుగురు బాలింతలు మృతిచెందారు.
- తాజాగా కొడిమ్యాల మండలం నమిలికొండకు చెందిన నవ్యశ్రీ ఘటన వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది.
- తరచూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడంతో ఈ ఆస్పత్రిలో పురుడు పోసుకునేందుకు గర్భిణులు భయపడుతున్నారు.

వైద్య పరికరాలపైనా అంతే..

సిజేరియన్ అనంతరం సర్జరీకి వినియోగించిన వైద్య పరికరాలను స్టెరిలైజ్ చేయాలని అధికారులు సూచిస్తున్నారు. కానీ, ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీనికితోడు ఆపరేషన్ చేసేసమయంలో వైద్యులు జాగ్రత్తలు తీసుకోడం లేదనే విమర్శలు ఉన్నాయి.

తగ్గిన ప్రసవాలు..

మాతా శిశు సంక్షేమ కేంద్రంలో నెలకు సుమారు 400 వరకు ప్రసవాలు జరిగేవి. ప్రస్తుతం 200కు మించి ప్రసవాలు జరగడంలేదని రికార్డులు చెబుతున్నాయి. ఇందుకు వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యమా? లేక మరేదైనా ఉందా? అనే అనుమానలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు.. ప్రసవాల కోసం చాలామంది గర్భిణులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న ప్రైవేట్ డాక్టర్లు.. అవసరం లేకున్నా సిజేరియన్లు చేస్తున్నారని బాధితులు పేర్కొంటున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో 75 శాతం సిజేరియన్లు జరుగుతున్నాయని ఓ నివేదికలో తేలడంతో కలెక్టర్ యాస్మిన్‌బాషా వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలు మెరుగుపర్చడమే కాదు.. వైద్యులు, సిబ్బంది తీరులోనూ మార్పు రావాలని జిల్లావాసులు కోరుతున్నారు.

కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- కారు దగ్ధం.. డ్రైవర్‌కు స్వల్పగాయాలు
- తప్పిన ప్రాణాపాయం



దగ్ధమవుతున్న కారు

కెరమెరి(ఆసిఫాబాద్): కుమురంభీం జిల్లా కెరమెరి మండలంలోని ఘాట్‌పై మంగళవారం ఆర్టీసీ బస్సు కారును ఢీకొన్న ఘటనలో తృటిలో ప్రాణాపాయం తప్పింది. ఎస్సై నల్లా వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం ఆసిఫాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆదిలాబాద్ నుంచి ఆసిఫాబాద్‌కు బయలుదేరింది. ఆసిఫాబాద్‌కు చెందిన శ్రీనివాస్ కారులో ఆదిలాబాద్‌కు వెళ్తుండగా కెరమెరి ఘాట్ వద్దకు వెళ్లగానే మూలమలుపు వద్ద అతివేగంగా వచ్చిన బస్సు ఢీకొట్టింది. దీంతో కారులోంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో శ్రీనివాస్ సమయ స్ఫూర్తితో బయటకు దూకాడు. దీంతో తలకు తీవ్రగాయాలు కాగా ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. క్షతగాత్రున్ని 108లో ఉట్నూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందడంతో ఆసిఫాబాద్ నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పినప్పటికీ అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. బస్సు డ్రైవర్ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాసర ఆలయాన్ని పరిశీలించిన ఏడీసీ



బాసర స్నానఘట్టాల వద్ద దేవాదాయశాఖ అదనపు కమిషనర్ కృష్ణవేణి

భైంసా: నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞానసరస్వతీ అమ్మవారి ఆలయాన్ని దేవాదాయశాఖ అదనపు కమిషనర్ కృష్ణవేణి మంగళవారం పరిశీలించారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఏడీసీకి ఈవో విజయరామారావు స్వాగతం పలికారు. అనంతరం సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. తర్వాత ఆలయంలో చేపట్టబోయే పనులపై చర్చించారు. దేవాదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాసరకు వచ్చినట్లు వెల్లడించారు. మాస్టర్‌ప్లాన్, బాలాలయం ఏర్పాట్లు ఇతర పనులపై చర్చించారు. అనంతరం గోదావరి స్నాన ఘట్టాలను పరిశీలించారు. వేసవిలో వచ్చే ఇబ్బందుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గోదావరినదిలో నీరు తగ్గుతున్నందున భక్తుల కోసం స్నానఘట్టాల వద్ద వాటర్ షవర్లు ఏర్పాటు చేసినట్లు ఈవో విజయరామారావు తెలిపారు. బాసర ఆలయాన్ని నూతన హంగులతో నిర్మించేందుకు జరుగుతున్న ఏర్పాట్లు ఇతర విషయాలపై ఏడీసీ కృష్ణవేణి చర్చించారు.

జేబీసీసీఐ సమావేశం వాయిదా

- వేతన పెరుగుదలపై లిఖిత పూర్వక హామీకి పట్టు
- తిరిగి వచ్చే నెల సమావేశం కావాలని నిర్ణయం



సమావేశంలో పాల్గొన్న జాతీయ సంఘాల నాయకులు

గోదావరిఖని: కనీస వేతన పెరుగుదల 19 శాతం ఒప్పుకున్నప్పటికీ లిఖిత పూర్వకంగా ఇవ్వాలని జాతీయ కార్మిక సంఘాలు పట్టుబట్టాయి. మంగళవారం కోల్‌కత్తాలో జరిగిన జేబీసీసీఐ 11వేజ్‌బోర్డు 9వ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. కనీస వేతన ఒప్పందంపై కోలిండియా చైర్మన్ ప్రమోద్ అగర్వాల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆమోదంతోనే 19శాతం పెంచేందుకు ఒప్పుకున్నామని, కొన్ని నిబంధనల కారణంగా జాప్యం జరిగిందని, త్వరలో స్పష్టత ఇస్తామని వెల్లడించారు. ఇంక్రిమెంట్ రేట్ మూడు శాతం పాతదే కొనసాగుతుందని, కోల్‌పిల్లర్ స్ప్రా మూడుశాతం గతంలో లాగే ఉంటుందని పేర్కొన్నారు. ఓవర్ టైం సీలింగ్ ఎత్తివేయాలనే డిమాండ్‌పై సుదీర్ఘమైన చర్చ జరిగింది. దీనిపై నిర్ణయం తీసుకోకుండా పెండింగ్‌లో పెట్టారు. జీతం చెల్లింపు రూ.పదికి రౌండింగ్ చేయటానికి నిర్ణయం జరిగింది. రూ.ఐదు కంటే తక్కువగా ఉంటే దిగువ స్థాయికి.. రూ.ఐదు కంటే ఎక్కువగా ఉంటే ఎగువ స్థాయికి సరిచేస్తారని, డీఏ 100శాతం న్యూట్రలైజేషన్ చేస్తారని పేర్కొన్నారు. అండర్ గ్రౌండ్ అలవెన్స్‌ను యాజమాన్యం 9 శాతానికి ఎలాంటి ఫ్రీజింగ్ లేకుండా ఇచ్చేందుకు అంగీకరించగా.. కార్మిక సంఘాలు 10శాతం ఇవ్వాలంటే ఫ్రీజింగ్ పెడతామని చెప్పడంపై యూనియన్లు వ్యతిరేకించాయి. నైట్‌షిఫ్ట్ అలవెన్స్ రోజుకు రూ.50 అమలు చేయనున్నట్లు వెల్లడించారు. చార్జి అలవెన్స్ ప్రస్తుతానికి యథాతథంగా కొనసాగనుంది. కొన్ని డిమాండ్లపై స్టాండడేషన్ కమిటీలో నిర్ణయించి ఒప్పందం చేసుకుంటారు. పారామెడికల్ సిబ్బంది నర్సింగ్ అలవెన్స్ రూ.500 ఇచ్చేందుకు ఒప్పందం కుదిరిందన్నారు. అలవెన్స్‌లు, లీవులు, ఎల్టీసీ, ఎల్ఎల్‌టీసీ, డిపెండెంట్ ఎంప్లాయ్‌మెంట్, కాంట్రాక్ట్ కార్మికుల జీతభత్యాలు ఇతర అంశాలు, 30శాతం రిటైర్మెంట్ బెనిఫిట్స్, దిగిపోయిన కార్మికుల మెడికల్ స్కీం, పెన్షన్ స్కీం తదితర పెండింగ్ అంశాలన్నీ తదుపరి సమావేశంలో చర్చించేందుకు వచ్చేనెలకు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. వేజ్‌బోర్డు సభ్యులు సీతారామయ్య, జనక్ ప్రసాద్, మంద నర్సింహారావు, ఆల్టర్‌నేటివ్ వేజ్ బోర్డు సభ్యులు రియాజ్‌అహ్మద్ పాల్గొన్నారు.



చేనేత సంతలో వీవర్స్ స్టాల్స్

చేనేతకు చేరువలో..

చేనేతకారులకు సాయం చేయాలనే ఆలోచనతో ఎగ్జిబిషన్స్ పెట్టి, ఆ పేరుతో పవర్‌లూమ్స్ అమ్ముతుంటారు. దీనివల్ల చేనేతకారులకు అన్యాయం జరుగుతుంటుంది. ఈ సమస్యల గురించి తెలిసి, ఆరేళ్ల నుంచి చేనేత సంత పేరుతో యాభై ఎగ్జిబిషన్స్ ఏర్పాటు చేసి, వీవర్స్‌కు సాయం చేస్తోంది హైదరాబాద్ విద్యానగర్‌లో ఉంటున్న సరస్వతి కవుల. వ్యవసాయం మీద ఉన్న ప్రేమతో యాచారం దగ్గర నందివనపర్తిలో రైతుగానూ తన సేవలను అందిస్తున్నారు. పర్యావరణ ఉద్యమకారిణిగానూ పనిచేసే సరస్వతి చేనేతకారుల సమస్యలు, వారికి అందించాల్సిన తోడ్పాటు గురించి వివరించారు.



సరస్వతి కవుల

''ప్రభుత్వాలు పవర్‌లూమ్‌నే ప్రమోట్ చేస్తున్నంత కాలం చేనేతకారుల వెతలు తీరవని ఇన్నాళ్లుగా వాళ్లతో నేను చేసిన ప్రయాణం వల్ల అర్థమైంది. దాదాపు పదిహేనేళ్లుగా వ్యవసాయం, చేనేతకారులకు సంబంధించిన విషయాలపై స్టడీ చేస్తూనే ఉన్నాను. మొదట్లో పర్యావరణానికి సంబంధించిన డాక్యుమెంటరీలు చేసేదాన్ని. అప్పట్లో రసాయన మందులతో వ్యవసాయం చేసే రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్టే చేనేతకారులు కూడా అదేబాట పట్టారు. కుటుంబం అంతా కలిసి చేసే హస్తకళల్లోకి చాపకింద నీరులాగ పెద్ద కంపెనీలు వచ్చి చేరుతున్నాయి. దీనివల్లే వీవర్స్‌కి సమస్యలు వచ్చాయి. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్‌కు ఉన్న గ్యారంటీ చేనేతకారుల ఉత్పత్తులకు మార్కెట్ ఉండదు. ఇంకా హ్యాండ్లూమ్ బతికుంది అంటే మన చేనేతకారుల పట్టుదల వల్లనే. సమాజంలో బాధ్యతగలవారిగా మనమే వారికి సపోర్ట్‌గా నిలవాలి. ఇప్పటికే చేనేతకారులు వారి పిల్లలకు తమ వారసత్వ విద్యను నేర్పించడం లేదు. పెద్ద చదువులు, కంపెనీల్లో ఉద్యోగాలు అంటూ పంపిస్తున్నారు. దీంతో నేతపని రోజురోజుకూ కుంటుపడుతుంది. మనదేశంలో నైపుణ్యాలు కల కళాకారులు ఉన్నారు. కానీ, పెద్ద పెద్ద టెక్స్‌టైల్ పరిశ్రమలు వస్తాయి. వాటికి రాయితీలు పెద్దఎత్తున ఉంటాయి. కానీ, వీవర్స్‌కి ఇవ్వచ్చు. పాలిస్టర్ దారానికి సబ్సిడీ ఉంటుంది, కాటన్‌కి టాక్స్ పెంచుతారు. కరోనా సమయంలో వీవర్స్ చాలా దెబ్బతిన్నారు. సేల్స్ తగ్గిపోయి, పూట గడవడమే కష్టపడిన సందర్భాలున్నాయి.

■ దిగులును చూశాను..

మొదట్లో రూరల్ ఇండియాకు సంబంధించి డాక్యుమెంటరీ ఫిల్మ్స్ చేస్తుండేదాన్ని. వ్యవసాయదారులతోనూ చేసేదాన్ని. ఎన్జీవోలతో కలిసి చేనేతకారులకు సపోర్ట్ చేసేదాన్ని. వాళ్లకు సపోర్ట్ చేసే సంస్థ మూతపడినప్పుడు ఏం చేయాలో తోచక దిగాలు పడటం చూశాను. డైరెక్ట్ మార్కెటింగ్ ఉంటే వారు తయారు చేసినదానికి సరైన ధర వస్తుంది.దానివల్ల ఆ వస్తువు తయారీదారునికి, కొనుగోలు దారికీ నేరుగా లాభం కలుగుతుంది. ఈ ఆలోచన వచ్చినప్పుడు చేనేతకారులకు డైరెక్ట్ మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలనుకున్నాను. కానీ, కొన్నాళ్లు నేనది చేయలేకపోయాను. కొంతమంది చేనేతకారుల దగ్గరకు వచ్చి ఎలాంటి సాయం కావాలి అని అడిగేవారు. వాళ్లు 'మా సరుకును కొనండి చాలు, మాకేం చేయద్దు' అనేవారు. ఇవన్నీ చూశాక మా ఫ్రెండ్స్‌తో కలిసి చర్చించాను. వారు కొంత ఆర్థిక సహాయం చేస్తామన్నారు. అప్పుడు హైదరాబాద్‌లో కమ్యూనిటీ హాల్స్ లాంటి చోట్ల ఎగ్జిబిషన్స్ ఏర్పాటు చేశాం. 2015 నుంచి 2017 వరకు ఫ్రెండ్స్ సాయం చేశారు. ఆ తర్వాత సేల్స్ నుంచి 2 శాతం ఇవ్వాలని చేనేతకారులకు చెప్పాం. ఇప్పుడు వారికి వచ్చిన దాంట్లో 5 శాతం ఇస్తున్నారు. పెద్ద పెద్ద హాల్స్ తీసుకొని పెట్టాలంటే ఆ హాల్స్‌కి అమౌంట్ కట్టాలి. దానివల్ల మళ్లీ వీవర్ తన వస్తువుల ధర పెంచాలి. అది కూడా మళ్లీ ధర పెరిగినట్టే కదా! అందుకే, తక్కువ ఖర్చుతో పూర్తయ్యే సంతలను ఏర్పాటు చేస్తున్నాం. స్వయంసమృద్ధిగా ఉంటే ఏ సమస్యలూ ఉండవు. ఇప్పుడైతే ప్రయాణ ఖర్చులూ పెరుగుతున్నాయి. మెటీరియల్ తీసుకొని, రైళ్లలో రావాల్సి ఉంటుంది. అలా వచ్చే ఖర్చు కూడా గతంలో వందల్లో ఉంటే, ఇప్పుడు వేలకు చేరింది. అందుకే, వసతి సదుపాయాలకు ఖర్చు పెట్టాల్సిన అవసరం రాకుండా చూస్తుంటాం. అందుకు ఇప్పటికీ సాయం చేసేవారున్నారు.

> **మద్దతు ముఖ్యం**
>
> క్రమం తప్పకుండా ఇలాంటి సంతలను ఏర్పాటు చేయడం వల్ల వినియోగదారులకు సులువుగా అర్థమైపోతుంది ఫలానాచోట హ్యాండ్లూమ్స్ లభిస్తాయి అని. దీనికి డిజిటల్ మీడియా వేదికగా ప్రమోట్ చేస్తున్నాం. ఈ నెల వరకు 50 చేనేత సంతలు ఏర్పాటుచేశాం. ఇక ముందు కూడా ఎన్ని వీలైతే అన్ని చేద్దామనుకుంటున్నాను. మనవంతు సాయంగా సపోర్ట్ చేయగలిగితే సరిపోతుంది. ఇది ఒక వాలంటీర్‌గా చేసే సాయం.

■ అన్ని చేనేతలు ఒక దగ్గర

ఆరేళ్ల క్రితం రెండు–మూడు స్టాల్స్‌తో ఎగ్జిబిషన్ మొదలుపెట్టాం. తర్వాత కొంతమందిని నేరుగా కలిసి చెబితే, కొంతమందికి నోటిమాట ద్వారా తెలిసి వచ్చారు. ఇప్పుడు 25 నుంచి 30 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. చిన్న వీవర్ ఎవరైతే ఉన్నారో ముఖ్యంగా వారు రావాలనుకుంటాం. అందుకు చాలా ప్రయత్నం చేశాం. మాస్టర్ వీవర్స్, కో ఆపరేటివ్ సొసైటీ, తూర్పుగోదావరి నుంచి మోరీ సొసైటీ, ఇంకొంతమంది ఇండివిడ్యువల్ వీవర్స్ ఉన్నారు. పొందూరు, పెన్‌కలంకారీ, కలంకారీ, గుంటూరు, చీరాల, మంగళగిరి, వెంకటగిరి, ఒరిస్సా నుంచి కూడా చేనేతకారులు తమ ఉత్పత్తులతో వస్తుంటారు. వరంగల్ నుంచి మ్యాట్స్, చందేరీ, కర్నాటక నుంచి ఇల్‌కల్ వీవింగ్, సిద్ధిపేట్ గొల్లభామ, ముత్యంగడి చీరలు... మొత్తం దీనిమీద ఆసక్తి కొద్దీ, కళను బతికించాలని ఆలోచనతో చేస్తున్న వర్క్ ఉన్నవాళ్లు ఒకచోట చేరుతుంటారు. కొంత మంది చదువుకున్నవారు, ఉద్యోగాలు చేస్తూ ఆసక్తితో తిరిగి చేనేతలకు వస్తున్నారు. ఆంధ్ర తెలంగాణ, కర్ణాటక, ఒరిస్సా, గుజరాత్ నుంచి అజ్రక్, కలకత్తా, బెంగాల్ నుంచి చేనేతకారులు ఈ సంతకు వస్తున్నారు. అయితే, ఇక్కడకు వచ్చే కొంతమంది ధర పెట్టడానికి చాలాసేపు బేరం ఆడుతుంటారు. అది బాధనిపిస్తుంది. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్‌కి వెళ్లి, అక్కడి వస్తువులకి ఎంత డబ్బయినా ఖర్చు పెడతారు. కానీ, మనవైన చేనేతల కష్టాన్ని మాత్రం విపరీతంగా బేరం ఆడుతుంటారు. మనలో ఆర్థిక మార్పు కాదు, సామాజిక మార్పు రావాలి.

■ రైతుగానూ..

మా అమ్మానాన్నలు నాకు మంచి సపోర్ట్. పర్యావరణ సంబంధిత ఉద్యమాలు చేస్తున్నప్పుడు కూడా తమవంతు తోడ్పాటును అందించారు. ఎన్నిరోజుల వీవర్స్ వారు తమ శక్తిని నమ్ముకుంటారో అంతవరకు ఇలాంటి సంతలు ఏర్పాటు చేస్తూనే ఉంటాను. ఇప్పటివరకు రెండు నెలలకు ఒకసారి ఈ ప్రోగ్రామ్ చేస్తున్నాం. రాబోయే రోజుల్లో మూడు – ఆరు నెలలకు ఒకసారి చేయాలనుకుంటున్నాం. ఇందుకు కారణం కొనుగోలు చేసేవారి సంఖ్య కూడా తగ్గిపోతుండటమే. ఫలితంగా చేనేతకారులు ఆశించినంత ఆదాయం వారికి రావడం లేదు. నేటి తరం మన హస్తకళల గొప్పతనాన్ని అర్థం చేసుకోవాలి, చేయూతనివ్వాలి. ప్రకృతితో మమేకం అవడం నాకు ఇష్టమైన పని. అందుకే, వ్యవసాయం చేస్తూ రైతులకు దగ్గరగా, చేనేతలకు చేరువలో ఉండటంలోని సంతోషాన్ని పొందుతుంటాను'' అని వివరించారు సరస్వతి.

– నిర్మలారెడ్డి

వేసవి సెలవుల్లో పిల్లలు కనీసం 3 గంటలు ఫోన్ లేదా కంప్యూటర్ స్క్రీన్‌తో గడుపుతున్నారని దేశంలో 85 శాతం మంది తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నట్టు 'అమేజాన్' నిర్వహించిన తాజా సర్వే వెల్లడించింది. దీనివల్ల పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యం దెబ్బ తింటుందని వారు భయపడుతున్నారు. పిల్లల్ని ఆరోగ్యకరమైన వ్యాపకాల్లో పెట్టాలని వారంతా కోరుకుంటున్నారు. కాకుంటే పిల్లల్ని స్క్రీన్ మీద నుంచి దృష్టి మళ్లించేలా చేయడమే అసలు సమస్య.

సర్వే/ పేరెంటింగ్



రోజుకు 3 గంటలు చూసేస్తున్నారు

మన దగ్గర సమయం లేక పిల్లల్ని ఎలా ఎంగేజ్ చేయాలో తెలియక వారి చేతుల్లో పెడుతున్న ఫోన్ ఇవాళ విశ్వరూపం చూపిస్తున్నదని అమేజాన్ సంస్థ తాజాగా కాంటార్ అనే ఏజెన్సీ ద్వారా నిర్వహించిన సర్వే చెబుతోంది. 10 మెట్రో, నాన్ మెట్రో నగరాల్లో 750 మంది తల్లిదండ్రులను సర్వే చేయగా 69 శాతం మంది ఇప్పుడు మొదలైన వేసవి సెలవుల్లో పిల్లలు మూడు గంటలకు మించి ఫోన్‌గాని కంప్యూటర్ స్క్రీన్‌గాని చూస్తున్నారని అంగీకరించారు. మొత్తం 85 శాతం మంది తమ పిల్లలు అవసరానికి మించి ఫోన్‌లు చూస్తున్నారని ఇందుకు తాము చాలా ఆందోళన చెందుతున్నామని తెలియచేశారు. అంతంత సేపు వాళ్లు ఫోన్ చూడటం వల్ల మజ్జుగా ఉండటమే కాదు సోమరులుగా తయారవుతున్నారు. నిద్ర లేమితో బాధపడుతున్నారు అని తెలియచేశారు.

■ రెక్కలు కత్తిరించి

అయితే ఈ తప్పు పిల్లలదా? వారు నిజంగా ఆడుకోరా? గెంతరా? అల్లరి చేయరా? అంటే చేస్తారు. కాని ఆటస్థలాలు లేకపోవడం, వీధుల్లో ఆడలేకపోవడం, అపార్ట్‌మెంట్‌లలో సెల్లార్‌లు ఉన్నా ఆడటానికి కమిటీలు అంగీకరించకపోవడం, పార్క్‌లు నామమాత్రంగా ఉండటం... వీటన్నింటి వల్ల రోజువారి జీవితంలో బడి నుంచి వచ్చాక మాత్రమే వారు ఫోన్ చేతిలోకి తీసుకునేవారు. తల్లిదండ్రుల ఉద్యోగాల వల్లో, పని వొత్తిడి వల్లో, పిల్లలతో గడిపే సమయం వారు తమ ఫోన్‌కు ఇస్తున్నందు వల్లో పిల్లలు ఫోన్ చూస్తున్నా చూసి చూడనట్టు ఊరుకుంటున్నారు. ఇప్పుడు వేసవి సెలవుల్లో వారికి ఆ అలవాటు వ్యసనం స్థాయికి వెళ్లడం, నివారిస్తే అలగడం మనస్తాపం చేస్తుండటంతో తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు.

■ ఇలా చేయాలని ఉంది

సర్వేలో ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులను 'మీ పిల్లలు ఈ సెలవుల్లో ఏం చేస్తే బాగుంటుందని ఆశిస్తున్నారు' అనే ప్రశ్నకు ఇంగ్లిష్ నేర్చుకోవడం (50 శాతం), నైతిక విషయాలు సంఘ మర్యాదలు తెలుసుకోవాలి (45 శాతం), కళలు నేర్చుకోవాలి (36 శాతం), ఆడుకోవడం విహారాలు చేయడం (32 శాతం) సమాధానం చెప్పారు. అందరూ ఆశిస్తున్నది విజ్ఞానం వినోదం కలగలిసి ఉంటే బాగుంటుందని. 'పిల్లలు కొత్త విషయాలు నేర్చుకోవాలని కోరుకుంటారు. ఫోన్ చూసే సమయాన్ని తగ్గించి కొత్త విషయాలు నేర్పించడంలో వారిని ఉత్సాహపరచాలని ఉంది అని చాలామంది తల్లిదండ్రులు మాతో అన్నారు' అని సర్వే చేసిన కాంటార్ ఏజెన్సీ ప్రతినిధి తెలియచేశారు.

■ మెల్లగా మళ్లించాలి

స్క్రీన్ టైమ్‌ను తగ్గించాలంటే అది ఒక్కసారిగా బంద్ చేయకుండా మెల్లగా తగ్గించాలని నిపుణులు పేర్కొంటున్నారు. ఫోన్‌లు రీచార్జ్ చేయకుండా నిరుత్సాహ పరచడం, ఇంట్లో రౌటర్ ఉంటే దానిని తరచూ ఆఫ్ చేస్తూ ఉండటం, ఈ పుస్తకం చదివితే ఫోన్ ఇస్తాను, కాసేపు ఆడుకుంటే ఇస్తాను, ఫ్రెండ్స్‌ను కలిసి వచ్చాక ఇస్తాను అని వారిని దారి మళ్లించడం, విహారాలకు తీసుకెళ్లడం, ఆడుకునే సమయం– కథలు చదివే సమయం– ఫోన్ సమయం అని టైమ్ విభజించి ఆ టైమ్ పాటించడం... అలా మెల్లగా ఫోన్ టైమ్‌ను తగ్గించాలి.

పిల్లలు ఫోన్ చూడటం వల్ల వారి మానసిక, భౌతిక స్థితుల కంటే వారు చూస్తున్నది ఆరోగ్యకర మైనదో కాదో పరిశీలించే తీరికలో కూడా తల్లిదండ్రులు లేకపోతే అట్టి సర్వేలకు అందనంత తీవ్ర ఆందోళన చెందాల్సిందే.

రంజాన్ స్పెషల్ రెసిపీ



మటన్ షామీ కబాబ్

కావలసినవి: మటన్ ఖీమా– అర కేజీ; పచ్చిశనగపప్పు – అర కప్పు; నెయ్యి– 2 టేబుల్ స్పూన్‌లు; దాల్చిన చెక్క– అర అంగుళం ముక్క; జాపత్రి – 1; లవంగాలు – 3; బిర్యానీ ఆకు – 1; పచ్చ యాలకులు – 2; మిరియాలు – 10; నల్ల యాలకులు – 2; ఉప్పు – అర టీ స్పూన్; మిరప్పొడి – అర టీ స్పూన్; నీళ్లు – కప్పు; ఉల్లిపాయ – 1; పచ్చిమిర్చి – 1; నిమ్మకాయ – 1;


తయారీ: ● పచ్చి శనగపప్పు కడిగి, మునిగేటట్లు నీటిని పోసి అరగంట సేపు నానబెట్టాలి. మటన్ ఖీమాను శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి. ● ప్రెషర్ పాన్‌లో నెయ్యి వేడి చేసి దాల్చిన చెక్క, జాపత్రి, లవంగాలు, బిర్యానీ ఆకు, యాలకులు, మిరియాలు వేసి దోరగా వేయించాలి. ఇందులో మటన్ ఖీమా, ఉప్పు, మిరప్పొడి వేసి కలిపి ఒక నిమిషం పాటు మగ్గనివ్వాలి. ఇప్పుడు నానబెట్టిన శనగపప్పు వేసి వేడయ్యే వరకు గరిటెతో కలిపి, కప్పు నీళ్లు పోసి మరోసారి కలిపి కుక్కర్ మూత పెట్టి ఉడికించాలి. రెండు విజిల్స్ వచ్చిన తర్వాత స్టవ్ ఆపేసి ప్రెషర్ తగ్గిన తరవాత మూత తీసి కలిపి చూసుకోవాలి. నీరు ఇంకా ఉందనిపిస్తే స్టవ్ ఆన్ చేసి మూత లేకుండా ఉడికిస్తే నీరు ఆవిరైపోతుంది. ● ఖీమా, శనగపప్పు మిశ్రమం చల్లారిన తరవాత బిర్యానీ ఆకు తీసేసి మిగిలినవన్నీ మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసి అరగంట పాటు ఫ్రిజ్‌లో పెట్టాలి. ● ఫ్రిజ్‌లో నుంచి తీసిన తరవాత అందులో ఉల్లిపాయ ముక్కలు, నిమ్మరసం, పచ్చిమిర్చి ముక్కలు వేసి కలపాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని పెద్ద నిమ్మకాయంత తీసుకుని వడల్లా వత్తాలి. మొత్తాన్ని ఇలా వత్తుకున్న తర్వాత వీటిని మరో పదినిమిషాల సేపు ఫ్రిజ్‌లో పెట్టాలి. ● పెనం మీద నెయ్యి వేడి చేసి, వత్తి సిద్ధంగా ఉంచిన కబాబ్‌లను పెనం మీద పెట్టి మీడియం మంట మీద రెండు వైపులా బంగారు రంగులోకి వచ్చే వరకు కాల్చి వేడిగా తినాలి.

యూత్ పల్స్

సినిమాల్లో డైలాగులు ఏంచేస్తాయి?
ప్రేక్షకుల చేత చప్పట్లు కొట్టిస్తాయి.
ఉత్సాహం ఎక్కువైతే ఈలలు కొట్టిస్తాయి.
అంతేనా?.. అంతకంటే ఎక్కువే!
యువతరం వాటిని మదిలో స్టోర్ చేసుకుంటోంది.
'వెనకడుగు' ఫైల్స్‌ను డిలీట్ చేస్తోంది.
'స్టార్టప్ కల్చర్'ను ఇన్‌స్టాల్ చేసుకుంటుంది.
ఇంతకంటే కావాల్సింది ఏముంది!

స్టార్టప్ కల్చర్ వారి...

అంకుర చిత్రం



మన దేశంలో అరవై వేలకు పైగా రిజిస్టర్డ్ స్టార్టప్‌లు ఉన్నాయి. అమెరికా, చైనా తరువాత అత్యధికంగా అంకురాలు ఉన్న దేశం మనదే. అయితే అన్ని స్టార్టప్‌లు సక్సెస్ బాటలో పయనించడం లేదు. చాలా కంపెనీలు చతికిలపడుతున్నాయి. అయినప్పటికీ స్టార్టప్ కల్చర్‌లో భాగం కావడానికి యువతరం ఉత్సాహం చూపుతోంది.

అయితే అది శూన్యంలో నుంచి వచ్చిన ఉత్సాహం కాదు. చలన చిత్రాల్లో నుంచి స్ఫూర్తిగా వచ్చిన ఉత్సాహం. 2010లో 'ది సోషల్ నెట్‌వర్క్' అనే సినిమా విడుదలైంది. అద్భుత కథాసంవిధానంతో కూడిన ఈ చిత్రం మూడు అకాడమీ అవార్డ్‌లు గెలుచుకొంది.

సోషల్ మీడియా దిగ్గజం మార్క్ జుకర్‌బర్గ్ జీవితం ఆధారంగా వచ్చిన ఈ చిత్రం స్టార్టప్ కలల యువతరానికి గట్టి స్ఫూర్తిని ఇచ్చింది. మెగా సిటీల నుంచి మారుమూల పల్లె వరకు జుకర్‌బర్గ్ పేరు తెలియని వారు అతి తక్కువగా ఉంటారు.

ఫేస్‌బుక్ యాక్టివిటీని ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది జీవితాల్లో భాగం చేసిన జుకర్‌బర్గ్ విజయాల గురించి తప్ప ఒడుదుడుకుల గురించి తెలిసిన వారు అతి తక్కువగా ఉంటారు. 'ది సోషల్ నెట్‌వర్క్' జుకర్ బర్గ్ అవతలి కోణాన్ని చూపిస్తుంది. ఇక ఈ చిత్రంలో డైలాగుల విషయానికి వస్తే...

'సక్సెస్‌ఫుల్ పీపుల్ పెదాల మీద రెండు తప్పనిసరిగా ఉండాలి. ఒకటి... సైలెన్స్ రెండు స్మైల్'

'నువ్వు ఏం చెబుతున్నావు అనే దానికంటే ఏం చేశావు అనే దానికే ప్రజలు విలువ ఇస్తారు'... ఇలాంటి డైలాగులను యువతరం సొంతం చేసుకుంది.

స్టీవ్ జాబ్స్ బయోగ్రాఫికల్ డ్రామా ఫిల్మ్ 'స్టీవ్ జాబ్స్' యువతరంలో ఎంతోమందిని ప్రభావితం చేస్తూనే ఉంది. స్టీవ్ జాబ్స్ బిజినెస్ ఫిలాసఫీని పట్టించే ఈ చిత్రంలో ఆలోచింపజేసే డైలాగులు ఉన్నాయి...

'ఉన్నత విద్యను నేను తక్కువ చేయడం లేదు. అయితే అది అనుభవ సారం నుంచి వచ్చింది అయితే బాగుంటుంది'

'డోన్ట్ డూ థింగ్స్ బెటర్. డూ థింగ్స్ డిఫరెంట్'

'డోన్ట్ జస్ట్ మేక్ ఇట్. మేక్ ఇట్ గ్రేట్'

రిచర్డ్ హెండ్రిక్స్ అనే ప్రోగ్రామర్ 'పైడ్ పైపర్' అనే స్టార్టప్ స్టార్ట్ చేస్తాడు. తన కంపెనీని బతికించుకోవడానికి అతను పడే రకరకాల తిప్పలను 'సిలికాన్ వ్యాలీ'లో చూడవచ్చు. 2014లో వచ్చిన అమెరికన్ కామెడీ టీవీ సిరీస్ 'సిలికాన్ వ్యాలీ'లో వాస్తవ సంఘటనలు, వ్యక్తులు లేకపోయినప్పటికీ యువతరాన్ని ఆకట్టుకుంది. నవ్విస్తూనే ఈ చిత్రం జీవన పాఠాలు చెబుతుంది....ఈ మూడు చిత్రాలు మాత్రమే కాదు ఎన్నో చిత్రాలలో ఎన్నో స్ఫూర్తిదాయకమైన డైలాగులు యువతకు కంఠో'పాఠాలు' అయ్యాయి. మచ్చుకు కొన్ని...

'గతం అనే గాయం నీకు ఉపయోగపడుతుంది. చెడు పరిస్థితులకు దూరంగా ఉండడానికి. కొత్త పాఠాలు నేర్చుకోవడానికి'

'జీవితంలో ఉన్న గొప్పతనం ఏమిటంటే, కష్టం ఉంటుంది. భయం ఉంటుంది. అయోమయం ఉంటుంది. అయినా సరే అద్భుతమైన అందం ఉంటుంది'

రంగస్థలం

సోషల్ మీడియా వేధింపులకు

దర్పణం



● రుజుత సోమన్ నట విశ్వరూపం

ఎక్కడ ఏ ప్రమాదం దాగుందో తెలియదు.

ఎప్పుడు ఎక్కడ ఏ ఫొటో ఏ రూపంలో ప్రత్యక్షం అవుతుందో తెలియదు.

మహిళల పట్ల సోషల్ మీడియా వేధింపులకు అద్దం పట్టిన నాటకం మాల్ ప్రాక్టీస్ అండ్ ది షో...

లవణీ డ్యాన్సర్ గౌతమి పాటిల్ ప్రైవెట్ వీడియో ఒకటి ఇంటర్నెట్‌లో లీక్ అయింది. ఫొటోలు, వీడియోల రూపంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతూనే ఉన్నాయి. ప్రముఖ నాటక దర్శకుడు అతుల్ పేతే కూతురు ప్రముఖ నటి పర్ణ పేతేకు ఒక షాప్‌లోని గ్రీన్‌రూమ్‌లో రహస్య కెమెరా కనిపించింది.

గొడవ జరిగింది. ఆ కెమెరాను తొలగించారు. ఇలాంటి కొన్ని సంఘటనల ప్రభావంతో సోషల్‌మీడియా వేదికగా స్త్రీలపై జరుగుతున్న హింస, వేధింపులపై పేతేకు నాటకం రాయాలనిపించింది.

అలా రూపుదిద్దుకున్నదే 'మాల్‌ప్రాక్టిస్ అండ్ ది షో' నాటకం

ప్రముఖ నృత్యకారిణి రుజుత సోమన్ ఈ నాటకానికి తన నటన ద్వారా ప్రాణం పోసింది.



● రుజుత సోమన్

రామాయణ, మహాభారతాల లాంటి పౌరాణిక నాటకాలతో ప్రసిద్ధురాలైన సోమన్ ఒక ప్రయోగాత్మక నాటకంలో నటించాలనుకుంది. ఆ సమయంలోనే స్క్రిప్ట్ దశలో ఉన్న తన నాటకం గురించి చెప్పాడు పేతే.

ఇద్దరు కలిసి పుణెలోని ఎంతోమంది కళాకారులతో మాట్లాడి స్క్రిప్ట్‌ను మరింతగా మెరుగుపరిచారు. స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్న సమయంలో పేతే 'డాన్సర్' పాత్రలోకి, సోమన్ 'ప్లే డైరెక్టర్' పాత్రలోకి పరకాయ ప్రవేశం చేశారు.

ఆరునెలల పాటు రిహార్సల్స్ చేసిన తరువాత తొలి ప్రదర్శన పుణెలో ఇచ్చారు.

ఇమేజ్‌లు, సింబల్స్, సంభాషణలతో ఈ నాటకం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది.

ప్రదర్శన ఒక సర్కిల్‌లో సాగుతుంది. ఈ సర్కిల్‌కు మూడు వైపుల ప్రేక్షకులు కూర్చుంటారు.

నాటకం పూర్తయిన తరువాత కూడా ప్రేక్షకులు హాల్ వీడకుండా 'సోషల్ మీడియా హింస' గురించి చర్చించుకున్నారు. తమకు ఎదురైన అనుభవాలను పంచుకున్నారు.

'వేరే పని ఉండడంతో కొద్దిసేపు నాటకం చూసి వెళదామని వచ్చాను. తీరా నాటకంలో లీనమైపోయాక ఆ పని గురించే మరిచిపోయాను. సోషల్‌మీడియాలో నాకు, నా ఫ్రెండ్స్‌కి ఎదురైన చేదు అనుభవాలు ఒక్కటొక్కటిగా గుర్తుకొచ్చాయి' అంటుంది సౌమ్య అనే ప్రేక్షకురాలు.

''సాధారణంగా నాటకం పూర్తి కాగానే ప్రేక్షకులు, కళాకారులు ఎవరి ప్రపంచంలోకి వాళ్లు వెళ్లిపోతారు. కాని ఈ నాటకం పూర్తయిన కొన్ని వారాల తర్వాత కూడా ఎవరో ఒకరు ఫోన్ చేస్తూ సోషల్ మీడియాలో తాము ఎదుర్కొన్న చేదు అనుభవాలను పంచుకుంటూనే ఉన్నారు'' అంటుంది రుజుత సోమన్.

పుణేలోని 'ది బాక్స్' నాటక వేదికలో ఇప్పటివరకు 20కి పైగా ప్రదర్శనలు పూర్తి చేసుకున్న ఈ నాటకాన్ని చూడటానికి ముంబై తదితర పట్టణాల నుంచి కూడా ప్రేక్షకులు రావడం విశేషం.

బ్యూటిప్స్



● బాదం పప్పులను నానబెట్టి, పైన పొట్టు తీసి, మెత్తగా రుబ్బి, కొద్దిగా పచ్చి పాలను కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు అప్లై చేయాలి. ఇరవై నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. ఇలా వారానికి మూడు సార్లు చేస్తే చర్మం మృదువుగా అవుతుంది. కాంతి పెరుగుతుంది.

● పెరుగు, నారింజ రసం సమపాళ్లలో తీసుకొని, కొద్దిగా ఆలోవెరా జెల్ కలిపి ముఖానికి అప్లై చేయాలి. పది నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి.

● బొప్పాయి గుజ్జులో తేనె కలిపి ముఖానికి మృదువుగా మర్దనా చేయాలి. పది నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. వారానికి రెండు సార్లు ఇలా చేస్తే చర్మం నిగారింపు పెరుగుతుంది.





కోహ్లి మ్యాచ్ ఫీజులో కోత


రాయల్ చాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ కోహ్లిపై జరిమానా విధించారు. సోమవారం చెన్నైతో జరిగిన పోరులో ప్రత్యర్థి బ్యాటర్ శివమ్ దూబే అవుటైనపుడు కోహ్లి సంబరం అతిగా అనిపించడంతో ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి ప్రకారం అతని మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించారు. కోహ్లి తన తప్పును అంగీకరించడంతో మ్యాచ్ రిఫరీ జరిమానాతో సరిపెట్టారు. నియమావళిలోని ఆర్టికల్ 2.2 లెవెల్ 1 అతిక్రమణలో రిఫరీదే తుది నిర్ణయం అవుతుంది.



శ్రీలంక ఇన్నింగ్స్ 280 పరుగుల తేడాతో విజయం

ఐర్లాండ్‌తో గాలెలో జరిగిన తొలి టెస్టులో శ్రీలంక ఇన్నింగ్స్ 280 పరుగుల తేడాతో నెగ్గి తమ టెస్టు క్రికెట్ చరిత్రలో అతి పెద్ద విజయం నమోదు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 117/7తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఐర్లాండ్ 143 పరుగులకు ఆలౌటైంది. 448 పరుగులతో వెనుకబడి ఫాలోఆన్‌లో రెండో ఇన్నింగ్స్ ఆడిన ఐర్లాండ్ 168 పరుగులకే కుప్పకూలింది. లంక స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య (3/56, 7/52) రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లు పడగొట్టాడు. రెండో టెస్టు ఈనెల 24న మొదలవుతుంది.

రైజర్స్ జోరుకు బ్రేక్....


మయాంక్

- 14 పరుగులతో ఓడిన హైదరాబాద్
- ముంబైకి హ్యాట్రిక్ విజయం
- రాణించిన గ్రీన్


తిలక్

వరుసగా రెండు విజయాలతో జోరు పెంచిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు సొంతగడ్డపై అడ్డుకట్ట పడింది. కొంత పోరాటపటిమ కనబర్చినా చివరకు విజయం మాత్రం దక్కలేదు. అన్ని రంగాల్లో సమష్టిగా రాణించిన ముంబై ఇండియన్స్ 'హ్యాట్రిక్' గెలుపుతో సత్తా చాటింది. కామెరాన్ గ్రీన్, తిలక్ వర్మ విజయంలో కీలకపాత్ర పోషించగా... ఒక్క బ్యాటర్ కూడా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేకపోవడంతో రైజర్స్ ఉప్పల్‌లో చతికిలపడింది.

సాక్షి, హైదరాబాద్: ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ ఖాతాలో మరో ఓటమి చేరింది. మంగళవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ 14 పరుగుల తేడాతో హైదరాబాద్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కామెరాన్ గ్రీన్ (40 బంతుల్లో 64 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా, ఇషాన్ కిషన్ (31 బంతుల్లో 38; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), తిలక్ వర్మ (17 బంతుల్లో 37; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) రాణించారు. అనంతరం హైదరాబాద్ 19.5 ఓవర్లలో 178 పరుగులకు ఆలౌటైంది. మయాంక్ అగర్వాల్ (41 బంతుల్లో 48; 4 ఫోర్లు,1 సిక్స్), హెన్రిచ్ క్లాసెన్ (16 బంతుల్లో 36; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు.

సూర్యకుమార్ విఫలం...

కెప్టెన్ రోహిత్ శర్మ (18 బంతుల్లో 28; 6 ఫోర్లు) ముంబై ఇన్నింగ్స్‌ను ధాటిగా మొదలు పెట్టాడు. సుందర్ ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు కొట్టిన అతను ఈ క్రమంలో ఐపీఎల్‌లో 6 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. నటరాజన్ ఓవర్లో మరో రెండు ఫోర్లు కొట్టిన రోహిత్, అదే ఓవర్లో వెనుదిరిగాడు. పవర్‌ప్లేలో ముంబై 53 పరుగులు చేసింది. అనంతరం రైజర్స్ బౌలింగ్ కట్టుదిట్టంగా సాగడంతో ముంబై స్కోరు వేగం మందగించింది. జాన్సెన్ ఒకే ఓవర్లో కిషన్, సూర్యకుమార్ (7)లను అవుట్ చేసి దెబ్బ కొట్టాడు. ఈ రెండు క్యాచ్‌లను మార్క్‌రమ్ అద్భుతంగా అందుకున్నాడు. 14 ఓవర్లలో ముంబై 109 పరుగులు చేసింది. అయితే చివరి 6 ఓవర్లలో చెలరేగిన ఆ జట్టు 83 పరుగులు రాబట్టింది. నటరాజన్ వేసిన 18వ ఓవర్లో వరుస బంతుల్లో గ్రీన్ 4, 4, 4, 6 తో చెలరేగడం విశేషం. ఈ క్రమంలో 33 బంతుల్లో అతని అర్ధ సెంచరీ పూర్తయింది. భువీ తన చివరి 2 ఓవర్లలో 14 పరుగులే ఇచ్చినా, ఇతర బౌలర్లు విఫలమయ్యారు.


గ్రీన్

తిలక్ జోరు...

సొంతగడ్డపై ప్రత్యర్థి జట్టు హైదరాబాద్‌పై తిలక్ వర్మ సత్తా చాటాడు. తనపై ఉన్న అంచనాలను నిలబెట్టుకుంటూ మరో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. క్రీజ్‌లో ఉన్న 24 నిమిషాల్లో ఫటాఫట్ బ్యాటింగ్ ప్రదర్శించాడు. జాన్సెన్ ఓవర్లో వరుసగా రెండు సిక్స్‌లు కొట్టిన అతను... మర్కండే, భువీ బౌలింగ్‌లో ఒక్కో సిక్సర్ బాదాడు. భువీ బౌలింగ్‌లో మరో షాట్‌కు ప్రయత్నించి కవర్స్‌లో చిక్కడంతో అతని ఇన్నింగ్స్ ముగిసింది.

సమష్టి వైఫల్యం...

ఛేదనలో రైజర్స్‌కు సరైన ఆరంభం లభించలేదు. గత మ్యాచ్ హీరో బ్రూక్ (9), రాహుల్ త్రిపాఠి (7)లను బెహ్రన్‌డార్ఫ్ తన వరుస ఓవర్లో అవుట్ చేశాడు. మరో ఎండ్‌లో మయాంక్ మాత్రం కొన్ని చక్కటి షాట్లతో ఇన్నింగ్స్‌ను నడిపించాడు. 6 ఓవర్లలో జట్టు స్కోరు 2 వికెట్లకు 42. మార్క్‌రమ్ (17 బంతుల్లో 22; 1 ఫోర్, 1 సిక్స్) కూడా ఎక్కువ సేపు నిలవలేకపోగా, అభిషేక్ (1) కూడా వెంటనే అవుటయ్యాడు. రైజర్స్ గెలుపు అవకాశాలు సన్నగిల్లుతున్న దశలో చావ్లా వేసిన 14వ ఓవర్ ఆశలు రేపింది. ఈ ఓవర్లో క్లాసెన్ వరుసగా 4, 6, 6, 4 బాదాడు. అయితే చివరి బంతికి అతను అవుట్ కావడంతో పరిస్థితి మళ్లీ మారిపోయింది. తర్వాతి ఓవర్లో మయాంక్ వెనుదిరిగాక జట్టు ఓటమి లాంఛనమే అయింది. అర్జున్ టెండూల్కర్ తన తొలి ఐపీఎల్ వికెట్‌తో హైదరాబాద్ ఇన్నింగ్స్ ముగించగానే ముంబై సంబరాల్లో మునిగిపోయింది.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) మార్క్‌రమ్ (బి) నటరాజన్ 28; ఇషాన్ కిషన్ (సి) మార్క్‌రమ్ (బి) జాన్సెన్ 38; గ్రీన్ (నాటౌట్) 64; సూర్యకుమార్ (సి) మార్క్‌రమ్ (బి) జాన్సెన్ 7; తిలక్ (సి) మయాంక్ (బి) భువనేశ్వర్ 37; డేవిడ్ (రనౌట్) 16; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 192. వికెట్ల పతనం:** 1-41, 2-87, 3-95, 4-151, 5-192. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-31-1, జాన్సెన్ 4-0-43-2, సుందర్ 4-0-33-0, నటరాజన్ 4-0-50-1, మర్కండే 4-0-35-0.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: బ్రూక్ (సి) సూర్యకుమార్ (బి) బెహ్రన్‌డార్ఫ్ 9; మయాంక్ (సి) డేవిడ్ (బి) మెరిడిత్ 48; త్రిపాఠి (సి) ఇషాన్ కిషన్ (బి) బెహ్రన్‌డార్ఫ్ 7; మార్క్‌రమ్ (సి) షోకీన్ (బి) గ్రీన్ 22; అభిషేక్ (సి) డేవిడ్ (బి) చావ్లా 1; క్లాసెన్ (సి) డేవిడ్ (బి) చావ్లా 36; సమద్ (రనౌట్) 9; జాన్సెన్ (సి) డేవిడ్ (బి) మెరిడిత్ 13; సుందర్ (రనౌట్) 10; భువనేశ్వర్ (సి) రోహిత్ (బి) అర్జున్ 2; మర్కండే (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (19.5 ఓవర్లలో ఆలౌట్) 178. వికెట్ల పతనం:** 1-11, 2-25, 3-71, 4-72, 5-127, 6-132, 7-149, 8-165, 9-174, 10-178. **బౌలింగ్:** అర్జున్ టెండూల్కర్ 2.5-0-18-1, బెహ్రన్‌డార్ఫ్ 4-0-37-2, మెరిడిత్ 4-0-33-2, షోకీన్ 1-0-12-0, చావ్లా 4-0-43-2, గ్రీన్ 4-0-29-1.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	5	4	1	8	1.354
లక్నో	5	3	2	6	0.761
చెన్నై	5	3	2	6	0.265
గుజరాత్	5	3	2	6	0.192
పంజాబ్	5	3	2	6	-0.109
ముంబై	5	3	2	6	-0.164
కోల్‌కతా	5	2	3	4	0.320
బెంగళూరు	5	2	3	4	-0.318
హైదరాబాద్	5	2	3	4	-0.798
ఢిల్లీ	5	0	5	0	-1.488

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ x లక్నో (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

జ్యోతి సురేఖ ప్రపంచ రికార్డు

- 360 పాయింట్లకుగాను 360 పాయింట్లు స్కోరు చేసిన ఆంధ్రప్రదేశ్ ఆర్చర్
- ఓవరాల్‌గా 713 పాయింట్లతో ప్రపంచ రికార్డు సమం
- వరల్డ్‌కప్ స్టేజ్-1 టోర్నీ



అంటాల్యా (తుర్కియే): భారత అగ్రశ్రేణి ఆర్చర్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ కొత్త సీజన్‌లో శుభారంభం చేసింది. ప్రపంచకప్ స్టేజ్-1 టోర్నీలో ఆమె క్వాలిఫయింగ్‌లో కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పడంతోపాటు మరో ప్రపంచ రికార్డును సమం చేసింది. మంగళవారం జరిగిన మహిళల కాంపౌండ్ క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ మొత్తం 713 పాయింట్లు స్కోరు చేసింది. 2015లో సారా లోపెజ్ (కొలంబియా) 713 పాయింట్లతో నమోదు చేసిన ప్రపంచ రికార్డును సురేఖ సమం చేసింది. అంతేకాకుండా కొత్త ఆసియా రికార్డును సృష్టించింది. 2017లో కొరియా ఆర్చర్ 709 పాయింట్లతో నమోదు చేసిన రికార్డును సురేఖ సవరించింది. క్వాలిఫయింగ్‌లో ఒక్కో ఆర్చర్ 72 బాణాలు సంధించాలి. తొలి రౌండ్‌లో 36, రెండో రౌండ్‌లో మరో 36 బాణాలు సంధిస్తారు. తొలి రౌండ్‌లో జ్యోతి సురేఖ 353 పాయింట్లు... రెండో రౌండ్‌లో 360 పాయింట్లు సాధించింది. రెండో రౌండ్‌లో జ్యోతి సురేఖ కొట్టిన 36 బాణాలు 10 పాయింట్ల సర్కిల్‌లోకి వెళ్లడం విశేషం. దాంతో ఆమె అందుబాటులో ఉన్న మొత్తం 360 పాయింట్లను తన ఖాతాలోకి వేసుకుంది. ఈ క్రమంలో జ్యోతి సురేఖ 360కి 360 పాయింట్లు స్కోరు చేసిన తొలి మహిళా ఆర్చర్‌గా ప్రపంచ రికార్డు సృష్టించింది. ఈ ప్రదర్శనతో 2015 నుంచి సారా లోపెజ్ (356 పాయింట్లు) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును జ్యోతి సురేఖ బద్దలు కొట్టింది. 'ప్రపంచ రికార్డు సాధిస్తానని ఊహించలేదు. ఇదే నా అత్యుత్తమ ప్రదర్శన. టాప్ సీడ్‌తో మెయిన్ రౌండ్‌లో బరిలోకి దిగనుండటం సంతోషంగా ఉంది. ఎలిమినేషన్ రౌండ్లలోనూ పూర్తి ఏకాగ్రతతో పోటీ పడతాను' అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జ్యోతి సురేఖ వ్యాఖ్యానించింది. క్వాలిఫయింగ్‌లో టాప్ ర్యాంక్‌లో నిలిచిన సురేఖకు ఎలిమినేషన్ రౌండ్‌లలో టాప్ సీడ్ దక్కింది. భారత్‌కే చెందిన అదితి, అవ్‌నీత్ కౌర్ స్కోర్ల ఆధారంగా క్వాలిఫయింగ్ టీమ్ విభాగంలో భారత్ 2,112 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకొని నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. 2011 నుంచి భారత జట్టుకు ఆడుతున్న సురేఖ అంతర్జాతీయ టోర్నీలలో 30 కంటే ఎక్కువ పతకాలు సాధించింది.

హైదరాబాద్ మాజీ క్రికెటర్ అబ్దుల్ అజీమ్ మృతి



సాక్షి, హైదరాబాద్: దేశవాళీ క్రికెట్‌లో దూకుడైన ఓపెనర్‌గా పేరొందిన హైదరాబాద్ మాజీ క్రికెటర్ అబ్దుల్ అజీమ్ మంగళవారం కన్నుమూశారు. 62 ఏళ్ల అజీమ్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. 80, 90 దశకాల్లో హైదరాబాద్ మేటి ఓపెనర్‌గా వెలుగొందారు. 1986లో తమిళనాడుతో జరిగిన రంజీ మ్యాచ్‌లో అజీమ్ ట్రిపుల్ సెంచరీ సాధించారు. 1980 నుంచి 1995 వరకు క్రికెట్ కెరీర్ కొనసాగించిన ఆయన 73 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లాడి 4644 పరుగులు చేశాడు. ఇందులో 12 శతకాలున్నాయి. అనంతరం హైదరాబాద్ జట్టుకు కోచ్‌గా, సెలక్టర్‌గా సేవలందించారు.

గట్టెక్కిన న్యూజిలాండ్

లాహోర్: పాకిస్తాన్‌తో మూడో టి20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ నాలుగు పరుగులతో గెలిచింది. ఆఖరి ఓవర్లో పాక్ విజయానికి 15 పరుగులు కావాల్సి ఉండగా, జోరు మీదున్న ఇఫ్తికార్ అహ్మద్ (24 బంతుల్లో 60; 3 ఫోర్లు, 6 సిక్సర్లు) తొలి మూడు బంతుల్లో పది పరుగులు బాదాడు. ఇక మిగిలిన 3 బంతుల్లో 5 పరుగుల సులువైన సమీకరణం పాక్‌ను గెలుపు వాకిట నిలిపింది. అయితే బౌలర్ నీషమ్ (3/38) తర్వాతి మూడు బంతుల్లో ఒక్క పరుగైనా ఇవ్వకుండా, ఇఫ్తికార్‌తో పాటు రవూఫ్ (0)ను అవుట్ చేయడంతో పాకిస్తాన్ ఓడిపోయింది. అంతకుముందు న్యూజిలాండ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 163 పరుగులు చేసింది. తర్వాత పాక్ 20 ఓవర్లలో 159 పరుగుల వద్ద ఆలౌటైంది.

సినిమా

తల్లి కానున్న ఇలియానా


ఇలియానా


ఇలియానా షేర్ చేసిన ఫొటోలు

''ఓ సాహసం ఆరంభం.. కమింగ్ సూన్. నా లిటిల్ డార్లింగ్ కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నాను'' అని మంగళవారం సోషల్ మీడియాలో ఓ చిన్న బేబీ డ్రెస్ ఫొటో, మెడలో ఉన్న గొలుసుకి 'మమ్మా' (అమ్మ) అనే లాకెట్ ఉన్న ఫొటోని షేర్ చేశారు ఇలియానా. కాగా ఇలియానా తల్లి సమీరా ''మా ప్రపంచంలోకి త్వరగా రా.. నా గ్రాండ్ బేబీ'' అని కుమార్తె పెట్టిన పోస్ట్‌కి స్పందించారు. దీన్ని బట్టి ఇలియానా తల్లి కాబోతున్నారనే విషయం స్పష్టమవుతోంది. పలువురు బాలీవుడ్ ప్రముఖులు సోషల్ మీడియా ద్వారా ఆమెకు శుభాకాంక్షలు తెలుపగా.. కొందరు నెటిజన్లు మాత్రం 'పెళ్లెప్పుడు చేసుకున్నారు? ఫొటో పెట్టండి' అని పోస్ట్ చేశారు. ఇక సినిమాల విషయానికి వస్తే.. ఇలియానా నటించిన 'అన్‌ఫెయిర్ అండ్ లవ్లీ' చిత్రం రిలీజ్ కావాల్సి ఉంది. మరోవైపు 'సామ్ గజబ్' అనే మ్యూజిక్ వీడియోలో నటించారామె.

ఎన్టీఆర్‌తో సైఫ్ ఢీ


కొరటాల శివ, సైఫ్ అలీఖాన్, ఎన్టీఆర్

ఎన్టీఆర్‌తో ఢీ కొనేందుకు సిద్ధమయ్యారు బాలీవుడ్ హీరో సైఫ్ అలీఖాన్. 'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ చిత్రం తర్వాత ఎన్టీఆర్–డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'ఎన్‌టీఆర్ 30'(వర్కింగ్ టైటిల్). ఈ మూవీతో శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ తెలుగులో హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. నందమూరి కల్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కొసరాజు హరికృష్ణ, సుధాకర్ మిక్కిలినేని నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ మూవీలో విలన్ పాత్రలో సైఫ్ అలీఖాన్ నటించనున్నారని వార్తలొచ్చాయి. ఈ విషయాన్ని చిత్రయూనిట్ అధికారికంగా ప్రకటించింది. 'జాతీయ అవార్డు గ్రహీత (సైఫ్ అలీఖాన్) హై ఓల్టేజ్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న ఈ సినిమా సెట్స్‌లో అడుగుపెట్టారు' అంటూ ఎన్టీఆర్, కొరటాల శివతో సైఫ్ అలీఖాన్ కలిసి ఉన్న ఫొటోలను యూనిట్ విడుదల చేసింది. 'ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 2024 ఏప్రిల్ 5న రిలీజ్ చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. కాగా ప్రభాస్ హీరోగా నటించిన 'ఆదిపురుష్' చిత్రంలో రావణుడి పాత్ర చేశారు సైఫ్ అలీఖాన్.

ఫలితం మన చేతుల్లో ఉండదు


సమంత

''ఎందుకీ వేదాంతం... ఏంటా వైరాగ్యం?'' అంటూ మంగళవారం సమంత సోషల్ మీడియాలో షేర్ చేసిన ఓ పోస్ట్ గురించి నెటిజన్లు చర్చించుకోవడం మొదలుపెట్టారు. ఈ చర్చకు కారణం మహాభారతంలోని సమంత షేర్ చేసిన శ్లోకం.

'కర్మణ్యే వాధికారస్తే.. మా ఫలేషు కదాచన.. మా కర్మఫలహేతుర్భూః మాతే సంగోత్స్వ కర్మణి'

అనే శ్లోకంతో పాటు కారులో కూర్చుని ఎటో చూస్తున్న ఫొటోను షేర్ చేశారు సమంత. 'కర్మ చేయడానికి మాత్రమే గానీ ఆ కర్మఫలానికి అధికారివి కాదు.. ప్రతిఫలాపేక్షతో కర్మలను చేయకు.. అలాగని ఫలితాలకు భయపడి ప్రయత్నం చేయడం మానకు. ఏది ఏమైనా ముందుకు సాగిపో' అనేది ఈ గీతాశ్లోకానికి అర్థం. సమంత ఈ శ్లోకం పెట్టడానికి కారణం 'శాకుంతలం' అని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఆ సినిమా ఆశించిన ఫలితం సాధించక పోవడంవల్లే 'ఫలితం మన చేతుల్లో ఉండదు.. ప్రయత్నాలు చేసుకుంటూ వెళ్లడమే' అని చెప్పడానికి సమంత ఈ శ్లోకాన్ని షేర్ చేశారన్నది నెటిజన్ల ఊహ.

కామెడీ చేయడం ఇష్టం

- సంయుక్తా మీనన్



''విరూపాక్ష' మిస్టిక్ థ్రిల్లర్‌గా రూపొందింది. హారర్ మూవీ కాదు. కానీ ప్రేక్షకులు భయపడతారు. 1990ల నాటి కాలంలో ఈ మూవీ కథ జరుగుతుంది'' అన్నారు సంయుక్తా మీనన్. సాయిధరమ్ తేజ్ హీరోగా కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'విరూపాక్ష'. బాపినీడు .బి సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పీ, సుకుమార్ రైటింగ్స్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా చిత్ర కథానాయిక సంయుక్తా మీనన్ మాట్లాడుతూ– ''బింబిసార' తర్వాత నేను సంతకం చేసిన రెండో చిత్రం 'విరూపాక్ష'. అయితే కరోనా లాక్‌డౌన్, తేజ్‌కి ప్రమాదం.. వంటి కారణాలతో ఈ సినిమా లేట్ అయింది. 'విరూపాక్ష' తర్వాత నేను ఒప్పుకున్న 'వకీల్ సాబ్, సార్' సినిమాలు ముందు రిలీజ్ అయ్యాయి. రుద్రవనం అనే గ్రామంలో జరిగే కథే 'విరూపాక్ష'. నేను నందిని అనే పల్లెటూరి అమ్మాయి పాత్ర చేశాను. నందినికి పొగరు, పట్టుదల ఎక్కువ ఉంటుంది. నందిని పాత్రకి, నిజ జీవితంలో నా క్యారెక్టర్‌కి పోలికే లేదు. బైక్ ప్రమాదం నుంచి కోలుకున్నాక తేజ్‌గారు ఎంతో ఎనర్జీతో ఈ మూవీ చేశారు. నాకు కామెడీ రోల్స్ ఇష్టం.. అవి చేయాలనుంది. ప్రస్తుతం కల్యాణ్ రామ్‌గారితో 'డెవిల్' చిత్రం చేస్తున్నా'' అన్నారు.

ఆ సినిమా వదులుకున్నందుకు బాధపడుతుంటా!

- ఖుష్బూ



''నా కెరీర్ ప్రారంభంలో రాఘవేంద్రరావు, పి. వాసు, భారతీరాజా, బాలచందర్, జంధ్యాల, గోపాల్ రెడ్డి వంటి ఎందరో గొప్ప దర్శకులతో పని చేశాను. నా పాత్ర బాగుందన్నా, బాగా లేదన్నా ఆ క్రెడిట్ దర్శకులదే. ఎందుకంటే వారు చెప్పినట్టే నేను చేస్తాను. ఇన్నేళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నానంటే కారణం నా పనిని ప్రేమిస్తాను.. అదే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చింది'' అని నటి ఖుష్బూ అన్నారు. గోపీచంద్, డింపుల్ హయతి జంటగా శ్రీవాస్ దర్శకత్వం వహించిన చిత్రం 'రామబాణం'. టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మించిన ఈ సినిమా మే 5న రిలీజవుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర చేసిన ఖుష్బూ చెప్పిన విశేషాలు.

- 'రామబాణం' ప్రధానంగా కుటుంబ బంధాల నేపథ్యంలో ఉంటుంది. మనం ఎంత డబ్బు సంపాదించినా, ఉన్నత స్థాయికి చేరినా కుటుంబ బంధం అనేది చాలా ముఖ్యం. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా కుటుంబమంతా కలిసి ఉండాలని ఈ సినిమా చెబుతుంది. ప్రస్తుతం మనం తింటున్న ఫాస్ట్ ఫుడ్ వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. ఈ మూవీలో నేను చేసిన భువనేశ్వరి పాత్ర మనం మరిచిపోతున్న సంప్రదాయాలు, ఆహార వ్యవహారాలను గుర్తు చేసేలా ఉంటుంది.
- మొదట్లో తెలుగు సినీ పరిశ్రమ చెన్నైలోనే ఉండేది.. ఆ తర్వాత హైదరాబాద్‌కి తెలుగు ఇండస్ట్రీ వచ్చింది. అయితే నా కుటుంబం కోసం నేను అక్కడే ఉండిపోయాను. అప్పుడు తమిళ్‌లో ఎక్కువ చాన్సులు వచ్చాయి. డేట్స్ సర్దుబాటు కాక తెలుగులో 'చంటి' వంటి సినిమాని వదులుకోవాల్సి వచ్చింది. ఆ విషయంలో ఇప్పటికీ బాధ ఉంది.
- గోపీచంద్‌తో మొదటిసారి 'రామబాణం'లో నటించాను. జగపతిబాబుగారు నటుడు కాకముందు నుంచే నాకు తెలుసు. ఆయన తండ్రి వీబీ రాజేంద్రప్రసాద్‌గారు నిర్మించిన రెండు సినిమాల్లో నేను బాలనటిగా చేశాను. జగపతిగారు మంచి మనసున్న వ్యక్తి. నేను చౌ మామా అని పిలుస్తాను.
- ప్రస్తుత కాలంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ లాంటి గొప్ప నిర్మాణ సంస్థను చూడటం చాలా కష్టం. టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్లగారు సెట్స్‌కి పెద్దగా వచ్చేవారు కాదు. వారు వరుస హిట్స్ అందుకోవడం సంతోషంగా ఉంది. శ్రీవాస్‌తో మొదటిసారి పని చేస్తున్నట్లు అనిపించలేదు. తనతో పని చేయడం చాలా సౌకర్యంగా అనిపించింది.
- అప్పటికి, ఇప్పటికి మేకింగ్ పరంగా, నటన పరంగా ఎన్నో మార్పులు వచ్చాయి. నేనే ఇప్పటి తరం నుంచి కొన్ని నేర్చుకోవాలి. హీరోయిన్ డింపుల్ హయతి మేకప్, హెయిర్ స్టైల్ చేసుకునే విధానం నన్ను ఆకట్టుకుంది. నటనలోనూ మార్పు కనిపిస్తోంది. ఇప్పుడు సెటిల్డ్‌గా పెర్ఫార్మ్ చేస్తున్నారు. అయితే అప్పట్లో లొకేషన్‌లో సరైన వసతులు లేకపోయినా ఎలా మేకప్ వేసుకోవాలి? ఎలా కాస్ట్యూమ్ మార్చుకోవాలి? అనే ట్రిక్స్ మాకు తెలిసేవి. ఈ తరానికి అలాంటివి తెలీదు.
- కెరీర్‌లో గ్లామర్ రోల్స్ చేశాను, డ్యాన్స్‌లు చేశా. ఇప్పుడు అవన్నీ అయిపోయాయి. ప్రేక్షకులు సినిమా చూసే కోణం కూడా మారింది. వారి మనసుల్లో స్థానం సంపాదించుకునే పాత్రలు చేయాలి. అలాంటి పాత్రనే 'రామబాణం'లో చేశాను. తెలుగులో ఇంకా మంచి పాత్రలు చేయాలని ఉంది. పాత్రకి ప్రాధాన్యత ఉంటే నిడివి తక్కువ అయినా చేస్తాను. ప్రస్తుతం మనసుకి నచ్చిన పాత్రలే ఎంచుకుంటున్నాను.. అందుకే తక్కువ సినిమాలు చేస్తున్నా. విజయ్ హీరోగా చేసిన 'వారసుడు'లో నాది 18 నిమిషాల పాత్ర.. అయితే సినిమా నిడివి ఎక్కువ కావడంతో నా పాత్ర సన్నివేశాలు తొలగించారు.
- అమితాబ్ బచ్చన్‌గారికి నేను చాలా పెద్ద అభిమానిని. నా బెడ్ రూమ్‌లో ఇప్పటికీ ఆయన పోస్టర్స్ ఉంటాయి. ఆయనతో చైల్డ్ ఆర్టిస్ట్‌గా చేశాను. కానీ జోడీగా చేయలేదనే బాధ ఉంది. 'చీనీ కమ్' చిత్రంలో అమితాబ్‌గారితో టబు నటించింది. ఆ చాన్స్ నాకు రాలేదని బాధపడ్డాను. టబుకి ఫోన్ చేసి, అది నేను చేయాల్సిన పాత్ర.. నువ్వు ఎలా చేస్తావ్? అని అడిగాను (నవ్వుతూ). చిరంజీవి, బాలకృష్ణగార్లకి జోడీగా చేయలేదు.. అవకాశం వస్తే చేయాలని ఉంది.
- సినిమాల్లో డైరెక్టర్స్ సృష్టించిన పాత్రకి తగ్గట్లు చేయాలి. కానీ, టీవీ షోల్లో నాకు నచ్చినట్టు ఉండొచ్చు. ప్రస్తుతం బీజేపీలో కొనసాగుతున్నాను. గతంలో ఎమ్మెల్యేగా పోటీ చేసి, ఓడిపోయాను. అధిష్టానం ఆదేశిస్తే ఎంపీగానో, ఎమ్మెల్యేగానో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నాను.

థ్రిల్‌కి గురి చేసే మీరా


కాకర్ల శ్రీనివాస్

ప్రముఖ దర్శకులు బాపు వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా చేసిన కాకర్ల శ్రీనివాస్ దర్శకునిగా పరిచయమవుతున్న చిత్రం 'హలో మీరా'. గార్గేయి యాల్లాప్రగడ లీడ్ రోల్ చేశారు. జీవన్ సమర్పణలో డా. లక్ష్మణరావు దిక్కల, వరప్రసాదరావు దుంపల, పద్మ కాకర్ల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న రిలీజ్ కానుంది. కాకర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ– ''ఒకే ఒక్క పాత్రతో రూపొందిన చిత్రం 'హలో మీరా'. వైవిధ్యభరితమైన కథలో వచ్చే ఊహించని ట్విస్టులతో ప్రేక్షకులు థ్రిల్ అవుతారు. తెరపై కనిపించేది మీరా (గార్గేయి పాత్ర పేరు) అయినా వినిపించే పాత్రలన్నీ సగటు ప్రేక్షకుడి మదిలో మెదిలేలా ఉంటాయి. ప్రేమ, స్నేహం, స్నేహితుల కోసం దెబ్బలు తినడం, రౌడీయిజమ్, బ్రేకింగ్ న్యూస్ వంటి అన్ని అంశాలు ప్రేక్షకుడి కళ్ల ముందు ఉండేలా జాగ్రత్త పడ్డాం. ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతుంది'' అన్నారు.

నటుడు అల్లు రమేశ్ మృతి



రంగస్థల నటుడు, హాస్య నటుడు అల్లు రమేశ్ విశాఖపట్నంలో గుండెపోటుతో మంగళవారం కన్నుమూశారు. వైజాగ్ దొండపర్తికి చెందిన రామునాయుడు, దేముడమ్మ దంపతులకు జన్మించిన అల్లు రమేశ్ నాటక రంగం నుంచి చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టారు. తరుణ్ హీరోగా నటించిన 'చిరుజల్లు' – 2001 సినిమాతో నటుడిగా ప్రయాణం ప్రారంభించారు అల్లు రమేశ్. ఆ చిత్రంలో తరుణ్ ఫ్రెండ్ పాత్ర చేశారు. 'బ్లేడ్ బాబ్జీ, తోలుబొమ్మలాట, మధుర వైన్స్, కేరింత, కెవ్వు కేక, దేశముదురు, నిజం, నెపోలియన్'.. ఇలా దాదాపు 50 సినిమాల్లో నటించారు. అల్లు రమేశ్ నటించిన చివరి చిత్రం 'అనుకోని ప్రయాణం'. అలాగే 'మావిడాకులు' అనే వెబ్ సిరీస్‌లోనూ నటించారు. ఆయనకి భార్య వరలక్ష్మి, కుమారులు వంశీ, రేవంత్ ఉన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽ 184	59,727	
నిఫ్టీ ▽ 47	17,660	

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	12,154	▽ 4
డోజోన్స్	34,014	△ 21
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,909	△ 30
డాక్స్	15,883	△ 93
షాంఘై	3,393	△ 8
నికాయ్	28,659	△ 144

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	60,593	△ 36
బంగారం (22 క్యారట్)	60,350	△ 34
వెండి (కిలో)	74,642	▽ 888

యాపిల్ స్టోర్ వచ్చేసింది..



ముంబై యాపిల్ స్టోర్ ప్రారంభోత్సవంలో సీఈఓ టిమ్ కుక్

ముంబైలో తొలి స్టోర్ ప్రారంభించిన సీఈవో టిమ్ కుక్ • వెల్లువెత్తిన అభిమానులు

ముంబై: అమెరికన్ టెక్ దిగ్గజం యాపిల్ భారత్‌లో తమ తొలి రిటైల్ స్టోర్‌ను మంగళవారం ఆవిష్కరించింది. ముంబై బీకేసీ ప్రాంతంలోని జియో వరల్డ్ డ్రైవ్ మాల్‌లో దీన్ని కంపెనీ సీఈవో టిమ్ కుక్ ప్రారంభించారు. 'భారత్‌లో మా తొలి స్టోర్ యాపిల్ బీకేసీని ప్రారంభించడం ఆనందంగా ఉంది' అని ఆయన ట్వీట్ చేశారు. యాపిల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (రిటైల్) డియెర్‌డ్రె ఓ'బ్రియెన్‌తో కలిసి కస్టమర్లను స్వయంగా ఆహ్వానించారు. స్టోర్‌ను సందర్శించేందుకు, కొనుగోళ్లు జరిపేందుకు అభిమానులు వెల్లువెత్తారు. యాపిల్ తమ రెండో స్టోర్‌ను గురువారం (ఏప్రిల్ 20) న్యూఢిల్లీలో ప్రారంభించనుంది. యాపిల్ దాదాపు పాతికేళ్లుగా భారత్‌లో వివిధ భాగస్వాముల ద్వారా తమ ఉత్పత్తులను విక్రయిస్తోంది. కంపెనీకి భారత్‌లో 2,500 మంది సిబ్బంది ఉండగా, తమ యాప్ వ్యవస్థ ద్వారా పరోక్షంగా 10 లక్షల పైచిలుకు ఉద్యోగాల కల్పనకు తోడ్పడుతున్నట్లు అంచనా. చైనా, కొరియా బ్రాండ్ల ఆధిపత్యం ఉన్న దేశీ స్మార్ట్‌ఫోన్ల మార్కెట్లో ప్రస్తుతం యాపిల్ వాటా సుమారు 3 శాతమే ఉన్నప్పటికీ ఇటీవల అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే భారత్‌లో కార్యకలాపాలను మరింతగా విస్తరించడంపై కంపెనీ ప్రత్యేకంగా దృష్టి పెడుతోంది.





రాత్రి నుంచే క్యూ..

దేశీయంగా తొలి యాపిల్ స్టోర్‌లో అందరి కన్నా ముందుగా ప్రవేశం పొందేందుకు అభిమానులు బారులు తీరారు. రాజస్థాన్ తదితర ప్రాంతాల నుంచి కూడా వచ్చిన కొందరు కస్టమర్లు క్రితం రోజు రాత్రి నుంచే క్యూ కట్టారు. టిమ్ కుక్‌తో కలిసి ఫొటోలు దిగేందుకు, ఆటోగ్రాఫ్‌లు తీసుకునేందుకు ఎగబడ్డారు. ఓ కస్టమరు 40 ఏళ్ల నాటి యాపిల్ తొలి మ్యాక్ ఎస్‌ఈ కంప్యూటర్‌ను కూడా వెంట తీసుకొచ్చి తన అభిమానం చాటుకున్నారు. ముంబైలో తిరిగే నలుపు, పసుపు రంగు ట్యాక్సీల థీమ్‌తో, 20,000 చ.అ. విస్తీర్ణంలో యాపిల్ బీకేసీని తీర్చిదిద్దారు. ఇందులో 18 భారతీయ భాషల్లో మాట్లాడగలిగే 100 మంది సిబ్బంది ఉంటారు. వీరిలో దాదాపు సగం మంది మహిళలు. యాపిల్ ఉత్పత్తులతో పాటు గ్యాడ్జెట్ల రిపేరింగ్ వంటి సర్వీసులను కూడా ఇందులో పొందవచ్చు. యాపిల్ ఈ స్టోర్‌ను 11 ఏళ్ల పాటు నెలకు రూ. 42 లక్షల చొప్పున అద్దెకు తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

డిజిటల్ చెల్లింపుల జోరు

- 2.9 కోట్ల లావాదేవీలతో బెంగళూరు టాప్
- వరల్డ్‌లైన్ ఇండియా నివేదిక



చెన్నై: దేశీయంగా గతేడాది డిజిటల్ చెల్లింపు లావాదేవీల్లో బెంగళూరు నగరం అగ్రస్థానంలో నిల్చింది. 2022లో 65 బిలియన్ డాలర్ల విలువ చేసే 2.9 కోట్ల లావాదేవీలతో టాప్ ప్లేస్ దక్కించుకుంది. పేమెంట్ సర్వీసుల సంస్థ వరల్డ్‌లైన్ ఇండియా ఒక నివేదికలో ఈ అంశాలు వెల్లడించింది. నివేదిక ప్రకారం న్యూఢిల్లీ (1.96 కోట్ల లావాదేవీలు, 50 బిలియన్ డాలర్ల విలువ), ముంబై (1.87 కోట్ల లావాదేవీలు, 49.5 బిలియన్ డాలర్ల విలువ), చెన్నై (1.43 కోట్ల లావాదేవీలు, 35.5 బిలియన్ డాలర్ల విలువ), పుణే (1.5 కోట్ల లావాదేవీలు, 32.8 బిలియన్ డాలర్ల విలువ) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. గత కొన్నేళ్లుగా డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో అద్భుతమైన పురోగతి నమోదవుతోందని వరల్డ్‌లైన్ ఇండియా సీఈవో రమేష్ నరసింహన్ తెలిపారు. దేశీయంగా నగదు చలామణీని తగ్గించే దిశగా చెల్లింపులకు సంబంధించి బహుళ సాధనాలు అందుబాటులోకి రావడం మంచి అవకాశమని ఆయన పేర్కొన్నారు.

బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణ

- సూచీలకు రెండోరోజూ నష్టాలే
- సెన్సెక్స్ నష్టం 184 పాయింట్లు
- 17,700 దిగువకు నిఫ్టీ



ముంబై: బ్యాంకింగ్, ఇంధన షేర్లలో లాభాల స్వీకరణ కొనసాగడంతో స్టాక్ సూచీలు రెండోరోజూ నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందాయి. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో సెంటిమెంట్ మరింత బలహీనపడింది. ఉదయం ట్రేడింగ్ మొదలైన కొద్దిసేపటికే సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. ఇన్వెస్టర్ల నుంచి కొనుగోళ్ల మద్దతు లభించకపోవడంతో ఇంట్రాడే కనిష్టానికి పతనమయ్యాయి. అయితే చివర్లో రియల్టీ, ఫార్మా షేర్లకు రాణించడంతో నష్టాలు కొంత మేరకే పరిమితం అయ్యాయి. సెన్సెక్స్ 80 పాయింట్ల లాభంతో 59,991 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 534 పాయింట్ల పరిధిలో 59,579 వద్ద కనిష్టాన్ని, 60,113 గరిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి 184 పాయింట్లు నష్టపోయి 59,727 వద్ద నిలిచింది. నిఫ్టీ 60 పాయింట్లు బలపడి 17,767 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 17,610–17,767 శ్రేణిలో కదలాడింది. చివరికి 47 పాయింట్లు పతనమై 17,660 వద్ద స్థిరపడింది. ఐటీ, మెటల్, ఫార్మా రియల్టీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ మిడ్ సూచీ అరశాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.22 శాతం చొప్పున లాభపడ్డాయి. ''అంతర్జాతీయ ఆర్థిక మాంద్యం పరిస్థితుల నేపథ్యంలో గత ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసికం ఫలితాలు బలహీనంగా నమోదు కావడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతింది'' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రీసెర్చ్ హెడ్ దీపక్ జెసానీ తెలిపారు. విదేశీ ఇన్వెస్టర్లు రూ.810 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.401 కోట్ల షేర్లను కొన్నారు. ఫెడ్ రిజర్వ్‌తో సహా ఇతర కేంద్ర బ్యాంకులు కఠినతర ద్రవ్య విధాన వైఖరిని అవలంభించవచ్చనే అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు స్వల్ప నష్టాల్లో కదలాడుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన తర్వాత మార్కెట్లోకి వచ్చిన తొలి ఐపీఓ అవెలాన్ టెక్నాలజీస్ లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.436)తో పోలిస్తే ఒకశాతం డిస్కౌంట్‌తో రూ.431 వద్ద లిస్టయింది. ఒక దశలో 11 శాతం క్షీణించి రూ.388 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 9% నష్టపోయి రూ.397 వద్ద నిలిచింది. ఎక్స్ఛేంజీలో మొత్తం 3.17 లక్షల షేర్లు చేతులు మారాయి. కంపెనీ వ్యాల్యుయేషన్ రూ.2,595 కోట్లుగా నమోదైంది.
- సోడా యాష్ ధరలు 3–4 శాతం తగ్గించడంతో టాటా కెమికల్స్ షేరు 6% నష్టపోయి రూ.932 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 6.50% క్షీణించి రూ.926 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది.

ఐసీఐసీఐ లాంబార్డ్ లాభం జూమ్

న్యూఢిల్లీ: ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ గతేడాది చివరి త్రైమాసికంలో (2022–23, క్యూ4) ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. నికర లాభం 40 శాతం జంప్‌చేసి రూ. 437 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో రూ. 313 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 4,636 కోట్ల నుంచి రూ. 5,256 కోట్లకు ఎగసింది. వాటాదారులకు షేరుకి రూ. 5.5 చొప్పున తుది డివిడెండ్‌ను ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 36 శాతం పుంజుకుని రూ. 1,729 కోట్లకు చేరింది. 2021–22లో రూ. 1,271 కోట్ల లాభం సాధించింది

టాటా కాఫీ లాభం అప్

క్యూ4లో రూ. 49 కోట్లు



ముంబై: ప్రైవేట్ రంగ దిగ్గజం టాటా కాఫీ గతేడాది(2022–23) చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో రూ. 49 కోట్ల నికర లాభం ఆర్జించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలం(క్యూ4)లో ఆర్జించిన రూ. 41 కోట్లతో పోలిస్తే ఇది 20 శాతం వృద్ధి. మొత్తం ఆదాయం సైతం 11 శాతం పుంజుకుని రూ. 723 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 656 కోట్ల ఆదాయం సాధించింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 78 శాతం జంప్‌చేసి రూ. 263 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం 21 శాతం ఎగసి రూ. 2,850 కోట్లను దాటింది.

అన్‌లిమిటెడ్ ఫ్యాషన్ ఈద్ కలెక్షన్లు

హైదరాబాద్: అన్‌లిమిటెడ్ ఫ్యాషన్ రంజాన్ పండుగ కోసం 'సెలబ్రేషన్–ఫ్యాషన్' పేరుతో కొత్త కలెక్షన్‌ను తీసుకురానుంది. మహిళలు, పురుషులు, పిల్లలకు అద్భుతమైన డిజైన్లు కలిగిన వస్త్రాలెన్నో ఇందులో ఉన్నాయి. కొత్త కలెక్షన్ ప్రారంభ ధర రూ.149 నుంచి మొదలవుతుంది. ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన ఈ వస్త్రాలు ఈద్ పండుగకు మరింత శోభ తెస్తాయని కంపెనీ ప్రకటనలో తెలిపింది.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఏపీఎస్ఎఫ్‌సీ, విజయవాడలో వివిధ ఉద్యోగాలు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్(ఏపీఎస్ఎఫ్‌సీ).. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 14
» పోస్టుల వివరాలు: మేనేజర్–06, డిప్యూటీ మేనేజర్–03, అసిస్టెంట్ మేనేజర్–05.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 14.04.2023.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 15.05.2023.
» పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.esfc.ap.gov.in

ఏపీసీపీడీసీఎల్, విజయవాడలో 100 అప్రెంటిస్‌లు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీసీపీడీసీఎల్).. ఏడాదిపాటు అప్రెంటిస్‌షిప్ శిక్షణ ఉంటుంది. అర్హులైన ఇంజనీరింగ్ డిగ్రీ/డిప్లొమా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చు.

» మొత్తం ఖాళీల సంఖ్య: 100
» ఖాళీల వివరాలు: గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–30, టెక్నీషియన్ (డిప్లొమా) అప్రెంటిస్–70.
» విభాగాలు: ఇంజనీరింగ్ డిగ్రీ–ఈఈఈ, డిప్లొమా–డీఈఈఈ.
» స్టయిపెండ్: గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ అభ్యర్థులకు రూ.9000, టెక్నీషియన్ అప్రెంటిస్ అభ్యర్థులకు రూ.8000 చెల్లిస్తారు.
» అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా/డిగ్రీ(ఇంజనీరింగ్/టెక్నాలజీ) 2021–2022 సంవత్సరంలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు. వయసు: 18 ఏళ్లు నిండి ఉండాలి.
» శిక్షణా కాలం: ఒక సంవత్సరం.
» ఎంపిక విధానం: డిగ్రీ/డిప్లొమా కోర్సులో అభ్యర్థి పొందిన మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.apcpdcl.in

ఐఆర్‌డీఏఐ, హైదరాబాద్‌లో 45 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐఆర్‌డీఏఐ).. అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 45
» విభాగాలు: ఆక్యురియల్, ఫైనాన్స్, లా, ఐటీ, రీసెర్చ్, జనరలిస్ట్.
» అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌లో గ్రాడ్యుయేషన్/బ్యాచిలర్స్ డిగ్రీ/ఇంజనీరింగ్ డిగ్రీ/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 21 నుంచి 30 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.44,500 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ పరీక్ష, డిస్క్రిప్టివ్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» పరీక్ష విధానం: ఆన్‌లైన్‌లో పరీక్ష జరుగుతుంది. మొత్తం మూడు పేపర్లు ఉంటాయి. ప్రతి పేపర్‌కు 60 నిమిషాలు సమయం ఉంటుంది. రీజనింగ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. మొత్తం 160 మార్కులకు గాను 160 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం 90 నిమిషాలు. ఈ డిస్క్రిప్టివ్ పరీక్షలో భాగంగా ఇంగ్లిష్, ఎకనామిక్, సోషల్, ఇన్సూరెన్స్ మేనేజ్‌మెంట్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో పేపర్‌కు 100 మార్కులు కేటాయిస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 10.05.2023.
» వెబ్‌సైట్: www.irdai.gov.in

ఎన్ఎఫ్‌డీబీ, హైదరాబాద్‌లో కన్సల్టెంట్ పోస్టులు

హైదరాబాద్‌లోని నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డ్(ఎన్ఎఫ్‌డీబీ).. ఒప్పంద ప్రాతిపదికన కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 04
» విభాగాలు: టెక్నికల్,ఇన్‌ఫ్రాస్ట్రక్చర్,హిందీ,ఐటీ
» అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఎన్ఎఫ్‌డీబీ, ఫిష్ బిల్డింగ్, పిల్లర్ నెం.235, పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే, ఎస్‌వీఎన్‌పీఏ పోస్టు, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 04.05.2023.
» వెబ్‌సైట్: www.nfdb.gov.in

యూవోహెచ్‌లో రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టులు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్, స్కూల్ ఆఫ్ కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్.. తాత్కాలిక ప్రాతిపదికన రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 02
» అర్హత: ఎంఈ/ఎంటెక్, ఎంసీఏ, ఎంఎస్సీ(కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 40 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.20,000 చెల్లిస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది డీన్, స్కూల్ ఆఫ్ కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్, యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 22.04.2023.
» వెబ్‌సైట్: www.uohyd.ac.in

పాలిటెక్నిక్ డిప్లొమా.. భవితకు ధీమా

» తెలుగు రాష్ట్రాల్లో పాలీసెట్ 2023 నోటిఫికేషన్లు విడుదల
» పదితోనే టెక్నికల్ రంగంలో కెరీర్‌కు మార్గం

పదో తరగతి తర్వాత స్వల్ప వ్యవధిలోనే ఉద్యోగం, ఉపాధి పొందాలనుకునే వారికి అందుబాటులో ఉన్న చక్కటి మార్గం.. పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాల కోసం పాలీసెట్ -2023 ప్రకటనలు విడుదలయ్యాయి. పాలీసెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో మూడేళ్లు, మూడున్నరేళ్ల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చు. టెక్నికల్ కోర్సులతోపాటు అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ వంటి ప్రత్యేక డిప్లొమా కోర్సుల్లోనూ చేరొచ్చు. తెలుగు రాష్ట్రాల్లో పాలిటెక్నిక్ కోర్సులు, ప్రవేశాలకు నిర్వహించే పాలీసెట్ పరీక్ష వివరాలు..



ఆఫ్టర్ టెన్త్‌క్లాస్

పదోతరగతి తర్వాత విద్యార్థి వేసే ప్రతి అడుగు ఎంతో కీలకమైంది. అదే భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తుంది. టెన్త్ తర్వాత పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరి పూర్తిచేసుకుంటే.. చిన్న వయసులోనే ఉద్యోగం, ఉన్నత విద్య అవకాశాలు సొంతం చేసుకునే వీలుంది. డిప్లొమాలో టెక్నికల్, నాన్ టెక్నికల్ కోర్సులుంటాయి. వీటిని పూర్తిచేసిన విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ పడవచ్చు. వీరికి ప్రైవేట్ రంగంలోనూ అవకాశాలు విస్తృతం. పలు పాలిటెక్నిక్ కాలేజీల్లో డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా ఉద్యోగాలు లభిస్తున్నాయి.

డిప్లొమా కోర్సులు

సంప్రదాయ డిప్లొమా కోర్సులతోపాటు ప్రస్తుతం డిమాండ్ ఉన్న కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, కమ్యూనికేషన్ అండ్ కంప్యూటర్ నెట్‌వర్కింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డేటా, సైబర్ సెక్యూరిటీ, వెబ్ డిజైనింగ్ తదితర కోర్సులను పలు పాలిటెక్నిక్ కాలేజీలు అందిస్తున్నాయి. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా ఇష్టమైన కోర్సులను ఎంపిక చేసుకోవచ్చు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి పాలీసెట్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగా ఆయా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

టెక్నికల్ కోర్సులు

- సివిల్, మెకానికల్, ఆర్కిటెక్చరల్ అసిస్టెంట్‌షిప్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, కంప్యూటర్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, గార్మెంట్ టెక్నాలజీ, హోమ్‌సైన్స్, మెటలర్జికల్, కెమికల్, సిరామిక్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, టెక్స్‌టైల్ రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషనింగ్, పెట్రోలియం టెక్నాలజీ, ఫుట్‌వేర్, ప్యాకేజింగ్, ప్రింటింగ్, లెదర్ టెక్నాలజీ వంటివి ఉన్నాయి.
- నాన్ టెక్నికల్: తెలంగాణ రాష్ట్రంలో అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరి కల్చర్ వంటి నాన్ టెక్నికల్ డిప్లొమా కోర్సుల్లో పాలీసెట్ ద్వారా ప్రవేశం పొందే వీలుంది.

కాలవ్యవధి

టెక్నికల్ కోర్సులు మూడేళ్లు లేదా మూడున్నరేళ్ల కాలవ్యవధితో అందిస్తారు. నాన్ టెక్నికల్ కోర్సులు మూడేళ్లు లేదా రెండేళ్ల కాలవ్యవధితో ఉంటాయి. సెమిస్టర్ విధానంలో బోధన ఉంటుంది. కోర్సులో భాగంగా ఇండస్ట్రియల్ ట్రైనింగ్ కూడా ఉంటుంది.

అర్హతలు

పదోతరగతి లేదా తత్సమాన విద్యను మ్యాథమెటిక్స్ ఒక సబ్జెక్టుగా కనీసం 35 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు ఆయా రాష్ట్రాల పాలిసెట్‌లకు దరఖాస్తుకు అర్హులు.

పాలీసెట్ పరీక్షలు ఇలా

రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి పాలిసెట్ పరీక్షలు ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు.

ఏపీ పాలీసెట్

ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించే పరీక్షలో మొత్తం 120 ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. నెగిటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం రెండు గంటలు. మొత్తం మూడు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. మ్యాథ్స్–50, ఫిజిక్స్–40, కెమిస్ట్రీ విభాగాల నుంచి 30 చొప్పున ప్రశ్నలుంటాయి.

తెలంగాణ పాలీసెట్

- తెలంగాణ పాలీసెట్ ద్వారా రెగ్యులర్ పాలిటెక్నిక్ కోర్సులతోపాటు అగ్రికల్చర్, ఫిషరీస్, వెటర్నరీ, హార్టికల్చర్ డిప్లొమాల్లో ప్రవేశాలు పొందవచ్చు. తెలంగాణ పాలీసెట్‌లో మ్యాథ్స్–60, ఫిజిక్స్–30, కెమిస్ట్రీ–30, బయాలజీకి–30 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం 2గంటలు. రెగ్యులర్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కోరుకునే వారు బయాలజీ విభాగాన్ని రాయనవసరం లేదు. అన్ని కోర్సులు లేదా ప్రత్యేకమైన కోర్సుల్లో చేరాలనుకునే వారు మాత్రమే బయాలజీ విభాగాన్ని రాయాలి.
- తెలంగాణ పాలీసెట్ ప్రవేశాలకు సంబంధించి ప్రతి అభ్యర్థికి రెండు వేర్వేరు ర్యాంకులను జనరేట్ చేస్తారు. టెక్నికల్ పాలిటెక్నిక్, అగ్రికల్చర్ అండ్ వెటర్నరీ డిప్లొమాగా ర్యాంకులను జనరేట్ చేసి ప్రవేశాలను కల్పిస్తారు.
- టెక్నికల్ కోర్సుల్లో ప్రవేశాలు పొందాలనుకునే వారి మార్కుల విధానం 120గా ఉంటుంది. ఇందులో మ్యాథ్స్–60,ఫిజిక్స్–30,కెమిస్ట్రీ–30గా ఉంటాయి.
- అగ్రికల్చర్ అండ్ వెటర్నరీ డిప్లొమా కోర్సుల మార్కుల విధానం కూడా 120గా ఉంటుంది. కాని ఇందులో మ్యాథ్స్ (60/2=30)–30, ఫిజిక్స్–30, కెమిస్ట్రీ–30, బయాలజీలో 30 మార్కులుగా ఉంటాయి.

ఉన్నత విద్య

డిప్లొమా పూర్తిచేసిన అనంతరం ఉన్నత విద్య మీద ఆసక్తి ఉంటే.. ఈసెట్ పరీక్ష రాసి లేటరల్ ఎంట్రీ ద్వారా నేరుగా బీటెక్/బీఈ రెండో సంవత్సరంలో చేరొచ్చు. ఈ విద్యార్హతతో ఎంసెట్, ఐఐటీ–జేఈఈ వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షలకు పోటీ పడొచ్చు.

ఉద్యోగావకాశాలు

పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలో ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. రైల్వే, ఆర్మీ, గెయిల్, ఓఎన్‌జీసీ, డీఆర్‌డీఓ, బీహెచ్ఈఎల్ మహారత్న, నవరత్న, రైల్వేల్లో జేఈ పోస్టులు, సింగరేణి సంస్థలో అవకాశాలు లభిస్తాయి. అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, ఇరిగేషన్, వ్యవసాయం తదితరశాఖల్లో డిప్లొమా విద్యార్హతతో ఉద్యోగావకాశాలున్నాయి.

ప్రైవేట్ రంగం

ఈ కోర్సులను పూర్తిచేసిన అభ్యర్థులు ప్రైవేట్ రంగంలో కన్‌స్ట్రక్షన్, ఆటోమొబైల్, పవర్‌ప్లాంట్స్, కమ్యూనికేషన్స్, మ్యానుఫాక్చరింగ్ తదితర విభాగాల్లో ఉద్యోగావకాశాలు పొందవచ్చు. బీటెక్ ఇంజనీరింగ్ విద్యార్థులతో పోలిస్తే డిప్లొమా కోర్సులను పూర్తిచేసిన వారికి సంస్థలు ప్రాధాన్యం ఇస్తున్నాయి.

ముఖ్య తేదీలు

టీఎస్ పాలీసెట్

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి
- దరఖాస్తులకు చివరి తేదీ: ఏప్రిల్ 24, 2023
- టీఎస్ పాలీసెట్ పరీక్ష తేదీ: మే 17, 2023
- ఫలితాలు: పరీక్ష జరిగిన 12 రోజుల తర్వాత.
- వెబ్‌సైట్: www.polycet.sbtet.telangana.gov.in

ఏపీ పాలీసెట్

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి
- దరఖాస్తులకు చివరి తేదీ: ఏప్రిల్ 30, 2023
- ఏపీ పాలీసెట్ పరీక్ష తేదీ: మే 10, 2023
- ఫలితాలు: మే 25, 2023
- వెబ్‌సైట్: https://polycetap.nic.in

క్లుప్తంగా...


నైనా జైస్వాల్‌కు డాక్టరేట్



కాచిగూడ: దేశంలోనే అతి పిన్న వయస్కురాలైన ఇంటర్నేషనల్ టేబుల్ టెన్నిస్ ప్లేయర్ నైనా జైస్వాల్ 22 ఏళ్ల వయస్సులోనే పీహెచ్‌డీలో డాక్టరేట్ డిగ్రీ పొందారు. హైదరాబాద్‌లోని నారాయణగూడ ప్రాంతానికి చెందిన నైనా జైస్వాల్..ఏపీలోని రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి 'మహిళా సాధికారతలో మైక్రోఫైనాన్స్ పాత్రపై అధ్యయనం' అనే అంశంపై నైనా జైస్వాల్ పరిశోధన చేశారు. ఈ సందర్భంగా నైనా జైస్వాల్‌ను రిసెర్చ్ గైడ్, యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్లర్ ఎం.ముత్యాల నాయుడు అభినందించారు.

నేటి నుంచి బూస్టర్ డోస్

సాక్షి, హైదరాబాద్: కరోనా టీకాలను పంపిణీ చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేసింది. బుధవారం నుంచి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బూస్టర్ డోస్‌ను అందజేయనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 5 లక్షల కార్బేవ్యాక్స్ టీకా డోసులను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. మొదటి రెండు డోసులు కోవిషీల్డ్ లేదా కోవాగ్జిన్ తీసుకున్నా బూస్టర్ డోసుగా కార్బేవ్యాక్స్ తీసుకోవచ్చని హరీశ్ తెలిపారు. కాగా, రాష్ట్రంలో ఇప్పటివరకు కోటిన్నర మందికి పైగా బూస్టర్ డోసులు తీసుకోవాల్సి ఉంది. కానీ ప్రభుత్వం కేవలం 5 లక్షలే అందుబాటులోకి తీసుకొచ్చింది. మిగిలినవి ఎప్పుడు అందుబాటులోకి తెస్తారన్న దానిపై స్పష్టత లేదు.



రాష్ట్రంలో భారీగా కరోనా కేసులు నమోదు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కరోనా కేసులు భారీగా పెరుగుతున్నాయి. మంగళవారం 7,154 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా..వారిలో 52 మంది వైరస్ బారినపడ్డారు. దీంతో ఇప్పటి వరకు మొత్తం నమోదైన కేసుల సంఖ్య 8.43 లక్షలకు చేరింది. ప్రస్తుతం 281 మంది ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారని, 40 మంది కరోనా నుంచి కోలుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఉన్నత చదువులతో బాగా ఎదగాలి

- సమాజానికి గొప్పగా సేవ చేయాలి.. విద్యార్థులకు కేసీఆర్ సూచన
- ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మనవడు హిమాన్షు 12వ క్లాస్ గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం దంపతులు





రాయదుర్గం (హైదరాబాద్):విద్యార్థులంతా ఉన్నత చదువులు చదివి, జీవితంలో మరింతగా ఎదగాలని.. సమాజానికి గొప్పగా సేవలు చేయాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సూచించారు. మంగళవారం హైదరాబాద్ శివార్లలో ఖాజాగూడలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 12వ తరగతి పూర్తిచేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు జరిగాయి. ఈ స్కూల్‌లోనే చదువుతున్న కేసీఆర్ మనవడు, మంత్రి కేటీఆర్ కుమారుడు హిమాన్షు కూడా పట్టా అందుకున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్–శోభ దంపతులు, కేటీఆర్–శైలిమ దంపతులు, హిమాన్షు సోదరి అలేఖ్య, అమ్మమ్మ, మేనమామలు, ఇతర బంధువులు కూడా హాజరయ్యారు. పట్టా అందుకున్న హిమాన్షు దానిని తాత కేసీఆర్ చేతిలోపెట్టి పాదాలకు నమస్కరించారు. కేసీఆర్ మనవడిని హత్తుకుని అభినందించారు. కేటీఆర్–శైలిమ కూడా తమ కుమారుడిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. హిమాన్షుతోపాటు ఇతర విద్యార్థులంతా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఇక కమ్యూనిటీ యాక్టివిటీ సర్వీసెస్ (సీఏఎస్) విభాగంలో ప్రతిభ చాటినందుకు హిమాన్షు ఓక్రిడ్జ్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు.



దేశంలో 2020లో స్త్రీల వివాహాల సగటు

22.7 సంవత్సరాలు

జాతీయ నమూనా సర్వేలో ఆసక్తికర అంశాలు

- 2017లో నమోదైన 22.1 ఏళ్ల సగటుతో పోలిస్తే కాస్త మెరుగు
- అదే కాలానికి తెలంగాణలో 23.7 ఏళ్లుగా నమోదైన మహిళల సగటు వివాహ వయసు
- అత్యధికంగా 26 ఏళ్ల సగటు వయసులో కశ్మీరీ యువతులకు పెళ్లిళ్లు
- అత్యల్పంగా 21 ఏళ్లలోపే పెళ్లి బంధంలోకి జార్ఖండ్, బెంగాల్ అతివలు

పెళ్లీడు పెరిగింది



సాక్షి, హైదరాబాద్: దేశంలో ఒకప్పుడు ఎక్కువగా బాల్యవివాహాలు జరిగినా కొన్నేళ్లుగా సమాజంలో వచ్చిన మార్పులతోపాటు ప్రభుత్వాలు ఆడపిల్లల చదువులకు సైతం అధిక ప్రాధాన్యత ఇస్తుండటంతో ఆ పరిస్థితిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. అమ్మాయిలు సైతం అబ్బాయిలతో సమానంగా ఉన్నత విద్యను అభ్యసిస్తుండటంతో దేశంలో అతివల సగటు పెళ్లిళ్ల వయసు పెరుగుతోంది. నేటికీ అక్కడక్కడా బాల్య వివాహాలు, నగరాల్లో లేటు వయసులో యువతుల పెళ్లిళ్లు జరుగుతున్నప్పటికీ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా కార్యాలయం వివాహ వయసులపై జరిపిన జాతీయ నమూనా సర్వేలో దేశవ్యాప్తంగా మహిళల సగటు వివాహ వయసు 22.7 ఏళ్లుగా వెల్లడైంది. 2020లో ఈ సర్వే జరిగినప్పటికీ వాటి విశ్లేషణ ఆలస్యమైంది. అందుకు సంబంధించిన గణాంకాలను ఆ కార్యాలయం ఇటీవల విడుదల చేసింది.

దేశ సగటు కంటే తెలంగాణ మెరుగు...

జాతీయ నమూనా సర్వే గణాంకాలను పరిశీలిస్తే 2017 నాటికి దేశంలో మహిళల వివాహ సగటు వయసు 22.1 ఏళ్లుకాగా 2020 నాటికి అది 22.7 ఏళ్లకు చేరింది. ఆయా రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం మహిళలు వివాహం చేసుకొనే వయసు ఆధారపడి ఉన్నందున వివిధ రాష్ట్రాల మధ్య సగటు వయసులో స్పష్టమైన తేడాలు కనిపిస్తున్నాయి. వివాహ సగటు వయసుకు సంబంధించి తెలంగాణ గణాంకాలను పరిశీలిస్తే పట్టణ ప్రాంతాల్లో 2020 నాటికి 24.3 ఏళ్లు, గ్రామీణ ప్రాంతాల్లో 22.8 ఏళ్లుగా తేలింది. సగటున 23.5 ఏళ్లకు తెలంగాణ మహిళలు వివాహాలు చేసుకుంటున్నారని జాతీయ నమూనా సర్వే వెల్లడించింది. దక్షిణ తెలంగాణతోపాటు తమిళనాడు మహిళలకు కొంత ఆలస్యంగా వివాహాలు జరుగుతున్నాయని ఈ సర్వేలో తేలింది. మరోవైపు దేశంలోనే అత్యధికంగా సగటున 26 ఏళ్లకు కశ్మీర్ మహిళలు వివాహాలు చేసుకుంటుండగా జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన యువతులు మాత్రం సగటున 21 ఏళ్లలోపే మాంగల్య బంధంలోకి అడుగు పెడుతుండటం గమనార్హం. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాల్లో గ్రామీణ మహిళల కంటే పట్టణ ప్రాంతాల్లోని మహిళలు కొంత ఆలస్యంగా వివాహాలు చేసుకుంటున్నారని జాతీయ నమూనా సర్వే వెల్లడించింది.

21 ఏళ్లకు పెంచేందుకు బిల్లు

దేశంలోని మహిళల చట్టబద్ధ కనీస వివాహ వయసు ప్రస్తుతం 18 ఏళ్లుగా ఉండగా దాన్ని పురుషుల చట్టబద్ధ కనీస వివాహ వయసు అయిన 21 ఏళ్లకు సమానంగా పెంచాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి బాల్య వివాహాల నిషేధ సవరణ బిల్లును తీసుకొచ్చింది. ప్రస్తుతం ఇది పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ వద్ద పరిశీలనలో ఉంది. అయితే దేశంలో కనీస వివాహ వయసును మార్చాలంటే కేంద్రం 6 చట్టాలకు సవరణలు చేయాల్సి ఉంది. ఇండియన్ క్రిస్టియన్ మ్యారేజ్ యాక్ట్–1872, ది పార్సీ మ్యారేజ్ అండ్ డైవోర్స్ యాక్ట్–1936, ద ముస్లిం పర్సనల్ లా (షరియత్) అప్లికేషన్ యాక్ట్–1937, ది స్పెషల్ మ్యారేజ్ యాక్ట్–1954, ది హిందూ మ్యారేజ్ యాక్ట్–1955, ది ఫారిన్ మ్యారేజ్ యాక్ట్–1969లను సవరించాల్సి ఉంటుంది.

ఎవరెవరి నుంచి ఎంతెంత వసూలు చేశారు?

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కేసులో ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డిలను ప్రశ్నించిన ఈడీ

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో జరిగిన ఆర్థిక లావాదేవీల మూలాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దృష్టిపెట్టింది. ఈ కేసులో కీలక నిందితులైన ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డిలను రెండోరోజైన మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రశ్నించింది. ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్లు సుమిత్ గోయల్, దేవేందర్‌సింగ్‌ల నేతృత్వంలోని నలుగురు సభ్యుల బృందం మొదట ప్రవీణ్ కుమార్, రాజశేఖర్‌రెడ్డిలను చెంచల్‌గూడ జైల్లో వేర్వేరుగా ప్రశ్నించినట్లు సమాచారం. మధ్యాహ్నం తర్వాత ఇద్దరినీ కలిపి కూడా కొన్ని అంశాలపై ప్రశ్నించినట్లు తెలిసింది. కాన్ఫిడెన్షియల్ సెక్షన్ నుంచి పేపర్లు కొట్టేశాక ఏయే పేపర్లను ఎవరికి, ఎంతకు అమ్మేందుకు బేరం కుదుర్చుకున్నారన్న దానిపై సోమవారం నాటి విచారణలో సేకరించిన వివరాల ఆధారంగా ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డిల బ్యాంకు స్టేట్‌మెంట్లను ముందుపెట్టి ప్రశ్నించినట్లు తెలియవచ్చింది. పేపర్ల లీకేజీ సొమ్ము మొత్తం రూ. 50 లక్షల మేర బేరసారాలు జరిగినట్లు సిట్ ఇప్పటికే గుర్తించిన నేపథ్యంలో ఆ మేరకు ఎంతెంత డబ్బు ఎవరెవరి ద్వారా సేకరించారన్న అంశాలపైనా ప్రశ్నించినట్లు సమాచారం. ప్రవీణ్‌కుమార్ ఇంట్లో జరిపిన సోదాల్లో లభ్యమైన రూ. 4 లక్షలు, రాజశేఖర్‌రెడ్డి గత ఆరు నెలలుగా ఖర్చు చేసిన డబ్బు, ఆ సొమ్ముకు మూలం, అతను తిరిగిన ప్రాంతాలు వంటి అంశాలపైనే ప్రధానంగా విచారణ కొనసాగినట్లు తెలిసింది. ఇప్పటికే ఈ కేసులో కాన్ఫిడెన్షియల్ సెక్షన్ అధికారి శంకరలక్ష్మి, మరో అధికారి సత్యనారాయణల నుంచి వివరాలు సేకరించిన ఈడీ అధికారులు... ప్రస్తుతం ప్రవీణ్ కుమార్, రాజశేఖర్‌రెడ్డిల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా మరికొందరిని సైతం కస్టడీకి కోరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డిల ఈడీ కస్టడీ మంగళవారంతో ముగిసింది.

అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయండి: డీజీపీ



సాక్షి, హైదరాబాద్: సరిహద్దు ప్రాంతాల నుంచి రాష్ట్రంలోకి ధాన్యం, గుడుంబా, మద్యం రవాణాలకు అడ్డుకట్ట వేసేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను డీజీపీ అంజనీ కుమార్ ఆదేశించారు. మంగళవారం డీజీపీ కార్యాలయంలో అంజనీ కుమార్ నిర్వహించిన సమీక్షలో పౌర సరఫరాలశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, ఎక్సైజ్ శాఖ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, శాంతిభద్రతల విభాగం అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్ జైన్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, దేశం మొత్తంలో తెలంగాణలోనే యాసంగి వరి ధాన్యానికి గరిష్ట మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నందున సరిహద్దు రాష్ట్రాల నుంచి మన రాష్ట్రానికి అక్రమంగా వరి ధాన్యం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. దానిని అడ్డుకోవడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మద్యం అక్రమ రవాణా, గుడుంబా రవాణా అడ్డుకోవడంలో పోలీస్, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా పనిచేయాలని ఎక్సైజ్‌శాఖ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ సూచించారు.

రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి సీఈఐఆర్

చోరీకి గురైన లేదా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ల జాడను తెలుసుకునేందుకు సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశ పెడుతున్నట్టు డీజీపీ అంజనీకుమార్ ప్రకటించారు.

టెన్త్ లీకేజీ కేసులో ఇద్దరికి బెయిల్

వరంగల్ లీగల్: పదో తరగతి హిందీ పేపర్ లీకేజీ కేసులో నిందితులు పి.వర్షిత్ అలియాస్ చందు, పోగు సుభాష్‌లకు బెయిల్ మంజూరైంది. హనుమకొండ నాలుగో మున్సిఫ్ కోర్టు జడ్జి మట్ట సరిత రూ.20 వేలు, ఇద్దరు జమానత్‌దారుల పూచీకత్తుపై మంగళవారం బెయిల్ మంజూరు చేశారు. కమలాపూర్ పరీక్ష కేంద్రంలో పదో తరగతి పేపర్ లీకేజీ సంఘటనలో కరీంనగర్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ సహా పదిమంది నిందితులపై కేసు నమోదవడం తెలిసిందే. ఈ కేసులో సంజయ్‌కుమార్ ఇప్పటికే బెయిల్‌పై విడుదలయ్యారు. తాజాగా మరో ఇద్దరు నిందితులకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇంకా ఇద్దరు నిందితులు జ్యుడీషియల్ రిమాండ్‌లోనే ఉన్నారు.

చదివేది ఆరు.. చేసేది చోరీలు

- ముగ్గురు మైనర్లుసహా ఐదుగురి అరెస్ట్.. 22 తులాల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్, డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి

కోదాడరూరల్: ఆరోతరగతి చదువుతున్న ముగ్గురు బాలురు దొంగతనాల్లో ఆరితేరారు. పట్టపగలు తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకొని తిరుగుతున్న ముగ్గురు మైనర్లను సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్ కోదాడ పట్టణ స్టేషన్ ఆవరణలో డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డితో కలిసి విలేకరులకు వెల్లడించారు. మంగళవారం కోదాడలోని రంగా థియేటర్ సెంటర్‌లో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా సూర్యాపేట రోడ్డు వైపు నుంచి నంబర్ ప్లేట్ లేని స్కూటీపై ముగ్గురు బాలురు వస్తున్నారు. ఆ స్కూటీని ఆపకుండా పరారవుతుండగా పోలీసులు వెంటపడి పట్టుకున్నారు. వెంటనే అదుపులోకి తీసుకొని విచారించగా, తాము ఎవరికి అనుమానం రాకుండా వీధుల్లో ప్లాస్టిక్ పాములతో ఆడుకుంటున్నట్లు నటిస్తూ పగటిపూట తాళం వేసిన ఇళ్లను గుర్తించి చోరీచేస్తామని నిజం ఒప్పుకున్నారు. ఈ నెల 13న భవానీనగర్‌తోపాటు 15 రోజుల కిందట నయానగర్, గణేశ్‌నగర్, అనంతగిరి రోడ్డులోని పలు ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు.

మైనర్లలో ఒకరి తల్లికి సొత్తు అప్పగింత

మైనర్లలో ఒకరి తల్లి అయిన షేక్ మీరాంబీ హోటల్‌లో పనిచేసుకుంటూ పట్టణంలోని ఓరుగంటి అప్పయ్య వీధిలో నివాసం ఉంటోంది. ఆమెతో ఖమ్మం నగరానికి చెందిన కనతాల శ్రీనివాస్ సహజీవనం చేస్తూ ఇక్కడే ఉంటున్నాడు. ముగ్గురు మైనర్లు దొంగతనాలకు పాల్పడిన సొత్తును మీరాంబీ, కనతాల శ్రీనివాస్‌కు ఇస్తున్నట్లు తెలిపారు. దీంతో వారిని కూడా అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. విచారణ అనంతరం వారి వద్ద నుంచి రూ.13 లక్షల విలువైన 22 తులాల బంగారు ఆభరణాలు, 250 గ్రాముల వెండి, రూ.20 వేల నగదు, స్కూటీ, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. మైనర్ బాలురను కోర్టు ఆదేశాల మేరకు జువెనైల్ హోంకు, షేక్ మీరాంబీ, కనతాల శ్రీనివాస్‌ను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రూ.లక్ష జరిమానా కట్టి మీ దేశం వెళ్లండి!

- రెసిడెన్సీ కార్డు గడువు ముగిసిపోయిన వలస కార్మికులకు ఇరాక్ ప్రభుత్వ ఆదేశం
- భారత ప్రభుత్వం తమను ఆదుకోవాలంటూ కార్మికుల విజ్ఞప్తి

మోర్తాడ్ (బాల్కొండ): ఉపాధిని వెతుక్కుంటూ ఇరాక్ వెళ్లిన తెలంగాణ వలస కార్మికుల అకామ (రెసిడెన్సీ కార్డు) గడువు ముగిసిపోవడంతో ఇంటికి చేరుకోవాలంటే రూ.లక్ష జరిమానా చెల్లించాలని అక్కడి ప్రభుత్వం నిర్దేశించింది. అకామ లేకపోవడంతో ఎవరూ పనిఇవ్వడం లేదని, పార్కులలో తలదాచుకుంటూ అష్టకష్టాలు పడుతున్న తమకు జరిమానా చెల్లించే స్తోమత లేదని వలస కార్మికులు వాపోతున్నారు. ఎర్బిల్ పట్టణంలో తెలంగాణ జిల్లాలకు చెందిన వలస కార్మికులు సుమారు 20 మంది వరకు ఉండిపోయారు. గతంలో అకామ లేనివారిని ఇరాక్‌లో మన రాయబార కార్యాలయం అధికారులు జరిమానాను తప్పించి ఇంటికి పంపించారు. అలా వందలాది మంది వలస కార్మికులు సొంతిళ్లకు చేరుకున్నారు. కాగా కొంత మంది మాత్రం ఇంటికి రాకుండా ఇరాక్‌లోనే ఉండిపోయారు. ఇప్పుడు ఇరాక్‌లో చట్టవిరుద్ధంగా ఉన్నవారిపై అక్కడి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఈ నేపథ్యంలో వలస కార్మికులు ఇంటికి చేరుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. రూ. వెయ్యి నుంచి 1,500 వరకు అమెరికన్ డాలర్లు (మన కరెన్సీలో రూ.లక్షకు పైగా) జరిమానా చెల్లిస్తేనే విదేశీ కార్మికులను వారి దేశాలకు వెళ్లడానికి అనుమతిస్తామని ఇరాక్ ప్రభుత్వం స్పష్టం చేసింది. చేతిలో చిల్లిగవ్వ లేని దుస్థితిలో ఉన్న తాము జరిమానా చెల్లించి, విమాన టికెట్‌ను కొనేందుకు ఎక్కడి నుంచి డబ్బులు తీసుకురావాలని వలస కార్మికులు వాపోతున్నారు. మంచిర్యాల్, జగిత్యాల, నిజామాబాద్, కరీంనగర్, రాజన్న సిరిసిల్లా జిల్లాలకు చెందిన వలస కార్మికులు ఇరాక్‌లో ఉండిపోయారని తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఇరాక్‌లోని వలస కార్మికులు ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్‌ను ఆశ్రయించగా సదరు సంస్థ ప్రతినిధులు విదేశాంగ శాఖను సంప్రదించారు. వలస కార్మికుల కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్‌కు ప్రవాసీ మిత్ర సంస్థ ప్రతినిధులు సమాచారం అందించారు.

ఇంటికి రప్పించడానికి చొరవ తీసుకోవాలి..

గడువు ముగిసిపోవడంతో మాకు పనివ్వడం లేదు. కరోనా వల్ల అనేక కంపెనీలు మూతపడ్డాయి. ఇంటికి రావాలంటే జరిమానా చెల్లించడానికి మా వద్ద డబ్బులు లేవు. ప్రభుత్వాలు చొరవ తీసుకుని వలస కార్మికులను ఇంటికి రప్పించాలి. – చింత రాము, గొల్లపెల్లి, జగిత్యాల జిల్లా (ఇరాక్)

మెరుగైన జీవ వైవిధ్యం

- సిటీ బయో డైవర్సిటీ ఇండెక్స్‌లో పైపైకి
- 36 నుంచి 57 పాయింట్లకు చేరిన స్కోర్
- పదేళ్లలో నగరంలో వృద్ధి ..ఇండెక్స్‌ను విడుదల చేసిన మంత్రి కేటీఆర్



బయోడైవర్సిటీ ఇండెక్స్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో రేగా కాంతారావు, లక్ష్మారెడ్డి, మేయర్ విజయలక్ష్మి తదితరులు

సాక్షి, హైదరాబాద్: నగర జీవవైవిధ్య సూచి (సిటీ బయో డైవర్సిటీ ఇండెక్స్)లో హైదరాబాద్ నగరం గణనీయమైన వృద్ధి సాధించింది. 2012లో ఇండెక్స్‌లో 36 పాయింట్ల స్కోర్‌తో ఉన్న నగరం తాజా ఇండెక్స్‌లో 57 పాయింట్ల స్కోర్ సాధించింది. ఇక్లీ (ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ లోకల్ ఎన్విరాన్‌మెంటల్ ఇనిషియేటివ్స్) ద్వారా జీహెచ్‌ఎంసీ రూపొందించిన తాజా సిటీ బయోడైవర్సిటీ ఇండెక్స్‌ను మంగళవారం మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ ఇండెక్స్‌లో నగరం పలు అంశాల్లో ఎంతో అభివృద్ధి సాధించినట్లు వెల్లడైంది. సరస్సుల నగరంగా పేరొందిన హైదరాబాద్ లో ప్రస్తుతం దాదాపు రెండు వేల హెక్టార్లలో విస్తరించి ఉన్న 1350కి పైగా జల వనరులు, 1600 హెక్టార్లలో విస్తరించిన సహజ రాళ్లగుట్టలు, నగరంలో ఉన్న రెండు జాతీయ పార్కులు (కేబీఆర్, హరిణి వనస్థలి) జీవవైవిధ్యానికి ఎంతగానో దోహదం చేస్తున్నాయని నివేదికలో పేర్కొన్నారు. దీంతోపాటు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీ, ఇక్రిశాట్ వంటి సంస్థలకు ఉన్న సువిశాలమైన క్యాంపస్‌లు జీవవైవిధ్యానికి కేంద్రాలుగా ఉన్నాయని తేలింది.

ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతోనే: కేటీఆర్

నగరం కోసం ప్రత్యేకంగా బయో డైవర్సిటీ ఇండెక్స్ తయారు చేయించిన అధికారులను మంత్రి కేటీఆర్ అభినందించారు. ఒక నిజమైన ప్రపంచ స్థాయి నగరంగా మారే పరిణామ క్రమంలో జీవవైవిధ్యం అత్యంత కీలకమైన అంశమని కేటీఆర్ ఈ సందర్భంగా అన్నారు. జీవించు– జీవించనివ్వు అన్న స్ఫూర్తి ఆధారంగా నగరీకరణ జరిగినప్పుడే ప్రకృతితో మమేకమై బతకగలిగే పరిస్థితి ఉంటుందన్నారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన హరిత హారం, చెరువుల సంరక్షణ – బలోపేతం, అడవుల పెంపకం, అర్బన్ లంగ్ స్పేసెస్ వంటి కార్యక్రమాలు నగర జీవవైవిధ్యానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, భవిష్యత్తులోనూ నగరంతోపాటు, నగరం చుట్టుపక్కల కూడా జీవివైవిధ్యం మరింత పెరుగుతుందని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మున్సిపల్‌శాఖ స్పెషల్ చీఫ్‌సెక్రటరీ అర్వింద్‌కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌వి పథకాలు.. బీజేపీవి పన్నాగాలు

- లక్కారం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీశ్‌రావు
- చౌటుప్పల్‌లో రూ. 36 కోట్లతో 100 పడకల ప్రభుత్వాస్పత్రికి శంకుస్థాపన



సాక్షి, యాదాద్రి, చౌటుప్పల్: బీజేపీపాలిత రాష్ట్రాల్లో గన్‌కల్చర్ ఉంటే బీఆర్‌ఎస్ పాలనలోని తెలంగాణలో మాత్రం అగ్రికల్చర్ ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో మూడు రోజుల కిందట పోలీసులు, మీడియా ప్రతినిధుల సమక్షంలోనే ఇద్దరు గ్యాంగ్‌స్టర్లన ఆగంతకులు కాల్చిచంపిన ఘటనే అందుకు ఉదాహరణ అని పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో రూ. 36 కోట్లతో నిర్మించనున్న 100 పడకల ప్రభుత్వాస్పత్రికి విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో కలసి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మీడియాతోపాటు లక్కారంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌వి పథకాలు, పనులు కాగా బీజేపీవి పన్నాగాలని దుయ్యబట్టారు. 10.50 లక్షల మంది ఆడబిడ్డల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా రూ. 9 వేల కోట్లు వెచ్చించామని, 13.60 లక్షల మందికి కేసీఆర్ కిట్లు పంపిణీ చేసినందున పాలాభిషేకం చేస్తున్నారని చెప్పారు.

కొబ్బరికాయ కొట్టి గొప్పగా ప్రచారమా?

ఎయిమ్స్ కోసం బీబీనగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం 2018లోనే 200 ఎకరాల స్థలాన్ని అప్పగిస్తే ఐదేళ్ల తర్వాత ప్రధాని కొబ్బరికాయ కొట్టి గొప్పగా ప్రచారం చేసుకున్నారని మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. త్వరలో రాష్ట్రంలో 10 వేల పడకల సామర్థ్యంగల కార్పొరేట్ స్థాయి ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెలాఖరులోగా కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకాన్ని ప్రారంభిస్తున్నామని చెప్పారు. కాగా, ఆయా కార్యక్రమాల్లో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఉద్యోగ సంఘాల మాజీ నేత దేవీప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కూసుకుంట్ల కంటతడి..



బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి కంటతడి పెట్టుకున్నారు. ఆయన ప్రసంగిస్తూ 2011లో నాటి టీఆర్‌ఎస్ పొలిట్ బ్యూరో సభ్యుడు కొనపూరి అయిలయ్య అలియాస్ సాంబశివుడు హత్యకు గురైన సమయంలో తనకూ ప్రాణహాని ఉందని హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లగా పోలీసు శాఖతో మాట్లాడి తుపాకీ లైసెన్స్ ఇప్పించారని చెప్పారు. తనకు సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అండగా ఉందంటూ కన్నీళ్లు పెట్టుకోగా మంత్రి హరీశ్‌రావు సముదాయించారు.

తొమ్మిది నెలల చిన్నారికి అరుదైన చికిత్స

- రెండు కిడ్నీల్లో ట్యూమర్ తొలగింపు
- చిన్నారికి పునర్జన్మ ప్రసాదించిన గాంధీ వైద్యులు



డిశ్చార్జ్ సమయంలో పీడియాట్రిక్ హెచ్ఓడీ నాగార్జునకు కృతజ్ఞతలు తెలుపుతున్న చిన్నారి తల్లిదండ్రులు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి చిన్నారికి పునర్జన్మను ప్రసాదించారు. గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, పీడియాట్రిక్ సర్జరీ హెచ్ఓడీ నాగార్జునలు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లా డోన్‌కు చెందిన రేష్మాబేగం, సలీమ్‌లు నగరానికి వలస వచ్చి బాలానగర్ చింతల్‌లో ఉంటున్నారు. వీరికి తొమ్మిది నెలల పాప యాస్మిన్‌బీ ఉంది. అస్వస్థతకు గురైన చిన్నారిని పలు కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. స్థానికుల సూచన మేరకు నెల రోజుల క్రితం గాంధీ ఆస్పత్రిలో చేరారు. పీడియాట్రిక్ సర్జరీ వైద్యులు పలు వైద్యపరీక్షలు నిర్వహించి రెండు మూత్రపిండాలకు అనుకుని ప్రమాదకరమైన రీతిలో భారీ కణితి పెరుగుతున్నట్లు గుర్తించారు. వైద్యపరిభాషలో బెలటేరియల్ విల్మస్ ట్యూమర్ అంటారు. లక్షలాది మందిలో ఒకరికి వచ్చే అరుదైన కణితి ఇది. కణితిని తొలగించే క్రమంలో బ్లీడింగ్, యూరిన్, రీనల్ షట్‌డౌన్‌లతో ప్రాణాలకే ప్రమాదం. గాంధీ వైద్యులు చాలెంజ్‌గా తీసుకుని, చిన్నారి తల్లిదండ్రులకు రెండువారాల పాటు కౌన్సెలింగ్ ఇచ్చారు. తగిన జాగ్రత్తలు తీసుకుని వారం రోజుల క్రితం అత్యంత అరుదైన బెలటేరియల్ నెఫ్రాన్ స్ప్రింగ్ సర్జరీని నిర్వహించి భారీ కణితిని విజయవంతంగా తొలగించారు. తన 23 ఏళ్ల సర్వీసులో ఇటువంటి సర్జరీ చేయలేదని, మొదటిసారిగా చేసిన అరుదైన సర్జరీ విజయవంతం కావడం పట్ల గాంధీ పీడియాట్రిక్ సర్జరీ హెచ్ఓడీ ప్రొఫెసర్ నాగార్జున ఆనందం వ్యక్తం చేశారు. సుమారు ఐదు గంటల పాటు శ్రమించి కిడ్నీలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా సర్జరీ నిర్వహించామన్నారు. చిన్నారి యాస్మిన్‌బీ కోలుకోవడంతో మంగళవారం డిశ్చార్జ్ చేశామని, ఎంఎన్‌జే ఆస్పత్రిలో కీమోథెరపీ ట్రీట్‌మెంట్ జరుగుతోందని వివరించారు. పునర్జన్మ ప్రసాదించిన గాంధీ వైద్యులకు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. అరుదైన సర్జరీ విజయవంతంగా నిర్వహించిన పీడియాట్రిక్ సర్జరీ హెచ్ఓడీ నాగార్జున, వైద్యులు శ్రీనివాస్, కవిమోజీ ఇలక్కియా, రాజ్‌కిరణ్, ఫణీంద్ర, అనస్తీషియా ప్రొఫెసర్ మురళీ, యూరాలజీ ప్రొఫెసర్ రవిచందర్, నర్సింగ్ సిబ్బందిని డీఎంఈ రమేష్‌రెడ్డి, గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, ఇతర వైద్య ఉన్నతాధికారులు అభినందించారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.